www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI




ఇదిగో టీసీఎస్

వైజాగ్ మిలీనియం టవర్స్‌పై బోర్డు ఏర్పాటు

పూర్తి కావొచ్చిన ఇంటీరియర్ పనులు

త్వరలోనే కార్యకలాపాలు

13

బుధవారం | 3-9-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 139 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం, తిథి: ఏకాదశి తె.4.22 తదుపరి ద్వాదశి, నక్షత్రం: పూర్వాషాఢ రా.11.08 తదుపరి ఉత్తరాషాఢ, వర్జ్యం: ఉ.7.57-9.38, దుర్ముహూర్తం: ఉ.11.49-12.39, అమృతఘడియలు: సా.6.04-7.45, రాహుకాలం: మ.12.00-1.30, సూర్యోదయం: 6.05, సూర్యాస్తమయం: 6.23 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

తీరానికి హారం

లాజిస్టిక్స్ గేట్‌వేగా తూర్పు తీరం




ఈస్ట్ కోస్ట్ మారీటైమ్ అండ్ లాజిస్టిక్స్ సదస్సులో ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు

రాష్ట్రంలో 1,050 కిలోమీటర్ల పొడవైన తీరప్రాంతం ఉంది. సముద్ర రవాణాలో ఏపీ రెండోస్థానంలో ఉంది. ఈ విషయంలో మనం మరింత అభివృద్ధి సాధించాలి. మనకు మూడు ఇండస్ట్రియల్ కారిడార్లు ఉన్నందున ఇది సాధ్యమే.

- చంద్రబాబు

మన రాష్ట్రమే దానికి కేంద్రం

ప్రతి 50 కి.మీ.లకు ఒక పోర్టు

రైల్, ఎయిర్, రోడ్డుతో అనుసంధానం

లాజిస్టిక్స్ కోసం ప్రత్యేక కార్పొరేషన్

త్వరలో రెండు కొత్త యూనివర్సిటీలు

అదానీ లాజిస్టిక్స్ యూనివర్సిటీ, జీఎంఆర్ సివిల్ ఏవియేషన్ వర్సిటీ రాక

ప్రస్తుతం 6 పోర్టులు, నిర్మాణంలో మరో 4

షిప్ బిల్డింగ్ తయారీలోనూ ముందుకు

అమరావతికి త్వరలోనే బుల్లెట్ ట్రైన్

ఈస్ట్ కోస్ట్ మారీటైమ్ అండ్ లాజిస్టిక్స్ సదస్సులో సీఎం చంద్రబాబు వెల్లడి

విశాఖపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): "తూర్పు తీరం మారీటైమ్ లాజిస్టిక్స్ గేట్ వేగా మారుతుంది. దీనికి ఏపీనే కేంద్రంగా ఉంటుంది. పొరుగు రాష్ట్రాల కార్గోను కూడా రాష్ట్రంలోని పోర్టుల ద్వారానే రవాణా చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. రాష్ట్రంలో ప్రతి 50 కిలోమీటర్లకు ఒక పోర్టును ఏర్పాటుచేస్తామని వెల్లడించారు. ప్రతి పోర్టునూ రైలు, ఎయిర్, రోడ్డు మార్గాలతో అనుసంధానిస్తూ మాస్టర్ ప్లాన్ రూపొందించనున్నట్టు తెలిపారు. విశాఖపట్నంలోని నోవాటెల్ హోటల్‌లో మంగళవారం జీఎఫ్ఎస్‌టీ, మారీటైమ్ గేట్‌వే సంయుక్తంగా నిర్వహించిన

మిగతా 13వ పేజీలో...

ఎరువుల కోసం ఆందోళన వద్దు

రసాయన ఎరువులు, పురుగు మందులు తక్కువగా వాడే రైతులకు రాయితీలు

11 రకాల ఉద్యాన పంటలకు కనీస ధర: సీఎం

రాష్ట్రానికి మరో 53 వేల టన్నుల యూరియా

రికార్డు స్థాయిలో కేటాయించిన కేంద్రం

12

అమరావతి 'స్పెషల్'!

రాజధాని ప్రాజెక్టులకు ఎస్పీవీ

వేగవంతంగా పూర్తికి చర్యలు

గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టు సహా అన్ని నిర్మాణాలకు వర్తింపు

అర్బన్ డిజైన్లు, ఆర్కిటెక్చరల్ గైడ్‌లైన్స్ నోటిఫికేషన్‌కు ఓకే

కన్వెన్షన్ సెంటర్లకు భూములు

సీఆర్‌డీఏ అథారిటీ భేటీలో 7 అంశాలకు సీఎం ఆమోదం



కర్నూలు మార్కెట్‌కు వచ్చిన ఉల్లి

క్వింటా ఉల్లి @1,200

ప్రభుత్వ కొనుగోళ్లతో అన్నదాతల్లో ఆనందం

మూడు రోజుల్లో 4,817 క్వింటాళ్ల కొనుగోలు

మార్కెట్‌కు పోటెత్తుతున్న పంట

వైసీపీ హయాంలో రేటు లేక పారబోసిన రైతులు

కర్నూలు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉల్లి రైతులకు కూటమి ప్రభుత్వం భరోసా ఇచ్చింది. ధర పతనమై దిక్కుతోచని స్థితిలో ఉన్న రైతులను మేమున్నామంటూ ఆదుకుంది. క్వింటా ఉల్లిని రూ.1,200లకు కొనుగోలు చేసేలా చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈమేరకు ఆది, సోమ, మంగళవారాల్లో 4,817 క్వింటాళ్లను ప్రభుత్వం కొనుగోలు చేసింది. మార్కెట్‌కు వచ్చిన 99 శాతం ఉల్లిని కొని.. రైతు బజార్లకు తరలిస్తోంది. దీనిపై రాయలసీమ రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉల్లి దిగుబడులతో పెద్దఎత్తున రైతులు కర్నూలు మార్కెట్‌కు వస్తున్నారు. 2018లోనూ ధరలు పతనమైతే.. అప్పటి చంద్రబాబు ప్రభుత్వం కనీస మద్దతు ధరను క్వింటా రూ.700గా నిర్ణయించింది. వ్యాపారులు కొనుగోలు చేసిన ధరపై మిగిలిన

మిగతా 2వ పేజీలో...



13

ఎయిరిండియా విమానాల్లో

వృద్ధులకు రాయితీ

అంతర్జాతీయ సర్వీసుల్లో 10 శాతం, దేశీయ సర్వీసుల్లో 25 శాతం దాకా..



2

గడువు విధించే అధికారం

కోర్టులకు ఉందా?

మేం గడువు విధించినా గవర్నర్లు పాటించకపోతే?

'వీలైనంత త్వరగా బిల్లుల్ని ఆమోదించాలి' అని మాత్రమే రాజ్యాంగంలో ఉంది

కొన్ని ఉదంతాల ఆధారంగా గవర్నర్లకు, రాష్ట్రపతికీ కాలపరిమితి నిర్దేశించలేం

అవసరమైతే కోర్టులున్నాయి: సుప్రీంకోర్టు



పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా తెనాలిలో భారీ కేక్ కట్ చేస్తున్న మంత్రి మనోహర్

సుపరిపాలనతో ఎన్డీయేను బలోపేతం చేస్తున్నారు

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ప్రధాని మోదీ, అమిత్ షా జన్మదిన శుభాకాంక్షలు

రాష్ట్రాభివృద్ధిలో ఆయన సహకారం మరువలేనిది: సీఎం చంద్రబాబు

13

పంచాయతీలకు 1,120 కోట్లు విడుదల

11

పంటి నొప్పి అని వెళ్తే

ప్రాణమే పోయింది!

వివాహితకు ఒకేసారి 6 పిప్పి పళ్లు తొలగింపు

తీవ్ర రక్తస్రావంతో బ్రెయిన్ డెడ్

12



13

జగన్.. కాస్త అప్‌డేట్ అవ్వు!

చంద్రబాబుకు, హెరిటేజ్ ఫ్రెష్‌కు లింకు పెట్టడంపై నెటిజన్ల సెటైర్లు

9 ఏళ్ల క్రితమే ఆ సంస్థను అమ్మేసిన బాబు

సుగాలి ప్రీతి కేసు సీబీఐకి

సీఎం చంద్రబాబు నిర్ణయం

14



3

ఫైబర్‌నెట్ నిర్వహణకు

ఎయిర్‌టెల్ ఆసక్తి

మరో ఐదు సంస్థలు కూడా ముందుకు

15 వరకు బిడ్ గడువు పెంచిన ఫైబర్‌నెట్

అబ్బే.. అంతా బాగానే చేశాం!



విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఐపీఎస్ సంజయ్

టెండర్ దక్కించుకున్న ఏజెన్సీకి బిల్లు చెల్లించాం

ఎస్సీ, ఎస్టీ సదస్సుల నిధుల్లో అవినీతి జరగలేదు

అగ్నిమాపకశాఖలో ట్యాబ్‌ల పంపిణీ జరిగింది

ఏసీబీ కస్టడీలో ఐపీఎస్ సంజయ్ వెల్లడి

అమరావతి, విజయవాడ, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): విజయవాడ జిల్లా జైలులో ఉన్న ఐపీఎస్ అధికారి ఎన్.సంజయ్‌ను ఏసీబీ అధికారులు కస్టడీకి తీసుకున్నారు. దళితులకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై అవగాహన కల్గించేందుకు కేటాయించిన నిధులను జగన్ జమానాలో స్వాహా చేసిన వ్యవహారంతోపాటు పలు అవినీతి అంశాలపై సంజయ్‌ను ప్రశ్నించారు. అయితే, కొన్ని ప్రశ్నలకు మౌనం వహించిన ఆయన.. మరికొన్నింటికి 'అబ్బే.. అంతా బాగానే చేశాం' అంటూ నమ్మబలికే ప్రయత్నం చేసినట్టు సమాచారం. సీఐడీ, అగ్నిమాపక విభాగాలకు అధినేతగా ఆనాడు పనిచేసిన సంజయ్‌పై పెద్దఎత్తున అవినీతి ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం ఆదేశంతో విజిలెన్స్ విచారణ జరిపి ఇచ్చిన నివేదిక ఆధారంగా ఏసీబీ ఆయనపై కేసు నమోదు చేసింది. దీనిపై

మిగతా 14వ పేజీలో...

నా అకౌంట్ నా ఇష్టం!

14

ఫేస్‌బుక్‌లో నేను రాసుకునేవాటికి ప్రభుత్వం ఎందుకు స్పందించాలి?

అమరావతిపై వ్యాఖ్యలను సమర్థించుకున్న ప్రభుత్వ అధికారి సుభాష్



కడప జిల్లా కొప్పర్తిలో ఎల్ఈడీ టీవీల పరిశ్రమను ప్రారంభించి తయారీ విధానాన్ని అడిగి తెలుసుకుంటున్న మంత్రి లోకేశ్



కొప్పర్తిలో ప్రారంభించిన రెడీమేడ్ దుస్తుల తయారీ పరిశ్రమలో పనిలో నిమగ్నమైన మహిళలు

కొప్పర్తికి లక్ష ఉద్యోగాలు

అక్కడికి పరిశ్రమలు తెచ్చే బాధ్యత నాదే

మార్పు ఇంటి నుంచే మొదలవ్వాలి

మహిళలను ఎక్కడ గౌరవిస్తే అక్కడే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం

కడప జిల్లా చింతకొమ్మదిన్నె స్కూల్‌లో తొలి స్మార్ట్ కిచెన్ ప్రారంభించిన లోకేశ్

మరో 4 వర్చువల్‌గా ప్రారంభం

టీవీల తయారీ, రెడీమేడ్ దుస్తుల పరిశ్రమలను ప్రారంభించిన మంత్రి

సీకేదిన్నె, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కొప్పర్తి మెగా ఇండస్ట్రియల్ హబ్‌లో లక్ష ఉద్యోగాలు కల్పిస్తామని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. అక్కడకు పరిశ్రమలను తీసుకొచ్చే బాధ్యత తాను తీసుకుంటానని మంత్రి వెల్లడించారు. కడప జిల్లా కమలాపురం నియోజకవర్గం చింతకొమ్మదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.2 కోట్లతో నెలకొల్పిన స్మార్ట్ కిచెన్‌ను ఆయన ప్రారంభించారు. విద్యార్థుల పోషకాహార అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇలాంటి కిచెన్‌ను ఏర్పాటుచేయడం దేశంలోనే తొలిసారి అని తెలిపారు. అనంతరం ఈ జిల్లాలో మరో నాలుగు స్మార్ట్ కిచెన్లను వర్చువల్‌గా ప్రారంభించారు. ఇక్కడ విజయవంతం అయితే, రాష్ట్రమంతా సెంట్రలైజ్డ్ స్మార్ట్‌కిచెన్లను విస్తరిస్తామని తెలిపారు. సోలార్ విద్యుత్‌ను వాడి ఆధునిక పద్ధతుల్లో

మిగతా 13వ పేజీలో...



డీఎస్సీలో భర్తీకాని 700 పోస్టులు!

దసరా సెలవుల్లో కొత్త టీచర్లకు శిక్షణ

12

నేడు, రేపు మూడో విడత సర్టిఫికెట్ల పరిశీలన

వచ్చేసింది స్వదేశీ చిప్

'విక్రమ్-32'

సెమీకండక్టర్ల తయారీలో భారత్ చరిత్ర

దేశీయంగా తయారైన తొలి చిప్ ఆవిష్కరణ

ప్రధానికి అందించిన కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్

సెమీకండక్టర్ల డిజైన్‌లో కీలక శక్తిగా భారత్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 2: సెమీకండక్టర్ల తయారీలో భారత్ చరిత్ర సృష్టించింది. ఈ రంగంలో స్వయం సమృద్ధి సాధించే దిశగా వడివడిగా అడుగులు వేస్తున్న భారత్ దేశీయంగా తయారుచేసిన తొలి చిప్ విక్రమ్-32 (విక్రమ్-3201) బిట్ ప్రాసెసర్‌ను మంగళవారం ఆవిష్కరించింది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)కు

మిగతా 2వ పేజీలో...



సెమీకాన్ ఇండియా సదస్సులో ప్రధాని మోదీకి చిప్‌ను అందజేస్తున్న ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్



బీఆర్ఎస్ నుంచి

కవిత సస్పెన్షన్

పార్టీ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారు

ఆమె తీరుతెన్నులు పార్టీకి నష్టం కలిగిస్తున్నాయి: బీఆర్ఎస్

బహిష్కరణ అనుకుని చివరికి సస్పెన్షన్‌కే పరిమితం!

హైదరాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కొన్నాళ్లుగా ఊహిస్తున్నదే జరిగింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన కన్నకూతురు, పార్టీ ఎమ్మెల్సీ కవితపై సస్పెన్షన్ వేటు వేశారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందుకు ఆమెపై ఈ చర్య తీసుకున్నట్లు బీఆర్ఎస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇటీవల కాలంలో కవిత వ్యవహార శైలి, ఆమె

మిగతా 13వ పేజీలో...

'మత్తు'ను పట్టించేస్తాయి!

పేలుడు పదార్థాలనూ కనిపెడతాయి

35 జాగిలాలకు అంతర్జాతీయ స్థాయిలో శిక్షణ

అమరావతి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వాసన పసిగట్టి నేరగాళ్లను పట్టించడమే కాదు... పేలుడు పదార్థాలను, మాదక ద్రవ్యాలను కూడా గుర్తించేలా బహుముఖ శిక్షణ పొందిన జాగిలాలు పోలీసు శాఖలో ప్రవేశించాయి. అవసరమైతే ఇవి నేరగాళ్లపై దాడి చేసి కట్టడి చేస్తాయి. ఇలా అంతర్జాతీయ స్థాయిలో

మిగతా 14వ పేజీలో...



పాసింగ్ అవుట్ పరేడ్‌లో హోం మంత్రి అనిత, డీజీపీ హరీశ్ కుమార్‌కు పోలీసు జాగిలం సెల్యూట్

వచ్చేసింది స్వదేశీ చిప్ 'విక్రమ్-32'



(మొదటి పేజీ తరువాయి)

చెందిన సెమీకండక్టర్ లేబొరేటరీ (ఎస్‌సీఎల్) అభివృద్ధి చేసిన మేడిన్ ఇండియా చిప్‌ను కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మంగళవారం ప్రారంభమైన సెమికాన్ ఇండియా-2025 సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీకి అందజేశారు. కాగా, ఈ చిప్‌ను 17 విద్యార్థి బృందాలు డిజైన్ చేసి.. రూపొందించాయి.

2021లో ప్రారంభమైన మిషన్..

సెమీ కండక్టర్ల రంగంలో స్వయం సమృద్ధి సాధించే లక్ష్యంతో 2021లోనే భారత్ సెమీకండక్టర్ మిషన్‌ను ప్రారంభించింది. కేవలం మూడున్నర ఏళ్లలోనే ఇస్రో తొలి చిప్‌ను విక్రమ్-32ను అందుబాటులోకి తీసుకొచ్చింది. విక్రమ్-32 అనేది విభిన్న పనులు నిర్వహించే సామర్థ్యం కలిగిన కంప్యూటర్ చిప్. అంతరిక్షంలో ఎదురయ్యే అత్యంత కఠిన పరిస్థితులు, వాతావరణాన్ని సైతం తట్టుకునేలా దీన్ని నిర్మించారు. ఇది -55 డిగ్రీల నుంచి +125 డిగ్రీల ఉష్ణోగ్రతలను సైతం తట్టుకోగలదు. ఇది ఒకేసారి 32 బిట్‌ల నుంచి డేటాను ప్రాసెస్ చేయగలదు. ల్యాప్‌టాప్, స్మార్ట్‌ఫోన్ వంటి పరికరాలకు కాకుండా అంతరిక్ష పరిశోధనల కోసం దీన్ని రూపొందించారు. ఈ చిప్‌లను రాకెట్లు, ఉపగ్రహాలు, లాంచ్ వెహికిల్ ఏవియానిక్స్‌లో వాడనున్నారు. ఇవి లాంచ్ వెహికిల్‌లో నేవిగేషన్, కంట్రోల్, మిషన్ మేనేజ్‌మెంట్ వంటి పనులు నిర్వర్తిస్తాయి.

పీఎస్ఎల్వీ-సీ60లో వినియోగం..

ఇస్రో చేపట్టిన పీఎస్ఎల్వీ-సీ60 ప్రాజెక్టులో విక్రమ్-32ను పరీక్షించారు. ఈ ప్రాజెక్టులోని ఆర్బిటల్ ఎక్స్‌పెరిమెంట్ మాడ్యూల్‌లోని మిషన్ మేనేజ్‌మెంట్ కంప్యూటర్‌లో దీన్ని ఉపయోగించగా.. ఇది అద్భుతంగా పనిచేసింది. సెమికాన్ ఇండియా-2025లో విక్రమ్-32 చిప్‌ను ప్రధాని మోదీకి అందించిన సందర్భంగా కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ.. భారత్‌లో కొత్తగా ఐదు సెమీకండక్టర్ యూనిట్ల నిర్మాణం జరుగుతోందని చెప్పారు. అలాగే ఆరు రాష్ట్రాల్లో రూ.1.60 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులతో 10 ప్రధాన ప్రాజెక్టులకు ఆమోదం లభించిందని తెలిపారు. డిజైన్ లింక్డ్ ఇన్సెంటివ్ స్కీమ్ కింద 23కిపైగా డిజైన్ స్టార్టప్‌లను ప్రోత్సహిస్తున్నామని, దీంతో ప్రపంచ సెమీకండక్టర్ రంగంలో భారత్ ఓ వెలుగు వెలగనుందని చెప్పారు.

20 శాతం చిప్ ఇంజనీర్లు భారత్‌లోనే

సెమీకండక్టర్ డిజైన్ రంగంలో భారత్ కీలక శక్తిగా ఎదుగుతోంది. ప్రపంచంలోని చిప్ డిజైన్ ఇంజనీర్లలో 20% మంది ఇక్కడే ఉన్నారని బాస్టియన్ రిసెర్చ్ నివేదిక చెబుతోంది. ప్రపంచ ప్రసిద్ధి చెందిన క్వాల్‌కామ్, ఇంటెల్, ఎన్‌విడియా, బ్రాడ్‌కామ్, మీడియాటెక్ సంస్థలు బెంగళూరు, హైదరాబాద్, నోయిడాల్లో పెద్ద పరిశోధన, అభివృద్ధి, డిజైన్ కేంద్రాలను ఏర్పాటు చేసుకున్నాయి. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని భారత ప్రభుత్వం 2021లో దాదాపు 76వేల కోట్ల విలువైన ప్రోత్సాహకాలు అందిస్తూ సెమికాన్ ఇండియా మిషన్‌ను ప్రారంభించడం వల్లే ఇప్పుడు దేశంలో సెమీకండక్టర్ వ్యవస్థ బలోపేతమైందని ఈ నివేదిక తెలిపింది.

అఫ్గాన్‌లో 1,400కు పెరిగిన మృతుల సంఖ్య

జలాలాబాద్, సెప్టెంబరు 2: అఫ్గానిస్థాన్‌లో సంభవించిన భారీ భూకంపం కారణంగా మరణించిన వారి సంఖ్య మంగళవారం నాటికి 1,400కు చేరుకుంది. మూడువేల మందికిపైగా గాయపడ్డారు. ఈ విషయాన్ని తాలిబాన్ ప్రభుత్వ అధికార ప్రతినిధి ఎక్స్ ద్వారా తెలిపారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికార వర్గాలు భావిస్తున్నాయి. మారుమూల కొండ ప్రాంతాలకు సహాయ బృందాలు వెళ్లే వీలు లేకపోవడంతో అక్కడి పరిస్థితి పూర్తిగా తెలియరావడం లేదు. ఇళ్లన్నీ మట్టి, కలపతో నిర్మించినవి కావడంతో భూకంపం కారణంగా అవన్నీ నేలమట్టమయ్యాయి. ఆదివారం అర్ధరాత్రి అందరూ నిద్రిస్తున్న సమయంలో ఈ ప్రమాదం సంభవించడంతో తప్పించుకునేందుకు అవకాశం లేకపోయింది. తాలిబన్ ప్రభుత్వాన్ని ఒక రష్యా మినహా మిగతా దేశాలేవీ గుర్తించకపోవడంతో అంతర్జాతీయ సాయం అంతగా అందడం లేదు. నిధులు లేక ఇప్పటికే 420 ఆరోగ్య కేంద్రాలను మూసివేసినట్టు ఐక్యరాజ్యసమితి సమన్వయ కర్త కేట్ కేరీ చెప్పారు. వీటిలో 80 భూకంప ప్రభావిత ప్రాంతంలోనివేనని తెలిపారు. .

ఎమ్మెల్యే అరెస్టు కోసం వెళ్లిన పోలీసులపై కాల్పులు

» అదే అదనుగా పారిపోయిన ఆప్ ఎమ్మెల్యే హర్మీత్ సింగ్

పటియాలా, సెప్టెంబరు 2: పంజాబ్‌లో అధికార ఆప్ ఎమ్మెల్యే హర్మీత్ సింగ్ పోలీసు కస్టడీ నుంచి సినీఫక్కీలో పరారయ్యారు. హర్మీత్ తనను మోసం చేశారంటూ ఓ మహిళ ఫిర్యాదు చేసింది. అత్యాచారం, మోసం, నేరపూరిత కుట్ర ఆరోపణలపై కేసు నమోదు చేసిన పోలీసులు.. మంగళవారం హరియాణాలోని కర్నాల్ జిల్లా డబ్రిలో ఉన్న హర్మీత్ ఇంటికి వెళ్లారు. ఆయన్ని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించేందుకు సిద్ధమవగా.. కొందరు అల్లరిమూకలు, గ్రామస్థులు కాల్పులు జరపడంతో పాటు రాళ్లు రువ్వారు. ఇదే అదనుగా ఎమ్మెల్యే పారిపోయారని, గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

పోలీసు నిఘాలోకి చాట్‌జీపీటీ!

న్యూఢిల్లీ, సెప్టెంబరు 2: చాట్‌జీపీటీతో సంభాషిస్తున్నారా? జాగ్రత్త! ఒకటికి రెండుసార్లు ఆలోచించి మీ మనసులో మాటలు టైప్ చేయండి! చాట్‌జీపీటీతో మీ సంభాషణలు అత్యంత రహస్యం, సురక్షితం అనుకోవడానికి ఇక ఎంతమాత్రం వీల్లేదు. చాట్‌జీపీటీతో మీ సంభాషణలు కొన్నిసార్లు పోలీసుల దృష్టికి కూడా వెళ్లొచ్చునని, యూజర్లు జరిపే సంభాషణలపై ప్రత్యేక నిఘా ఉంటుందని ఓపెన్ ఏఐ సంస్థ ప్రకటించింది. మరి.. ఎందుకీ నిఘా? అనంటే.. హింసాత్మకచర్యలపై, లేదా ఎవరినైనా లక్ష్యంగా చేసుకొని కలిగించాలనుకునే కష్టనష్టాలపై సంకేతాలను ముందుగానే పసిగట్టేందుకేనని ఓపెన్ ఏఐ పేర్కొంది. ప్రమాదకరమైన సంకేతాలున్న సంభాషణలను గుర్తించి వెంటనే ఓపెన్ ఏఐ సంస్థకు చెందిన స్పెషల్ రివ్యూ టీమ్‌కు, ఆపై సంభాషణల తీవ్రతను బట్టి సంస్థ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీకి పంపుతారు.

45 ఏళ్లు దాటితే ఊపిరితిత్తుల వ్యాధులు అధికం!

న్యూఢిల్లీ, సెప్టెంబరు 2: భారత్‌లో 45 ఏళ్లకు పైబడిన వారిలో 14% కంటే ఎక్కువ మంది ఊపిరితిత్తుల వ్యాధుల ప్రభావానికి గురవుతున్నారని ముంబైలోని ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ పాపులేషన్ సైన్సెస్ బృందం చేసిన అధ్యయనంలో వెల్లడైంది. అమెరికాలోని సదరన్ కాలిఫోర్నియా వర్సిటీ, హార్వర్డ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్‌కు చెందిన పరిశోధకులతో కలిసి ఈ బృందం చేపట్టిన 'లాంగిట్యూడినల్ ఏజింగ్ స్టడీ ఇన్ ఇండియా'లో దాదాపు 31వేల మంది స్పైరోమెట్రీని పరీక్షించారు. ఈ క్రమంలో 45ఏళ్లకు పైబడిన వారిలో ఎక్కువ మంది అవరోధిత ఊపిరితిత్తుల వ్యాధుల ప్రభావానికి గురయ్యారని గుర్తించారు. వారిలో ఎక్కువ మంది ఊపిరితిత్తులకు వాపు, నష్టం కలిగించి, శ్వాస ప్రవాహాన్ని అడ్డుకునే క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్‌కు గురయ్యారని పరిశోధకులు పేర్కొన్నారు. సర్వేచేసిన వారిలో మహిళలతో పోలిస్తే పురుషులు ఎక్కువగా ఈ ప్రభావానికి గురైనట్టు వెల్లడించారు.

క్వింటా ఉల్లి @1,200

(మొదటి పేజీ తరువాయి)

మొత్తాన్ని బోనస్‌గా ఇచ్చారు. ఉదాహరణకు క్వింటా రూ.300లకు వ్యాపారి కొంటే ప్రభుత్వం రూ.400 బోనస్ ఇచ్చింది.

వైసీపీ మద్దతు ధర.. ప్రకటనలకే పరిమితం

2019లో వైసీపీ ప్రభుత్వం ఉల్లి గిట్టుబాటు ధరను రూ.770 ప్రకటించినా అది ప్రకటనలకే పరిమితం అయ్యింది. 2022 సెప్టెంబరులో ఉల్లి క్వింటా రూ.350 నుంచి రూ.500లకు మించి రాలేదు. అప్పటి వైసీపీ ప్రభుత్వం పంటను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయలేదు.. బోనస్ కూడా ఇవ్వలేదు. దీంతో రైతులు పంటను రోడ్లపై పారబోయాల్సి వచ్చింది. గతేడాది ధరలు ఆశాజనంగా ఉండడంతో ఈ ఏడాది ఉల్లి సాగు రెట్టింపు అయ్యింది. పంట చేతికొచ్చే సమయంలో అధిక వర్షాల వల్ల దిగుబడులు తగ్గిపోయాయి. అదే క్రమంలో మహారాష్ట్ర నుంచి పెద్దఎత్తున ఉల్లి మార్కెట్‌లోకి వచ్చింది. దీంతో కర్నూలు మార్కెట్‌లో ఉల్లి ధరలు పతనమయ్యాయి. క్వింటా రూ.450 నుంచి రూ.1,150కు అమ్ముడవుతోంది. దీంతో క్వింటా రూ.1,200లకు కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది..

మూడు రోజుల్లో 4,817 క్వింటాళ్లు కొనుగోలు

ప్రభుత్వం నిర్ణయించిన క్వింటా ధర రూ.1,200 ప్రకారం కర్నూలు మార్కెట్‌లో రెండు రోజుల్లో ఏపీ మార్క్‌ఫెడ్ 4,817 క్వింటాళ్లు కొనుగోలు చేసింది. తొలి రోజు ఆదివారం 212 క్వింటాళ్లు కొనుగోలు చేశారు. సోమవారం 1,607 క్వింటాళ్ల ఉల్లి మార్కెట్‌కు రాగా.. అందులో 82 క్వింటాళ్లు మాత్రమే వ్యాపారులు కొనుగోలు చేశారు. మిగిలిన 1,525 క్వింటాళ్లను ఏపీ మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసింది. మంగళవారం రైతులు 3,261 క్వింటాళ్లు తీసుకొస్తే, 3,080 క్వింటాళ్లను ప్రభుత్వం కొనుగోలు చేసింది.



ప్రభుత్వమే ఆదుకుంది

ఎకరన్నర పొలంలో ఉల్లి సాగు చేశా. అధిక వర్షాలకు పంట దెబ్బతిని దిగుబడి తగ్గింది. ధర కూడా బాగా పడిపోయింది. క్వింటా రూ.500కూ అడిగేవారు లేరు. 56.50 క్వింటాళ్లు కర్నూలు మార్కెట్‌కు తెచ్చా. వ్యాపారులు రూ.517కు మించి కొనుగోలు చేయలేమన్నారు. ప్రభుత్వం రూ.1,200లకు కొనడంతో రూ.67,800లు చేతికి వచ్చింది. బయటకంటే రూ.39,550 అదనంగా వచ్చింది. సీఎం చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు.

- చంద్రప్ప, పార్లపల్లె గ్రామం, ఎమ్మిగనూరు మండలం, కర్నూలు జిల్లా.

రైతులు నష్టపోకుండా చర్యలు

కర్నూలు అగ్రికల్చర్: ఉల్లి రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకుంటున్నామని మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయసునీత చెప్పారు. కర్నూలు మార్కెట్ యార్డులో ఉల్లి కొనుగోలు ప్రక్రియను మంగళవారం ఆమె పరిశీలించారు. రైతులతో మాట్లాడి పెట్టుబడి, పంట దిగుబడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటిదాకా క్వింటాకు రూ.500, రూ.600 మాత్రమే దక్కిందని, సీఎం చంద్రబాబు తమ నష్టాలను తెలుసుకొని క్వింటాకు రూ.1,200 ఇవ్వడం సంతోషంగా ఉందని రైతులు చెప్పారు. మార్కెటింగ్ కమిషనర్ మాట్లాడుతూ మూడు రోజుల్లో 4,817 క్వింటాళ్లు కొనుగోలు చేశామన్నారు. జేడీ రామాంజనేయులు, డీడీ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

- కమిషనర్ విజయసునీత

మరణించిన నా తల్లిని దూషిస్తారా?

ఇది అందరు అమ్మలు, అక్కచెల్లెళ్లను, ఆడబిడ్డలను అవమానించడమే : ప్రధాని

» బీసీ గద్దెనెక్కడం కాంగ్రెస్ సహించదు
» ఆర్జేడీ హయాంలో బిహార్లో నేరాల వెల్లువ
» అందుకే మహిళలే దించేశారు: మోదీ



న్యూఢిల్లీ/పట్నా, సెప్టెంబరు 2: ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ బిహార్లో చేపట్టిన 'ఓటర్ అధికార యాత్ర'లో కాంగ్రెస్, ఆర్జేడీ నేతలు తన తల్లిని, తనను దూషించడంపై ప్రధాని మోదీ ఆవేదన వ్యక్తంచేశారు. నూరేళ్లు బతికి మరణించిన తన తల్లికి రాజకీయాలు తెలియదని.. ఆమెపై అనుచిత వ్యాఖ్యలు చేయడం.. తన తల్లినే గాక దేశంలోని అందరు అమ్మలు, అక్కచెల్లెమ్మలు, ఆడబిడ్డలను అవమానించడమేనని స్పష్టంచేశారు. స్వయం సహాయక బృందాల(ఎస్‌జీహెచ్ గ్రూపులు)కు ఆర్థిక సాయం చేయడానికి సీఎం నితీశ్‌కుమార్ సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటుచేసిన 'జీవికా నిధి సాఖ్ సహకారీ సంఘ్ లిమిటెడ్' సంస్థను మోదీ మంగళవారం ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'అమ్మ ప్రతి ఒక్కరి ఆత్మగౌరవం. కొద్దిరోజుల కిందట దర్భంగాలో జరిగిన కాంగ్రెస్-ఆర్జేడీ సభ వేదికపై నా తల్లిని దూషించారు. సంప్రదాయ విలువలకు పేరుగాంచిన బిహార్ నేలపై ఇలాంటి ఘటన జరుగుతుందని నేనెన్నడూ ఊహించలేదు. బిహార్లో ఇది చూసిన ప్రతి తల్లీ ఇందుకు ఎంతగానో బాధపడుతోందని నాకు తెలుసు. నా గుండెల్లో ఉన్నంత బాధే వారిలో కూడా ఉంది. భారత మాతనే అవమానించేవారికి.. నా తల్లి పట్ల అలాంటి అసభ్య పదాలు వాడడం పెద్ద లెక్కలోది కాదు. ఇలాంటివారిని శిక్షించాలి. నా తల్లికి రాజకీయాలతో సంబంధం లేదు. ఆమె తప్పేంటి..? ఎందుకు దూషించాలి? బిహార్ సీతామాత జన్మభూమి. కాంగ్రెస్, ఆర్జేడీలను నేను క్షమించినా.. బిహార్ తల్లులు క్షమించరు' అని మోదీ అన్నారు. తనకు జన్మనిచ్చిన తల్లి మాతృభూమికి సేవచేయాలని తనను కోరిందని.. అందుకే దేశంలో మహిళల సంక్షేమానికి తాను అవిశ్రాంతంగా కృషిచేస్తున్నానని తెలిపారు. ఆమె తన కోసం చీర కూడా కొనుక్కుని ఎరుగదని చెప్పారు. మహిళా వ్యతిరేక మనస్తత్వం ఉన్నవారు అధికారంలోకి వస్తే.. అమ్మలు, అక్కచెల్లెళ్లు, ఆడబిడ్డలు ఎక్కువ బాధలు పడాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆర్జేడీ హయాంలో రాష్ట్రంలో నేరాలు, హత్యలు, దోపిడీలు, అత్యాచారాలు, వసూళ్లు నిత్యకృత్యమని గుర్తుచేశారు. హంతకులు, రేపిస్టులకు ఆర్జేడీ ప్రభుత్వం రక్షణ కల్పించిందన్నారు. నాడు మహిళలే ఎక్కువగా బాధలు పడ్డారని.. వారే ఆ ప్రభుత్వాన్ని దించేశారని చెప్పారు. వెనుకబడిన వర్గాలకు చెందినవారు అధికారంలోకి రావడాన్ని కాంగ్రెస్ ఎప్పుడూ సహించదని.. అందుకే తనను దూషిస్తోందని మోదీ ధ్వజమెత్తారు.

తక్కువ వడ్డీతో రుణాలు..

స్వయం సహాయక బృందాలకు తక్కువ వడ్డీతో రుణాలు/ఆర్థిక సాయం అందించడం నితీశ్ సర్కారు ప్రారంభించిన 'జీవికా నిధి' లక్ష్యం. ఈ సంస్థ నిర్వహణకు రాష్ట్రప్రభుత్వం, కేంద్రం కూడా నిధులు అందిస్తాయి. మహిళా పారిశ్రామికవేత్తలు ఆర్థిక సాయం కోసం ప్రస్తుతం సూక్ష్మ ఆర్థిక సంస్థలపై ఆధారపడుతున్నారు. 18-24 శాతం వడ్డీ చెల్లించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో మహిళలకు తక్కువ వడ్డీలతో సకాలంలో ఆర్థిక సాయం అందించే జీవికా నిధిని ఏర్పాటుచేశారు. ఈ వ్యవస్థ పూర్తిగా డిజిటల్ లావాదేవీలే నడుస్తాయి. దీని ద్వారా 'జీవికా దీదీల' బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా నిధులు బదిలీ అవుతాయి.

కాంగ్రెస్ నేత ఖేడాకు రెండు ఓటరు ఐడీలు

కాంగ్రెస్ మీడియా విభాగం ఇన్‌చార్జి పవన్ ఖేడాకు వేర్వేరు నంబర్లతో రెండు ఓటరు ఫొటో గుర్తింపు కార్డులు ఉన్నాయని బీజేపీ ఆరోపించింది. బిహార్‌లో ఓట్ల చోరీ జరిగిందని రాహుల్ గాంధీ గగ్గోలు పెడుతున్నారని, కానీ అసలు 'ఓట్ల దొంగ' కాంగ్రెస్సేనని విమర్శించింది. ఖేడాకు రెండు ఓటరు ఐడీలు ఎలా వచ్చాయో ఎన్నికల సంఘం(ఈసీ) దర్యాప్తు చేయాలని డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో ఢిల్లీ ఎన్నికల సంఘం ఖేడాకు నోటీసులు జారీ చేసింది. ఈ నెల 8వ తేదీ 11 గంటల్లోపు సమాధానం ఇవ్వాలని సూచించింది. బీజేపీ ఆరోపణలపై ఖేడా స్పందిస్తూ ఆ పార్టీ నాయకులు చెప్పిన తర్వాతే తనకు రెండో ఓటరు ఐడీ ఉన్నట్లు తెలిసిందన్నారు. దీన్ని బట్టి ఓటర్ల జాబితాలు ఎంత లోపభూయిష్టంగా ఉన్నాయో తేటతెల్లమవుతోందన్నారు. దీనికి ఈసీనే నిందించాలని, ఓటర్ల జాబితాలను సక్రమంగా నిర్వహించడంలో ఈసీ విఫలమైందని విమర్శించారు.



గ్రామీణ ఇంజనీరింగ్ కాలేజీల

వెనుకబాటు!

» కృత్రిమ మేధపై అవగాహన కరువు
» దేశ వ్యాప్తంగా వెయ్యి గుర్తింపు
» అప్‌గ్రేడ్‌కు సిద్ధమైన ఏఐసీటీఈ
» జాబితాలో ఏపీ, తెలంగాణ సంస్థలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 2: దేశంలోని పలు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని గ్రామీణ ఇంజనీరింగ్ కాలేజీలు పనితీరులో వెనుకబడ్డాయని ఏఐసీటీఈ తెలిపింది. మొత్తం 1000 కాలేజీల పనితీరు ఏమాత్రం బాగోలేదని పేర్కొంది. కృత్రిమ మేధపై అవగాహన కల్పించడంలో ఈ కాలేజీలు వెనుకబడ్డాయని, ఏఐ, డేటా సైన్స్, క్లౌడ్ కంప్యూటింగ్ రంగాల్లో పరిచయమే లేదని పేర్కొంది. మరో 500 కాలేజీలు ఉపాధి కల్పించే విషయంలో మరింత వెనుకబడినట్టు తెలిపింది. ఫలితంగా 5 లక్షల మంది విద్యార్థులపై ప్రభావం పడుతోందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆయా కాలేజీల పనితీరు మెరుగుపడేలా చర్యలు తీసుకోనున్నట్టు పేర్కొంది. 2028 నాటికి ఉపాధి, ఉద్యోగాల కల్పనలో ఆయా కాలేజీలపాత్ర మెరుగు పడేలా చేయనున్నట్టు ఏఐసీటీఈ వివరించింది. దీనికి అమెరికాకు చెందిన మేకర్ భవన్ ఫౌండేషన్ సహాయం తీసుకోనున్నట్టు పేర్కొంది.

ఏపీలో 41, తెలంగాణలో 36

వెనుకబడిన గ్రామీణ ఇంజనీరింగ్ కళాశాలల జాబితాలో ఏపీ నుంచి 41, తెలంగాణ నుంచి 36 ఉన్నాయని ఏఐసీటీఈ తెలిపింది. అదేవిధంగా తమిళనాడులో అత్యధికంగా 128, కేరళలో 60, హరియాణాలో 43, పంజాబ్‌లో 33, యూపీలో 31, మహారాష్ట్రలో 29, గుజరాత్‌లో 25, కర్ణాటకలో 17, ఒడిశాలో 16, ఉత్తరాఖండ్, బెంగాల్‌లో 11 చొప్పున ఉన్నాయి.

ఆధార్ అమ్మేశారంటూ

93 లక్షలు స్వాహా

» విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలికి టోకరా

ఆకివీడు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): 'డిజిటల్ అరెస్టు' మోసం కొత్త పుంతలు తొక్కింది. సుప్రీం కోర్టు అరెస్టు చేయమని ఉత్తర్వులు ఇచ్చింది అంటూ ఓ విశ్రాంత ఉపాధ్యాయురాలిని బెదిరించిన మోసగాళ్లు దఫదఫాలుగా రూ.93 లక్షలు గుంజారు. చివరికి మోసపోయానని గుర్తించిన ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే... విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు కాకరపర్తి రాజరాజేశ్వరిది(64) పశ్చిమ గోదావరిజిల్లా ఆకివీడు. జూలై 25న ఆమెకు ఓ వీడియోకాల్ వచ్చింది. పోలీస్ డ్రెస్‌లో ఉన్న ఓ వ్యక్తి కర్ణాటక గాంధీనగర్ ఎస్ఐని అంటూ పరిచయం చేసుకున్నాడు. 'మీ ఆధార్ నంబరుతో ఒక వ్యక్తి సెల్ నంబరు తీసుకొని అమ్మాయిలను ఏడిపిస్తున్నాడు. మేం అతనిని అరెస్టు చేశాం. మీకు రూ.30 లక్షలు చెల్లించి మీ ఆధార్‌కార్డు కొనుగోలు చేసినట్లు చెప్తున్నాడు. ఆ మొత్తం మీ ఖాతాకు జమ చేశానంటూ మాకు ఆధారాలు చూపిస్తున్నాడు. మీ అరెస్టుకు సుప్రీం కోర్టు ఆదేశాలు ఇచ్చింది. మిమ్మల్ని అరెస్టు చేసేందుకు వస్తున్నాం' అంటూ సదరు వ్యక్తి బెదిరించాడు. దీంతో రాజరాజేశ్వరి కంగారుపడ్డారు. తన ఆధార్ కార్డు తన వద్దే వుందని, ఎవరికీ అమ్మలేదని చెప్పారు. తన ఖాతాకు ఎలాంటి సొమ్ములు జమ కాలేదని పేర్కొన్నారు. వీడియో కాల్‌లో ఉన్న వ్యక్తి... బ్యాంకు ఖాతాల వివరాలు, ఓటీపీ వివరాలు తమకు పంపించాలని, పూర్తి స్థాయిలో తనిఖీ చేసి తప్పులేదని తేలితే వదిలేస్తామని, లేకుంటే చిక్కుల్లో పడతారని బెదిరించాడు. ఈ కేసు విషయం ఎవరికైనా చెపితే వాళ్లనూ అరెస్టు చేస్తామని హెచ్చరించారు. దీంతో తీవ్ర భయాందోళనలకు గురైన ఆమె... తన ఖాతాల వివరాలను వారికి చెప్పింది. బంగారం తాకట్టు పెట్టి మరీ దఫదఫాలుగా తన ఖాతాలో రూ.93 లక్షలు జమ చేసింది. ఆ మొత్తాన్ని అవతలి వ్యక్తి నెల రోజుల్లో పది సార్లుగా డ్రా చేసేశాడు. ఆ తరువాత నుంచి ఆ వ్యక్తి ఫోన్ తీయడం మానేశాడు. దీంతో మోసపోయానని గ్రహించిన ఆమె మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ జగదీశ్వరరావు పర్యవేక్షణలో ఎస్ఐ హనుమంతు నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. డీఎస్పీ జయసూర్య ఆకివీడు వచ్చి జరిగిన విషయం తెలుసుకున్నారు.

గడువు విధించే అధికారం

కోర్టులకు ఉందా?

» గడువు విధించినా గవర్నర్లు పాటించకపోతే?
» 'వీలైనంత త్వరగా బిల్లుల్ని ఆమోదించాలి' అని మాత్రమే రాజ్యాంగంలో ఉంది
» కొన్ని ఉదంతాల ఆధారంగా గవర్నర్లకు, రాష్ట్రపతికి కాలపరిమితి నిర్దేశించలేం
» అవసరమైతే కోర్టులు ఉన్నాయి: సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ, సెప్టెంబరు 2: బిల్లులపై ఆమోదముద్ర కోసం గవర్నర్లకు గడువు విధించే అధికారం న్యాయస్థానాలకు ఉందా? ఒకవేళ గడువు విధిస్తే.. దానిని గవర్నర్లు పాటించకపోతే పరిస్థితి ఏమిటి? అంటూ సుప్రీంకోర్టు సందేహాలు వ్యక్తం చేసింది. 'బిల్లులపై గవర్నర్లు, రాష్ట్రపతి ఆమోదం' అంశంపై అత్యున్నత న్యాయస్థానం మంగళవారం విచారణ కొనసాగించింది. ఈ సందర్భంగా తమిళనాడు ప్రభుత్వం తరఫున అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. గవర్నర్లకు గడువు విధించకపోతే బిల్లులను ఎంతకాలమైనా ఆమోదించకుండా ఉండే పరిస్థితి ఉంటుందని, తద్వారా సదరు బిల్లు కాలదోషం పట్టే పరిస్థితి తీసుకురావచ్చన్నారు. గవర్నర్ సూపర్ చీఫ్ మినిస్టర్‌లా మారే ప్రమాదం ఉందని తెలిపారు. బెంగాల్ ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించిన కపిల్ సిబల్.. రాజ్యాంగ వ్యవస్థలు పని చేయకుండా అడ్డుకోవటానికి గవర్నర్లకు రాజ్యాంగం ఎటువంటి హక్కు కల్పించలేదని, కోర్టు జోక్యం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. కాగా, విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ స్పందిస్తూ.. ఒక్కో అంశం ఒక్కో విధంగా ఉంటుందని, అన్ని బిల్లులకూ ఒకే గడువు ఎలా విధించగలమన్నారు. బిల్లుల ఆమోదంపై రాష్ట్రపతికి గడువును పేర్కొనటం అంటే బలవంతంగా విధించటంలాగే ఉందన్నారు. బిల్లుల ఆమోదానికి రాజ్యాంగం ఎటువంటి గడువును పేర్కొనలేదని, వీలైనంత త్వరగా ఆమోదించాలని మాత్రమే చెప్పిందని గుర్తు చేశారు. గవర్నర్లు బిల్లుల ఆమోదంపై జాప్యం చేసిన కొన్ని ఉదంతాల ఆధారంగా మొత్తం గవర్నర్ల వ్యవస్థ మీద, రాష్ట్రపతి మీద గడువు విధించలేమని ఒకదశలో ధర్మాసనం అభిప్రాయపడటం గమనార్హం. అలా చేస్తే కోర్టే రాజ్యాంగంలో సవరణ జరిపినట్లవుతుందని జస్టిస్ విక్రమ్‌నాథ్ పేర్కొన్నారు. జాప్యం జరుగుతుందని భావించినప్పుడు న్యాయస్థానానికి రావచ్చని, ఆ అవకాశం ఎప్పుడూ రాష్ట్రాలకు ఉంటుందని ధర్మాసనం గుర్తుచేసింది.

వాదనల్లో తెలంగాణ ప్రస్తావన


పార్టీ మారినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరు ఎమ్మెల్యేల అభ్యర్థిత్వంపై మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌ను ఇటీవల సీజేఐ గవాయ్ ఆదేశించిన విషయాన్ని సింఘ్వీ గుర్తు చేశారు. గవర్నర్లకు కూడా ఇలాగే కాలపరిమితి విధించవచ్చన్నారు. దీనిపై సీజేఐ స్పందిస్తూ.. 'దేశంలో ఉన్న అసెంబ్లీల స్పీకర్లందరికీ ఈ ఆదేశాలు ఇవ్వలేదు. అక్కడ ఉన్న కేసును బట్టి మాత్రమే ఆ ఆదేశాలిచ్చాం' అని స్పష్టం చేశారు.

శిక్ష తగ్గించాలని కోరే హక్కు జీవిత ఖైదీలకూ ఉంది

సహజ మరణం సంభవించే వరకు జైలులోనే గడపాలంటూ తీర్పు వచ్చినప్పటికీ ఆ శిక్షను తగ్గించాలని కోరే హక్కు ఖైదీలకు ఉందని మంగళవారం సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. మైనర్లపై అత్యాచారం చేసి జీవితాంత శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు కూడా ఇలాంటి వినతి చేయవచ్చని తెలిపింది. పూర్వపు ఇండియన్ పీనల్ కోడ్‌లోని సెక్షన్ 376డీఏ రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యంపై ఈ స్పష్టత ఇచ్చింది. 16 ఏళ్లలోపు బాలికలపై అత్యాచారం, గ్యాంగ్ రేప్‌లకు పాల్పడేవారికి విధించే శిక్షలను ఈ సెక్షన్ వివరిస్తుంది. నేరం రుజువయితే దోషులు సహజ మరణం సంభవించే వరకు జైలులోనే కాలం గడపాల్సి ఉంటుంది. దీనివల్ల క్షమాభిక్షను పొందే హక్కును ముద్దాయిలు కోల్పోతున్నారని, ఇది సమంజసమేనా అన్న ప్రశ్న ధర్మాసనం ముందుకు వచ్చింది.

భారత్ రష్యాతో కాదు.. అమెరికాతో ఉండాలి

» పుతిన్, జిన్‌పింగ్‌లతో సఖ్యత పెంచుకోవడం సిగ్గుచేటు: నవారో



వాషింగ్టన్, సెప్టెంబర్ 2: రష్యాతో భారత్ దోస్తీపై తరచూ తీవ్ర విమర్శలు చేస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో మరోసారి అక్కసు వెళ్లగక్కారు. ప్రధాని మోదీ అవకాశవాదంతో పుతిన్, జిన్‌పింగ్‌లతో సఖ్యత పెంచుకుంటున్నారని, ఇది సిగ్గు చేటని వ్యాఖ్యానించారు. భారత్ ఉండాల్సింది రష్యాతో కాదని, అమెరికాతో ఉండాలని పేర్కొన్నారు. ఈ విషయాన్ని మోదీ త్వరలోనే గ్రహిస్తారని ఆశిస్తున్నట్లు చెప్పారు. మరోవైపు, షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీవో)లో పూర్తిస్థాయి సభ్యత్వం కోసం ప్రయత్నిస్తున్న అజర్‌బైజాన్‌కు భారత్ చెక్ పెట్టింది. దీనిపై అజర్‌బైజాన్ విమర్శలు చేసింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు మద్దతుగా నిలిచినందుకు భారత్ పగతీర్చుకుంటోందని ఆరోపించింది. ఇదిలా ఉండగా, పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ మంగళవారం చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీ అయ్యారు. బుధవారం జరగనున్న చైనా ఆర్మీ గ్రాండ్ పరేడ్‌లో మునీర్ పాల్గొననున్నారు.

పాకిస్థాన్‌తో బిజినెస్ కోసమే

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కుటుంబ వ్యాపారాల కోసం భారత్‌తో సంబంధాలను పణంగా పెట్టారని ఆ దేశ మాజీ భద్రతా సలహాదారు జేక్ సలివాన్ ఆరోపించారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. "ట్రంప్ కుటుంబంతో కలసి వ్యాపారాలు చేసేందుకు పాకిస్థాన్ ముందుకు రావడంతో.. భారత్‌తో సంబంధాలను ట్రంప్ పణంగా పెట్టారు. ఇది అతిపెద్ద వ్యూహాత్మక తప్పిదం" అని పేర్కొన్నారు. చైనాకు చెక్ పెట్టాలంటే అమెరికా భారత్‌తో సత్సంబంధాలు కొనసాగించాలన్నారు.

నవంబరు కల్లా అమెరికాతో వాణిజ్య ఒప్పందం

» భారత్ ఎప్పుడూ డెడ్‌లైన్స్ పెట్టుకుని చర్చలు జరపదు: పీయూష్ గోయల్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 2: అమెరికాతో వాణిజ్య చర్చలు కొనసాగుతున్నాయని.. త్వరలోనే పరిస్థితులన్నీ చక్కబడతాయని.. నవంబరుకల్లా ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదురుతుందని ఆశిస్తున్నామని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. ముంబైలో జరుగుతున్న అంతర్జాతీయ పెట్టుబడిదారుల వార్షిక సదస్సును ఉద్దేశించి వర్చువల్‌గా ప్రసంగించిన గోయల్.. భారత్‌తో వాణిజ్య, వ్యాపార సంబంధాలను పెంచుకోవాలనే ఆసక్తి, ఉత్సాహం ప్రపంచవ్యాప్తంగా పెరుగుతోందని అన్నారు. ఈయూతో స్వేచ్ఛావాణిజ్య ఒప్పందానికి సంబంధించిన చర్చలు కూడా చివరి దశకు చేరుకున్నాయని తెలిపారు. అలాగే.. అంతకుముందు మరో కార్యక్రమంలో మాట్లాడుతూ అమెరికాతో చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు. అయితే, భారతదేశం ఎప్పుడూ డెడ్‌లైన్స్ పెట్టుకొని వాణిజ్య చర్చలు జరపదని.. పరస్పర ప్రయోజనకరంగా ఉండే ఒప్పందాలపై మాత్రమే చర్చలు జరుపుతుందని ఆయన స్పష్టం చేశారు. ఇండియా సరఫరా వ్యవస్థలు చాలా బలంగా ఉన్నాయని.. వేరే ఏ ఇతర దేశ దయాదాక్షిణ్యాలపైనా మనం ఆధారపడి లేమని ఆయన తేల్చిచెప్పారు. చిలీ, పెరు, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, ఓమన్ వంటి దేశాలతో కూడా కొత్త వాణిజ్య ఒప్పందాలను భారత్ కుదుర్చుకుంటున్నట్టు ఆయన వెల్లడించారు. ఇదిలా ఉండగా, సుంకాలు, ఇంధన విధానాలపై విభేదాలు ఉన్నప్పటికీ.. రెండు గొప్ప దేశాలైన ఇండియా, అమెరికా బంధానికి బలమైన పునాదులు ఉన్నాయని.. ఈ సమస్యను ఇరు దేశాలూ పరిష్కరించుకుంటాయని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ అన్నారు. ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ విలువలు.. రష్యా, చైనా కన్నా అమెరికా విలువలకు దగ్గరగా ఉంటాయని 'ఫాక్స్ న్యూస్' వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పేర్కొన్నారు.

ఫైబర్ నెట్ నిర్వహణకు ఎయిర్‌టెల్ ఆసక్తి

- మరో ఐదు సంస్థలు కూడా ముందుకు
- 15 వరకు బిడ్ గడువు పెంచిన ఫైబర్‌నెట్

అమరావతి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఫైబర్ నెట్ సేవల నిర్వహణ చేపట్టేందుకు ఎయిర్‌టెల్‌తో సహా పలు సంస్థలు ముందుకొచ్చాయి. ఫైబర్ నెట్ సేవలను వినియోగదారులకు అందించేందుకు ఆసక్తి చూపే సంస్థల కోసం పిలిచిన బిడ్ గడువు సోమవారంతో ముగిసింది. ఆ గడువులోగా ఆరు సంస్థలు ముందుకు వచ్చాయి. వీటిలో కార్పస్, ఎస్ఆర్ఐటీ బెంగళూరు, రైల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, ఎయిర్‌టెల్, సిటీ ఆన్‌లైన్, డిష్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ సంస్థలున్నాయి. ప్రసారాలను వినియోగదారులకు అందించినందుకు వసూలు చేసిన నెలవారీ కలెక్షన్ రుసుము నుంచి కొంత ఫైబర్ నెట్‌కు చెల్లించాల్సి ఉంటుంది. అయితే మరిన్ని సంస్థలు బిడ్‌లో పాల్గొనేందుకు వీలుగా ఫైబర్ నెట్ ఆ గడువును ఈ నెల 15 వరకు పెంచింది.

పీఎంఏవై-2.0 ఇళ్ల నిర్మాణానికి రూ. 404 కోట్ల అదనపు నిధులు

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన అర్బన్ 2.0 (పీఎంఏవై-యూ 2.0) కింద రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇళ్లు నిర్మించేందుకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం వివిధ పద్దుల కింద మొత్తం రూ.404 కోట్ల 10 లక్షల అదనపు నిధులు మంజూరు చేసింది. 'అందరికీ ఇళ్లు' కార్యక్రమానికి మూలధన ఆస్తులను సృష్టించేందుకు ఈ నిధులను మంజూరు చేస్తూ రాష్ట్ర గృహ నిర్మాణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఏపీకి బదిలీ అయిన శివశంకర్ లోతేటి

హైదరాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ సంయుక్త కార్యదర్శి శివశంకర్ లోతేటిని తెలంగాణ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు బదిలీ చేసింది. కేంద్ర శిక్షణ, సిబ్బంది వ్యవహారాల శాఖ (డీవోపీటీ) ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. శివశంకర్‌ను ఆంధ్రప్రదేశ్‌కు రిలీవ్ చేయాలని కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్(క్యాట్) గతంలో ఆదేశించింది. ఆ మేరకు ఆయనను రిలీవ్ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

తనయుడి వర్ధంతి నాడే తల్లి మృతి

- దివంగత పోలీసు అధికారి వెస్లీ మాతృమూర్తి కన్నుమూత

ఒంగోలు క్రైం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తనయుడి వర్ధంతి రోజే తల్లి మృతిచెందారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, బంధువులు విషాదంలో మునిగిపోయారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర రెడ్డి భద్రతా అధికారిగా ఉన్న అద్దంకి సాల్మన్‌కేరి వెస్లీ ఆయనతోపాటు 2009లో నంద్యాల జిల్లా పావురాలగుట్టలో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. ఆయన 16 వర్ధంతి మంగళవారం. ఆ రోజే ఆయన తల్లి కమల వెస్లీ(94) వయోభారంతో మృతి చెందారు. కాగా వర్ధంతి నేపథ్యంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట వెస్లీ విగ్రహానికి పోలీసు శాఖ తరఫున ఎస్పీ ఏఆర్.దామోదర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం స్థానిక మిరియాలపాలెంలోని వెస్లీ స్వగృహంలో కమల వెస్లీ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ఎస్పీ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ప్రోత్సాహకాలు ఇంకెప్పుడు?

పారిశ్రామికవేత్తలకు 5 వేల కోట్లకుపైగా బకాయిలు

వైసీపీ హయాం నుంచి పెండింగ్‌లోనే

- నాలుగేళ్లు బకాయిపెట్టిన జగన్ సర్కార్
- ఆదుకుంటామని కూటమి ప్రభుత్వం హామీ
- మే 15లోపే నిధులు ఇస్తామన్న మంత్రులు
- ఇప్పటి వరకు పైసా విదల్చని వైనం
- కొవిడ్ నుంచి ట్రంప్ సుంకాల వరకు పారిశ్రామికవేత్తలకు దెబ్బపై దెబ్బ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలు చెల్లించడంతో కూటమి ప్రభుత్వం గత వైసీపీ ప్రభుత్వం బాటలోనే నడుస్తోంది. "రాష్ట్రంలో పరిశ్రమలకు చెల్లించాల్సిన రూ. 5 వేల కోట్లకు పైగా ప్రోత్సాహకాల బకాయిలను మే 15వ తేదీ లోపు విడుదల చేస్తాం. ఇక మీదట క్రమం తప్పకుండా ప్రోత్సాహకాలు విడుదల చేసేలా దేశంలోనే తొలిసారిగా ఎస్క్రో మెకానిజం (ప్రత్యేక ఖాతా)ను అందుబాటులోకి తీసుకువస్తాం" అని ఆరు నెలల క్రితం విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో పారిశ్రామిక పాలసీల మార్గదర్శకాలు విడుదల చేసిన సందర్భంగా రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్, ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పారిశ్రామికవేత్తలకు భరోసా ఇచ్చారు. కానీ, ఇంతవరకు ఒక్క పైసా కూడా విడుదల చేయలేదు. గత వైసీపీ ప్రభుత్వం కూడా పరిశ్రమలకు ఏటా ఆగస్టులో పారిశ్రామిక ప్రోత్సాహకాలను విడుదల చేస్తామంటూ క్యాలెండర్లను కూడా ప్రకటించింది. 2020-21 సంవత్సరంలో మాత్రమే రెండు విడతలుగా సుమారు రూ. 800 కోట్లు విడుదల చేసింది. ఆ తర్వాత నుంచి పరిశ్రమలకు ప్రోత్సాహకాలు ఇవ్వకుండా చివరికి చేతులెత్తేసింది. ఆ నాలుగేళ్లలోనే రూ. 5 వేల కోట్లకు పైగా ప్రోత్సాహకాలు బకాయిలుగా పేరుకుపోయాయి. పెండింగ్ బకాయిలను విడుదల చేసి సంక్షోభంలో కూరుకుపోయిన పరిశ్రమలకు కొత్త ఊపిరి పోస్తామన్న కూటమి ప్రభుత్వం కూడా ఏడాది కాలంగా పట్టించుకోవడంలేదు. దీంతో తీవ్ర నష్టాలతో రాష్ట్రంలో తమ యూనిట్లను నడపలేమంటూ పారిశ్రామికవేత్తలు చేతులెత్తేస్తున్నారు. పెండింగ్‌లో ఉన్న ఇన్సెంటివ్స్ బకాయిలను విడుదల చేస్తే పరిశ్రమలు తిరిగి నిలదొక్కుకోవడానికి అవకాశముంటుందని పారిశ్రామికవేత్తలు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.



దళితులకు జగనన్న దగా

దళిత పారిశ్రామికవేత్తలను జగన్ ప్రభుత్వం దగా చేసింది. 2020-23లో ప్రకటించిన నూతన పారిశ్రామిక విధానంలో భాగంగా 'జగనన్న బడుగు వికాసం' పథకం కింద రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు 45 శాతం రాయితీలు అందిస్తామని నాటి ముఖ్యమంత్రి జగన్ హామీ ఇచ్చారు. దళితుల ఎంఎస్ఎంఈ యూనిట్లకు విద్యుత్తు చార్జీల రీయింబర్స్‌మెంట్, అమ్మకం పన్ను, మూలధన రాయితీ తదితర ప్రయోజనాలు కల్పిస్తామంటూ ప్రకటించారు. ఆయన మాటలు నమ్మి రాష్ట్రంలోని వేలాదిమంది ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు బ్యాంకుల నుంచి, ప్రైవేటుగా అప్పులు చేసి వ్యాపారాలు ప్రారంభించారు. మొత్తంగా రాష్ట్రంలో ఎస్సీ పారిశ్రామికవేత్తలు 7,675 యూనిట్లు, ఎస్టీ పారిశ్రామికవేత్తలు మరో 1,320 యూనిట్లు నిర్వహిస్తున్నారు. వీరికి దాదాపు రూ. 1,200 కోట్ల వరకు ప్రోత్సాహకాలు పెండింగ్‌లో పెట్టేశారు. అప్పులు, వాటికి వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నామని, తమ యూనిట్లు ఎన్‌పీఏలోకి వెళ్లిపోతున్నాయని, రవాణా వాహనాలు సీజ్ అయిపోతున్నాయని, తమకు రావాల్సిన రాయితీల నిధులను విడుదల చేసి ఆదుకోవాలంటూ దళిత పారిశ్రామికవేత్తలు ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి మొరపెట్టుకుంటున్నారు. గత ఏడాదిగా అదిగో ఇదిగో అంటూ కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తుండటంతో దళిత పారిశ్రామికవేత్తలు రోడ్లపై ఆందోళనలు చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల జేఏసీ ఆధ్వర్యంలో ఇటీవలే మంగళగిరిలోని ఏపీఐఐసీ భవన్ ముందు ఆందోళనకు దిగారు. సెప్టెంబరులో ఇన్సెంటివ్స్ విడుదలయ్యే అవకాశం అధికారులు చెప్పడంతో వారు ఆందోళన విరమించారు.

ఎంఎస్ఎంఈలను ముంచిన జగన్ సర్కారు

రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా రాష్ట్రం నుంచి పలు పెద్ద పరిశ్రమలను వెళ్లగొట్టిన జగన్ ప్రభుత్వం.. కొవిడ్ దెబ్బతో తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిన చిన్నపరిశ్రమలను కూడా నిండా ముంచేసింది. ఎంఎస్ఎంఈలకు ఇన్సెంటివ్స్ ఇవ్వకుండా బకాయిలు పెట్టింది. కొవిడ్‌తో కుదేలైపోయిన చిన్న పరిశ్రమలు తిరిగి నిలదొక్కుకునేందుకు 'రీస్టార్ట్ ప్యాకేజీని అమలు చేస్తామని చెప్పిన వైసీపీ సర్కారు.. అది కూడా చేయకుండా చేతులెత్తేసింది. దాంతో రాష్ట్రవ్యాప్తంగా కొన్ని వేల ఎంఎస్ఎంఈ యూనిట్లు మూతబడ్డాయి. ఇటీవల ముడిసరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోవడం, లేబర్ చార్జీలు, విద్యుత్తు చార్జీల భారాలను భరించలేక చిన్న పరిశ్రమలు ఇప్పటికీ మూతబడుతూనే ఉన్నాయి. రాష్ట్రంలో దాదాపు 25 లక్షల ఎంఎస్ఎంఈ పరిశ్రమలున్నాయి. ఇవి రాష్ట్రంలో దాదాపు 70 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. వివిధ రంగాల్లో 40 శాతానికి పైగా పారిశ్రామిక ఉత్పత్తులను ఎగుమతి చేస్తున్నాయి. తాజాగా అమెరికా 50 శాతం సుంకాలు విధించడంతో రాష్ట్రం నుంచి ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడుతోంది. ముఖ్యంగా ఫుడ్ ప్రాసెసింగ్, స్పిన్నింగ్, టెక్స్‌టైల్స్, ఆక్వా తదితర పరిశ్రమలు మరింత సంక్షోభంలో పడ్డాయని పారిశ్రామికవేత్తలు గగ్గోలు పెడుతున్నారు. కొవిడ్ కాలం నుంచి దెబ్బ మీద దెబ్బ పడుతున్న ఎంఎస్ఎంఈలను ఆదుకునేందుకు పరిశ్రమలకు చెల్లించాల్సిన రూ. 5 వేల కోట్ల పెండింగ్ ప్రోత్సాహకాల నిధులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఏపీ చాంబర్స్ ప్రతినిధి బృందం ప్రభుత్వ పెద్దలను కలిసి వినతిపత్రాలు సమర్పించింది. ఉత్పత్తి వ్యయం విపరీతంగా పెరిగిపోయిన నేపథ్యంలో పరిశ్రమల నిర్వహణ కష్టతరంగా మారిందని, ప్రభుత్వం వెంటనే పెండింగ్ ప్రోత్సాహకాలను విడుదల చేయాలని ఏపీ చాంబర్స్ అభ్యర్థించింది.



ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుకు లేఖ ఇస్తున్న రమణారెడ్డి తదితరులు

పనిష్మెంట్లు లేని పదోన్నతులు ఇవ్వాలి

- గతంలో కేసులు కొట్టివేయాలని ఏపీపీటీడీ ఎన్ఎంయూఏ విజ్ఞప్తి

విజయవాడ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పనిష్మెంట్లను పరిగణనలోకి తీసుకోకుండా ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వాలని ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్(ఎన్ఎంయూఏ) అధ్యక్షుడు పి.వి.రమణారెడ్డి కోరారు. విజయవాడలో ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావును మంగళవారం యూనియన్ నాయకులతో కలిసి సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. అనంతరం రమణారెడ్డి మాట్లాడుతూ, పనిష్మెంట్లు పరిగణనలోకి తీసుకోకుండా పదోన్నతులు కల్పించే జీఓ ఆలస్యమవడంతో ప్రమోషన్లు ఆగిపోయాయని, వెంటనే జీఓ విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. సూపరింటెండెంట్ స్థాయి నుంచి ప్రమోషన్స్ ఇవ్వడానికి ప్రభుత్వ నుంచి రావాల్సిన అనుమతులు ఆలస్యమవడంతో ఎండీ దృష్టికి తీసుకువచ్చామన్నారు. దీనిపై ఎండీ సానుకూలంగా స్పందించారన్నారు. కోర్టు కేసులు క్లియర్‌చేసి త్వరగా జూనియర్ స్కేల్ అధికారులకు పదోన్నతులు ఇవ్వాలని కోరారు.

ముగ్గురు కార్పొరేషన్ చైర్మన్లకు క్యాబినెట్ హోదా

- శైలజ, జవహర్, ఆలపాటి సురేష్‌కు అవకాశం

అమరావతి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ముగ్గురు కార్పొరేషన్ చైర్మన్లకు రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్ హోదా కల్పించింది. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ, ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్.జవహర్, ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్‌కు క్యాబినెట్ హోదా కల్పిస్తూ సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరికి జిల్లా, రాష్ట్ర స్థాయిలో కూడా క్యాబినెట్ హోదాలోనే ప్రొటోకాల్ అమలు చేయనున్నారు. అదే హోదాలో వేతనాలు, అలవెన్సులు అందించనున్నారు.

18 మంది చైర్మన్లకు వేతనాలు

ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన పలువురు కార్పొరేషన్ చైర్మన్లకు వేతనాలు, అలవెన్సులను నిర్ణయించింది. హ్యాండీక్రాఫ్ట్ చైర్మన్, గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్, మహిళా కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్, భవన, ఇతర నిర్మాణ పనుల వర్కర్ల వెల్ఫేర్ బోర్డు చైర్మన్.. ఇలా 12 మంది చైర్మన్లకు ఏ కేటగిరి కింద వేతనాలు, అలవెన్సులు ఇవ్వడానికి నిర్ణయించింది. తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీతో పాటు మరో ఐదు కార్పొరేషన్ల చైర్మన్లకు బి కేటగిరి కింద వేతనాలు అందించడానికి ఉత్తర్వులు జారీ చేసింది.

హరికృష్ణకు సీఎం చంద్రబాబు నివాళి

అమరావతి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): చైతన్య రథసారథి, మాజీ ఎంపీ నందమూరి హరికృష్ణ జయంతి సందర్భంగా సీఎం చంద్రబాబు ఆయనకు నివాళులర్పించారు. ప్రజాసేవలో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్న హరికృష్ణ తరతరాలకు గుర్తిండిపోయే నాయకుడు అని చంద్రబాబు కొనియాడారు. మంత్రి లోకేశ్ కూడా హరికృష్ణకు నివాళులర్పించారు. 'హరి మావయ్య మన మధ్య లేకపోయినా వారి జ్ఞాపకాలు మా మనస్సుల్లో ఎప్పటికీ నిలిచే ఉంటాయి. సినీ రంగానికి, పార్టీకి, ప్రజలకు నందమూరి హరికృష్ణ చేసిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకుందాం' అని లోకేశ్ అన్నారు.

అసలైన వెన్నుపోటుదారుడు జగన్: వర్ల రామయ్య

'అసలైన వెన్నుపోటుదారుడు జగన్‌రెడ్డి. వెన్నుపోటు మొదలైందే వైఎస్ కుటుంబం నుంచి' అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య పేర్కొన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చేయని తప్పునకు మూడు దశాబ్దాల నుంచి వెన్నుపోటు అనే నిందను మోస్తున్న చంద్రబాబు అసలు సిసలైన ప్రొటెక్టర్ అని రామయ్య పేర్కొన్నారు. 1995 ఆగస్టు సంక్షోభంలో దుష్ట శక్తి నుంచి పార్టీని, నేడు 2024 ఆర్థిక సంక్షోభం నుంచి రాష్ట్రాన్ని రక్షించిన మహాశక్తి చంద్రబాబు అని కొనియాడారు.

జీఎస్టీపై జగన్‌వి పనికిమాలిన విమర్శలు: నీలాయపాలెం

అమరావతి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): గత కొన్ని మాసాలుగా జీఎస్టీ వసూళ్ల వివరాలు రాగానే ఎవరో రాసిచ్చిన లెక్కలను ఉదహరిస్తూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై విమర్శలు చేయడం జగన్‌కు పరిపాటిగా మారిందని ఏపీ బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ ఓ ప్రకటనలో విమర్శించారు. జగన్ విమర్శలను పటాపంచలు చేస్తూ ఆగస్టు నెలలో ఏపీ జీఎస్టీ వసూళ్లు రూ.3,989 కోట్లతో రికార్డు స్థాయిలో వచ్చాయని విజయ్‌కుమార్ పేర్కొన్నారు. దేశంలో ఏ పెద్ద రాష్ట్రం కూడా ఈ స్థాయిలో వృద్ధి నమోదు చేయలేదన్నారు.


బరిస్టా కాఫీ తయారీపై గిరిజన యువతకు శిక్షణ

అమరావతి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): అరకు ప్రాంతంలోని గిరిజన యువతకు బరిస్టా కాఫీ తయారీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ జి.గణేశ్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23 నుంచి 27 వరకు అరకు వైటీసీలో ఈ శిక్షణ కార్యక్రమం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు కాఫీ బోర్డు ఆఫ్ ఇండియాతో సంప్రదింపులు జరిపి శిక్షణ కార్యక్రమం ఏర్పాటుచేస్తున్నామన్నారు. ఈ శిక్షణ వల్ల గిరిజన యువతను పరిశ్రమ సంబంధిత నైపుణ్యాలతో శక్తివంతం చేయొచ్చన్నారు. కాఫీ రంగంలో భవిష్యత్తును నిర్మించుకునే అవకాశం లభిస్తుందన్నారు.

సైబర్ నేరగాడి అరెస్టు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బ్యాంకుల్లో కస్టమర్లకు గృహ రుణాలిప్పిస్తూ జీవనం సాగించే విశాఖ జిల్లా పరవాడ మండలం గండివానిపాలేనికి చెందిన బొబ్బరి శ్రీనివాసరావుకు సైబర్ నేరగాళ్ల ముఠాతో ఏర్పడిన లింకులతో ఈజీ మనీకి అలవాటు పడ్డాడు. నకిలీ బ్యాంకు ఖాతాలు తెరిచి వాటిని సైబర్ నేరగాళ్లకిచ్చి కమిషన్ పొందుతున్నాడు. హైదరాబాద్ సైబర్ క్రైం డీసీపీ ధార కవిత తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన వృద్ధుడ్ని (63) వాట్సాప్‌లో సంప్రదించిన సైబర్ నేరగాళ్లు తాము యాక్సిస్ సెక్యూరిటీస్ నుంచి మాట్లాడుతున్నట్టు నమ్మించారు. కంపెనీ ఐపీఓల్లో పెట్టుబడులతో అధిక లాభాలొస్తాయని చెప్పి.. విడతల వారీగా నెలలోనే రూ.43 లక్షలు పెట్టుబడి పెట్టించి.. వర్చువల్‌గా అధిక లాభాలొచ్చినట్టు చూపారు. బాధితుడితో సంబంధం లేకుండా పెద్దమొత్తంలో ఐపీఓల్లో షేర్లు కొన్నట్టు చూపి.. అందుకు సంబంధించిన డబ్బు చెల్లించాలని ఒత్తిడి తెచ్చారు. తన వద్ద డబ్బు లేదని చెప్పినా వినకుండా.. ఇప్పటి వరకూ చెల్లించిన డబ్బు స్తంభింపజేస్తున్నాం అంటూ స్పందించడం మానేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సైబర్ క్రైం పోలీసులు రంగంలోకి దిగారు. శ్రీనివాసరావు అందించిన బ్యాంకు ఖాతాలతోనే సైబర్ నేరగాళ్లు ఆ డబ్బు కొల్లగొట్టినట్లు గుర్తించారు. నిందితుడ్ని అరెస్టు చేసి విచారించగా.. అతనిపై తెలంగాణలో 2, దేశవ్యాప్తంగా 19 కేసులు నమోదైనట్లు తేలింది.

ఇది అక్షర విజయం



- 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమం వినూత్నం
- ప్రజల సమస్యలు మాకు తెలిశాయి.. పరిష్కారం చూపించగలిగాం
- 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్'ను అభినందించిన ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి
- 7నెలల్లో రూ.5.86కోట్ల కేటాయింపు.. 99% సమస్యల పరిష్కారం
- శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువులో 'అక్షరం అండగా..' సభ



శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువులో 'అక్షరం అండగా..' సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, వేదికపై మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తదితరులు

పుట్టపర్తి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' చేపట్టిన 'అక్షరం అండగా..' వినూత్న కార్యక్రమం చక్కటి ఫలితాలు ఇచ్చిందని, ఇది అక్షర విజయమని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి కొనియాడారు. శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో మంగళవారం నిర్వహించిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' సభలో ఆమె ప్రసంగించారు. ఈ ఏడాది జనవరి 28న నిర్వహించిన కార్యక్రమంలో స్థానికులు ప్రస్తావించిన సమస్యల్లో 99శాతం పరిష్కరించామని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. ఇందుకోసం రూ.5.86 కోట్లు మంజూరు చేయించామని చెప్పారు. తొలిదశలో రూ.4.68 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, మిగిలినవి కూడా త్వరలో ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో అర్ధాంతరంగా ఆగిపోయిన ఇండోర్ స్టేడియం నిర్మాణంపై జూలై 10న కొత్తచెరువులో జరిగిన మెగా పీటీఎంలో సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామని, తక్షణం ఆయన రూ.2 కోట్లు మంజూరు చేశానని వివరించారు. పెనుకొండ రహదారిలో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం విషయాన్ని రైల్వేశాఖ సహాయ మంత్రి సోమన్న దృష్టికి తీసుకెళ్లి, రూ.2కోట్లు మంజూరు చేయించానని ఎమ్మెల్యే తెలిపారు. కొత్తచెరువులో ఎన్నో ఏళ్లగా ఉన్న శ్మశానవాటిక సమస్యకు పరిష్కారం చూపించామని, 3.70 ఎకరాల స్థలాన్ని రెవెన్యూ అధికారులు గ్రామ పంచాయతీకి అప్పగించారని వెల్లడించారు. 1,150 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయించామని, రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించామని, తాగునీటి సమస్య పరిష్కారానికి బోర్లు వేయించామని, విద్యుత్తు, పారిశుధ్య సమస్యలు పరిష్కరించామని వివరించారు. ఈ విషయంలో 'ఆంధ్రజ్యోతి' యాజమాన్యం చొరవ అభినందనీయమన్నారు. ప్రజల సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టి తీసుకువచ్చి పరిష్కారం మార్గం చూపాలన్న 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఎండీ వేమూరి రాధాకృష్ణ తపన అభినందనీయమని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి అన్నారు. తమ సమస్యలు పరిష్కారమయ్యాయంటూ 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్'కు ప్రజలు, రైతులు కృతజ్ఞతలు తెలిపారు.



ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్‌లో వైఎస్ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న జగన్



వైఎస్ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్ షర్మిల

వేర్వేరుగానే వైఎస్‌కు నివాళులు

- జగన్ వెళ్లిపోయే వరకు వేచి ఉన్న షర్మిల
- ఇడుపులపాయ వైఎస్సార్ ఘాట్‌లో ప్రత్యేక ప్రార్థనలు.. పాల్గొన్న విజయలక్ష్మి

వేంపల్లె, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి 16వ వర్ధంతిని పురస్కరించుకుని అన్నాచెల్లెలు జగన్, షర్మిలలు ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద వేర్వేరుగానే నివాళులర్పించారు. వీరిద్దరి కార్యక్రమాల్లో తల్లి విజయలక్ష్మి పాల్గొన్నారు. పులివెందుల నుంచి మాజీ సీఎం వైఎస్ జగన్, ఆయన సతీమణి భారతి, తల్లి విజయలక్ష్మి, ఎంపీ అవినాశ్‌రెడ్డి, బాబాయి సుధీకర్‌రెడ్డి, ఇతర కుటుంబ సభ్యులు వైఎస్సార్ ఘాట్‌కు వచ్చి రాజశేఖర్‌రెడ్డికి నివాళులర్పించారు. మంగళవారం ఉదయం 7.30 గంటలకు చేరుకోవాల్సిన జగన్ అరగంట ఆలస్యంగా వచ్చారు. అనంతరం, వైఎస్ సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కాగా, జగన్ ఘాట్ నుంచి వెళ్లే వరకు వైఎస్ షర్మిల గెస్ట్‌హౌస్‌లో వేచి ఉన్నారు. వెళ్లిపోయాక 9 గంటల సమయంలో ఆమె అక్కడకు చేరుకున్నారు. తల్లి విజయలక్ష్మి, కుమారుడు రాజారెడ్డి, కోడలు ప్రియ, కుమార్తె అంజలి ఇతర కుటుంబ సభ్యులతో కలిసి సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పూలమాల వేసి నివాళులు అర్పించారు. వైఎస్ స్ఫూర్తితో ప్రజల కోసమే పనిచేస్తున్నానని షర్మిల తెలిపారు.

గుడ్డుకు భలే డిమాండ్

- స్టాకు లేక పెరుగుతున్న ధరలు
- తగినంత ఉత్పత్తి లేకపోవడమే కారణం
- విశాఖలో 100 గుడ్లు (హోల్ సేల్) 575

విశాఖపట్నం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): గుడ్డు ధర పరిగెడుతోంది. కొద్దిరోజులుగా మార్కెట్ డిమాండ్‌కు తగినంత ఉత్పత్తి లేకపోగా.. ఇదే సమయంలో తూర్పు, ఉత్తరాది రాష్ట్రాల నుంచి గుడ్ల ఎగుమతికి ఆర్డర్లు వస్తున్నాయి. దీంతో తగినంత స్టాకు లేక ధర పెరుగుతోంది. మంగళవారం విశాఖపట్నంలో 100 గుడ్ల ధరను రూ.575 (హోల్ సేల్)గా నిర్ణయించారు. ఈ ధర మరింత పెరుగుతుందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు. రోజువారీ 50 లక్షల గుడ్లు ఉత్పత్తి అయ్యే ఉత్తరాంధ్రలో ప్రస్తుతం 46 లక్షల నుంచి 47 లక్షల గుడ్లు వస్తున్నాయి. ఇదే పరిస్థితి రాష్ట్రంలో ఇతర జిల్లాల్లో నెలకొంది. గుడ్ల ఉత్పత్తి తగ్గడానికి అనేక కారణాలు ఉన్నాయని పౌల్ట్రీ రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది ప్రారంభం నుంచి ధర గిట్టుబాటు కాకపోవడంతో కొందరు రైతులు కోళ్ల పెంపకాన్ని తగ్గించారు. చిన్న రైతులు పూర్తిగా గుడ్లు ఉత్పత్తి చేసే కోళ్ల పెంపకానికి స్వస్తి చెప్పారు. జూన్, జూలై నెలల్లో తీవ్రమైన ఎండలు కాయడంతో ఆ ప్రభావం కోళ్లపై పడింది. వీటన్నింటితో గుడ్ల ఉత్పత్తి తగ్గింది. వర్షాకాలంలో ఉత్తరాది, మధ్య భారతంలో కూరగాయల పంటలు దెబ్బతినడంతో గుడ్ల వినియోగం పెరిగింది. దీంతో తెలుగు రాష్ట్రాల నుంచి ఎగుమతులు పెరిగాయి. అదేవిధంగా కొన్ని రాష్ట్రాలు ఈ ఏడాది నుంచి పాఠశాలల పిల్లలకు మధ్యాహ్న భోజనంలో గుడ్డు సరఫరా ప్రారంభించాయి. ఏపీ, తెలంగాణ నుంచి ఆయా రాష్ట్రాలకు గుడ్లు ఎగుమతి చేస్తున్నారు. ఇలా పలు కారణాలతో స్థానిక మార్కెట్‌లో డిమాండ్ రావడంతో ధరలు పెరుగుతున్నాయని అనకాపల్లి జిల్లాకు చెందిన పౌల్ట్రీ రైతు ఒకరు చెప్పారు. మార్కెట్ డిమాండ్‌కు తగినంత సరఫరా జరిగేంత వరకు గుడ్ల ధరలు పెరిగే అవకాశం ఉందన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ప్రజాస్వామ్య నైతికత

భారతీయ నాగరికత ప్రభవ ప్రాభవాలకు హిమాలయాలు ఎంత ముఖ్యమో భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్య విశిష్టతా వికాసాలకు సార్వజనీన ఓటు హక్కు అంతే ప్రధానమైనది. కులమతాలకు అతీతంగా, విద్యార్హతలు, ఆర్థిక స్థాయితో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం ద్వారా భారత గణతంత్ర రాజ్య వ్యవస్థాపకులు భారతీయుల ప్రజాస్వామిక ప్రస్థానాన్ని సుస్థిరమూ, స్ఫూర్తిదాయకమూ చేశారు. అతడు/ఆమె ప్రజాస్వామిక ప్రక్రియలో విధిగా పాల్గొనేలా చేయడంలో భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) బాధ్యత బృహత్తరమైనది. మన గణతంత్ర రాజ్యం కంటే ఒక రోజు ముందే (జనవరి 25, 1950) ఏర్పడిన ఈ రాజ్యాంగ సంస్థ ఇటీవలి కాలంలో తన గురుతర బాధ్యతను సక్రమంగా నిర్వర్తించడం లేదనే సందేహాలు సామాన్యులలోను, పాలకపక్షం ప్రయోజనాలను కాపాడడమే లక్ష్యంగా వ్యవహరిస్తోందనే భయాందోళనలు రాజకీయ పక్షాలలోను వ్యక్తమవుతున్నాయి. ఆ భయ సందేహాలు సహేతుకమైనవని సోమవారం నాడు పట్నాలో ముగిసిన జాతీయ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఓటర్ అధికార్ యాత్ర నిర్ధారించింది.

మూడు సంవత్సరాల క్రితం కన్యాకుమారి నుంచి నుంచి కశ్మీర్ దాకా రాహుల్ నిర్వహించిన భారత్ జోడో యాత్ర భారత జాతీయ కాంగ్రెస్‌కు ప్రజాదరణను పెంపొందించింది. గత ఏడాది సార్వత్రిక ఎన్నికలలో ఉత్తరాది రాష్ట్రాలలో బీజేపీ ఆధిక్యతను కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు గణనీయంగా దెబ్బతీశాయి. లోక్‌సభ ఎన్నికల అనంతరం నాలుగు నెలల వ్యవధిలో మహారాష్ట్ర హర్యానా శాసనసభలకు జరిగిన ఎన్నికలలో బీజేపీ విజయం సాధించింది. మహారాష్ట్రలో, ఓటర్ల జాబితాలో మోసపూరితంగా దాదాపు నలభై లక్షల కొత్త ఓటర్లను చేర్చడం, అక్రమంగా పలువురు ఓటర్ల పేర్లను తొలగించడం వల్లే బీజేపీకి విజయం సాధ్యమయిందని రాహుల్ ఆరోపించారు. అలాగే గత లోక్‌సభ ఎన్నికలలో కర్ణాటకలోని బెంగళూరు సెంట్రల్ నియోజకవర్గంలోని మహదేవపుర అసెంబ్లీ సెగ్మెంట్ ఓటర్ జాబితాలలో ఘోరమైన అవకతవకలు చోటుచేసుకున్నాయని, లక్షకు పైగా ఓట్లు అనుమానాస్పదమైనవని ఈసీఐ ఇచ్చిన జాబితాల ఆధారంగానే రాహుల్ నిరూపించారు. ఆయన లేవనెత్తిన ప్రశ్నలకు ఈసీఐ సరైన సమాధానాలు ఇవ్వలేకపోయింది.

జూన్‌లో బిహార్‌లో ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ఈసీఐ చేపట్టింది. ఈ సంవత్సరాంతంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇంత తక్కువ వ్యవధిలో హడావుడిగా ఈ సవరణ కార్యక్రమాన్ని చేపట్టడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేశారు. బీజేపీకి తోడ్పడేందుకే లక్షలాది ఓటర్ల పేర్లను జాబితాల నుంచి తొలగించేందుకు ప్రత్యేక సమగ్ర సవరణను ఈసీఐ చేపట్టిందని రాహుల్ తప్పుపట్టారు. ఆగస్టు 1న ఈసీఐ ప్రకటించిన ముసాయిదా ఓటర్ జాబితాలలో 65 లక్షల పేర్లను మినహాయించినట్టు వెల్లడవడంతో ప్రజల సందేహాలు మరింత బలపడ్డాయి. ముసాయిదా జాబితాలను నిశితంగా పరిశీలిస్తే పేర్ల తొలగింపుతో నష్టపోయిన ఓటర్లలో అత్యధికులు అణగారిన వర్గాలవారు, మతపరమైన మైనారిటీలు, మహిళలు ఉన్నారు. ఈ ప్రత్యేక సమగ్ర సవరణను వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలలోను, పిదప దేశమంతటా నిర్వహిస్తామని ఈసీఐ ఇప్పటికే ప్రకటించడంతో కోట్లాది పౌరులు తమ ఓటుహక్కును కోల్పోయే ముప్పు వాటిల్లనున్నది. ఇదే జరిగితే ప్రజాప్రాతినిధ్యానికి అర్థమేమున్నది? ఈ విపత్కర పరిస్థితులపై ప్రజలను జాగృతం చేసేందుకే జాతీయ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ బిహార్‌లో 16 రోజుల పాటు ఓటర్ అధికార్ యాత్ర నిర్వహించారు. ప్రజలు అపూర్వంగా ప్రతిస్పందించారు. ప్రతిపక్ష ఇండియా కూటమిలో సమైక్యత వెల్లివిరిసింది. ఈ సానుకూల పరిస్థితులను మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు రాహుల్ మరింత దృఢ సంకల్పంతోను, రాజనీతిజ్ఞతతోను వ్యవహరించవలసి ఉన్నది.

ప్రజాస్వామ్యానికి ప్రాణప్రదమైన ఎన్నికల వ్యవస్థలో ఇటువంటి అపసవ్యతలు చోటుచేసుకున్నప్పుడు అధికారంలో ఉన్నవారిని వేలెత్తి చూపకుండా ప్రతిపక్షాలు ఉండలేవు. ఎందుకంటే ప్రజాస్వామ్య నైతికతే ఓటుహక్కు. ఆ నైతికత భ్రష్టం కాకుండా భద్రంగా, ప్రయోజనకరంగా ఉండేలా జాగ్రత్త వహించడం ప్రతి విద్యావంతుడి విద్యుక్తధర్మం.

బహ్రెయిన్‌లోని శివ మందిరం గల్ఫ్ ప్రాంతంలో అత్యంత పురాతన హిందూ దేవాలయం. రెండు శతాబ్దాలకు పైగా చరిత్ర ఉన్న కోవెల అది. లోకమాన్య తిలక్ భారతదేశంలో వినాయక చవితి ఉత్సవాలకు శ్రీకారం చుట్టని కాలంలోనే బహ్రెయిన్‌లో వినాయక చవితి ఉత్సవాలు జరిగేవి. అన్యమత కార్యకలాపాలు నిషిద్ధమైన సౌదీ అరేబియాలో సైతం కొన్నేళ్లుగా తెలుగు ప్రవాసుల నేతృత్వంలో వినాయక చవితి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి.

ఎడారి దేశాల్లో వినాయక వేడుకలు

గల్ఫ్ లేఖ

భారతీయ పండుగలు సంప్రదాయాల సమ్మేళనాలు. తరతరాల ఆచారాలు, జీవన రీతులను సంరక్షిస్తూ భారతావని సాంస్కృతిక వైభవాన్ని, వైవిధ్యాన్ని అవి ప్రతిబింబిస్తాయి. భారత దేశంలో పండుగలు మత, సాంస్కృతిక, సామాజిక అంశాల పట్టు పోగులతో అల్లిన శోభాయమానమైన వస్త్రాలు. వివిధ పండుగల సంప్రదాయాలు భారతీయ సంస్కృతిలో అంతర్భాగం. పర్వదినాల సందర్భంగా నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజల మధ్య అనుబంధాన్ని పెంచుతాయి. ఈ వేడుకలను నిర్వహించే వేదికలు భిన్న వర్గాల జనులను సమైక్యం చేస్తాయి. స్వాతంత్ర్యోద్యమ కాలంలో ప్రజలను సంఘటితపరిచి వలస పాలకుల వ్యతిరేక పోరాట స్ఫూర్తిని రగిలించేందుకు వినాయక చవితి ఉత్సవాలను లోకమాన్య బాలగంగాధర్ తిలక్ స్ఫూర్తిదాయకంగా వినియోగించుకున్నారు. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా దేశ దేశాలలో ఉన్న భారతీయులు భారతీయ స్ఫూర్తిని ఆవాహన చేసుకుని తమను తాము విలక్షణంగా నిలబెట్టుకునేందుకు వినాయక చవితి, విజయ దశమి, దీపావళి వేడుకలు జరుపుకోవడం పరిపాటిగా ఉన్నది.

గల్ఫ్ దేశాలలోని ప్రవాసులలో వినాయక చతుర్థి శోభ వెల్లివిరుస్తోంది. మాతృదేశంలో వలే ఆర్భాటంగా కాకున్నా ఆద్యంతం ఆధ్యాత్మికంగా గణనాథుడిని ప్రవాస భక్తులు ఆరాధిస్తున్నారు. స్వదేశంలో మాదిరిగా తొమ్మిది రోజుల పాటు కాకుండా ఈ ఎడారి దేశాలలో సాధారణంగా ఒకటి నుంచి మూడు రోజుల పాటు బొజ్జ గణపతికి పూజలు చేసి ఆ వేల్పు ప్రతిమను నిమజ్జనం చేస్తుంటారు. చాలామంది స్వగృహాలలోని స్నానపు తొట్టెల (బాత్ టబ్స్)లో నిమజ్జనం చేస్తుంటారు! చెంతనే ఉన్న అరేబియా సముద్రంలో నిమజ్జనం చేసేవారు తక్కువే. దుబాయి, మస్కట్, బహ్రెయిన్‌లలో కొన్ని ఎంపిక చేసిన ప్రదేశాలలో మాత్రం సింధీ వ్యాపారస్తులు వినాయక పూజలు తొమ్మిది రోజుల పాటు అట్టహాసంగా చేస్తుంటారు. ఈ సారి 18 అడుగుల ఎత్తు ఉన్న గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించడం ద్వారా గిన్నిస్ రికార్డులో తమ ఘనతను నమోదు చేయించుకోవడానికి దుబాయిలో కొందరు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీనిపై విభిన్న కథనాలు వినిపిస్తున్నాయి. ఒక్క దుబాయిలోనే కాదు, అన్ని ఎమిరేట్స్‌లోని ఔత్సాహికులకూ ఈ సందర్భం ఒక గుణాత్మక సందేశాన్ని ఇచ్చింది.



దుబాయి, షార్జా, మస్కట్ నగరాలలో భారతీయ సంప్రదాయ వస్తువులు, పూజ సామగ్రి విక్రయించే దుకాణాలు వినాయక చవితి ముందు రోజుల్లో గణపతి ప్రతిమల విక్రయాలతో సందడి సందడిగా ఉంటాయి. రంగురంగుల విద్యుత్ దీపాలు, భక్తి పారవశ్యంలోకి తీసుకెళ్లే ఆధ్యాత్మిక గేయాలను ఆలపించే సాంకేతిక సామగ్రి మొదలు పూజాద్రవ్యాల వరకు అనేకం 'మేడ్ ఇన్ చైనా'వి కావడం గమనార్హం.

గల్ఫ్ దేశాలలోని విద్యాలయాల వేసవి సెలవులు ఇటీవలే ముగిశాయి. సెలవులకు స్వస్థలాలకు వెళ్లిన ప్రవాస భారతీయ కుటుంబాలు తిరిగి వస్తూ తమ వెంట ఏకదంతుని విగ్రహాలనూ తీసుకువచ్చాయి. దుబాయి, బహ్రెయిన్, ఒమాన్, ఖతర్‌లలోని కొన్ని లేబర్ క్యాంపులు వినాయక మండపాలతో కోలాహలంగా మారాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని తెలుగు ప్రవాసుల సమూహాలు తొమ్మిది రోజుల పాటు పూజలు చేస్తాయి. ఒక్క అజ్మాన్‌లోని త్రిమూర్తుల ఫాంలో మాత్రమే ఎత్తైన వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా మట్టి గణేశుని విగ్రహాన్ని ఇక్కడకు దిగుమతి చేసుకుని త్రిమూర్తులు దీన్ని ప్రతిష్ఠిస్తారు. సింధీ ప్రజల ప్రాబల్యం ఉన్న పండుగల వాతావరణంలో అజ్మాన్‌లోని తెలుగువారందరికి ఆ మట్టి గణేశుడే ఒక పెద్ద దిక్కు.

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని రెండు హిందూ దేవాలయాల కంటే చాలా పురాతనమైన హిందూ దేవాలయం ఉన్న దేశం బహ్రెయిన్. ఈ దేశంలోని శివ మందిరం గల్ఫ్ ప్రాంతంలో అత్యంత పురాతన హిందూ దేవాలయం. రెండు శతాబ్దాలకు పైగా చరిత్ర ఉన్న కోవెల ఇది. లోకమాన్య తిలక్ భారతదేశంలో వినాయక చవితి ఉత్సవాలకు శ్రీకారం చుట్టని కాలంలోనే బహ్రెయిన్‌లో వినాయక చవితి ఉత్సవాలు జరిగేవి. కృష్ణ మందిరంతో పాటు అనేక లేబర్ క్యాంపులలో వినాయక చవితిని ఘనంగా నిర్వహిస్తున్నారు. బహిరంగ విగ్రహారాధన, అన్యమత కార్యకలాపాలు నిషిద్ధమైన సౌదీ అరేబియాలో సైతం కొన్నేళ్లుగా తెలుగు ప్రవాసుల నేతృత్వంలో వినాయక చవితి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి.

కువైత్‌లో కొనసాగుతున్న విస్తృత వీసా తనిఖీల కారణంగా వినాయక చవితి కార్యక్రమం పూర్తిగా వ్యక్తిగత ఆరాధనగా మారింది. రాయలసీమ ప్రవాసులు చేసే హడావుడి ఈ సారి పూర్తిగా తగ్గిపోయింది. ఒమాన్‌లోని మస్కట్ నగరంలో గల చరిత్రాత్మక శివ మందిరంలోనే కాకుండా ఆ దేశ వ్యాప్తంగా గణనాథుని పూజలు జరుగుతున్నాయి. లేబర్ క్యాంపులలో ప్రతి వారాంతంలోనూ ఆధ్యాత్మిక వాతావరణం నెలకొని ఉంటుంది. మాతృదేశంలో వలే ఇక్కడ కూడా లడ్డూను వేలం వేయడం పరిపాటి అయింది. కొన్నాళ్లుగా నిర్వహిస్తున్న ఈ వేలం యువతలో మత సంప్రదాయాల పట్ల ఉత్సుకతను పెంచుతోంది. గల్ఫ్‌లో ఏటా ఒక నూతన ప్రదేశంలో వినాయకుడు పూజలు అందుకుంటున్నాడు.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

కేసీఆర్ పార్టీ భవితవ్యం ఏమిటి?



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

భారతదేశంలో ప్రాంతీయ పార్టీలకు భవిష్యత్తు ఉన్నదా? తెలంగాణలో ఒకప్పుడు ఉజ్వలమైన పాత్రను పోషించిన భారత రాష్ట్ర సమితి దుస్థితి చూస్తుంటే ఈ అనుమానం రాకమానదు. బీఆర్ఎస్ ఎదుర్కొంటున్న పరిస్థితి అన్ని ప్రాంతీయ పార్టీలకూ వస్తుందని చెప్పలేము కాని బీఆర్ఎస్ దుస్థితి నుంచి మాత్రం ప్రాంతీయ పార్టీలు, వాటి నేతలు ఎలా వ్యవహరించకూడదో తెలుసుకునే అవకాశం ఉన్నది, తెలుసుకోవాలి కూడా. గత లోక్‌సభ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి కేవలం 240 సీట్లు మాత్రమే లభించాయి. ప్రాంతీయ పార్టీలపై ఆధారపడి ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడింది. ఇండియా కూటమిలో కాంగ్రెస్ సంఖ్యాబలం కంటే రెట్టింపుకు పైగా సంఖ్యాబలం ప్రాంతీయ పార్టీలదే.

అంత మాత్రాన ప్రాంతీయ పార్టీల పరిస్థితి మెరుగ్గా ఉన్నదని చెప్పడానికి వీల్లేదు. ఇందుకు 2024 జూన్‌లో జరిగిన లోక్‌సభ ఎన్నికలే తార్కాణం. కాని బీజేపీకి మద్దతు నిచ్చిన ప్రాంతీయ పార్టీల్లో ఒక్క తెలుగుదేశం, జేడీ(యు) ప్రధాన పార్టీలు కాగా మిగతావన్నీ చిన్నా చితక పార్టీలు. ఎన్డీఏలో ఉన్నామని చెప్పుకుంటున్న దాదాపు 20 పార్టీలకు ఒక్క సీటూ లేదు. ఇండియా కూటమిలో కూడా సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే, తృణమూల్ మాత్రమే ప్రధాన పార్టీలు. దాదాపు 30కి పైగా పార్టీలు రెండు కూటముల్లోనూ అయిదు స్థానాలలోపే సాధించగా, వాటిలో మెజారిటీ పార్టీలకు కేవలం ఒక్కొక్క సీటే లభించింది. బీజేడీ, బీఆర్ఎస్, అన్నా డీఎంకే వంటి ప్రధాన పార్టీలు అదృశ్యం కాగా, శివసేన, లోక్ జనశక్తి, ఎన్‌సీపీ, జేఎంఎం వంటి పార్టీలు నిలదొక్కుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి.

నిజానికి భారత రాష్ట్ర సమితి ప్రాంతీయ పార్టీల్లో కెల్లా జూనియర్ పార్టీ. డీఎంకే 1949లోనూ, ఆ పార్టీ నుంచి చీలిన అన్నాడీఎంకే 1972లోనూ జన్మించాయి. శివసేన 1966 నుంచీ ఉనికిలో ఉన్నది. జార్ఖండ్ ముక్తి మోర్చా 1972లో ఆవిర్భవించింది. తెలుగుదేశం 1982లో ఏర్పడితే, సమాజ్‌వాదీ పార్టీ, రాష్ట్రీయ జనతాదళ్, తృణమూల్ కాంగ్రెస్, ఎన్‌సీపీ 1990వ దశకంలో జన్మించాయి. ఈ పార్టీలన్నీ ఇవాళ్టికీ అస్తిత్వంలో ఉండగా అవి ఏర్పడిన ఎంతో కాలానికి జన్మించిన బీఆర్ఎస్ మాత్రం ఎందుకు అంతర్గత సంక్షోభంలో చిక్కుకున్నది? ఈ విషయమై ఆ పార్టీ ఆత్మపరీక్ష చేసుకోవాల్సిన అవసరం ఉన్నది.

చాలా ప్రాంతీయ పార్టీలకు ఒక సిద్ధాంతం, చరిత్ర, లక్ష్యాలు ఉన్నాయి. అవి రాజ్యాంగంలో పీఠిక లాంటివి. ఇటీవల మరణించిన జేఎంఎం అధినేత శిబూసోరెన్ కేవలం రాజకీయ నాయకుడు కాదు. భూస్వాములు, వడ్డీ వ్యాపారులు ఉపాధ్యాయుడైన తన తండ్రిని 1957లో హత్య చేస్తే వారికి వ్యతిరేకంగా సుదీర్ఘకాలం పోరాడుతూ ఎదిగిన ప్రజా నాయకుడు. ఆదివాసీలు, రైతులు, కార్మికుల హక్కుల కోసం, వారిని కట్టుబానిసత్వం నుంచి విముక్తి చేయడం కోసం పోరాడినవాడు. డీఎంకేకు 1916 నుంచే ద్రవిడ ఉద్యమం నిర్వహించిన చరిత్ర ఉన్నది. పెరియార్, అన్నాదురైలు నిర్మించిన వారసత్వం ఉన్నది. ఇవాళ స్టాలిన్ ఆ వారసత్వాన్ని నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నాడు. సోషలిస్టు నాయకుడు రామ్ మనోహర్ లోహియా సామాజిక న్యాయం కోసం ప్రారంభించిన పోరాట క్రమంలో సమాజ్‌వాదీ పార్టీ, రాష్ట్రీయ జనతాదళ్ ఉద్భవించాయి. ములాయం తర్వాత అఖిలేశ్, లాలూ తర్వాత తేజస్వి తమ తండ్రుల దారిలో రాష్ట్రాల్లో బీజేపీని ఢీకొంటున్నారు. ఎన్ని ఆటుపోట్లు వచ్చినా 85 ఏళ్ల వయస్సులో శరద్ పవార్ మరాఠా ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు పోరాడుతున్నారు. తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి కూడా బెంగాలీల ఆత్మగౌరవానికి తానే ప్రతీకగా భావిస్తూ బీజేపీని శాయశక్తులా అడ్డుకునేందుకు ప్రయత్నిస్తోంది. తెలుగు వారి ఆత్మగౌరవం, రాష్ట్ర ప్రయోజనాల కోసం ఏర్పడిన తెలుగుదేశం ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా, రాష్ట్ర విభజన జరిగినా అస్త్ర సన్యాసం చేయకుండా నిలదొక్కుకుని ఇవాళ కేంద్రంలో ఎన్డీఏ సర్కార్‌కు కీలక మద్దతునిస్తోంది. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ సీఎంగా మూడు దశాబ్దాల క్రితం ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబునాయుడు ఇంకా అదే ఉత్సాహంతో ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ ప్రాంతీయ పార్టీలు కేంద్రంలో ఏ పార్టీతో సంబంధాలు పెట్టుకున్నాయన్నది ప్రధానం కాదు. చంద్రబాబు లాగా కరుణానిధి, మమతా బెనర్జీ, జయలలిత కూడా బీజేపీతోనూ కాంగ్రెస్‌తోనూ సంబంధాలు ఏర్పర్చుకున్నవారే. అయినా వారు తమ అస్తిత్వాన్ని పణంగా పెట్టినవారు కాదు. ఏది జరిగినా ఓటమిని అంత సులభంగా అంగీకరించేవారు కారు. మరి కేసీఆర్‌కు ఏమైంది? ఆయన పార్టీ ఎందుకు లుకలుకలకు గురవుతోంది?

కారణం ఏమంటే తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పడ్డ లక్ష్యాలకు, ఆశయాలకూ కేసీఆర్ దూరం కావడమే. నేల విడిచి సాము చేయడమే. చాలా మంది ప్రాంతీయ నాయకులకున్న స్థిరత్వం, లక్ష్యశుద్ధి, ప్రజాస్వామ్య స్ఫూర్తి కేసీఆర్‌కు లేవు. తెలంగాణ ప్రజల్లో, ముఖ్యంగా సామాజికంగా బలహీనవర్గాల్లో ఆకాంక్షలు పెరిగిపోయిన క్రమంలో జయశంకర్, కోదండరాం వంటి అనేక మంది నేతలు నిర్మించిన ఉద్యమం ఆయన రాజకీయంగా బలపడేందుకు తోడ్పడింది.

కేసీఆర్ పార్టీ ప్రారంభించిన ఏడేళ్ల వరకూ కేటీఆర్, కవిత దరిదాపుల్లో ఉండేవారు కాదు. 'మా రాము అమెరికాలో ఉంటాడు. నెలకు 300 డాలర్లు పంపుతాడు. తెలంగాణ ఏర్పడకపోయినా నా మనుగడకేమీ ఢోకా లేదు' అని ఆయన తుగ్లక్ రోడ్‌లో కేటీఆర్‌ను పరిచయం చేసిన రోజులున్నాయి. చాలా పార్టీల్లో ముఖ్యంగా ప్రాంతీయ పార్టీల్లో వారసులు ఉండడం సహజం. కాని ఆ పార్టీలేవీ వారసుల మూలంగా అంతర్గత సంక్షోభంలో చిక్కుకోలేదు. ములాయం, లాలూ, కరుణానిధి, శిబూ సోరేన్‌ల వారసులే ఆ తర్వాత ముఖ్యమంత్రులయ్యారు. పైగా వారి బంధువులు కూడా పార్టీల్లో, పదవుల్లో కీలక స్థానాలు పోషించారు. అన్నీ సజావుగా జరిగాయి. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్‌లో కూడా రాహుల్, ప్రియాంక ఎంత సన్నిహితంగా, ఎవరి బాధ్యతలు వారు నెరవేరుస్తూ ఉంటారో స్పష్టంగా కనపడుతుంది. బీఆర్ఎస్ కుటుంబసభ్యుల వల్ల దెబ్బతిన్నదని చెప్పడానికి వీల్లేదు. కేసీఆర్ వారి విషయంలో అప్రమత్తంగా, జాగరూకతతో లేకపోవడం వల్ల, సరైన మార్గదర్శకత్వం అందించకపోవడం వల్ల, వారి పాత్రను నిర్దేశించకపోవడం వల్ల, కొన్ని విషయాల్లో అదుపులో పెట్టకపోవడం వల్ల దుష్పరిణామాలు జరిగాయనడానికి ఆస్కారం ఉన్నది.



కొన్ని దశాబ్దాలుగా మనుగడలో ఉన్న ఇతర ప్రాంతీయ పార్టీల నేతల్లో లేని అనేక అప్రజాస్వామిక, నియంతృత్వ దుర్లక్షణాలు కేసీఆర్‌లో ఉన్నాయి. ఈ కారణంగానే అధికారం కోల్పోయిన ఏడాదిన్నరలోనే ఆయన మనుగడ కోసం తండ్లాడవలసి వస్తోంది. 'మనం వ్యవస్థలతో చెలగాటమాడితే అవి తర్వాత మనతో చెలగాటమాడతాయి..' అని చంద్రబాబు ఒక సందర్భంలో అన్నారు. కేసీఆర్ విషయంలో ఇప్పుడదే జరుగుతోంది. కేసీఆర్ తదుపరి అడుగులెలా ఉంటాయన్నదే భారత రాష్ట్ర సమితి మనుగడను నిర్ణయిస్తుంది.

కేసీఆర్ చాలా పుస్తకాలు చదివి ఉండొచ్చు కాని ఆ పుస్తకాల వల్ల ఆయన ఏమి నేర్చుకున్నారనేది ప్రధానం. 'ఎవరైనా ఏమైనా చెబితే అర్థం చేసుకునేందుకు వినరు. జవాబిచ్చేందుకు వింటారు..' అని భారతీయుల గురించి ప్రముఖ అమెరికన్ విద్యావేత్త స్టీఫెన్ రిచర్డ్స్ కోవే రాశారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు చాలా సార్లు ఫోన్ చేసేవారు. ఆయన పాలన గురించి వస్తున్న విమర్శలను చెప్పేందుకు ప్రయత్నిస్తే కొట్టి పారేసేవారు. 'కాళేశ్వరం అన్ని విమర్శలకూ సమాధానమిస్తుంది.. దానితో రాష్ట్రం రూపురేఖలు మారిపోతాయి' అని ఒకరోజు చెప్పారు. ఎంతసేపూ ఢిల్లీ రాజకీయాల గురించి, ముఖ్యంగా బీజేపీ గురించే ఆయన మాట్లాడేవారు. దేశ రాజకీయాల్లో చక్రం తిప్పగలనని ఆశించేవారు. ఫాంహౌజ్‌లో ఉన్నదే పూర్తిగా జాతీయ రాజకీయాలపై దృష్టి సారించడం కోసమే. ఢిల్లీలో బిల్డింగ్ కట్టి యజ్ఞం చేస్తే తమ పార్టీ జాతీయ పార్టీ అయిపోతుందని నమ్మిన వ్యక్తి కేసీఆర్. కాళేశ్వరం విషయంలో ఆయన తాను అనుకున్నదే సరైనదని, ఇంజనీర్లకు కూడా ఏమీ తెలియదని భావించేవారని అనేకమంది చెప్పేవారు. ఆ వ్యక్తి తాను పట్టిన కుందేలుకు మూడేకాళ్లని భావిస్తుంటే విద్యాసాగర్‌రావుతో సహా అనేకమంది మేధావులు ఆయనకు చెప్పేందుకు సాహసించేవారు కాదు. ఆ ప్రాజెక్టుకు అయిన ఖర్చులో భారీ అవినీతి జరిగిందని చెప్పేందుకు ఇంజనీర్ల ఇళ్లలో భారీ మొత్తంలో దొరికిన డబ్బే నిదర్శనం.

కేసీఆర్ వ్యవహార శైలి విచిత్రమైనది. ఒక థింక్ టాంక్ అన్నది ఏర్పర్చుకోకపోగా, తన చుట్టూ ఉన్న ఆలోచనాపరుల్ని విస్మరించారు. 'కేసీఆర్ గొప్ప మేధావి. ఆయన చేతితో ముక్కు రుద్దుకున్నారంటే చాలు ఏదో కీలకమైన వ్యూహం వేశారన్నమాటే.' అని ఒక రోజు మజ్లిస్ నేత ఒవైసీ సెంట్రల్ హాలులో చెప్పారు. ఇలాంటివన్నీ నడిచినన్ని రోజులే నడుస్తాయి. ఒక రోజు తుగ్లక్ రోడ్ నివాసంలో కేసీఆర్, జయశంకర్‌లతో మాట్లాడేందుకు కాంగ్రెస్ నేత జయరాం రమేశ్ వచ్చారు. మధ్యలో జయశంకర్ మాట్లాడబోగా కేసీఆర్ ఆయనను 'మీకేం తెలుసు. ఆగండి' అని అడ్డుకున్నారు. ఇలాంటి అవమానాలు ఆయన చుట్టూ ఉన్న మేధావులు చాలా మంది ఎదుర్కొన్నారు. 'కేసీఆర్‌తో ఎలా వేగుతున్నారు సార్' అని జయశంకర్‌ను అడిగితే 'కనీసం భౌగోళిక తెలంగాణ రావడం ప్రధానం. అందుకు రాజకీయ సాధనం కేసీఆరే. ఆయనను విస్మరించలేం..' అని చెప్పేవారు. భౌగోళిక తెలంగాణ వచ్చినా జయశంకర్ ఆశించిన సామాజిక తెలంగాణ దిశగా అడుగులు పడలేదు. వ్యవహారశైలి మాత్రమే కాదు. దేశంలో కొన్ని దశాబ్దాలుగా మనుగడలో ఉన్న ఇతర ప్రాంతీయ పార్టీల నేతల్లో లేని అనేక అప్రజాస్వామిక, నియంతృత్వ దుర్లక్షణాలు కేసీఆర్‌లో ఉండడం వల్లే ఇవాళ అధికారం కోల్పోయిన ఏడాదిన్నరలోనే ఆయన మనుగడకోసం తండ్లాడవలసి వస్తోంది. 'మనం వ్యవస్థలతో చెలగాటమాడితే అవి తర్వాత మనతో చెలగాటమాడతాయి..' అని చంద్రబాబు ఒక సందర్భంలో అన్నారు. కేసీఆర్ విషయంలో ఇప్పుడదే జరుగుతోంది. కేసీఆర్ తదుపరి అడుగులెలా ఉంటాయన్నదే భారత రాష్ట్ర సమితి మనుగడను నిర్ణయిస్తుంది.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

విద్యార్థి నాయకుడిగా చంద్రబాబు

ఇటీవల సోషల్ మీడియాలో విశ్వవిద్యాలయ విద్యార్థిగా నారా చంద్రబాబు నాయుడు జీవితంపై అవాస్తవాలతో కూడిన కథనాలు వస్తున్నాయి. నాకు చంద్రబాబుతో సన్నిహిత పరిచయం ఉంది. ఆనాటి వాస్తవాలు అందరికీ తెలియపరచాలనే ఉద్దేశంతో ఈ వ్యాసం రాస్తున్నాను.

ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు 1975లో అత్యవసర పరిస్థితి ప్రకటించారు. ఈ ఎమర్జెన్సీని దాదాపు 21 నెలలపాటు కొనసాగించి మార్చి 21, 1977న ఎత్తివేశారు. ఈ కాలంలో ఏ కళాశాలకూ ఎన్నికలు జరగలేదు. 1976–77లో చంద్రబాబు ఎంతో చురుగ్గా సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనేవాడు. కాంగ్రెస్ పార్టీలో చేరి చిన్న వయస్సులోనే ఎంతో మంది పార్టీ పెద్దల్ని ఆకర్షించారు. సంజయ్‌గాంధీతో కూడా ఎంతో సాన్నిహిత్యం ఏర్పడింది. 1977లో దివిసీమ ఉప్పెన రాష్ట్రాన్ని శోక సంద్రంలో ముంచెత్తింది. దివిసీమ నిండా గుట్టల గుట్టల శవాలు. అలాంటి విపత్కర స్థితిలో బాధితుల్ని ఆదుకొనేందుకు చంద్రబాబు రేయింబవళ్ళు శ్రమించారు. బియ్యం, వస్త్రాలు, పప్పు ధాన్యాలు విరాళాలుగా సేకరించి దివిసీమలోని అందరికీ పంచారు. ఆయన చేస్తున్న కృషి విశ్వవిద్యాలయంలో కొత్తగా చేరిన మాలాంటి వారందరికీ ఎంతో ఆదర్శంగా నిలిచింది.

1977లో కళాశాల ఎన్నికలలో ఇరువైపులా సైన్యాలు పోరాడాయే గానీ నాయకులు కొట్టుకోలేదు. ఈ వాస్తవాల్ని వక్రీకరించి ఇప్పుడు దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటు. ఎన్నికల్లో గెలుపు కోసం, పార్టీల సిద్ధాంతాలపై, మేనిఫెస్టోలపై ఒకర్నొకరు విమర్శించుకోవాలే కానీ వ్యక్తుల శీలాన్ని గూర్చి కల్పిత కథలు ప్రచారం చేయడం మంచి సంప్రదాయం కాదు.



1977లో దేశంలో ప్రజాస్వామ్యం తిరిగి నెలకొన్నాక విశ్వవిద్యాలయ కళాశాలలకు ఎన్నికలు ప్రకటించారు. మా కళాశాలలో సోషియాలజీలో పరిశోధకుడుగా ఉన్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఒక వర్గానికి, మరో వర్గానికి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం వహించారు. ఈ ఎన్నికలు రెండు వర్గాల విద్యార్థుల మధ్య శతృత్వానికి బీజం వేశాయి. తొలిసారి కులాల కుంపట్లు ఏర్పడ్డాయి. ముఖ్యంగా ఆర్ట్స్ గ్రూప్‌కు చెందిన చైర్మన్, సెక్రటరీ పోస్టులకు ఎంతో ఉత్కంఠభరిత వాతావరణంలో ఎన్నికలు జరిగాయి. అన్ని శాఖల్లోనూ ఈ ఇరువురు నాయకులు తమ అభ్యర్థుల్ని ఎంపిక చేసి యుద్ధ భేరి మోగించారు. దాదాపు పది రోజులపాటు ప్రచారాన్ని హోరాహోత్తించారు. నాకు తెలిసి అధ్యాపకులెవ్వరూ విద్యార్థుల ఎన్నికల్లో పరోక్షంగా కూడా పాల్గొనలేదు. ఇద్దరు నాయకులు ఎదురుపడిందీ లేదు, తలపడిందీ లేదు. విద్యార్థులు మాత్రం కొన్నిసార్లు కొట్టుకున్నారు.

ఈ ఎన్నికల్లో చంద్రబాబు ఒక సైద్ధాంతిక కూటమికి తెరలేపాడు. ఒక వర్గానికి వ్యతిరేకంగా అన్ని కులాలు, మతాల వారిని ఒక తాటిపైకి తీసుకొచ్చాడు. నేను చంద్రబాబు వర్గంలో చేరాను. సోషియాలజీలో చైర్మన్ పోస్టుకు నిలబడ్డాను. మా రీసెర్చ్ స్కాలర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి వ్యతిరేకంగా నిలబడడం గొప్ప సాహసమే! ఎప్పటికప్పుడు చంద్రబాబు మాకు ధైర్యం చెప్పేవాడు. అన్ని కులాల్ని ఏకం చేయడం చంద్రబాబు చాణక్యతనం. ఆయన విధానం అందరికీ ఎంతో నచ్చింది. సరైన నాయకత్వాన్ని ఇవ్వగలిగినవాడే నిజమైన నాయకుడిగా ఎదుగుతాడు. ఇప్పటి శాసనసభ ఎన్నికలు కూడా అంత హోరాహోరీగా జరగలేదనిపిస్తున్నది. ఆ యుద్ధం ఆఖరు ఘట్టం చేరిన రోజు రాత్రి ఎవరికీ కంటిమీద కునుకు లేదు. రాత్రంతా ఆయా శాఖల విద్యార్థుల్ని మరోసారి అర్థించడం ముఖ్యంగా తటస్థుల్ని తమవైపు తిప్పుకునే ప్రయత్నాలు జరిగాయి. చంద్రబాబు కూడా తిరుగుతూనే కనిపించాడు. ఒక్క ఓటు కోసం నేనూ దాదాపు 15 కి.మీ. దూరంలోని ఒక హరిజన గ్రామానికి టెంపో మాట్లాడుకొని రాత్రిపూట వెళ్లొచ్చాను. ఆ రాత్రంతా అభ్యర్థులందరూ నాలాగే తిరిగారు. ఎన్నికల మలుపు కాస్త క్రూరత్వానికి కూడా దారితీసింది. చాలామంది తమకు ఓటు వేయరన్న అభిప్రాయంతో వ్యతిరేకుల్ని ఇరువర్గాలు కిడ్నాప్ చేశాయి.

ఎన్నికలు ముగిశాయి. ప్రతి శాఖ నుంచి ద్వితీయ సంవత్సరం చదివే వ్యక్తి ఆ శాఖ చైర్మన్‌గాను, ప్రథమ సంవత్సరం చదివే వ్యక్తి ఆ శాఖ సెక్రటరీగాను ఎంపికయ్యారు. అందరూ కలసి కాలేజీ ఆర్ట్స్ విభాగపు చైర్మన్‌ను, సెక్రటరీని ఎన్నుకున్నారు. క్లాస్ వారీ ఓటింగ్ ముగిసి, కౌంటింగ్ స్టార్ట్ చేశారు. ఉత్కంఠగా సాగిన చివరి ఎన్నికలో కిరీటం చంద్రబాబుకు దక్కింది. పెద్దిరెడ్డి వర్గం నా ఒక్క ఓటు తేడాతో అపజయం పాలయింది. పెద్దిరెడ్డి నిలబెట్టిన పరంధామయ్యారెడ్డి ఓడిపోయాడు. ఇరువైపులా సైన్యాలు పోరాడాయే గానీ నాయకులు కొట్టుకోలేదు. ఈ వాస్తవాల్ని వక్రీకరించి చంద్రబాబును పెద్దిరెడ్డి కొట్టాడని కొంతమంది ఇప్పుడు దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటు. నిజానికి ఆ గెలుపే చంద్రబాబు రాజకీయ జీవితానికి మలుపు అయింది.

చంద్రబాబుకు ఆడపిల్లలతో సంబంధాలు ఉన్నాయన్న దుష్ప్రచారం కూడా కొందరు చేస్తున్నారు. రాజకీయాల కోసం వ్యక్తిత్వాన్ని హననం చేయడం ఎంతమాత్రం భావ్యం కాదు. ఎన్నికల్లో గెలుపు కోసం, పార్టీల సిద్ధాంతాలపై, మేనిఫెస్టోలపై ఒకర్నొకరు విమర్శించుకోవాలే కానీ వ్యక్తుల శీలాన్ని గూర్చి కల్పిత కథలు ప్రచారం చేయడం మంచి సంప్రదాయం కాదు. చంద్రబాబును నేను 40 సంవత్సరాలు సన్నిహితంగా చూశాను. అప్పటి విద్యార్థి దశలోనూ, ఆపై రాజకీయ సింహాసనంపై కూర్చున్నప్పుడు కూడా ఆయనకు రాజకీయ వ్యామోహం తప్ప, ఎలాంటి స్త్రీ వ్యామోహం లేదు. ఏ స్త్రీతోను సంబంధాలు లేవు. నాకు తెలిసి చంద్రబాబు మహిళల్ని సోదరీ భావంతోనే చూసేవారు. అలాంటి దుర్బుద్ధి ఆయనకు ఈనాటికీ లేదు. చంద్రబాబు మెప్పుకోసం నేను ఈ విషయాల్ని రాయడం లేదు. ఏడు పదుల వయస్సు దాటిన నాకు ఇంకా ఏమి అవసరాలు ఉంటాయి ఆయనతో. నాకు నచ్చని విషయాల్ని ఆయనకే చెప్పేసేవాడిని.

అందర్నీ కలుపుకుపోయే తత్వం చంద్రబాబుకు ముందు ముందు చాలా లాభకారి అయింది. నాటి మా విద్యార్థుల సమైక్యత, ఆయనకు చాలాకాలం వరకు అండగా నిలిచింది. 1978లో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో మొదటిసారిగా ఏర్పడ్డ చంద్రగిరి నియోజకవర్గానికి ఇందిరా కాంగ్రెస్ తరఫున చంద్రబాబు టిక్కెట్టు తెచ్చుకున్నాడు. అనేక మంది విద్యార్థి బృందాలు చంద్రబాబు కోసం గ్రామగ్రామాన తిరిగి ప్రచారం నిర్వహించాయి. చంద్రగిరి నియోజకవర్గ పరిధి చాలా పెద్దది. నేను ప్రతిరోజు ఓ పదిమంది స్నేహితుల్ని వెంటబెట్టుకొని కాలినడకన అన్ని పల్లెలు తిరుగుతూ ఓట్లు అడిగాను. కొన్ని చోట్ల రైతులు మొహంమీదే జనతాపార్టీకి ఓట్లేస్తాం అని చెప్పేవాళ్ళు. మేమిచ్చిన కరపత్రాలు మా ఎదుటే చించేవారు. బడుగు, బలహీనవర్గాలు మాత్రం ఇందిరమ్మకే మా ఓట్లు అనేవారు. విద్యార్థులు నిస్వార్థంతో, విద్యార్థి నాయకుడైన చంద్రబాబు ఎలాగైనా గెలవాలన్న పట్టుదలతో పనిచేశారు. ఫలితాల రోజు సాయంత్రానికి ఆఖరు రౌండ్‌లో చంద్రబాబు మెజారిటీ సాధించి, గెలుపొందాడు.

విద్యార్థుల సంఘీభావం, సమైక్యత చంద్రబాబును మంత్రిగా చేసే వరకు కొనసాగింది. టి. అంజయ్య ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడిని మంత్రివర్గంలోకి తీసుకున్నారు. రాజకీయ పోరాటంలో చంద్రబాబు, రామచంద్రారెడ్డి తలపడ్డా అదృష్ట దేవత మొదట చంద్రబాబునే వరించింది. రెండుసార్లు ఓటమి తర్వాత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కూడా అంచెలంచెలుగా ఎదిగాడు. అపార రాజకీయ చతురత, పట్టుదల, కలిసొచ్చిన అదృష్టం, అసాధ్య వ్యూహ రచన, మాటతీరు, మంచితనం, అందర్నీ కలుపుకెళ్లాలన్న మనస్తత్వం చంద్రబాబును ముఖ్యమంత్రి పీఠానికి చేర్చాయి.

■ డా. యస్. విజయకుమార్
సీఎంఓ – మాజీ ముఖ్య ప్రజాసంబంధాల అధికారి


పర్వతారోహణే ఊపిరిగా...

పర్వతారోహణే శ్వాసగా, జీవితాశయంగా జీవించారు మల్లి మస్తాన్‌బాబు. కేవలం 172 రోజుల్లో ఏడు ఖండాల్లోని ఏడు అత్యున్నత శిఖరాలను అవలీలగా అధిరోహించి గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో స్థానం సంపాదించారాయన.

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా సంగం మండలం గాంధీ జనసంఘం గ్రామంలో 1974 సెప్టెంబర్ 3న ఒక సాధారణ గిరిజన కుటుంబంలో మల్లి జన్మించారు. ఆయనకు చిన్నప్పటి నుంచే కొండలెక్కడం అంటే మహా సరదా. కోరుకొండ సైనిక పాఠశాలలో చదివే సమయంలో.. తన సీనియర్ విద్యార్థి ఎం.ఉదయభాస్కరరావు ఎవరెస్ట్‌ను అధిరోహించే క్రమంలో మృతి చెందారు. ఎప్పటికైనా ఆ పర్వతాన్ని అధిరోహించడం ద్వారా భాస్కరరావుకు నివాళి అర్పించాలనుకున్నారు మల్లి. అందుకోసం పర్వతారోహణలో శిక్షణ తీసుకున్నారు. మొదటగా 2006 జనవరి 19న అంటార్కిటికా ఖండంలోని 4,897మీటర్ల ఎత్తున్న 'విన్సన్ మాసిఫ్' శిఖరాన్ని అధిరోహించారు. అలా తన పర్వతారోహణ ప్రస్థానాన్ని ప్రారంభించారు. అదే ఏడాది మే 21న ఎవరెస్ట్ శిఖరాన్ని, పలు హిమాలయ పర్వతాలనూ అధిరోహించి తన సీనియర్ విద్యార్థి కన్న కలను నిజం చేశారు. మల్లి బహుభాషా కోవిదుడు. గొప్ప పర్యావరణ ప్రేమికుడు, మంచి వక్త. హిమాలయ పర్వతాల్లో పేరుకుపోతున్న వ్యర్థ పదార్థాల గురించి నిరంతరం ఆందోళన చెందుతుండేవారు. 2015 మార్చిలో దక్షిణ అమెరికాలోని 'నెవాడో ట్రెస్ క్రూసెస్ సర్ సమ్మిట్'ను అధిరోహించే క్రమంలో దురదృష్టవశాత్తూ మృతి చెందారు. పాలకులు ప్రోత్సాహాన్ని అందిస్తే ఇలాంటి మట్టిలో మాణిక్యాలు మరికొందరు వెలుగులోకి వస్తారు.

– ఎం. రాంప్రదీప్
జెవివి సభ్యుడు, తిరువూరు

(నేడు మల్లి మస్తాన్‌బాబు జయంతి)



రవాణాలో వార్!

ఏఎంవీఐ వర్సెస్ ఎంవీఐ

ఉమ్మడి కృష్ణాజిల్లాలో నడుస్తోన్న వివాదం

- ఏఎంవీఐల విధుల్లో తలదూర్చుతున్న పలువురు ఎంవీఐలు
- లైసెన్స్‌ల మంజూరులో అవినీతికి పాల్పడుతున్న వైనం
- వీరికి అండగా నిలుస్తున్న కొందరు ఆర్‌జేటీసీ, జేటీసీలు
- కమిషనర్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్న ఏఎంవీఐలు



ఉమ్మడి కృష్ణాజిల్లాలోని రవాణాశాఖలోని ఏఎంవీఐ, ఎంవీఐ మధ్య కొన్నాళ్లుగా వివాదాలు జరుగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త విధానాలతో ఎంవీఐలకు పనిలేకుండా పోయింది. దీంతో అవినీతికి అలవాటు పడిన పలువురు ఎంవీఐలు ఏఎంవీఐ విధుల్లో తలదూర్చి లైసెన్స్‌ల మంజూరు తదితర వ్యవహారాల్లో అవినీతికి పాల్పడుతున్నారు. వీరిక్ని కొందరు ఆర్‌జేటీసీ, జేటీసీలు అండగా నిలుస్తున్నారు. దీంతో ఎంవీఐల తీరుతో విసిగిపోయిన ఏఎంవీఐలు కమిషనర్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రవాణా శాఖలో సీనియర్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు (ఎంవీఐ), సహాయ మోటార్ ఇన్‌స్పెక్టర్ల మధ్య వార్ నడుస్తోంది. ఏఎంవీఐల విధుల్లో పలువురు సీనియర్ ఎంవీఐలు తలదూర్చటమే దీనికి కారణంగా తెలుస్తోంది. రవాణా వ్యవస్థలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ల పాత్రను గణనీయంగా తగ్గించేందుకు కొద్ది కాలంగా కేంద్ర ప్రభుత్వం తీసుకు వస్తున్న అనేక సంస్కరణల వల్ల ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఎంవీఐలు నిర్వహించాల్సిన విధులు చాలా వరకు తగ్గిపోయాయి. వాహనాల రిజిస్ట్రేషన్లు, వాహనాల బ్రేక్ వ్యవహారాలు, ఫిట్‌నెస్ టెస్టులు నిర్వహించటం, ఎన్‌ఫోర్స్‌మెంట్ చేయటం, రవాణా వాహనాల మీద కేసులు రాయటం, ఇచ్చిన టార్గెట్స్‌ను పూర్తి చేయటం ఎంవీఐలు ప్రధానంగా నిర్వహించేవారు. అలాగే గతంలో చెక్ పోస్టుల పరిధిలో కూడా విధులు నిర్వహించేవారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆటోమేటిక్ టెస్టింగ్ సెంటర్స్ (ఏటీఎస్) పేరుతో ప్రైవేటు కేంద్రాల ద్వారా వాహన బ్రేక్, ఫిట్‌నెస్‌లు వంటి బాధ్యతలను ప్రైవేటు నిర్వాహకుల చేతుల్లో ఉన్న ఏటీఎస్ కేంద్రాలకు అప్పగించింది. దీంతో ఎంవీఐల ప్రధానమైన బాధ్యతలను మిగతా 6లో..

ఉన్నతాధికారుల అండ చూసుకుని..

సీనియర్ ఎంవీఐలు కొందరు తమ పైఅధికారులు అయిన ఆర్‌జేటీసీ, జేటీసీల అండ చూసుకుని ఏఎంవీఐల విధుల్లో తలదూర్చుతూ, విచ్చలవిడిగా అవినీతి కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఏఎంవీఐలు పైఅధికారులకు చెప్పుకుందామంటే వారంతా కూడా ఎంవీఐలకు మద్దతుగా ఉంటున్నారని తెలిసింది. ఈ వ్యవహారాలేవీ రవాణా శాఖ కమిషనర్‌కు తెలియకపోవటంతో ఏఎంవీఐలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానమైన బాధ్యతలు లేకపోయినప్పటికీ.. ఎన్‌ఫోర్స్‌మెంట్ చేసే అధికారం ఇప్పటికీ ఎంవీఐల చేతుల్లోనే ఉంది. వాహనాల తనిఖీలు ముమ్మరం చేస్తూ నిబంధనల ఉల్లంఘనలు జరిగితే జరిమానాలు వేయవచ్చు. ఈ పనిని ఎంవీఐలు పెద్దగా చేయటం లేదని విమర్శలు వస్తున్నాయి.

వాహన సదుపాయం లేక అవస్థలు

మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లకు వాహన సదుపాయం ఉంది. ఏఎంవీలకు మాత్రం కార్లు లేవు. ఇటీవల ఏఎంవీఐలు అంతా కలిసి ప్రభుత్వ స్థాయిలో ఓ ఉన్నతాధికారి దగ్గరకు వెళ్లి వాహన సదుపాయం కల్పించాల్సిందిగా కోరారు. చట్ట ప్రకారం మీకు వాహన సదుపాయం లేదని, అయినప్పటికీ రూ.20 లక్షలు ఇచ్చుకుంటే మీకు ఆ అవకాశాన్ని కల్పిస్తానని ఆఫర్ ఇచ్చినట్టు తెలుస్తోంది. దీంతో ఏఎంవీఐలు ఉలిక్కిపడి తిరుగుటపా కట్టారు. తమను రూ.20 లక్షలు లంచం డిమాండ్ చేసిన ప్రభుత్వ స్థాయి ఉన్నతాధికారి వ్యవహారంపై రవాణా శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేయాలని భావించినా... ఆ తర్వాత వారు తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నారు.



వినాయకుడి నవరాత్రులు జిల్లాలో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. జగ్గయ్యపేట పట్టణం బంగారపు కొట్ల సెంటర్‌లో ఉన్న స్వయంభూ శ్రీవిఘ్నేశ్వరస్వామి ఆలయంలో గణపతిని పెన్నులతో అలంకరించారు. స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. -ఆంధ్రజ్యోతి- జగ్గయ్యపేట

మీరు సింహం సార్!

రిటైర్డ్ ఏడీసీపీ ప్రసన్నకుమార్‌కు ఇన్‌స్పెక్టర్ల కితాబు

సెట్ కాన్ఫరెన్స్‌లో 'ప్రత్యేక ప్రసన్నం'పై చర్చ

(ఆంధ్రజ్యోతి - విజయవాడ): 'సింహం సింగిల్‌గా వస్తుంది సార్. మీరు సింహం లాంటి వారు' ఇది ఓ ఇన్‌స్పెక్టర్ ఇచ్చిన కితాబు. 'మీపై ఎన్ని వ్యతిరేక కథనాలు వచ్చినా ఓఎస్డీ వస్తుంది సార్' ఇది మరో ఇన్‌స్పెక్టర్ చెప్పిన ధైర్యం. ఈ రెండింటితోపాటు అనేక అభిప్రాయాలను అందుకున్న అధికారి ఎవరో కాదు ఆయనే రిటైర్డ్ ట్రాఫిక్ ఏడీసీపీ ఏవీఎల్ ప్రసన్నకుమార్. ప్రభుత్వం నుంచి ఎలాంటి నియామకపు ఉత్తర్వులు లేకుండా అధికారిక విధుల్లో పాల్గొన్న ప్రసన్నకుమార్‌పై 'ఆంధ్రజ్యోతి'లో 'ప్రత్యేక ప్రసన్నం' శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై ఆయన మంగళవారం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలతో సెట్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించిన అంశాల కంటే 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపైనే ప్రధానంగా చర్చ జరిగినట్టు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. ఆయనకు ప్రియ శిష్యులుగా ఉన్న నలుగురైదుగురు ఇన్‌స్పెక్టర్లు మనోధైర్యాన్ని చెప్పినట్టు తెలిసింది. ముఖ్యంగా పశ్చిమ డివిజన్‌లోని ఒక ఇన్‌స్పెక్టర్, ఉత్తర డివిజన్‌లో ఒక ఇన్‌స్పెక్టర్, ఐదో ట్రాఫిక్‌లో ఉన్న ఒక ఇన్‌స్పెక్టర్ ఏవీఎల్‌కు భరోసా ఇచ్చినట్టు మిగతా 6లో..

మత్తులోడు మ్యాడీ



తెలుగు రాష్ట్రాల్లో డ్రగ్ నెట్‌వర్క్

- మ్యాడీగా చెలామణి అవుతున్న నెల్లూరుకు చెందిన మధుసూదన్‌రెడ్డి
- పేరులో ఉన్న ఇంగ్లీష్ అక్షరాల్లో మొదటి రెండు, చివరి మూడు అక్షరాలతో 'మ్యాడీ'
- బెంగళూరులో ఉంటూ డ్రగ్ కార్యకలాపాలు
- మ్యాడీ కోసం పోలీసుల గాలింపు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ): మ్యాడీ... వినడానికి ఈ పేరు చాలా స్టైల్‌గా ఉంది. పైగా విదేశాల్లో వాడుకలో ఉన్న పేరుగా అనిపిస్తుంది. వాస్తవానికి ఈ పేరు అచ్చుతెలుగుదే. మాదకద్రవ్యాల సరఫరా, విక్రయాల కోసం సృష్టించుకున్న పేరిది. ఈ మ్యాడీ ఎవరో కాదు వైజాగ్ ప్రేమికులకు ఎండీఎంఏ, ఎల్ఎస్డీని సమకూర్చిన మల్లె మధుసూదన్‌రెడ్డి. నెల్లూరు జిల్లాకు చెందిన మధుసూదన్‌రెడ్డి బెంగళూరులో ఉంటూ మాదకద్రవ్యాలను సరఫరా, విక్రయించడం చేస్తున్నాడు. వైజాగ్‌కు చెందిన అర్జా శ్రీవాత్సవ్, బొడ్డేపల్లి హవీల డిలైట్ డ్రగ్స్‌తో చిక్కడంతో మధుసూదన్‌రెడ్డి పేరు వెలుగులోకి వచ్చింది. మాచవరం పోలీసులు అతడి కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. శ్రీవాత్సవ్, హవీల పోలీసులకు పట్టుబడిన తర్వాత మధుసూదన్‌రెడ్డి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. డ్రగ్స్ సరఫరాలో ఆరితేరిన అతడు అసలు పేరు తెలియకుండా జాగ్రత్తలు తీసుకున్నాడు. అందుకోసం అతడు ముద్దుగా ఒక పేరును సృష్టించుకున్నాడు. మధుసూదన్‌రెడ్డి పేరును ఇంగ్లీష్ రాస్తే వచ్చే మొదటి రెండు అక్షరాలు, చివరి మూడు అక్షరాలు కలిపి ఎంఏడీడీవై (మ్యాడీ) పేరును రూపొందించుకున్నాడు. డ్రగ్స్ కోసం సంప్రదింపులు చేసే వారందరికి ఇదే పేరును చెప్పేవాడు.

భారీగా 'తెలుగు' నెట్‌వర్క్

మధుసూదన్‌రెడ్డి రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న విద్యార్థులకు, యువకులకు ఎండీఎంఏ, ఎల్ఎస్డీ డ్రగ్స్‌ను భారీగానే సరఫరా చేసినట్టు తెలుస్తోంది. బెంగళూరులోనే ఈ డ్రగ్స్‌ను అందజేయడానికి 10-15 డ్రాపింగ్ పాయింట్లను ఏర్పాటు చేసుకున్నాడు. డ్రగ్స్ కోసం సంప్రదింపులు చేసిన వారందరిని బెంగళూరుకు పిలిపించుకుంటున్నాడు. పేమెంట్ యాప్‌ల ద్వారా డ్రగ్స్‌కు సంబంధించిన చెల్లింపులు పూర్తయిన తర్వాత మాత్రమే సరుకు ఉన్న డ్రాపింగ్ పాయింట్‌ను వాట్సాప్‌లో పంపుతాడు. ముఖ్యంగా నగరాల్లో ఉన్న యువతీ యువకులతో మ్యాడీకి సంబంధాలు ఉన్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ఎండీఎంఏ, ఎల్ఎస్డీ మిగతా 6లో..

విలేజీ వ్యవసాయాధికారులు ముగ్గురిపై సస్పెన్షన్ వేటు

ఐదుగురు ఎరువుల వ్యాపారులపై కేసు నమోదు

'బ్లాక్ మార్కెట్‌కు యూరియా' కథనంపై స్పందన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఎ.కొండూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): యూరియా పక్కదారి పట్టించిన కేసులో ముగ్గురు విలేజీ వ్యవసాయాధికారులపై సస్పెన్షన్ వేటు పడింది. ఐదుగురు ఎరువుల డీలర్లపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలో యూరియా, డీఏపీని బ్లాక్ మార్కెట్‌కు తరలించడంపై 'బ్లాక్ మార్కెట్‌కు యూరియా' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ జి.లక్ష్మీశ స్పందించి విచారణకు ఆదేశించారు. చీమలపాడు, రామచంద్రాపురం, ఎ.కొండూరు గ్రామాల్లో విచారణ నిర్వహించిన అధికారులు ఓ నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. ఎ.కొండూరు ఏవో బండి సాయిశ్రీ ఆర్‌ఎస్‌కేలకు మార్క్‌ఫెడ్ ద్వారా సరఫరా చేసిన 40 టన్నుల యూరియా, 10 టన్నుల డీఏపీని స్థానిక ఎరువుల డీలర్లతో కుమ్మక్కై పక్కదారి పట్టించినట్టు విచారణలో తేలింది. ఈ నివేదిక ఆధారంగా కలెక్టర్ లక్ష్మీశ ఏవో బి.సాయిశ్రీని ఇప్పటికే సస్పెండ్ చేశారు. మంగళవారం రామచంద్రాపురం, చీమలపాడు, ఎ.కొండూరు గ్రామ వ్యవసాయాధికారులు నాగారాజు, రాజు, సాగర్‌ను సస్పెండ్ చేశారు. ఎరువుల డీలర్లపై తిరువూరు ఏడీఏ ఏవీఎస్ రంగారావు ఏ.కొండూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు మిగతా 6లో..



లడ్డూల తయారీ లక్ష్యం 38 లక్షలు

దసరా ఉత్సవాల్లో సరఫరాకు ప్రణాళిక

- 3 తయారీ కేంద్రాల ద్వారా ఉత్పత్తి
- గతేడాది ఉత్సవాల్లో 28 లక్షల లడ్డూల విక్రయం
- ఈ దఫా 32 లక్షల విక్రయాలే లక్ష్యం
- 20 కౌంటర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఇంద్రకీలాద్రిపై జరిగే దసరా ఉత్సవాలకు వచ్చే భక్తుల కోసం రికార్డు స్థాయిలో కనకదుర్గమ్మ లడ్డూ ప్రసాదాన్ని తయారు చేయించాలని దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం నిర్ణయించింది. గతేడాది ఉత్సవాలలో 28 లక్షల లడ్డూలను విక్రయించింది. దీన్ని దృష్టిలో మిగతా 6లో..

రోడ్డుకు పేరు లేదని.. తమ పేరు పెట్టుకున్నారు..!

విజయవాడ సెంట్రల్ 1వ డివిజన్ వైసీపీ కార్పొరేటర్ నిర్వాకం

- ఉద్దంటి సునీత సురేష్ మార్గ్‌గా పేరు పెట్టడానికి ప్రత్యేక కమిటీకి ప్రతిపాదన
- వెంటనే ఆమోదించిన వైసీపీ పాలక పక్షం.. త్వరలో కౌన్సిల్‌లోనూ ఆమోదం!
- మహానుభావుల పేర్లు పెట్టాల్సిన చోట.. కార్పొరేటర్ దంపతుల పేర్ల ప్రతిపాదనపై విమర్శలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): తన డివిజన్‌లో ఓ రోడ్డుకు అస్సలు పేరు లేదట.. అందుకే ఆ రోడ్డుకు తమ పేర్లు పెట్టుకొన్నారు వైసీపీకి చెందిన ఓ మహిళా కార్పొరేటర్ దంపతులు. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం పరిధిలోని ఒకటవ డివిజన్ మహిళా కార్పొరేటర్ ఉద్దంటి సునీత సురేష్ సోమవారం ప్రత్యేక కమిటీ ముందుకు ఓ ప్రతిపాదన తీసుకువచ్చారు. గుణదల డోర్ నెంబర్ 49-4-12/2 నుంచి 49-4-22/1ఎ వరకు ఉన్న రోడ్డుకు పేరులేదని, అందుకే దానికి ఉద్దంటి సునీత సురేష్ మార్గ్‌గా పేరు పెట్టామన్నారు. దీనికి ప్రత్యేక కమిటీ ఆమోద ముద్ర వేసేసింది. ఇక ఇది కౌన్సిల్‌కు రావటమే మిగిలి ఉంది. కౌన్సిల్‌లో కూడా బలం ఉండటంతో ఆమోదించడమే తరువాయి అని గుసగుసలు వినిపిస్తున్నాయి. వీధులకు ఇప్పటి వరకు నగరాభివృద్ధికి కృషి చేసిన వారి పేర్లను పెట్టుకోవటం ఆనవాయితీగా వస్తోంది. అలాగే వివిధ రంగాలలో మహానుభావుల పేర్లను పెట్టారు. ఆ తర్వాత కాలంలో కొన్ని మార్పులు వచ్చాయి. విజయవాడ అభివృద్ధి కాంక్షతో మౌలిక సదుపాయాలను కల్పించటానికి వీలుగా ఆయా రోడ్ల నిర్మాణ పనులకు సహకరించే దాతలు ప్రతిపాదించిన పేర్లను పెట్టడానికి నిబంధనలను మార్చారు. ఎక్కువ మంది దాతలు చనిపోయిన తమ తల్లిదండ్రుల పేర్లను ప్రతిపాదించేవారు. ఆ మేరకు మిగతా 6లో..

లాక్రోస్ క్రీడలో రారాజ్!

- అంతర్జాతీయ లాక్రోస్ పోటీలకు అర్హత
- అవకాశం వచ్చినా వెళ్లలేని ఆర్థిక నిస్సహాయత

8

కోహినూర్ లాంటి కలెక్టర్ వల్లే బంగారు పతకాలు

- మంత్రి సత్యకుమార్ యాదవ్
- సంపూర్ణతా అభియాన్ సారథులకు ఘన సత్కారం
- ఆకాంక్షిత మండలాల ప్రగతికి నీతి ఆయోగ్ పట్టం



లాటరీ తీస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, చిత్రంలో ఎక్సైజ్ అధికారులు

ఏడు బార్లు ఖరారు

- లాటరీ ద్వారా ఎంపిక చేసిన కలెక్టర్ లక్ష్మీశ
- 61 బార్‌లకు రీనోటిఫికేషన్

విజయవాడ, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మరో ఏడు బార్‌లకు వ్యాపారులను అధికారులు మంగళవారం ఖరారు చేశారు. జిల్లాలో 130 ఓసీ, పది రిజర్వేషన్ బార్‌లకు ఎక్సైజ్ శాఖ కొద్దిరోజుల క్రితం లాటరీ తీసిన విషయం తెలిసిందే. ఇందులో రిజర్వేషన్ కేటగిరిలో ఉన్న అన్ని బార్‌లకు వ్యాపారుల ఎంపిక పూర్తయింది. ఇక ఓసీ కేటగిరిలో 62 బార్‌లకు మాత్రమే లాటరీ తీశారు. 68 బార్‌లకు నిబంధనల ప్రకారం దరఖాస్తులు రాకపోవడంతో లాటరీ తీయలేదు. వాటిలో ఒక బార్‌కు రెండు, 12 బార్‌లకు ఒక్కొక్క దరఖాస్తు వచ్చాయి. ఒక దరఖాస్తు వచ్చిన బార్‌లకు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవడానికి ఎక్సైజ్ శాఖ గడువు ఇచ్చింది. ఈ గడువు పూర్తవ్వడంతో విజయవాడలోని కలెక్టర్ కార్యాలయంలో డ్రా తీశారు. ఒక దరఖాస్తు పడిన 12 బార్‌లో ఏడు బార్‌లకు వ్యాపారులను లాటరీ ద్వారా ఎంపిక చేశారు. 2 బార్‌లకు లాటరీ ద్వారా ఎంపికైన అభ్యర్థులు ఆసక్తిని చూపించకపోవడంతో రిజర్వేషన్ (ఆర్-1)గా ఉన్న వ్యక్తులను ఎంపిక చేశారు. ఇంకా 61 బార్‌లకు రీ నోటిఫికేషన్ విడుదల చేశారు. వాటి దరఖాస్తులను అందజేయడానికి 14వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు గడువు ఇచ్చారు. ఈ బార్‌లకు 15వ తేదీన డ్రా తీస్తారు.

శిథిలమవుతున్న కాజ్ వే..!

ప్రమాదమని తెలిసినా తప్పని ప్రయాణం

నిత్యం వేలాది వాహనాలు ప్రయాణించే రాష్ట్ర రహదారి.. మునేరుకు వరద వస్తే చాలు.. కాజ్‌వేపై నీరు ప్రవహిస్తుంది. ఆదమరిస్తే.. ప్రవాహంలో వాహనాలు కొట్టుకుపోతున్నాయి. ప్రమాదమని తెలిసినా తప్పని ప్రయాణం. ఆరు దశాబ్దాల క్రితం చిల్లకల్లు-వైరా హైవేలో మునేటిపై నిర్మించిన కాజ్‌వే మునేటి వరదలకు పూర్తిగా శిథిలావస్థకు చేరింది. మునేరు ఉగ్రరూపం దాల్చిన సమయంలో రహదారిపై రోజుల తరబడి రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఈ మధ్యకాలంలో ఈ మార్గంలో ట్రాఫిక్ విపరీతంగా పెరగడంతో ప్రజలు వ్యయ ప్రయాసలకు గురవుతున్నప్పటికీ పాలకుల్లో స్పందన లేదు.



నదిలోకి దూసుకుపోయిన లారీ

- వరద నీటిపై ప్రమాదకర ప్రయాణం
- అదుపుతప్పుతున్నా కళ్లు తెరవని పాలకులు
- తెలుగు రాష్ట్రాల మధ్య రాకపోకలకు తీవ్ర అంతరాయం
- లింగాల కాజ్‌వే స్థానంలో కొత్త వంతెనకు మోక్షమెప్పుడో?

(ఆంధ్రజ్యోతి, కంచికచర్ల)

65వ నెంబరు జాతీయరహదారి నుంచి చిల్లకల్లు-వైరా (తెలంగాణా) స్టేట్‌హైవే మార్గంలో వత్సవాయి మండలం లింగాల వద్ద మునేటిపై 1965లో 800 మీటర్ల పొడవున కాజ్‌వే నిర్మించారు. కాజ్‌వేకు అడుగు భాగంలో వరద నీరు వెళ్లేలా 55 ఖానాలు ఏర్పాటు చేశారు. అయితే మునేరు 30 వేల క్యూసెక్కులకు మించి వస్తే కాజ్‌వేపైకి వరద చేరుతున్నది. వరద తగ్గేంత వరకు కాజ్‌వేపై రాకపోకలకు వీలుపడటం లేదు. తెలంగాణ రాష్ట్రం వరంగల్, ఖమ్మం జిల్లాల్లో విస్తారంగా వర్షాలు పడితే మునేరుకు వరద వస్తున్నది. రోజుల తరబడి కాజ్‌వే వరదలో మునిగిపోతుండటంతో స్టేట్‌హైవేలో రాకపోకలు బంద్ అవుతున్నాయి. దీంతో కార్లు, బస్సులు, ఇతర తేలికపాటి వాహనాలు పెనుగంచిప్రోలు, మక్కపేట మీదుగా వెళుతున్నాయి. చుట్టూ తిరిగి రావాల్సి వస్తుండటంతో ప్రజలు వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు. భారీ వాహనాలు విజయవాడ మీదుగా వెళ్లాల్సి వస్తున్నది.

వరదలకు దెబ్బతిన్న కాజ్‌వే

ఆరు దశాబ్దాల క్రితం నిర్మించిన కాజ్‌వే భారీ వరదలకు పూర్తిగా దెబ్బతిన్నది. గత ఏడాది ఉధృతంగా 1.50 లక్షల క్యూసెక్కులకు పైగా వరద రావటంతో కాజ్‌వే పలు చోట్ల పూర్తిగా కోసుకుపోయింది. ఆర్ అండ్‌బీ అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారు. గతేడాది రూ. 20 లక్షలతో మరమ్మతులు చేశారు. ఈ ఏడాది రూ. 1.50 కోట్లతో మరమ్మతులు చేశారు. మళ్లీ వరద వస్తే పరిస్థితి షరా మామూలే అన్నట్టుగా తయారైంది.



శిథిలావస్థలో లింగాల కాజ్‌వే

కొత్త వంతెన నిర్మించండి..

కాజ్‌వే స్థానంలో మునేటిపై వంతెన నిర్మించాలన్న ప్రతిపాదన కార్యరూపం దాల్చటం లేదు. వంతెన నిర్మాణానికి సుమారు రూ. 150 కోట్లు అవసరమవుతాయని ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రతిపాదించినా.. ఏళ్ల తరబడి ఈ ప్రతిపాదన కాగితాలకే పరిమితమైంది. జగ్గయ్యపేట ప్రాంతంలో సిమెంట్ కార్మాగారాలు, ఇతర పరిశ్రమలు ఎక్కువగా ఉండటంతో ఇటీవల కాలంలో ఈ మార్గంలో లారీలు, భారీ వాహనాల సంఖ్య బాగా పెరిగింది. జగ్గయ్యపేట, నందిగామ ప్రాంతాల నుంచి తెలంగాణా రాష్ట్రం ఖమ్మం వెళ్లేందుకు దగ్గరి మార్గం. ఎంతో ప్రాధాన్యత కలిగిన ఈ రహదారిపై లింగాల వద్ద వంతెన నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వత్సవాయి : మునేరు కాజ్‌వేపై మంగళవారం ఉదయం అదుపుతప్పి బొగ్గు లారీ నదిలోకి వెళ్లిపోయింది. మణుగూరు నుంచి జగ్గయ్యపేట సమీపంలోని సిమెంట్ ఫ్యాక్టరీకి బొగ్గు లోడుతో వెళుతున్న లారీ లింగాల కాజ్‌వే వద్ద అదుపు తప్పి నదిలో పడింది. ప్రమాదంలో లారీ డ్రైవర్ త్రుటిలో తప్పించుకున్నాడు. కాజ్‌వేపై వెళుతున్న కొంతమంది డ్రైవర్‌ను రక్షించారు. ప్రమాద సమయంలో డ్రైవర్‌లో నిద్ర మత్తులో ఉన్నట్టు తెలుస్తున్నది.




రూ.1.50 కోట్లతో మరమ్మతులు చేసిన తర్వాత కాజ్‌వే



పరుగులు పెడుతున్న కృష్ణమ్మ

కొనసాగుతున్న వరద ఉధృతి..

జగ్గయ్యపేట రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కురుస్తున్న వర్షాలకు తోడు పాలేరు, మునేటికి వస్తున్న వరదతో కృష్ణానదిలో వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన పులిచింతల నుంచి 1.50 లక్షల క్యూసెక్కుల నీటిని కిందకు విడుదల చేయటంతో ముక్త్యాల, రావిరాల, వేదాద్రి వద్ద కృష్ణా-గుంటూరు తీరాలను తాకుతూ కృష్ణమ్మ పరుగులు పెడుతోంది. దీంతో ముక్త్యాల, రావిరాల వద్ద వినాయక నిమజ్జనాలను నిలిపి వేశారు. వేదాద్రికే విగ్రహాలను తరలిస్తున్నారు. వేదాద్రి వద్ద వినాయక నిమజ్జనాలకు పటిష్ఠ భద్రత కోసం పాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కృష్ణానది వరద పోటు ఉండటంతో అప్రమత్తంగా ఉండాలని అధికారులు మైకు ద్వారా ప్రచారం చేస్తున్నారు.



వృథాగా పోతున్న నీరు.. రైతుల ఆందోళన

భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో చిల్లకల్లు ఊర చెరువుకు గండి పడి నీరు వృథాగా పోతున్నది. వరద తగ్గినా చెరువులో నీరు వృథాగా పోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ఆదేశించినా ఇరిగేషన్ అధికారులు స్పందించకపోవటంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

క్వాంటం పెన్షన్ అందజేయాలి

» జిల్లా పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు రామస్వామి




మాట్లాడుతున్న రామస్వామి

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వం క్వాంటం పెన్షన్‌ను 75 ఏళ్లకు పెంచడం వల్ల తీవ్రంగా నష్టపోయామని, గతంలో ఉన్న 70 ఏళ్లు నిండిన పెన్షనర్లకు 10 శాతం అడిషనల్ క్వాంటం పెన్షన్‌ను ఇవ్వాలని జిల్లా పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు జి.రామస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం పెన్షనర్ల హాలులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు చాలాకాలంగా విడుదల కావడం లేదన్నారు. హెల్త్‌కార్డులను కార్పొరేట్ ఆసుపత్రుల్లో అనుమతించడం లేదన్నారు. పీఆర్సీని ప్రకటించాలని, డీఏలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా సంఘ కార్యదర్శి ఏవీ ప్రసాదరావు తదితరులు మాట్లాడారు.

అక్రమంగా చేపల చెరువు వేలం!

కోకిలంపాడు(తిరువూరు)సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కోకిలంపాడు గ్రామంలో పెద్దల ముసుగులో నిబంధనలకు విరుద్ధంగా చేపల చెరువుల వేలంను మంగళవారం నిర్వహించారు. గ్రామంలోని రెండు చెరువుల్లో చేపలు పట్టుకునేందుకు మొత్తం రూ. 9.60 లక్షలకు పాట నిర్వహించినట్టు సమాచారం. గ్రామంలోని రెండు చెరువుల్లో రెండేళ్ల కాలానికి తాళ్లచెరువు రూ.6.30లక్షలు, కొత్తచెరువు రూ.3.30 లక్షలకు ప్రైవేటు వ్యక్తులు పాడుకున్నట్టు తెలిసింది. నిబంధనల ప్రకారం పంచాయతీ చెరువుల్లో చేపలు పెంచుకునేందుకు, పట్టుకునేందుకు, డీఎల్‌పీవో వేలం నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంది. ఫిషరీష్ లేదా పీడబ్ల్యూడీ శాఖ సమక్షంలో బహిరంగ వేలం నిర్వహించాల్సి ఉండగా, కోకిలంపాడులో అధికారులకు తెలియకుండా గ్రామానికి చెందిన కొందరు పెద్దల ముసుగులో వేలం నిర్వహించడం గమనార్హం. సదరు నగదు వారి జేబుల్లోకి వెళుతున్నట్టు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో రవిబాబును వివరణ కోరగా, చేపల చెరువుల వేలం విషయం తమ దృష్టికి రాలేదని, విచారించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.



వేలం వద్ద గ్రామస్థులు

డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లాలో డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్లను మంగళవారం మూడో విడత డీఈవో పీవీజే రామారావు ఆధ్వర్యంలో పరిశీలించారు. నోబుల్ కళాశాలలో రెండురోజుల పాటు సర్టిఫికెట్లను పరిశీలించగా, డీఈవో కార్యాలయంలో మరోరోజు సర్టిఫికెట్లు పరిశీలించారు. మూడోవిడతగా 34 మంది సర్టిఫికెట్లు పరిశీలించారు. వీరిలో ఆరుగురు దివ్యాంగులు కావడంతో వారి సర్టిఫికెట్లను గుంటూరు, మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రులకు పంపారు. కొందరు టీచర్లు స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీ పోస్టులకు ఎంపికయ్యారు. ఇలా రెండు పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు ఎస్‌జీటీ పోస్టులు వదులుకున్నారు.

స్త్రీ శక్తి మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక

» ఎమ్మెల్యే వసంత

మైలవరం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్త్రీ శక్తి పథకం మహిళల ఆత్మ గౌరవానికి ప్రతీక అని, విజనరీ లీడర్ సీఎం చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వంతోనే మహిళల అభ్యున్నతి సాధ్యమని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అన్నారు. స్త్రీ శక్తి పథకం అమలుపై రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ పట్టణంలోని బస్టాండ్ సెంటర్ నుంచి ప్రధాన కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహం వరకు మంగళవారం నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో ఎమ్మెల్యేతో పాటు సుమారు రెండు వేలమంది మహిళలు పాల్గొన్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జోహార్ ఎన్టీఆర్, జై చంద్రబాబు అంటూ నినదించారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అంటూ మహిళలు నీరాజనం పలికారు. అనంతరం ఎస్వీ కళ్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రసంగించారు. స్త్రీ శక్తి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రతి మహిళకు సగటున నెలకు రూ.1500 ఉంచి రూ.3వేల వరకు ఆర్థిక ప్రయోజనం కలుగుతుందన్నారు. గడిచిన 15 రోజుల్లో ఈ పథకం కింద దాదాపు మూడు కోట్ల మంది మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణాలు చేశారన్నారు. 74 శాతం బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేసే అవకాశం కల్పించామని, భవిష్యత్తులో ఎలక్ట్రికల్ ఏసీ బస్సుల్లో కూడా ప్రభుత్వం అమలు చేస్తుందని వెల్లడించారు. స్త్రీశక్తి పథకం అమలుకు కృతజ్ఞతలు చెబుతూ విచ్చేసిన సోదరీమణులకు ఎమ్మెల్యే ధన్యావాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య, కలకొండ విజయబాబు, జనసేన పార్టీ అధికార ప్రతినిధి అక్కల రామోహనరావు (గాంధీ), లంక లితీష్, పట్టణ పార్టీ అధ్యక్షుడు కరీందాదా, మండల అధ్యక్షుడు జె.గోపాలస్వామి, నియోజకవర్గ కూటమి నేతలు, మహిళా నాయకులు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.



మహిళలతో కలసి ర్యాలీగా వస్తున్న ఎమ్మెల్యే వసంత, పార్టీ శ్రేణులు

జోగి వ్యంగ్య వ్యాఖ్యలు.. పట్టించుకోని మహిళలు

మైలవరం: వైఎస్ రాజశేఖరెడ్డి వర్ధంతి కార్యక్రమానికి మైలవరం విచ్చేసిన జోగి రమేష్ మూడు బొమ్మల సెంటర్లో రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం స్త్రీ శక్తి పథకం అమలుపై కృతజ్ఞతా ర్యాలీకి వస్తున్న మహిళలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేశాడు. అందరూ ముఖ్యమంత్రి చంద్రబాబు కాలర్ పట్టుకోవాలని చెబుతున్నా.. మహిళలు జోగి మాటలను పట్టించుకోకుండా ర్యాలీగా సభా వేదిక వద్దకు తరలివెళ్లారు.



హరికృష్ణకు నివాళులర్పిస్తున్న కుమార్తె సుహాసిని, సోదరుడు రామకృష్ణ తదితరులు

హరికృష్ణ సేవలు చిరస్మరణీయం

» జయంతి సభలో మంత్రి రవీంద్ర

పామర్రు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ వ్యవస్థాపకుడు దివంగత ఎన్టీఆర్ ప్రచార చైతన్య రథసారథి, దివంగత మంత్రి, రాజ్యసభసభ్యుడు నందమూరి హరికృష్ణ సేవలు తెలుగు ప్రజలకు చిరస్మరణీయమని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మండల పరిధిలోని ఎన్టీఆర్ స్వగ్రామమైన నిమ్మకూరులో మంగళవారం నిర్వహించిన హరికృష్ణ 69వ జయంతి సభలో ఆయన తనయురాలు సుహాసిని, సోదరుడు రామకృష్ణలతోపాటు మంత్రి రవీంద్ర ఎమ్మెల్యేలు వర్ల కుమార్‌రాజా, వెనిగండ్లరాము, యార్లగడ్డ వెంకట్రావు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్లనారాయణలు ముఖ్యఅతిథులు హాజరయ్యారు. ఈ సందర్భంగా హరికృష్ణ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎన్టీఆర్ ట్రస్ట్, కొప్పర్ల లక్ష్మి ఛారిటబుల్ ట్రస్టు, లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా రక్తదాన, వైద్య శిబిరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజా ప్రతినిధిగా, నటుడిగా హరికృష్ణ ప్రజల్లో తనకంటూ ఓ గుర్తింపు సంపాదించుకున్నారన్నారు. ప్రజలకు, అభిమానులకు, పార్టీకి ఆయన అందించిన సేవలు నిరుపమానమన్నారు. తొలుత గ్రామంలో ఎన్టీఆర్ బసవతారకం దంపతుల విగ్రహాలకు నివాళులర్పించి ప్రత్యేక పూజలు జరిపించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, గౌడకార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి, సర్పంచ్ పడమటిశ్రీనివాసరావు, పార్టీనేతలు తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర, పక్కన ఎమ్మెల్యేలు యార్లగడ్డ, వెనిగండ్ల

రవాణలో వార్!

(5వ పేజీ తరువాయి)

వారు నిర్వర్తించనవసరం లేకుండా పోయింది. దీంతో పాటు అంతే ప్రధానమైన వాహన రిజిస్ట్రేషన్లను కూడా అంతకు ముందే వాహన షోరూమ్‌లకు అప్పగించటం జరిగింది. టెంపరరీ రిజిస్ట్రేషన్, పర్మినెంట్ రిజిస్ట్రేషన్, నెంబర్ ప్లేట్ రిజిస్ట్రేషన్ వంటివి అక్కడే జరిగిపోతున్నాయి. అలాగే చెక్‌పోస్టులను కూడా కేంద్రం రద్దు చేసింది. దీంతో గతంలో మాదిరిగా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు సింహభాగం ప్రధానమైన విధులను నిర్వహించలేని పరిస్థితి నెలకొంది. ఈ రకమైన విధులు గతంలో కొందరు అవినీతి ఎంవీఐలకు కాసులు కురిపించేవి. ఇప్పుడా పరిస్థితి లేదు. దీంతో అవినీతి రుచి మరిగిన ఉమ్మడి కృష్ణాజిల్లాలోని పలువురు సీనియర్ ఎంవీఐలు.. తమ కింద కేటగిరీ అయిన అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్స్ (ఏఎంవీఐ) విధుల్లో తలదూర్చుతున్నారు. ఏఎంవీఐల ప్రధానమైన విధుల విషయానికి వస్తే .. రిజిస్ట్రేషన్ల రెన్యువల్స్, లెర్నర్ లైసెన్స్‌లు, ఫ్రెష్ లైసెన్స్‌ల వంటి బాధ్యతలను నిర్వహిస్తుంటారు. అయితే అధికారం ఉందన్న కారణంగా అవినీతికి అలవాటుపడిన సీనియర్ ఎంవీఐలు కొందరు ఏఎంవీఐల బాధ్యతలను లాగేసుకుంటున్నారు. కాసులను పిండుకునే కార్యక్రమాలకు తెర తీస్తున్నారు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలో ఉన్న సీనియర్ ఎంవీఐలలో ఎక్కువ మంది ప్రస్తుతం ఇదే పని చేస్తున్నారు. దీంతో సీనియర్ ఎంవీఐలు, ఏఎంవీఐల మధ్య యుద్ధ జరుగుతోంది. ఉన్నతాధికారుల స్థాయిలో పంచాయితీలు నడుస్తున్నాయి.

'మత్తు'లోడు 'మ్యాడీ'

(5వ పేజీ తరువాయి)

విక్రయాలు సాగడానికి రెండు తెలుగు రాష్ట్రాల్లో భారీగా నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నట్టు తెలుస్తోంది. శ్రీవాత్సవ్, హవీల చిక్కిన తర్వాత పోలీసులు జోగా లోహిత్ యాదవ్‌కు సంకెళ్లు వేసిన విషయం తెలిసిందే. అతడిని అదుపులోకి తీసుకున్న తర్వాత స్వరూపరాజు పేరు వెలుగులోకి వచ్చింది. ఇప్పటికే స్వరూపరాజు అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. అతడే కాకుండా లోహిత్‌తో చాటింగ్, వాట్సాప్ కాల్స్ చేసిన వారు ఇప్పుడు తలోదిక్కుకు పారిపోతున్నారు. ఈ డ్రగ్స్ సరఫరాలో మధుసూదన్‌రెడ్డి ఒక్కడే పాత్ర పోషించాడా, అతడి వెనుక ఇంకెవరైనా ఉన్నారా అన్న కోణంలో పోలీసులు కూపీ లాగుతున్నారు. మ్యాడీగా చలామణి అవుతున్న మధుసూదన్‌రెడ్డిని పట్టుకోవడానికి పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతోపాటు ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్న శ్రీవాత్సవ్, హవీల, లోహిత్‌ను కస్టడీలోకి తీసుకుని విచారించాలన్న యోచనలో పోలీసులు ఉన్నారు.

మీరు సింహం సార్!

(5వ పేజీ తరువాయి)

సమాచారం. ఒక ఇన్‌స్పెక్టర్ ప్రసన్నకుమార్‌ను సింహంతో పోల్చారు. సింహం ఎప్పుడూ సింగిల్‌గానే వస్తుంది సార్, మీరు సింహం లాంటి వారని పొగిడినట్టు తెలిసింది. పత్రికలో ప్రచురితమైన కథనం ఓఎస్డీ నియామకాన్ని ఆపలేదని వ్యాఖ్యానించినట్టు విశ్వసనీయ సమాచారం. వివిధ ఇన్‌స్పెక్టర్ల సంభాషణలు విన్న తర్వాత ప్రసన్నకుమార్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తన చాంబర్‌లో జరిగిన విషయాలూ బయటకు వచ్చాయని, ట్రాఫిక్ విభాగంలో ఉన్న బ్లాక్ షీప్‌లు ఎవరో త్వరలో తేలుస్తానని ఒక హెచ్చరికను జారీ చేసినట్టు సమాచారం.

లడ్డూల తయారీ లక్ష్యం 38 లక్షలు

(5వ పేజీ తరువాయి)

పెట్టుకుని ఈ ఏడాది 38 లక్షల లడ్డూలను తయారు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. వీటిలో 32 లక్షల లడ్డూలను విక్రయించగలమని దేవస్థానం అధికారులు అంచనా వేస్తున్నారు. భారీ సంఖ్యలో లడ్డూల తయారీ కోసం ఈ దఫా మూడు తయారీ కేంద్రాలను ఎంచుకుంది.

గతంలో తయారు చేసిన బుద్దా వారి మండపం, శృంగేరి షెడ్, నూతన ప్రసాద పోటు భవనాలలో లడ్డూ తయారీ చేపట్టాలని నిర్ణయించింది. బుద్దావారి మండపంలో 3,500 కళాయిల ద్వారా 20,02,200 లడ్డూలను తయారు చేయాలని, శృంగేరి షెడ్‌లోని లడ్డూ పోటులో 1,100 కళాయిల ద్వారా 6,20,400 లడ్డూలు తయారు చేయాలని, నూతన ప్రసాదం పోటు భవనంలో 2,200 కళాయిల ద్వారా 12,40,800 లడ్డూలు తయారు చేయాలని నిర్ణయించారు. తయారు చేసిన లడ్డూలను మొత్తం 20 కౌంటర్ల ద్వారా విక్రయించాలని భావిస్తున్నారు. కొండదిగువన కనకదుర్గానగర్‌లో అత్యధికంగా 11 లడ్డూ కౌంటర్లను ఏర్పాటు చేయనున్నారు. ఇవి కాకుండా రైల్వేస్టేషన్‌లో, ఇంద్రకీలాద్రిపై ఓం టర్నింగ్ దగ్గర, భవానీఘాట్ దగ్గర, బస్‌స్టేషన్ (పీఎన్‌బీఎస్)లో, వీఐపీల కోసం కలెక్టరేట్‌లో, స్టేట్ గెస్టహౌస్‌లో, మోడల్ గెస్టహౌస్‌లో, వీఎంసీ ఆఫీసు ఆవరణలో, జమ్మిదొడ్డి దగ్గర ఒక్కొక్కటి చొప్పున లడ్డూ విక్రయ కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. విడిగా ఇవ్వటంతో పాటు బాక్సుల్లో ఆరు లడ్డూలు లభించేలా అందుబాటులోకి తీసుకువస్తున్నారు.

శ్రీకాకుళేశ్వరస్వామి పవిత్రోత్సవాలు నేటినుంచి

ఘంటసాల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని శ్రీకాకుళేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 3వ తేదీ బుధవారం నుంచి 6వ తేదీ వరకు పవిత్రోత్సవాలు జరుగుతాయని ఆలయ డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామవర ప్రసాదరావు తెలిపారు. 3వ తేదీ రాత్రి 7.30 నిముషాలకు ప్రత్యేక పూజతో ఎవిత్రతోత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. 4వ తేదీన విశ్వక్సేణ పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యారాధన నిర్వహిస్తామని తెలిపారు. 5వ తేదీ ఉదయం 5 గంటలకు విశ్వక్సేణ పూజ, పుణ్యాహవచనం, అష్టోత్తర శతకలశారాధన, అనంతరం స్వామి వార్లకు అష్టోత్తర శత కలశ స్థాపన, హోమాలు జరుగుతాయన్నారు. 6వ తేదీ ఉదయం ప్రత్యేక పూజలు, శాంతి కల్యాణం జరుగుతుందన్నారు. వేదపండితులు అగ్నిహోత్రం భాష్కరాచార్యుల పర్యవేక్షణలో ముక్త్యేవి వెంకట సత్యనారాయణ చార్యులు పూజలు జరుపుతారన్నారు.

ముగ్గురిపై సస్పెన్షన్ వేటు

(5వ పేజీ తరువాయి)

చేశారు. ఏవో పేరు లేకుండా డీలర్లపై కేసు ఎలా నమోదు చేస్తామని ఎస్ఐ కృష్ణ అనడంతో జిల్లా వ్యవసాయాధికారి విజయకుమారి దృష్టికి విషయం తీసుకెళ్లారు. ఆమె జేసీకి ఫిర్యాదు చేయడంతో, జేసీ, పోలీస్ అధికారుల ఆదేశాల మేరకు ఎరువుల వ్యాపారులు మునగ వెంకట ఉమామహేశ్వరావు(ఎ.కొండూరు), వగ్గు సురేష్‌రెడ్డి(చీమలపాడు), బొమ్మారెడ్డి మురళీధరరెడ్డి(చీమలపాడు), శెట్టిపల్లి వెంకటశేషపిచ్చియ్య(చీమలపాడు), తుళ్లూరు వెంకట సత్యనారాయణ(రామచంద్రాపురం)పై కేసులు నమోదు చేశారు.

రోడ్డుకు పేరు లేదని..

(5వ పేజీ తరువాయి)

వారి పేర్లను పెట్టేవారు. ముఖ్యమంత్రి స్థాయిలో, ఉన్నతాధికారుల స్థాయిలో ప్రజల కోసం కృషి చేసిన వారికి మాత్రమే బతికి ఉన్నా పేర్లు పెట్టేలా మినహాయింపు ఉంది. మరీ ఏ అధికారంతో కార్పొరేటర్ సునీత, ఆమె భర్త ఒక రోడ్డుకు తమ పేరు పెట్టుకుంటారన్నది చర్చనీయాంశంగా మారింది. అధికారం చేతిలో ఉంటే ఏదైనా చేయొచ్చన్నదానికి నిదర్శనంగా ఈ ప్రతిపాదన నిలుస్తోంది. మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర ఈ ప్రతిపాదన విషయంలో పునఃసమీక్ష చేయాలని పలువురు కోరుతున్నారు.

నున్న-గుడివాడ విద్యుత్‌లైన్ ఆధునికీకరణ పనులు

మచిలీపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ట్రాన్స్‌కో 220 కేవీ నున్న-గుడివాడ ట్రాన్స్‌మిషన్ విద్యుత్‌లైన్ ఆధునీకరణ పనులను ఈనెల 3నుంచి 30వరకు ఉదయం 7గంటలనుంచి సాయంత్రం 6గంటలవరకు చేయనున్నట్టు విద్యుత్‌శాఖ ఈఈ ఎస్.కోటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని ఆయన తెలిపారు. అత్యవసర స్థితిలో గుడివాడ 220కేవీ, పామర్రు, మచిలీపట్నం, అవనిగడ్డ, చిగురుకోటలలోని 132కేవీ సబ్‌స్టేషన్‌ల పరిధిలో కొంతమేర విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.



మంటల్లో కాలిపోతున్న టిప్పర్


టిప్పర్ బోల్తా మంటల్లో దగ్ధం.. డ్రైవర్ క్షేమం

జి.కొండూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గంగినేనిపాలెం రైల్వే లైన్‌కు కంకర అన్‌లోడ్ చేసేందుకు వెళుతున్న ఎస్‌ఈపీఎల్‌కు చెందిన టిప్పర్ అదుపు తప్పి బోల్తాపడి మంటల్లో దగ్ధమైంది. మంగళవారం సాయంత్రం ఈ ఘటన జి.కొండూరు - గంగినేనిపాలెం గ్రామాల మధ్య మునగపాడు వద్ద జరిగింది. అతి వేగంగా వెళుతు అదుపు తప్పిన టిప్పర్ కింద పడగానే మంటలు అంటుకున్నాయి. డ్రైవర్ ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ కె.సతీష్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని ఫైర్ ఇంజన్‌తో మంటలను అదుపు చేయించారు.

డీఎస్సీ తరువాతే పోలీసు నియామకాలు చేపట్టాలి

» ఏపీ నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు హేమంత్‌కుమార్

వన్‌టౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ నియామకాలు పూర్తి అయిన తరువాతనే పోలీసు ఉద్యోగాల నియామకాలు చేపట్టాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్ కుమార్ మంగళవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డీఎస్సీ ఉద్యోగంతో పాటు పోలీసు అర్హత సాధించిన అభ్యర్థుల నుంచి ఏపీఎస్ఎల్ఆర్‌పి అయిష్ట లేఖ తీసుకోగలిగితే మిగతా అభ్యర్థులకు మిగిలిన ఉద్యోగాలను కేటాయించే అవకాశం ఉంటుందన్నారు. ఆవిధంగా జరగకపోతే ఉద్యోగాలు, తదుపరి నియామకాలకోసం బ్యాక్‌లాగ్‌గా నిలిచిపోతాయని చెప్పారు. మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి వివక్ష వల్ల కానిస్టేబుల్, ఒక డీఎస్సీ ఉద్యోగం కాని నియామకం జరగలేదన్నారు. ఈ కారణంగా ఐదు సంవత్సరాల పాటు అభ్యర్థులు కోచింగ్ సెంటర్‌లలో లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి విసిగి వేసారిపోయారని, వయోపరిమితి కూడా దాటిపోయిందని తెలిపారు. జనరల్ కానిస్టేబుల్ ఉద్యోగ వయోపరిమితి 24 సంవత్సరాలు మాత్రమేనన్నది గమనించాలన్నారు. ఉద్యోగం సాధించిన కానిస్టేబుల్ అభ్యర్థులు తెలంగాణ తరహాలో స్టైపండ్ పెంచే విధంగా కృషి చేయాలన్నారు. రాష్ట్ర విభజన సమయంలో రాష్ట్ర ప్రధాన కేంద్ర కేడర్‌గా తెలంగాణలో ఉండిపోయిన ఉద్యోగులను ఏపీకి రప్పించాలన్నారు. పల్లా శ్రీనివాస్ వీటి పై స్పందిస్తూ తాను ప్రభుత్వ పెద్దలతో, అధికారులతో చర్చించి న్యాయం జరిగేలా చూస్తానని తెలిపారు.



శ్రీనివాసరావుకు వినతి పత్రం ఇస్తున్న ఏపీ నిరుద్యోగ జేఏసీ

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	127,136, 147
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 570

7న జిల్లా సాఫ్ట్ టెన్నిస్ జట్ల ఎంపిక

విజయవాడ(స్పోర్ట్స్), సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 7న జిల్లా సీనియర్ పురుషుల, మహిళల జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి కె.దిలీప్ తెలిపారు. పటమట చెన్నుపాటి రామ కోటయ్య ఇండోర్ స్టేడియంలోని టెన్నిస్ కాంప్లెక్స్‌లో ఈ ఎంపికలు జరుగుతాయన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్ కార్డు, పుట్టినతేది ధ్రువీకరణ పత్రంతో హాజరుకావాలన్నారు. ఎంపికైన జట్లు ఈనెల 27, 28తేదీల్లో నగరంలో జరిగే రాష్ట్రస్థాయి సీనియర్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటాయని తెలిపారు.


పారిశుధ్య కార్మికురాలిని సమస్యలు అడిగి తెలుసుకుంటున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

ఇబ్బందులుంటే..
నా దృష్టికి తీసుకురండి

- కమిషనర్ ధ్యానచంద్ర

కార్పొరేషన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులున్నా తన దృష్టికి తీసుకురావాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర సూచించారు. మొగల్రాజపురం, జమ్మి చెట్టు సెంటర్, పిన్నమనేని పాలి క్లినిక్ రోడ్, నిర్మల కాన్వెంట్ రోడ్డు, ఆటోనగర్ రోడ్డు ప్రాంతాల్లో మంగళవారం అధికారులతో కలసి పారిశుధ్య నిర్వహణ పరిశీలించారు. ప్రతిరోజు ఇంటి వద్ద వ్యర్థాల సేకరణ చేస్తున్నారా, ప్రజలు ఇంటి వద్దనే తడి చెత్త, పొడి చెత్త, హానికారక వ్యర్థాలను వేరుచేసి ఇమ్మని అవగాహన కల్పిస్తున్నారా తదితర వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నిత్యం డ్రెయిన్లలో పూడికతీత పనులు చేపడుతుంది లేనిది, రహదారులను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. వాహనాలను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులు, ప్రజా ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పనిముట్లు, తోపుడుబండ్లు, చెత్త బుట్టలు, మెరుగైన పారిశుధ్య నిర్వహణ అవసరమైన వాటి గురించి నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కమిషనర్ పారిశుధ్య కార్మికులతో అన్నారు.

గుర్తింపు కార్డు ఉంటేనే వీధుల్లో వ్యాపారం

గుర్తింపు కార్డు ఉంటేనే వీధుల్లో వ్యాపారం చేసుకునేందుకు అనుమతని, వీధి విక్రయదారులకు గుర్తింపు కార్డులు, వెండింగ్ సర్టిఫికెట్లు జారీ చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలో వివిధ రకాల వీధి వ్యాపారాలు గుర్తింపు కార్డు, వెండింగ్ సర్టిఫికెట్లను పొందాలన్నారు. మెప్మా రిసోర్స్ పర్సన్స్, వార్డు సం టక్షేమ అభివృద్ధి కార్యదర్శిల ద్వారా సర్వేలో పాల్గొన్న ప్రతి వీధి విక్రయదారులు గుర్తింపు కార్డు వెండింగ్ సర్టిఫికెట్ పొందుటకు 200 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. రుసుం చెల్లించి రశీదు పొందాలన్నారు.


సందీప్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబురావు తదితరులు

గూగుల్ స్టూడెంట్ అంబాసిడర్‌గా
పీబీ సిద్ధార్థ విద్యార్థి ఎంపిక

మొగల్రాజపురం , సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి) : గూగుల్ స్టూడెంట్ అంబాసిడర్‌గా పర్వతనేని బ్రహయ్య సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థి సందీప్ కపిలవాయి ఎంపికయ్యాడు. కళాశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ మాట్లాడుతూ బీఎస్సీ హానర్స్ ఏఐ చదువుతన్న సందీప్ ఎంపిక నాయకత్వ నైపుణ్యం, విద్యా ప్రావీణ్యం, సృజనాత్మకత అధారంగా జరిగిందన్నారు. గూగుల్, విద్యార్థి సమాజానికి మధ్య వారధిగా పనిచేస్తాడన్నారు. తాజా సాంకేతిక పరిజ్ఞానం అందించడం, విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించడం, డిజిటల్ సాధికారిత ప్రోత్సహించడం, జ్ఞానం పెంచుకునే వేదికలను ఏర్పాటు చేయడం వంటి బాధ్యలుఉంటాయ న్నారు. అనంతరం సందీప్‌ను అభినందించారు. కార్యక్రమంలో డేటా సైన్స్ ఏఐ విభాగాధిపతి డాక్టర్ ఉదయశ్రీ కొంపల్లి, డీన్ రాజేష్ జంపాల, డైరెక్టర్ వి.బాబురావు పాల్గొన్నారు.

ఆటోనగర్‌లో రహదారులు గోతులమయం

- గోతుల్లో వర్షపు నీరు నిలిచి తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందిపడుతున్న స్థానికులు

(ఆటోనగర్, ఆంధ్రజ్యోతి)

విజయవాడ జవహర్ ఆటోనగర్‌లోని రోడ్లు నిలువెత్తు గోతులతో దర్శనమిస్తున్నాయి. ఆటోనగర్ మెయిన్ రోడ్డు (వంద అడుగుల రోడ్డు) నుంచి అంతర్గత రోడ్ల వరకు అన్నీ రోడ్లలో గోతులయమే. ఆటోనగర్- తాడిగడప మున్సిపాలిటీకి సరిహద్దుగా ఉన్న బల్లెంవారి వీధిలో కూడా నిలువెత్తు గోతులు దర్శనమిస్తున్నాయి. ఆటోనగర్- మహానాడు రోడ్డు కూడలిలో కూడా రోడ్డుపై పెద్ద పెద్ద గోతులున్నాయి. ఈగోతుల్లో వర్షపునీరు నిలిచి ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. వాహనచోదకుల నుంచి పాదచారుల వరకు ఈ గోతులతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గోతుల్లో వర్షపునీరు చేరడంతో రాత్రి సమయాల్లో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా మరమ్మతులు, ఇక్కడ తయారైన పరికరాలను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు వచ్చే భారీవాహనాలు రోడ్లు సరిగాలేకపోవడంతో ఇబ్బంది ఏర్పడుతుందని ఖార్కానాల యజమానులు చెబుతున్నారు. ఆటోనగర్ ఐలా సొసైటీ అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు గానీ దృష్టిసారించడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి ఆటోనగర్‌లో గోతులను పూడ్చించాలని ప్రజలు కోరుతున్నారు.



ఆటోనగర్ బల్లెంవారి వీధిలో రోడ్డు మధ్యలో గోతుల్లో నిలిచిన వర్షపు నీరు

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్
పుట్టినరోజు వేడుకలు


సిటీ సివిల్ కోర్టుల ఆవరణలో పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తున్న న్యాయవాదులు


కృష్ణలంక సర్వీసు రోడ్డులో పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న డివిజన్ అధ్యక్షుడు కొప్పూరి కిరణ్‌బాబు

విజయవాడ లీగల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సిటీ సివిల్ కోర్టుల ఆవరణలో న్యాయదేవత విగ్రహం వద్ద ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు న్యాయవాదులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్ నారాయణ, జయప్రకాష్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

కృష్ణలంక : కృష్ణలంక 21వ డివిజన్‌లోని సర్వీసు రోడ్డులో కొల్లా వారి వీధి వద్ద డివిజన్ అధ్యక్షుడు కొప్పూరి కిరణ్ బాబు అధ్వర్యంలో పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి అమ్మిశెట్టి వాసు విచ్చేసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పోతిరెడ్డి అనిత, కొల్లా విశ్వనాథ్ సాయిరాం, పోతిరెడ్డి శంకర్, మోపిదేవి మోహన్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

భారతీనగర్ : తూర్పు నియోజకవర్గంలోని రామచంద్రనగర్ టీడీపీ కార్యాలయంలో మంగళవారం కూటమి ఆధ్వర్యంలో ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పాల్గొని కేక్ కట్ చేసి పవన్ కల్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జనసేన నాయకుడు అమ్మిశెట్టి వాసు ఆపిల్ ట్రస్ట్ విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు.గద్దె క్రాంతికుమార్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. క్రాంతి కుమార్ స్వయంగా ప్రారంభించి రక్తదానం చేశారు. సేవా కార్యక్రమాలను గద్దె రమేష్, గుత్తికొండ కృష్ణమోహన్, తాడి బాబురావు, సునీల్, బండి కోమలి పర్యవేక్షించారు. కార్యక్రమంలో బొప్పన భవకుమార్, తూమాటి ప్రేమ్‌నాథ్, బుచ్చి రాంప్రసాద్, బండిరెడ్డి రామకృష్ణ, చెన్నుపాటి గాంధీ, ఫిరోజ్, ముమ్మనేని ప్రసాద్, సునీల్, గల్లా రవి తదితరులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలి - అమ్మిశెట్టి వాసు

గుణదల: నాయకత్వ లక్షణాలుగల నాయకుణ్ణి యువత ఆదర్శంగా తీసుకోవాలని జన సేన విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి అమ్మిశెట్టి వాసు అన్నారు. కొణిదల పవన్ కల్యాణ్ పుట్టిన రోజు వేడుకను పురస్కరించుకుని మంగళవారం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న రోగులకు అమ్మిశెట్టి వాసు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో పవన్‌పుట్టినరోజు వేడుకలను యువత అంగరంగ వైభవంగా నిర్వహించారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చిల్లపల్లి శ్రీనివాస్, మండలి రాజేష్, దాసరి కిరణ్, కామల్ల సోమనాథం తదితరులు పాల్గొన్నారు.


పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, తదితరులు


ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న అమ్మిశెట్టి వాసు

తిరుపతిరాజుకు ఉత్తమ ప్రచారక్ అవార్డు

పటమట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సీనియర్ యోగా శిక్షకులు సమన్వయకర్త దంతలూరి తిరుపతిరాజు సమాజానికి అందించిన వివిధ రకాల సేవలకు గాను ఆయనకు ఉత్తమ ప్రచారక్ అవార్డు లభించింది. ఈ అవార్డును పిఠాపురంలో చాతుర్మస్య దీక్ష సందర్భంగా దత్త విజయానంద స్వామిజీ నుంచి అందుకున్నారు. వివిధ సంస్థల్లో తిరుపతిరాజు అందించిన యోగా సేవలను దృష్టిలో పెట్టుకొని అవధూత దత్త పీఠం, దత్తక్రియ యోగా అంతర్జాతీయ శాఖ ఈ అవార్డును అందించారు. అధ్యక్షుడు కృష్ణకుమారి, కో ఆర్డినేటర్ అరుణ ఆయనను అభినందించారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ల మంజూరుకు
ఎమ్మెల్యే గద్దె వినతి

- సానుకూలంగా స్పందించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్

పటమట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తూర్పు నియోజకవర్గంలో నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు సబ్‌స్టేషన్‌లను మంజూరు చేయాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కోరారు. మంగళవారం తాడేపల్లిలోని మంత్రి రవికుమార్‌ను ఆయన నివాసంలో కలిశారు. నియోజకవర్గంలో 3 విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు చేయాల్సిందిగా కోరారు. అందుకు మంత్రి రవికుమార్ సాను టకూలంగా స్పందించారు. అధికారులతో మాట్లాడి మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.

డ్రెయినేజీ పైపులైన్‌కు మరమ్మతులు

- నిలిచిపోయిన పైపులైన్ లీక్‌లు
- ఊపిరిపీల్చుకున్న స్థానికులు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

ఆటోనగర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పొంగుతున్న డ్రెయినేజీ- ఆటోనగర్ సన్‌లైట్ సెంటర్‌లో మురుగునీటితో నిండిన రోడ్డు అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు స్పందించారు. మంగళవారం వీఎంసీ ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది సన్‌లైట్ సెంటర్‌లో మురుగు నీరు వెలుపలకు వస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. యంత్రం సహాయంతో పగిలిన పైపులైను తవ్వి మరమ్మతులు చేశారు. రోడ్డుపైకి వచ్చే మురుగుకు బ్రేక్ పడింది. వారం రోజులుగా తాము మురుగునీటి నుంచి వస్తున్న దుర్వాసనకు తీవ్ర ఇబ్బందిపడ్డామన్నారు.


ఆటోనగర్ సన్‌లైట్ సెంటర్‌లో డ్రెయినేజీ పైపులైన్‌కు మరమ్మతులు

ఓపెన్ డ్రెయినేజీపై సిమెంట్ దిమ్మెల ఏర్పాటు



[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

పటమట, సెప్టెంబరు2 (ఆంధ్రజ్యోతి): పటమట నల్లూరివారి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం ముందు ఉన్న ఓపెన్ డ్రెయినేజీపై సిమెంట్ దిమ్మెలు ఏర్పాటు చేశారు. ఓపెన్ డ్రెయినేజీతో జరభద్రం శీర్షికన ఆంధ్రజ్యోతి పత్రికలో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు ఓపెన్ డ్రెయినేజీపై సిమెంట్ దిమ్మెలు వేయడంతో భక్తులు, స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

డ్రెయినేజీపై వేసిన సిమెంట్ దిమ్మెలు



లాక్రోస్ క్రీడలో రా'రాజ్'!

● మట్టిలో మాణిక్యం, వివిధ క్రీడల్లో జాతీయ స్థాయిలో పతకాలు
● అంతర్జాతీయ పోటీలకు అవకాశం వచ్చినా వెళ్లలేని ఆర్థిక నిస్సహాయత

ఆంధ్రజ్యోతి, నందిగామ: మట్టిలో మాణిక్యాల ప్రతిభకు ఆర్థిక చేయూత కూడా ఉంటే అంతర్జాతీయ యవనికపై ఎంతోమంది క్రీడాకారులు దేశ ఖ్యాతిని పెంచుతారనడంలో ఏమాత్రం సందేహం లేదు. నందిగామ పట్టణంలోని ఒక పేద కుటుంబంలో జన్మించిన ఓర్సు వెంకటేశ్వరరాజ్ లాక్రోస్ (హాకీ తరహా క్రీడ) జాతీయ జట్టుకు ఎంపికై ఆర్థిక పరిస్థితులు సహకరించక అల్లాడిపోతున్నాడు.పలుచోట్ల జరిగిన క్రీడా పోటీల్లో రాజ్ ప్రతిభను గమనించిన హరికుమార్ అనే లాక్రోస్ జాతీయ రిఫరీ ఆయన్ను లాక్రోస్ వైపు అడుగులు వేయించారు. ఆర్థిక స్థితిగతులు బాగా లేకపోయినా రాజ్ తండ్రి కొండలరావు విజయవాడలో లాక్రోస్ క్రీడలో శిక్షణ ఇప్పించారు. ఎన్టీఆర్ జిల్లా జట్టుకు ఎంపికైన రాజ్ తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించారు. ఆయన ప్రతిభను గమనించిన సెలక్టర్లు రాష్ట్ర జట్టులో చాన్స్ ఇచ్చారు. 2024లో ఆగ్రాలో జరిగిన జాతీయ పోటీల్లోనూ ప్రతిభ కనబరచడడంలో అంతర్జాతీయ పోటీలకు ఎంపిక చేశారు. ఇప్పటి వరకూ లాక్రోస్ క్రీడకు క్రీడఒలంపిక్స్‌లో గుర్తింపు లేకపోవడంతో శాప్ గుర్తింపు కూడా రాలేదు. దీంతో రాజ్‌కు ప్రభుత్వ సాయం అందడం లేదు. సౌదీ అరేబియాలో జరిగే అంతర్జాతీయ పోటీలకు ఆహ్వానం అందుకున్న రాజ్ ఆర్థిక పరిస్థితి దీనంగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు.

బహుళ క్రీడా ప్రవీణుడు

లాక్రోస్‌తో పాటు పలు క్రీడల్లో రాజ్ అంతర్జాతీయ పోటీలకు భారత్ తరఫున ఆడేందుకు ఎంపికయ్యాడు. రెజ్లింగ్‌లో జాతీయ పోటీల్లో బ్రాంజ్ మెడల్ సాధించి కజికస్థాన్‌లో జరిగిన ప్రపంచకప్ పోటీలకు ఎంపికయ్యాడు. ఆర్థిక స్థోమత లేక పోటీలకు వెళ్లలేదు ఫెన్సింగ్ (కత్తియుద్ధం)లో విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి, గుజరాత్‌లో జరిగిన జాతీయ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాడు. మోడరన్ పెన్ కాట్‌లా విభాగంలో రన్నింగ్, షూటింగ్ విభాగాల్లో విజయవాడలో జరిగిన రాష్ట్ర పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించాడు.





మనసున్న మారాజులు ముందుకు రావాలి

లాక్రోస్ క్రీడలో ప్రతిభ కనబరిచి దేశం తరఫున అర్హత సాధించి సౌదీ అరేబియా వెళ్లేందుకు డబ్బు లేక ఇబ్బందులు పడుతున్నాడు. లాక్రోస్ అసోసియేషన్‌కు రూ.2లక్షలు చెల్లిస్తేనే సౌదీలో అడుగుపెట్టగలడు. తనతో పాటు ఎంపికైన 11 మంది డబ్బులు చెల్లించి పోటీలకు సిద్ధం కాగా, రాజ్ మాత్రం సాయం కోసం వేచి చూస్తున్నాడు. సమాజంలో ఆర్థికంగా ఎదిగినవారు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి రాజ్ ప్రతిభకు బాసటగా నిలవాల్సిన ఎంతైనా ఉంది.



అంబులెన్స్ తాళాలు ఈవోకు అప్పగిస్తున్న జీఆర్‌టీ జ్యూవెలర్స్ ప్రతినిధులు

దుర్గగుడికి అంబులెన్స్ విరాళం

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడికి వచ్చే భక్తుల్లో ఎవరికైనా అనారోగ్య సమస్యలు ఏర్పడి అత్యవసర పరిస్థితులు తలెత్తితే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించేందుకు ఆధునిక సదుపాయాలతో కొత్త అంబులెన్స్‌ను మంగళవారం దుర్గగుడికి జీఆర్‌టీ జ్యూవెలర్స్ విరాళంగా ఇచ్చింది. అంబులెన్స్‌కు పూజలు నిర్వహించిన అనంతరం ఈవో శీనానాయక్‌కు జీఆర్‌టీ జ్యూవెలర్స్ ప్రతినిధులు తాళం చెవులు, వాహనానికి సంబంధించిన పత్రాలను అప్పగించారు. ప్రస్తుతం దేవస్థానంలో ఒక అంబులెన్స్ మాత్రమే ఉందని, అదీ కొండ దిగువన మహామండపం వద్ద ఉండటంతో ఎదురవుతున్న ఇబ్బందుల దృష్ట్యా జీఆర్‌టీ జ్యూవెలరీ వారిని విరాళం ఇమ్మని కోరగా వారు స్పందించి అంబులెన్స్ అందించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ అంబులెన్స్ కొండపైన సమాచార కేంద్రం వద్ద ఉంటుందని భక్తుల అవసరార్థం ఇంకో అంబులెన్స్ కూడా అవసరమని, దాతలు ఎవరైనా ముందుకు వచ్చి సహకరించాలని కోరారు. జీఆర్‌టీ జ్యూవెలర్స్ విజయవాడ ప్రతినిధులు, వరుణ్ మోటార్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

11న ఏచూరి ప్రథమ వర్ధంతి సభ

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

గవర్నర్‌పేట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 11న సాయంత్రం 5 గంటలకు సీపీఎం పూర్వ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభ ఎంజీ రోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నట్టు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలో సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు రాఘవులు పాల్గొని ప్రసంగిస్తారని, పార్టీ రాష్ట్ర నేతలు పాల్గొని నివాళులర్పిస్తారని, నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను జయప్రదం చేయాలని కోరారు.



రేటింగ్‌లు సాధించిన అకాడమీ విద్యార్థులు

గ్లోబల్ చెస్ విద్యార్థులకు అంతర్జాతీయ రేటింగ్స్

విజయవాడ స్పోర్ట్స్, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): ఆగస్టు 21 నుంచి 25 వరకు సిద్ధార్థ అకాడమీలో జరిగిన ఇంటర్నేషనల్ ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో గ్లోబల్ చెస్ అకాడమీ విద్యార్థులు అంతర్జాతీయ చెస్ రేటింగ్‌లను సాధించారని అకాడమీ కార్యదర్శి ఎస్‌కే ఖాసీం తెలిపారు. ప్రియా జైన్ స్టాండర్డ్ - 1533, బ్లిట్జ్ - 1470. విద్యా జైన్ స్టాండర్డ్ - 1470, బ్లిట్జ్ - 1410. హరిదాసు చెట్విర్ స్టాండర్డ్ - 1480, బ్లిట్జ్ - 1424, షేక్ ఆఫ్షీన్ బ్లిట్జ్ - 1403. గిరాజా నందన్ జంగల బ్లిట్జ్ - 1435 రేటింగ్ సాధించారని, వారికి సంస్థ తరుపున శుభాకాంక్షలు తెలుపుతున్నామని అకాడమీ అధ్యక్షుడు రాజేంద్ర తెలిపారు.

ఏసీబీ కస్టడీకి ఐపీఎస్ సంజయ్

విజయవాడ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విజయవాడ జిల్లా జైలులో ఉన్న ఐపీఎస్ అధికారి ఎన్ సంజయ్‌ను ఏసీబీ అధికారులు కస్టడీకి తీసుకున్నారు. మంగళవారం నుంచి 3 రోజులపాటు కస్టడీకి ఇస్తూ ఏసీబీ కోర్టు అనుమతులిచ్చిన విషయం తెలిసిందే. ఏసీబీ అధికారులు సంజయ్‌ను జైలు నుంచి అదుపులోకి తీసుకున్న అనంతరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు పూర్తి చేయించి గొల్లపూడిలోని ఏసీబీ కార్యాలయానికి తరలించారు. అక్కడ విచారించి సాయంత్రం వైద్య పరీక్షలు చేయించి జైలులో అప్పగించారు.

లోను పేరుతో రూ.2లక్షలకు టోకరా

● సైబర్ నేరగాళ్లతో ఎస్ బ్యాంకు మేనేజర్ కుమ్మక్కు..!
● వ్యక్తి ఖాతాలో తెలియకుండానే రూ.82లక్షల లావాదేవీలు
● సైబర్ నేరగాళ్ల ఫోన్‌తో బ్యాంకుకు వచ్చిన బాధితుడు
● పరారీలో బ్యాంకు మేనేజర్ అజయ్‌కుమార్..?

గుడివాడ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): లోను ఇప్పిస్తానని నమ్మించి బ్యాంకు మేనేజర్ బాధితుడి నుంచి ఏకంగా రూ.2లక్షలు స్వాహా చేశారు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుడివాడ ఎస్ బ్యాంకు మేనేజర్ పీకా అజయ్‌కుమార్ గన్నవరం మండలం కేసరపల్లికి చెందిన గుర్రపుకొండ శ్రీధర్‌కు బ్యాంకు నుంచి భారీగా లోను ఇప్పిస్తానని చెప్పి ఖర్చుల కింద రూ.2లక్షలు నగదు తీసుకున్నాడు. శ్రీధర్ పేరున బ్యాంకులో ఖాతా తెరిచాడు. ఆ సమయంలో ఇచ్చే ఈ-మెయిల్ ఐడీ, సెల్ నెంబర్‌ను సైబర్ నేరగాళ్లకు అందజేశాడు. ఆ వివరాలతో సైబర్ నేరగాళ్లు శ్రీధర్ ఖాతా నుంచి సుమారు రూ.82లక్షల మేర నగదు లావాదేవీలు చేశారు. ఏం పనిచేస్తావంటూ సైబర్ నేరస్థుల నుంచి ఫోన్ రావడంతో అనుమానం వచ్చి బ్యాంకుకు వెళ్లి ఖాతాను చూసుకోగా భారీగా నగదు లావాదేవీలు జరిగినట్టు గుర్తించి మేనేజర్‌ను నిలదీశాడు. ప్రస్తుతం బ్యాంకు మేనేజర్ అజయ్‌కుమార్ సెలవులో ఉన్నట్టు సమాచారం. తన ఖాతాలో తనకు తెలియకుండా లక్షల్లో లావాదేవీలు చేసి, లోను ఇప్పిస్తానని రూ.2లక్షల తీసుకుని బ్యాంకు మేనేజర్ అజయ్‌కుమార్ తనను మోసం చేసాడని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పీ గౌతమ్‌కుమార్ తెలిపారు.

కోహినూర్ లాంటి కలెక్టర్ వల్లే బంగారు పతకాలు

● మంత్రి సత్యకుమార్ యాదవ్ ● సంపూర్ణతా అభియాన్ సారథులకు ఘన సత్కారం ● ఆకాంక్షిత మండలాల ప్రగతికి నీతి ఆయోగ్ పట్టం

వన్‌టౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కేంద్రం ప్రకటించిన ఇబ్రహీంపట్నం, పెనుగంచిప్రోలు ఆకాంక్షిత మండలాలు.. ఆదర్శ మండలాలుగా ప్రపంచం ముందు, భారతదేశం ముందు సగర్వంగా నిలిచాయని, కోహినూర్ లాంటి కలెక్టర్ లక్ష్మీశ నేతృత్వంలోని అధికార యంత్రాంగం కృషివల్లే ఈ రెండు మండలాలకు నీతి ఆయోగ్ బంగారు పతకాలు లభించాయని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. 2023లో ప్రధానమంత్రి ఆకాంక్షిత బ్లాక్స్‌లో సంపూర్ణతా అభియాన్ సమ్మాన్ సమరోహ మంగళవారం విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరిగింది. మంత్రి సత్యకుమార్ యాదవ్, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, కలెక్టర్ జీ లక్ష్మీశతో కలిసి ప్రగతిలో భాగస్వాములైన అధికారులు, సిబ్బందికి బంగారు పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ముఖ్య అతిథులు కలెక్టర్ లక్ష్మీశను ప్రత్యేకంగా సత్కరించి, అభినందనలు తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఆకాంక్ష హాట్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు ప్రధానమంత్రి కృషి చేస్తున్నారని, దీని ఫలితమే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలబడిందన్నారు. అన్ని జిల్లాలు, మండలాలకు పథకాలు అందుతున్నప్పుడు కొన్ని ప్రాంతాలు వెనకబాటుతనాన్ని సరిదిద్ది అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో కేంద్రం ఆకాంక్షిత జిల్లాలు, బ్లాకులను ప్రకటించిందన్నారు. బంగారు పతకాలు అందుకుంటున్న ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాలను అత్యున్నత శిఖరాలపై నిలబెట్టిన ఘనత చంద్రబాబుదని పేర్కొన్నారు. ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ జిల్లాలోని రెండు మండలాలకు నీతి ఆయోగ్ బంగారు పతకాలు రావడం అభినందనీయమన్నారు. ప్రతి మండలంలోనూ కామన్ ఫెసిలిటీ సెంటర్ (సీఎఫ్‌సీ) ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ మాట్లాడుతూ ఆకాంక్షిత బ్లాకుల కార్యక్రమం విజయవంతమైందనడానికి ఎన్టీఆర్ జిల్లా సాధించిన ఫలితాలే నిదర్శనమన్నారు.



సత్కారాలు పొందిన అధికారులతో మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ కేశినేని చిన్ని

సమష్టి కృషి ఫలితం ఈ విజయం: కలెక్టర్

ఆకాంక్షిత బ్లాకుల కార్యక్రమం, ఆరోగ్యం 8 పోషణ, విద్య, వ్యవసాయం - అనుబంధ రంగాలు, ప్రాథమిక మౌలిక వసతులు, సామాజిక అభివృద్ధిలోని 40 సూచికలు, వాటి వెయిటేజీ తదితరాలను కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అన్ని శాఖల సమష్టి కృషితో ముఖ్యంగా వైద్యారోగ్యం, మహిళా, శిశు సంక్షేమం, డీఆర్‌డీఏ అధికారుల కృషి కారణంగా ఈ విజయం సాధించామన్నారు.

సత్కారం పొందిన అధికారులు

సీపీవో వై శ్రీలత, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం సుహాసిని, ఐసీడీఎస్ పీడీ షేక్ రుక్సానా, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావుతో పాటు పెనుగంచిప్రోలు, ఇబ్రహీంపట్నం ఎంపీడీవోలు, ఏబీపీ కోఆర్డినేటర్లు జీ మోహన్ సందీప్ (పెనుగంచిప్రోలు), పీ శ్రీనివాస్ (ఇబ్రహీంపట్నం), వివిధ మండలా అధికారులు, వైద్యారోగ్యం, వ్యవసాయం, సామాజిక అభివృద్ధి ఫ్రంట్ లైన్ వర్కర్లు సత్కారం అందుకున్నారు. విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, నందిగామ ఆర్డీవో కే బాలకృష్ణ పాల్గొన్నారు.



మంత్రి చేతులమీదుగా అవార్డు తీసుకుంటున్న డీఎంహెచ్‌వో సుహాసిని

దసరా, దీపావళికి ప్రత్యేక రైళ్లు పొడిగింపు



రైల్వేస్టేషన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దసరా, దీపావళి, చత్ పండుగల సందర్భంగా అదనపు ప్రయాణికుల రద్దీని నియంత్రించేందుకు పలు ప్రాంతాల నుంచి నడిచే ప్రత్యేక రైళ్లను ఇంకొంతకాలం కొనసాగిస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 07191 కాచిగూడ - మధురై సోమవారాల్లో బయలుదేరుతుంది. 07192 మధురై కాచిగూడ బుధవారాల్లో నడుస్తుంది. 07193 హైదరాబాద్ - కొల్లం శనివారాల్లో నడుస్తుంది. 07194 కొల్లం - హైదరాబాద్ సోమవారాల్లో నడుస్తుంది. 07230 హైదరాబాద్ - కన్యాకుమారి బుధవారాల్లో నడుస్తుంది. 07229 కన్యాకుమారి - హైదరాబాద్ శుక్రవారాలలో నడుస్తుంది. 07637 తిరుపతి - సాయినగర్ షిరిడీ ఆదివారాల్లో నడుస్తుంది. 07219 నరసాపూర్ - తిరువణ్ణామలై బుధవారాల్లో నడుస్తుంది. 07220 తిరువణ్ణామలై - నరసాపూర్ గురువారాల్లో నడుస్తుంది. 06055 పొడనూర్ - బరోని శనివారాల్లో నడుస్తుంది. 06056 బరోని - పొడనూర్ మంగళవారాల్లో నడుస్తుంది. 06063 కోయంబత్తూర్ - ధన్‌బాద్ శుక్రవారాల్లో నడుస్తుంది. 06064 ధన్‌బాద్ - కోయంబత్తూరు సోమవారాల్లో నడుస్తుంది. 06077 చెన్నై సెంట్రల్ సంత్రాగచ్చి శనివారాల్లో నడుస్తుంది. 06078 సత్రాగచ్చి - చెన్నై సెంట్రల్ సోమవారాల్లో నడుస్తుంది. 07027 చర్లపల్లి - బ్రహ్మపూర్ శుక్రవారాల్లో నడుస్తుంది. 07028 బ్రహ్మపూర్ - చర్లపల్లి శనివారాల్లో నడుస్తుంది. 07225 చర్లపల్లి - షాలిమార్ (కోల్‌కతా) సోమవారాల్లో నడుస్తుంది. 07226 షాలిమార్ (కోల్‌కత్తా) - చర్లపల్లి మంగళవారాల్లో నడుస్తుంది. కాగా, 07225, 07226 చర్లపల్లి, భద్రక్, బాలేశ్వర్, ఖర్గపూర్, సత్రాగచ్చి, షాలిమార్ స్టేషన్‌లకు సంబంధించి సమయాలను గమనించాలని విజయవాడ పీఆర్‌వో నుస్రత్ ఎం మండ్రూపకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

02439 పూరీ - పాట్నా సెప్టెంబరు 13 నుంచి 29 వరకు, 08440 పాట్నా - పూరీ ఆదివారాల్లో నడుస్తుంది. 02811 భువనేశ్వర్ - యశ్వంత్‌పూర్ శనివారాల్లో నడుస్తుంది. 02812 యశ్వంత్‌పూర్ - భువనేశ్వర్ సోమవారాల్లో నడుస్తుంది. 08581 విశాఖపట్నం - ఎస్ఎంవీటీ బెంగళూరు ఆదివారాల్లో నడుస్తుంది. 08582 ఎస్ఎంవీటీ బెంగళూరు - విశాఖపట్నం సోమవారాల్లో నడుస్తుంది. 08547 విశాఖపట్నం - తిరుపతి బుధవారాల్లో నడుస్తుంది. 08548 తిరుపతి - విశాఖపట్నం గురువారాల్లో నడుస్తుంది. 08579 విశాఖపట్నం - చర్లపల్లి శుక్రవారాల్లో నడుస్తుంది. 08580 చర్లపల్లి - విశాఖపట్నం శనివారాల్లో నడుస్తుంది.



అభయాంజనేయ స్వామి దేవస్థానంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

అభయాంజనేయ స్వామి సన్నిధిలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మంగళవారం స్థానిక అభయాంజనేయ దేవస్థానంలో స్వామిని దర్శనం చేసుకున్నారు. ఆయన రాజమండ్రి నుంచి విజయవాడ వెళ్తూ మార్గమధ్యంలో హనుమాన్‌జంక్షన్‌లోని అభయాంజనేయ స్వామి దేవస్థానాన్ని సందర్శించారు. ఈవో తారకేశ్వరరావు ఆలయ మర్యాదలతో మాధవ్‌కు స్వాగతం పలికారు. పూజల అనంతరం స్వామి వారి శేషవస్త్రంతో మాధవ్‌ను సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ దయాకర రెడ్డి, ఎస్‌సీ మోర్చా నేతలు సురేష్ ఉన్నారు. కూటమి నేతలు తోట మురళీధర్, నలగామరాజు, వడ్డి వాసవి, గరికపాటి నాగేశ్వరరావు తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

వేతన సమస్యలపై హోంగార్డుల సంఘం వినతి

హోంగార్డులు ఎదుర్కొంటున్న వేతన సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌ను రాష్ట్ర హోంగార్డుల సంక్షేమ సంఘం కోరింది. ఈ మేరకు మాధవ్‌కు ఆ సంఘం జంక్షన్ ప్రతినిధి కరప దుర్గాప్రసాద్ వినతి పత్రం అందజేసి సమస్యలను వివరించారు. హోంగార్డులకు సుప్రీం కోర్టు ఇచ్చిన మార్గదర్శకాలు ప్రకారం గౌరవ వేతనాలు ఇవ్వాలని, కానిస్టేబుల్ నియామకాల్లో రిజర్వేషన్ సౌకర్యం మెరుగు పరచాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని హోంగార్డులను కానిస్టేబుల్స్‌గా ప్రమోషన్ ఇవ్వాలని కోరుతు వినతి పత్రం ఇచ్చారు.

కరివేపాకు తేలేదని కారుకూతలు

● వాచ్‌మెన్‌ను ఫోన్‌లో బూతులు తిట్టిన లైన్ ఇన్‌స్పెక్టర్ ● సోషల్ మీడియాలో వైరల్

ఉయ్యూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కరివేపాకు తేలేదని కిందిస్థాయి ఉద్యోగిపై ఏపీసీపీడీసీఎల్ పెద ఓగిరాల లైన్ ఇన్‌స్పెక్టర్ అసభ్యకర తిట్లతో చంపుతానని బెదిరించిన వైనం మంగళవారం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. పెద ఓగిరాల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న నాగరాజుకు అక్కడ లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న సత్యనారాయణ ఫోన్‌చేసి కరివేపాకు ఎందుకు తేలేదని అరిచాడు. ఏజీఎల్ బ్రేక్‌డౌనై ట్రిప్పు అవుతుందని లైన్‌మెన్ చెబితే వె ళ్లానని చెప్పగా నాగరాజు మండిపడుతూ నేను చెప్పిన పనిచేయకుం డా లైన్‌మెన్ చెబితే వెళతావా అంటూ చిర్రెత్తిపోయాడు. ఉద్యోగం నుంచి పీకిచ్చేస్తానని బెదిరిస్తూ బండబూతులు తిట్టి హెచ్చరించడం పై సోషల్ మీడియాలో తీవ్ర వ్యతిరేకత వస్తోంది. సదరు లైన్ ఇన్స్‌పెక్టర్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

డీ కృష్ణనాయక్, ఉయ్యూరు డివిజన్ ఈఈ

పెద ఓగిరాల సబ్‌స్టేషన్ వాచ్‌మెన్‌ను లైన్ ఇన్‌స్పెక్టర్ బూతులు తిట్టిన విషయం తెలిసింది. దీనిపై విచారించి చర్యలు తీసుకుంటాం.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, చిత్రంలో ఎంపీ శివనాథ్, కలెక్టర్ లక్ష్మీశ, ఈవో శీనానాయక్

మైసూర్‌ను మరిపించేలా దసరా ఉత్సవ్

● రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

కలెక్టరేట్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర రాజధాని అమరావతి పేరు ప్రతిష్టలు పెరిగేలా సమష్టి కృషితో విజయవాడ ఉత్సవ్‌ను నిర్వహిద్దామని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఏవీఎస్ రెడ్డి వీసీ హాల్‌లో విజయవాడ ఉత్సవ్‌పై జరిగిన సమావేశంలో మంత్రితోపాటు ఎంపీ కేశినేని శివనాథ్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కే పట్టాభిరామ్, కలెక్టర్ లక్ష్మీశ, సీపీ ఎస్‌వీ రాజశేఖరబాబు, జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియా, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విజయవాడ నగర ఆధ్యాత్మిక, సాంస్కృతిక, పర్యాటక సౌరభాలను రాష్ట్రం, జాతీయ స్థాయిలో వెదజల్లేలా విజయవాడ ఉత్సవ్‌ను నిర్వహిద్దామన్నారు. దసరా ఉత్సవాలకు రాష్ట్రంతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు రానున్నారని, ఇదే సమయంలో విజయవాడ ఉత్సవ్‌ను నిర్వహించనున్న నేపథ్యంలో ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ మైసూరు ఉత్సవాల తరహాలో విజయవాడలో విజయవాడ ఉత్సవ్ జరగనుందని, దసరా ఉత్సవాలతో పాటు భక్తులకు ఈ ఆధ్యాత్మిక పర్యటన మధురానుభూతులు మిగిల్చేలా, పర్యాటకానికి కొత్త ఊపు తెచ్చేలా ఉత్సవ్ ఉంటుందన్నారు. ఉత్సవాల విజయవంతానికి సమన్వయ కమిటీని ఏర్పాటు చేయనున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. తుమ్మలపల్లి కళాక్షేత్రం, పున్నమిఘాట్, గొల్లపూడి ఎగ్జిబిషన్ వేదిక తదితరాల్లో పటిష్ట ఏర్పాట్లు చేయాల్సి ఉంటుందన్నారు. హోల్డింగ్ ప్రాంతాల ఏర్పాటు, పటిష్ట భద్రత, నగర సుందరీకరణ, తాగునీరు, పారిశుధ్యం, సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిఘా, ఫుడ్ కోర్టుల ఏర్పాటు, హెలీ టూరిజం, వాటర్ స్పోర్ట్స్, సంప్రదాయ కళా ప్రదర్శనలు తదితరాలపై సమావేశంలో చర్చించి ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర బిల్డింగ్స్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, దుర్గగుడి ఈవో శీనానాయక్, డీఆర్‌వో ఎం లక్ష్మీ నరసింహం, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య పాల్గొన్నారు.

పనిష్మెంట్లు లేని పదోన్నతులు ఇవ్వాలి

● గతంలో కేసులు కొట్టివేయాలని విజ్ఞప్తి ● ఏపీపీటీడీ ఎన్ఎంయూఏ అధ్యక్షుడు రమణారెడ్డి

విజయవాడ, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): పనిష్మెంట్లను పరిగణలోకి తీసుకోకుండా ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వాలని ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ (ఎన్ఎంయూఏ) అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి అన్నారు. నగరంలో ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావును మంగళవారం యూనియన్ నేతలతో కలిసి సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పనిష్మెంట్లు పరిగణలోకి తీసుకోకుండా పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వానికి కోరడంతో సంబంధించిన జీవో ఆలస్యమవడంతో ప్రమోషన్లు ఆగిపోయాయన్నారు. పనిష్మెంట్లు లేని పదోన్నతల కోసం జీవో వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేయగా, దీనిపై ఎండీ సానుకూలంగా స్పందించారన్నారు. కోర్టు కేసులు క్లియర్‌చేసి త్వరగా జూనియర్ స్కేల్ అధికారులకు పదోన్నతులు ఇవ్వాలని కోరారు. స్త్రీ శక్తి పథకంతో కండక్టర్లు, డ్రైవర్లు పడుతున్న ఇబ్బందులను అధికారులకు తెలిపామన్నారు. దాదాపు 100 యూనిట్లలో డిప్యూటీ సూపరింటెండెంట్ల ప్రమేయం లేకుండా డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ చేసేలా గతంలో ఎన్ఎంయూఏ ఇచ్చిన మెమోరాండం మేరకు ఆర్టీసీలో ఉన్న విధంగా ప్రమోషన్ల ద్వారా ఖాళీలను భర్తీచేయాలని రమణారెడ్డి కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజేష్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి పీఆర్‌జే రెడ్డి ఉన్నారు.

పోలీసుల అదుపులో 'మగబిడ్డ దత్తత' నిందితులు

వన్‌టౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మగబిడ్డని దత్తత ఇస్తానని మాయమాటలతో మోసం చేసిన ముగ్గురిని భవానీపురం పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. పోలీసుల విచారణలో నిందితులు బాధితుడి వద్ద డబ్బులు తీసుకున్న మాట వాస్తవమేనని, డబ్బులు తిరిగిచ్చేస్తామని ఒప్పుకున్నట్టు తెలిసింది. భవానీపురానికి చెందిన లక్ష్మణ్ రెడ్డి మౌలాలి, బబ్బూరి శ్రీనివాస్ ముఠాగా ఏర్పడి సంతానం లేనివారికి పిల్లల్ని దత్తత ఇస్తామంటూ వారి నుంచి పెద్దమొత్తంలో డబ్బులు తీసుకుని మోసం చేస్తుంటారు. ఈ క్రమంలోనే తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా నకరికల్‌కు చెందిన దాసరి శివను కూడా మోసం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి లక్ష్మణరెడ్డి,

● డబ్బులిస్తామంటూ రాజీకి యత్నం

మౌలాలి, బబ్బూరి శ్రీనులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. పోలీసులు డాక్టర్ షేక్ ఫాతిమాతో ఫోన్‌లో మాట్లాడినట్టు తెలిసింది. తనకెలాంటి సంబంధం లేదని ఆమె పోలీసులకు వివరించినట్టు సమాచారం. బాధితుడి వద్ద డబ్బులు తీసుకున్నట్టు ఆ ముగ్గురు పోలీసులు ముందు ఒప్పుకున్నారు. డబ్బులు తిరిగిచ్చేస్తామంటూ ఆ ముగ్గురు పోలీసులను వేడుకుంటున్నారు. పోలీసులు మాత్రం ఆ దిశగా కాకుండా కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచటానికి చర్యలు తీసుకుంటున్నారు. లక్ష్మణ్ రెడ్డి, మౌలాలి, బబ్బూరి శ్రీనులు గతంలో చేసిన వ్యవహారాలపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.



వానల్లో మొక్కల సంరక్షణ..

మనం సాధారణంగా బాల్కనీలో, ఇంటి పరిసరాల్లో మొక్కల కుండీలను ఏర్పాటు చేసుకుంటూ ఉంటాం. వర్షాకాలంలో ఈ మొక్కలు బాగా పెరుగుతాయి. కానీ ఒక్కోసారి ఆకులు పసుపు రంగులోకి మారడం, కాండానికి ఫంగస్ రావడం, వేళ్లు కుళ్లిపోయి మొక్కలు వడలిపోవడం లాంటివి గమనిస్తూ ఉంటాం. అలాకాకుండా మొక్కలు ఆరోగ్యంగా పెరగాలంటే వర్షాకాలంలో ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో తెలుసుకుందాం...

- నీళ్లు ఎక్కువగా అవసరంలేని మొక్కల కుండీలకు వర్షం తగలకుండా జాగ్రలు తీసుకోవాలి. వీటి మీద గ్రీన్ నెట్ అమర్చడం మంచిది.
- వర్షాకాలంలో కుండీలను ముప్పావు వంతుకు పైగా మట్టితో నింపాలి. దీనివల్ల వర్షపు నీరు ఎక్కువగా కుండీల్లో నిలవకుండా ఉంటుంది.
- కుండీల్లో మట్టి మరీ మెత్తగా ఉంటే అది ఎక్కువగా నీటిని పీల్చుకుంటుంది. దీనివల్ల వర్షాకాలంలో మొక్కలు త్వరగా పాడవుతాయి. అలాంటప్పుడు ఈ మెత్తని మట్టిలో కొద్దిగా ఇసుకను కలిపితే అదనపు నీరు త్వరగా బయటికి వెళుతుంది.
- కుండీ అడుగు భాగంలో ఉండే రంధ్రాలను గమనించాలి. కుండీలో చేరిన అదనపు నీరు బయటికి వస్తుందో లేదో పరిశీలించాలి. రంధ్రాల వద్ద వేళ్లు లేదా మట్టి చేరి నీళ్లు బయటికి పోకుండా అడ్డుపడుతుంటాయి. వీటిని ఎప్పటికప్పుడు సరిచేస్తూ ఉండాలి.
- వర్షాకాలంలో కుండీల కింద పళ్లాలు ఉంచకూడదు. అలా ఉంచితే మొక్కల వేళ్లు కుళ్లిపోయే అవకాశం ఉంటుంది. చిన్న కాళ్లు ఉన్న కుండీలను ఎంచుకోవడం మంచిది. అలా లేని పక్షంలో కుండీ కింద నాలుగు వైపులా చదునుగా ఉన్న రాళ్లు అమర్చాలి. అప్పుడు కుండీలో చేరే వర్షపు నీరు సులువుగా బయటికి వెళుతుంది.
- వర్షాకాలంలో గాలులు బలంగా వీస్తుంటాయి. వీటి ధాటికి కుండీల్లోని మొక్కలు వంగిపోవచ్చు. ఒక్కోసారి వేళ్లతో సహా ఒరిగిపోవచ్చు. అలాకాకుండా మొక్కలన్నింటికీ ఆధారంగా కర్రలను కుండీల్లో నిలబెట్టాలి.
- కాండానికి కింది భాగంలో ఉన్న ఆకులకు తేమ ఎక్కువగా తగులుతూ ఉంటుంది. దీనివల్ల మొక్కకు ఫంగస్ చేరవచ్చు. కాబట్టి కుండీలో మట్టికి దగ్గరగా ఉండే ఆకులను కత్తిరించడం మంచిది.



ప్రేరణ

ప్రపంచవ్యాప్తంగా సమాజ సేవ, స్నేహసంబంధాల కోసం కృషి చేస్తోన్న అంతర్జాతీయ మహిళా సంస్థ... 'ఇన్నర్ వీల్ క్లబ్' తాజాగా హైదరాబాద్‌లో మొట్టమొదటి ఇన్నర్ వీల్ ఛాంపియన్స్ క్రికెట్ లీగ్‌ను ఏర్పాటు చేసింది. ఈ మ్యాచ్‌లో 45 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు మహిళలు పాల్గొని, జీవితంలోని ఏ దశలోనైనా చురుగ్గా ఉండడం సాధ్యమేనని నిరూపించారు. ఆ విశేషాలు నవ్య పాఠకుల కోసం...

యాభైల్లో యువతుల్లా..



జయశ్రీ సాగర్



ఇన్నర్ వీల్... ప్రపంచంలోని అతి పెద్ద అంతర్జాతీయ స్వచ్ఛంద మహిళా సంస్థ. సమాజ సేవ, స్నేహ సంబంధాలను పెంపొందించడం లక్ష్యంగా 1924లో ఈ సంస్థను స్థాపించారు. రోటరీ ఇంటర్నేషనల్ సహకారంతో పని చేస్తున్న ఇన్నర్ వీల్... క్లబ్బులు, అసోసియేషన్ల ద్వారా నిధులను సమీకరిస్తూ, వెనుకబడిన వర్గాలకు, అనాథలకూ, మహిళలకూ సహాయపడుతూ ఉంటుంది. భారతదేశంలోని 27 ఇన్నర్ వీల్ జిల్లాలను నాలుగు జోన్లుగా విభజించుకుని, వాటిలోని సభ్యులైన 44 మంది మహిళలు ఒక జట్టుగా ఏర్పడి హైదరాబాద్ ఇన్నర్ వీల్ ఛాంపియన్స్ క్రికెట్ లీగ్‌లో పాల్గొన్నారు. క్రికెట్ మ్యాచ్‌లో పాల్గొన్నారు కాబట్టి వీళ్లందరూ క్రికెట్ ప్లేయర్స్ అనుకుంటే పొరపాటు. స్నేహభావాన్ని చాటుకోవడంతో పాటు, నడివయసులో సైతం ఆరితేరిన క్రికెటర్ల మాదిరిగా చురుగ్గా ఉండగలుగుతామని నిరూపించడం కోసమే మహిళలు ఈ లీగ్‌లో పాల్గొనడం చెప్పుకోదగిన విశేషం.

యాభైల్లో కొత్త జీవితం మొదలవుతుంది

సమాజానికి సేవ చేయాలని కోరుకునే మహిళలు మనలో ఎంతోమంది ఉంటారు. అవసరంలో ఉన్న వారికి తమకు తోచిన సహాయాన్ని అందించాలని పరితపించే మహిళలూ ఉంటారు. ఇలాంటి మహిలందరికీ ఇన్నర్ వీల్ ఒకే వేదికగా ఉపయోగపడుతోంది. ఈ ఏడాది మేం గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ వ్యాక్సినేషన్ డ్రైవ్‌ను చేపట్టాం. ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేశాం. ప్రజలకు ఈ సేవలన్నీ ఉచితమే! ఇన్నర్ వీల్ సభ్యుల్లో ఎక్కువ మంది పెళ్లైన మహిళలే! వీళ్లలో 45 నుంచి 60 ఏళ్ల వయసు మహిళలు ఈ క్రికెట్ లీగ్‌లో పాల్గొన్నారు. ఒక సంస్థలో భాగంగా సేవలు అందించాలనుకునే మహిళలు కేవలం సమాజానికే సేవలందిస్తూ అక్కడికే పరిమితమైపోకూడదు. నడివయసులో ఉన్నప్పటికీ శారీరకంగా దృఢంగా ఉన్నామని సాటి మహిళలకు నిరూపించగలగాలి. ఈ లక్ష్యంతో తాజా క్రికెట్ లీగ్‌ను ఏర్పాటు చేసి, దేశవ్యాప్తంగా దాదాపు 200 మంది మహిళలు హైదరాబాద్‌లో జరిగిన క్రికెట్ లీగ్‌లో పాల్గొన్నారు. కొచ్చి, పంజాబ్, కోల్‌కతా, ముంబయి.. ఇలా దేశంలోని వేర్వేరు ప్రాంతాల నుంచి సొంత ఖర్చులతో వాళ్లందరూ హైదరాబాద్‌కు చేరుకున్నారు. నేను బెంగుళూరు నుంచి ఈ లీగ్‌లో పాల్గొన్నాను. నాకు 50 ఏళ్లు. కిర్లోస్కర్ హెచ్‌ఆర్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్నాను. అలాగే ఇన్నర్ వీల్ డిస్ట్రిక్ట్ 316కు డిస్ట్రిక్ట్ ఛైర్మన్‌గా కూడా పని చేస్తున్నాను. దక్షిణ జోన్ కొఆర్డినేటర్‌ను నేనే కాబట్టి ఈ లీగ్‌లో పాల్గొనే ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక, కేరళ, తమిళనాడుల నుంచి మహిళలను నేనే ఎంపిక చేశాను. వాళ్లలో టీచర్లున్నారు, మహిళా వ్యాపారవేత్తలున్నారు. వీళ్లలో కొందరికి క్రికెట్ పూర్తిగా కొత్త. అయినప్పటికీ ఈ లీగ్‌లో పాల్గొనడం ద్వారా అమ్మమ్మల వయసులో సైతం చురుగ్గా ఉండొచ్చని నిరూపించగలిగారు.

- జయశ్రీ సాగర్,
ఇన్నర్ వీల్ డిస్ట్రిక్ట్ ఛైర్మన్, బెంగుళూరు.

అపరిమిత సేవలే మా లక్ష్యం



ఈ క్రికెట్ లీగ్‌లో 27 జిల్లాలకు చెందిన ఇన్నర్ వీల్ మహిళలు పాల్గొన్నారు. వీళ్లందరూ స్నేహబంధాన్నీ, క్రీడాస్ఫూర్తినీ చాటుకోవడమే ప్రధానంగా ఈ లీగ్‌లో పాల్గొన్నారు. ఇక్కడ గెలుపోటములు ప్రధానం కాదు. ఇన్నర్ వీల్‌లోని మహిళా సభ్యులందరినీ చేరువ చేయడం, సాటి మహిళలకు ప్రేరణగా మారడమే ఈ క్రికెట్ లీగ్ లక్ష్యం. నిజానికి ఇన్నర్ వీల్‌లోని మహిళలందరూ సేవ ద్వారా పరస్పరం అనుబంధాన్ని పెంపొందించుకున్నవారే! మా ఉమ్మడి లక్ష్యం ఒకటే కాబట్టి అందరి మధ్యా దృఢమైన అనుబంధం ఉంటుంది. ఇన్నర్ వీల్ స్వచ్ఛంద సంస్థలాగే పని చేస్తుంది. కానీ ఇది స్వచ్ఛంద సంస్థ కాదు. 100కు పైగా దేశాలు ఇన్నర్‌వీల్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. భారతదేశంలోనే 17 వేల ఇన్నర్ వీల్ క్లబ్బులున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 1.2 లక్షల మంది మహిళా సభ్యులు ప్రపంచవ్యాప్తంగా సమాజసేవలో పాల్గొంటున్నారు. ఈ సంస్థ తరఫున అనాథ శరణాలయాలు, వృద్ధాశ్రమాలు, పాఠశాలలు, మహిళా సాధికారతల కోసం నిధులను సేకరిస్తూ ఉచిత సహాయసహకారాలు అందిస్తూ ఉంటాం. పాఠశాలలకు మౌలిక సదుపాయాల కల్పనలో సహాయపడడంతో పాటు, ఆరోగ్య శిబిరాలను కూడా ఏర్పాటు చేస్తూ ఉంటాం. పాఠశాలల్లో, కాలేజీల్లో చెట్లు నాటే కార్యక్రమాలు చేపడుతూ ఉంటాం. ప్రతి ఏటా ఒక లక్ష విత్తన బంతులను పంపిణీ చేస్తూ, పర్యావరణానికి సహాయపడుతున్నాం. నిమ్స్ ఆస్పత్రిలో కీమో వార్డులో చికిత్స పొందే పిల్లలకు లైబ్రరీని ఏర్పాటు చేశాం. ఇటీవలే గాంధీ ఆస్పత్రి మెటర్నటీ వార్డుకు స్ట్రెచర్స్, వీల్ ఛైర్స్, ఇంక్యుబేటర్స్‌ను అందించాం. ఇలా మేం అందించే సేవలకు ఒక పరిమితంటూ ఉండదు. ఎవరికి ఏ సహాయం అవసరమో గుర్తించి, ఆ అవసరాలను తీర్చడమే లక్ష్యంగా మేం ముందుకు వెళ్తూ ఉంటాం!

- స్వర్ణలత, డిస్ట్రిక్ట్ ఛైర్మన్, హైదరాబాద్.

వయసు... పరిమితి కాదు ప్రేరణ



ఇన్నర్ వీల్ అంతర్జాతీయ ప్రెసిడెంట్, ఆస్ట్రేలియాకు చెందిన **కే మోర్లాండ్**, హైదరాబాద్‌లో జరిగిన ఛాంపియన్స్ క్రికెట్ లీగ్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... "భారత్ అద్భుతమైన దేశం. భారత్, ఆస్ట్రేలియా రెండూ క్రికెట్ ఆడతాయి. ఈ ఆటను అమితంగా ప్రేమిస్తాయి. అభిరుచి, ప్రతిభలకు లింగబేధం లేదని నిరూపిస్తూ, ఈ మహిళా క్రికెట్ జట్టు, ఆట నియమాలను తిరగరాస్తోంది. స్థానిక మైదానాల నుంచి ప్రపంచ స్టేడియంల వరకూ, మహిళా క్రికెటర్లు కొత్త తరాలకు స్ఫూర్తిగా మారుతూనే ఉన్నారు. వయసు ఒక పరిమితి కాదు, ఒక ప్రేరణ. జీవనశైలి వ్యాధులు పెరుగుతున్న ఈ యుగంలో, జీవితంలోని ఏ దశలోనైనా చురుగ్గా, సాహసోపేతంగా ఉండడం సాధ్యమేనని ఈ మహిళలు నిరూపించారు" అని ఆమె ప్రసంగించారు.

• గోగుమళ్ల కవిత

ఫ్యాషన్



వేడుకల్లో వెలిగిపోయేలా బంగారు, వెండి జరీ ధగధగలు, కలనేతల కళాకాంతులు సొంతం చేసుకోవాలనుకునే వారి కోసం పలు రకాల పట్టు చీరలు ఇప్పుడు మార్కెట్లో దొరుకుతున్నాయి. వాటిలో కొన్నిటి మీద ఓ లుక్కేద్దామా?

కళ్లు చెదిరే కాంతుల్లా...

- చామంతులు, కనకాంబరాలు కలిపి కట్టిన పూమాలలా కనిపించాలంటే పవిట చెంగు, కుచ్చిళ్లు ఒక రంగు లో, చీర మొత్తం మరో రంగులో ఉండాలి. అలాంటి కాంట్రాస్ట్ రంగుల్లోనే చీర బారీగా కనిపించి కనువిందు చేస్తుంది.
- తెల్ల పట్టుచీర హుందాతనమే వేరు. ప్రింటెడ్ డిజైన్ మోడర్న్ లుక్‌ని తెచ్చిపెడితే, కాంట్రాస్ట్ జరీ బార్డరు చీర మొత్తానికే వన్నె తెస్తుంది.
- వెండి వెలుగులు విరజిమ్మాలంటే వెండి జరీలో ధగధగలాడాలి. నలుగురిలో ప్రత్యేకంగా కనిపించాలనుకుంటే వెండి జరీ చీరను ఎంచుకుంటే సరి!
- కుచ్చిళ్ల దగ్గర జరీ బార్డరు మోకాళ్ల వరకూ ఉండడం తాజా ఫ్యాషన్! ఈ స్టయిల్ చీరకు వినూత్న ఆకర్షణను తెచ్చిపెడుతుంది. జరీ మీద కనిపించీ, కనిపించకుండా ఉండే సెల్ఫ్ డిజైన్ చీరకే వన్నె తెస్తుంది.



"పౌరుల్లో ప్రతి ఒక్కరికీ హక్కులు ఉంటాయి. ఖైదీలు దీనికి మినహాయింపు కాదు. కానీ వారి సమస్యలను ఎవరూ పట్టించుకోరు. వారి తరపున మాట్లాడడానికి ఎవరూ ముందుకు రారు. ఈ పరిస్థితి మారాలి" అంటున్నారు **అపూర్వ వివేక్**. రాంచీకి చెందిన ఈ న్యాయవాది... మహిళా ఖైదీలను విద్యావంతులను చేయడానికి, న్యాయపరమైన సాయం అందించడానికి పాటుపడుతున్నారు. వారి హక్కుల పరిరక్షణ కోసం తన గళాన్ని గట్టిగా వినిపిస్తున్నారు.





మహిళా ఖైదీలకు అండ... హక్కుల సాధనే అజెండా!

"తెలిసినవారు ఎవరైనా ఎదురుపడినప్పుడు... ఎక్కడికి వెళ్తున్నారని అడిగేవారు. "జైలుకు" అని చెబితే ఆశ్చర్యంగా చూసేవారు. ఇప్పుడు అందరికీ నేనేమిటో, నేను చేస్తున్న పని ఏమిటో తెలుసు. రోజూ ఎక్కువ సమయం నేను గడిపేది జైల్లోనే మరి" అని నవ్వుతూ చెబుతారు అపూర్వ వివేక్. మహిళా ఖైదీల సంక్షేమం కోసం 'హాషియా సోషియో-లీగల్ సెంటర్ ఫర్ విమెన్' (హెచ్ఎస్ఎస్‌సిడబ్ల్యూ) అనే సంస్థను ఆమె స్థాపించారు.

పాఠాలతో మొదలుపెట్టి...

2013లో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ పరీక్షలు రాసి ఫలితాల కోసం ఎదురుచూస్తున్న అపూర్వ.. ఖాళీ సమయాల్లో పిల్లలకు పాఠాలు చెప్పేవారు. అప్పుడే ఒక స్వచ్ఛంద సంస్థతో కలిసి పని చేయడం ప్రారంభించారు. జైలులో మహిళా ఖైదీల గురించి అధ్యయనం చేయడానికి ఇతర వాలంటీర్లతో కలిసి రాంచీలోని బిర్సాముండా సెంట్రల్ జైలుకు వెళ్లారు. అక్కడ ఖైదీల జీవన పరిస్థితులను చూసి చలించిపోయారు. ముఖ్యంగా మహిళా ఖైదీల దుస్థితి ఆమెను తీవ్రంగా ఆలోచింపజేసింది. "చాలామందికి చదువు లేకపోవడం వల్ల వారికి తమ హక్కులేమిటో తెలియదు. న్యాయవాదులు తెచ్చిన కాగితాల మీద గుడ్డిగా సంతకాలు పెట్టడం తప్పితే... వాటిలో ఏం రాసి ఉందో, అది తమకు ఉపయోగమో కాదో అవగాహన లేదు. అందుకే వారికి ప్రాథమిక విద్య నేర్పాలని నిర్ణయించుకున్నాను" అని గుర్తు చేసుకున్నారు అపూర్వ. మహిళా ఖైదీలతో పాటు వారి పిల్లలకు కూడా పాఠాలు చెప్పడానికి జైలు అధికారుల అనుమతి తీసుకున్నారు. "మొదట్లో నన్ను అందరూ అనుమానంగా చూసేవారు. వారి వ్యక్తిగత విషయాలు తెలుసుకోవడానికి అధికారుల తరపున వచ్చానని భావించేవారు. క్రమంగా నా ఉద్దేశమేమిటో అర్థం చేసుకున్నారు. కనీసమైన చదువు లేనివారికి అక్షరాలు దిద్దించడం, కూడబలుక్కొని చదవగలిగేవారితో వార్తా పత్రికలు చదివించడంతో జైలులో నా తరగతులు ప్రారంభమయ్యాయి. క్రమంగా వారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి కూడా తెలిశాయి" అని వివరించారు అపూర్వ.

పలు కారాగారాల్లో...

జైలులో గడుపుతున్నవారిలో ఎక్కువమంది విచారణ ఖైదీలు. న్యాయవాదులను నియమించుకొనే స్థోమత లేనివారు. కొందరి తరపున ప్రభుత్వమే న్యాయవాదులను ఏర్పాటు చేసినా... కేసులు ఏళ్ళ తరబడి సాగుతూనే ఉంటాయి. మహిళా ఖైదీల్లో గర్భిణులు కూడా ఉంటారు. వారికి సరైన వైద్య సహాయం కానీ, పోషకాహారం కానీ ఉండదు. వారికి జన్మించిన పిల్లలకు సరైన సంరక్షణ అందదు. ఈ సమస్యలకు తన వంతుగా ఏదైనా పరిష్కారం చూపాలని అపూర్వ అనుకున్నారు. 'లా' చదివి, న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. సోషల్ వర్క్‌లో మాస్టర్స్ డిగ్రీ చేశారు. 2022లో 'హెచ్ఎస్ఎస్‌సిడబ్ల్యూ' సంస్థను ఏర్పాటు చేసి... మహిళా ఖైదీల సంక్షేమం కోసం కార్యక్రమాలను పూర్తిస్థాయిలో ప్రారంభించారు. అప్పటివరకూ నేను ఒంటరిగా చేస్తున్న కార్యక్రమాలను వ్యవస్థాగతం చేశాను. స్వచ్ఛంద సేవకులు, ఔత్సాహికుల భాగస్వామ్యంతో రాంచీ సెంట్రల్ జైల్‌లోని మహిళా ఖైదీలకు విద్యతో పాటు నైపుణ్య శిక్షణను మా సంస్థ తరఫున చేపట్టాం. ఆ తరువాత జైళ్ళ శాఖ అధికారుల ప్రోత్సాహంతో జార్ఖండ్ రాష్ట్రంలోని పలు కారాగారాలకు వాటిని విస్తరించాం. వైద్య శిబిరాల ఏర్పాటు, కుంగుబాటు, మానసికమైన ఒత్తిడిని నివారించడం కోసం కౌన్సెలింగ్, మహిళా ఖైదీల కేసుల్లో న్యాయపరమైన సహాయం, జైలు నుంచి విడుదలైనవారికి పునరావాసం, ఉపాధి కల్పన, వారి పిల్లలకు విద్య, వైద్య సౌకర్యాలు, ఆశ్రయం లాంటి పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. దీనికోసం వివిధ ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకుంటున్నాం" అని చెప్పారు అపూర్వ.

చారిటీగా భావించడం లేదు...

ఒకసారి ఒక మహిళా ఖైదీ సమస్య అపూర్వ దృష్టికి వచ్చింది. ఆ ఖైదీ అరెస్ట్ అయినప్పుడు గర్భవతి. ఆమె అబార్షన్ చేయించుకోవాలని అనుకుంది. కానీ దానికి న్యాయపరమైన అనుమతి వచ్చేసరికి ఆరు వారాలకు పైగా సమయం పట్టింది. అప్పటికే సమయం మించిపోయిందని, అబార్షన్ చేయడం కుదరదని వైద్యులు చెప్పారు. ఆమె తీవ్రమైన ఆవేదనకు గురయింది. ఈ సంఘటన నేపథ్యంలో... మహిళా ఖైదీల పునరుత్పత్తి హక్కులపై అపూర్వ చేసిన పోరాటం 'జార్ఖండ్ ప్రిజన్ మాన్యువల్'లో మార్పులకు దారి తీసింది. "ఇలాంటి సంఘటనలు భావోద్వేగపరమైన ఒత్తిడిని ఖైదీలకు తీసుకువస్తాయి. తమ బాధను ఎవరికైనా వినిపించాలనుకుంటారు. ఆ బాధ్యతను మేము తీసుకుంటున్నాం. వారికోసం మేము చేస్తున్న ఏ పనినీ చారిటీగా భావించడం లేదు. ఆ మహిళలకు హక్కులు ఉన్నాయి. ఆ హక్కులపై వారికి అవగాహన కల్పించి, వాటిని వినియోగించుకొనేలా చూస్తున్నాం. ఇప్పటివరకూ వేలమంది మహిళా ఖైదీలకు మా సంస్థ ద్వారా సాయపడ్డాం. భవిష్యత్తులో అన్ని జైళ్ళలో మహిళా ఖైదీల ఇబ్బందులను పరిష్కరించాలనేది మా లక్ష్యం" అని అంటున్నారు అపూర్వ.

పిల్లల జ్ఞాపకశక్తి కోసం...

కొంతమంది పిల్లలు ఎంత బాగా చదివినప్పటికీ మరుసటిరోజే అన్నీ మర్చిపోతుంటారు. అలాకాకుండా పిల్లల జ్ఞాపకశక్తిని పెంచడానికి తల్లిదండ్రులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం...

- మెదడు సమర్థవంతంగా పనిచేయాలంటే శరీరానికి విశ్రాంతి, నిద్ర అత్యవసరం. పిల్లలు రోజుకు కనీసం ఎనిమిది నుంచి పది గంటల వరకు హాయిగా నిద్రపోవాలి. అప్పుడే వారిలో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయి. టీవీ, మొబైల్, ల్యాప్‌టాప్‌ల వాడకంపై పరిమితులు విధించి పిల్లలు సమయానుసారం నిద్రించేలా చూసుకోవాలి.
- కొంతమంది పిల్లలు ఉదయం పూట అల్పాహారం తీసుకోకుండా పాలు తాగకుండా బడికి బయలుదేరుతుంటారు. ఇది అంత మంచి పద్ధతి కాదు. తృణధాన్యాలతో తయారు చేసిన ఆహారపదార్థాలు, తేలికగా జీర్ణమయ్యే వంటకాలు, పండ్లు, డ్రైఫ్రూట్స్ లాంటివాటిని పిల్లలకు అల్పాహారంగా తినిపించాలి. దీనివల్ల మెదడుకు పోషకాలు, శక్తి చేకూరుతాయి. బడిలో ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను పిల్లలు చక్కగా అర్థం చేసుకుని తేలికగా గుర్తుపెట్టుకోగల్గుతారు.
- పిల్లలతో చదరంగం, క్యారమ్స్, మెమరీ కార్డ్ లాంటి ఆటలు ఆడించాలి. పజిల్స్ సాల్వ్ చేయడం, సుడోకు లాంటి పదబంధాలను పూరించడం అలవాటు చేయాలి. వీటివల్ల మెదడుకు తగినంత వ్యాయామం లభిస్తుంది. దీంతో పిల్లలకు ఆలోచన సామర్థ్యం, జ్ఞాపక శక్తి చక్కగా పెరుగుతాయి.



ఫార్మాపై 200% సుంకాలు!

డొనాల్డ్ ట్రంప్ సన్నాహాలు ● టారిఫ్స్ అమల్లోకి వస్తే ఔషధ ధరలు 50% పెరిగే చాన్స్



న్యూఢిల్లీ: ఫార్మా దిగుమతులపై భారీగా సుంకాలు విధించేందుకు అమెరికా సిద్ధమవుతోంది. దిగుమతి చేసుకునే ఔషధాలపై 200 శాతం వరకు సుంకాలు విధించాలని ట్రంప్ అధికార యంత్రాంగం ప్రతిపాదించింది. ఇదే జరిగితే అమెరికా మార్కెట్‌పై ఎక్కువగా ఆధారపడిన భారత ఫార్మా కంపెనీలకు ఆ మార్కెట్ దాదాపుగా మూసుకుపోతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రస్తుతం ట్రంప్ సర్కారు ఔషధ దిగుమతులను సుంకాల నుంచి మినహాయించింది. తాజా ప్రతిపాదన అమలుకు నోచుకుంటే, అది భారత ఫార్మాకు చావు దెబ్బ అవుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే అన్ని రకాల ఔషధ దిగుమతులపై కాకుండా.. ఎంపిక చేసిన కొన్ని ఔషధ దిగుమతులపైనే ఈ సుంకాల పోటు ఉంటుందనే అంచనాలూ వినిపిస్తున్నాయి.

అమలు కష్టమే ?

అయితే ట్రంప్ సర్కారు ప్రతిపాదన అమలు చేయడం అంత తేలిక కాదనే వాదన వినిపిస్తోంది. అమెరికాలోనే ఈ ఔషధాలను ఉత్పత్తి చేయాలంటే అందుకు ఎంత లేదన్నా కనీసం రెండు నుంచి మూడేళ్ల సమయం పడుతుంది. ఉత్పత్తి వ్యయం మన దేశంతో పోలిస్తే కనీసం 30 నుంచి 40 శాతం పెరుగుతుంది. కంపెనీలు ఈ భారాన్ని వినియోగదారులకే బదిలీ చేయాల్సి ఉంటుంది. దాంతో అమెరికాలో ఆరోగ్య బీమా ప్రీమియంలు పెరిగి పోతాయని భావిస్తున్నారు. ఒకవేళ ప్రతిపాదించిన విధంగా దిగుమతి ఔషధాలపై 200 శాతం సుంకాలు విధించినా, అమెరికా రిటైల్ మార్కెట్లో ఔషధాల ధర 40 నుంచి 56 శాతం వరకు పెరుగుతాయని అంచనా. దీంతో అసలు ఈ ప్రతిపాదన అమలు చేసేందుకు ట్రంప్ సర్కారు సాహసిస్తుందా? లేదా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

పెరుగుతున్న నిల్వలు

ఈ ప్రతిపాదన వెలుగులోకి రావడంతో అమెరికాలోని రిటైల్ మెడికల్ చెయిన్స్ పెద్దఎత్తున దిగుమతులు ప్రారంభించాయి. కనీసం ఆరు నెలల నుంచి ఏడాదిన్నర వరకు సరిపోయేలా ఔషధాలను నిల్వ చేసుకుంటున్నాయి. అమెరికాకు ఇటీవల భారత ఔషధ ఎగుమతుల పెరుగుదలకు ఇది కూడా ఒక కారణమని భావిస్తున్నారు.

నేటి నుంచి జీఎస్‌టీ మండలి భేటీ

రెండు శ్లాబులపై నిర్ణయం .. లగ్జరీ ఈవీలపై బాదుడు!

గురువారం తుది నిర్ణయం

న్యూఢిల్లీ: జీఎస్‌టీ మలి తరం సంస్కరణలకు రంగం సిద్ధమైంది. బుధవారం నుంచి రెండు రోజుల పాటు ఢిల్లీలో జరిగే జీఎస్‌టీ మండలి సమావేశం దీనిపై నిర్ణయం తీసుకోనుంది. రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో కూడిన ఈ సమావేశానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షత వహిస్తారు. ఈ సంస్కరణలు ఆర్థిక వ్యవస్థను మరింత విస్తృతం చేసి పారదర్శకతను పెంచేలా ఉంటాయని సీతారామన్ ప్రకటించారు. దీనివల్ల చిన్న వ్యాపార సంస్థలపై నిబంధనల అమలు భారం తగ్గడంతో పాటు అనేక వస్తువుల ధరలు తగ్గుతాయన్నారు. ప్రతిపాదిత సంస్కరణల్లో భాగంగా ప్రస్తుతం నాలుగు శ్లాబులుగా ఉన్న జీఎస్‌టీ రేట్లను 5,18 శ్లాబులుగా కుదించాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. దీంతో నిత్యావసరాలతో పాటు గృహోపకరణ ఉత్పత్తుల ధరలు గణనీయంగా తగ్గే అవకాశం ఉంది.

విలాస కార్లపై బాదుడే: ఎంట్రీ లెవల్ కార్లు, ద్విచక్ర మోటారు వాహనాలపై ప్రస్తుతం 28 శాతం జీఎస్‌టీ అమలవుతోంది. విలాస కార్లపై మాత్రం 28 శాతం జీఎస్‌టీతో పాటు మరో 28 శాతం ప్రత్యేక సెస్సు అమలవుతోంది. ప్రతిపాదిత సంస్కరణల్లో భాగంగా ఎంట్రీ లెవల్ కార్లు, టూ వీలర్లపై జీఎస్‌టీని ప్రస్తుత 28 శాతం నుంచి 18 శాతానికి కుదించాలని రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో కూడిన మంత్రుల బృందం ఇప్పటికే సిఫారసు చేసింది. అయితే లగ్జరీ కార్లు, ఎస్‌యూవీలను మాత్రం ప్రత్యేకంగా ఏర్పాటు చేసే 40 శాతం శ్లాబులో చేర్చాలని సూచించింది. రూ.40 లక్షలకు మించిన ఎలక్ట్రిక్ కార్ల (ఈవీ)ను ఈ జాబితాలో చేర్చాలని కోరింది. జీఎస్‌టీ మండలి ఇందుకు ఆమోదం తెలిపితే టెస్లాతో పాటు లగ్జరీ ఈవీల బాట పట్టిన బీఎండబ్ల్యూ, మెర్సిడెజ్ బెంజ్ కంపెనీలకు తిప్పలు తప్పవని భావిస్తున్నారు.

హైదరాబాద్‌లో యాపిల్ విస్తరణ

మరో 64,125 చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్ లీజుకు తీసుకున్న సంస్థ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఐఫోన్ తయారీ దిగ్గజం యాపిల్ హైదరాబాద్‌లో కార్యకలాపాలను మరింత విస్తరిస్తోంది. ఇందుకోసం నానక్‌రామ్ గూడ, ఐటీ కారిడార్‌లోని వేవ్‌రాక్ టవర్ 2.1లో 64,125 చదరపు అడుగుల కార్యాలయ స్థలాన్ని (ఆఫీస్ స్పేస్)ను ఐదేళ్ల కాలానికి లీజుకు తీసుకుందని రియల్టీ రంగానికి చెందిన డేటా, అనలిటిక్స్ కంపెనీ ప్రాప్‌స్టాక్ వెల్లడించింది. టీఎస్ఐ బిజినెస్ పార్క్స్ (హైదరాబాద్) ప్రైవేట్ లిమిటెడ్ నుంచి లీజుకు తీసుకున్న ఈ స్థలం కోసం యాపిల్ ఇండియా నెలకు రూ.80.15 లక్షల అద్దె చెల్లించనున్నట్లు ప్రాప్‌స్టాక్ తెలిపింది. యాపిల్ హైదరాబాద్ ఆఫీస్‌ను సీఈఓ టిమ్ కుక్ 2016 మే నెలలో ప్రారంభించారు. సంస్థ ఇక్కడ యాపిల్ మ్యాప్స్, జియో స్పేషియల్ టెక్నాలజీ, డేటా మోడలింగ్ అభివృద్ధి కార్యకలాపాలు సాగిస్తోంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



3వ తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	570
వరంగల్	537	గోదావరి	570
చిత్తూరు	578	విశాఖపట్నం	575
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — పెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	98	విజయవాడ	127
వరంగల్	98	గుంటూరు	115
కరీంనగర్	98	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	98	చిత్తూరు	98
కర్నూలు	98	నెల్లూరు	103
విశాఖపట్నం	131	అనంతపురం	103
గోదావరి	127		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,06,090 ▲	97,250 ▲	1,36,100 ▲
విజయవాడ	1,07,650 ▲	1,01,500 ▲	1,26,250 ▲
విశాఖపట్నం	1,07,560 ▲	97,250 ▲	1,36,100 ▲
రాజమండ్రి	1,06,090 ▲	97,250 ▲	1,26,900 ▲
ప్రొద్దుటూరు	1,06,450 ▲	97,930 ▲	1,26,000 ▲
ముంబై	1,04,424 ▼	95,652 ▼	1,22,833 ▲

ఆఖర్లో లాభాల స్వీకరణ

సెన్సెక్స్ 206 పాయింట్లు డౌన్

ముంబై: ఈక్విటీ మదుపరులు ఆఖర్లో బ్యాంకింగ్, ఆటో రంగ షేర్లలో లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం నష్టాల్లో ముగిశాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే, సెన్సెక్స్ 206.61 పాయింట్లు కోల్పోయి 80,157.88 వద్దకు జారుకుంది. నిఫ్టీ 45.45 పాయింట్లు తగ్గి 24,579.60 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత సంస్థల్లో 16 నష్టపోయాయి. బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు మాత్రం 0.64 శాతం వరకు పెరిగాయి. రంగాల వారీ సూచీల్లో బ్యాంకెక్స్, టెలికాం, ఫైనాన్షియల్ సర్వీసెస్, టెక్, కన్స్యూమర్ డ్యూరబుల్స్ నేలచూపులు చూశాయి.

చక్కెర షేర్లు మరింత తీపిగా: షుగర్ మిల్లులు, డిస్టిలరీలకు ఇథనాల్ ఉత్పత్తిపై ఆంక్షలను ఎత్తివేయడంతో ఈ రంగ షేర్లు భారీగా పుంజుకున్నాయి. రాజ్‌శ్రీ షుగర్స్ షేరు ఏకంగా 20 శాతం ఎగబాకింది. శ్రీ రేణుక షుగర్స్ 12.72 శాతం, ద్వారికేశ్ షుగర్ ఇండస్ట్రీస్ 12.46 శాతం, ధామ్‌పూర్ షుగర్ మిల్స్ 10.36 శాతం, శక్తి షుగర్స్ 8.25 శాతం, అవధ్ షుగర్ అండ్ ఎనర్జీ 5.03 శాతం లాభపడ్డాయి.

కొత్త ఆల్‌టైం కనిష్ఠానికి రూపాయి: భారత కరెన్సీ సరికొత్త జీవితకాల కనిష్ఠానికి పతనమైంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ మరో 5 పైసల నష్టంతో రూ.88.15 వద్ద ముగిసింది.

ఇండెక్స్ ఆప్షన్స్‌కు ఇంట్రాడే పరిమితులు

జేన్‌స్ట్రీట్ ఉదంతం నేపథ్యంలో మార్కెట్ నియంత్రణ మండలి సెబీ.. ఇండెక్స్ ఆప్షన్స్ నిబంధనలను మరింత కఠినతరం చేసింది. ఈక్విటీ ఇండెక్స్ డెరివేటివ్స్ ఇంట్రాడే పొజిషన్స్‌పై పరిమితులు విధించింది. వీటిలో ట్రేడింగ్ జరిపే ప్రతి సంస్థకు నెట్ ఇంట్రాడే పొజిషన్‌ను రూ.5,000 కోట్లకు పరిమితం చేస్తున్నట్లు మంగళవారం విడుదల చేసిన సర్క్యులర్‌లో స్పష్టం చేసింది. గ్రాస్ ఇంట్రాడే పొజిషన్ పరిమితిని రూ.10,000 కోట్లకు పరిమితం చేసింది. కొత్త నియమావళి వచ్చే నెల 1 నుంచి అమల్లోకి వస్తుందని సెబీ స్పష్టం చేసింది.

ఆన్‌లైన్‌లో సంగం ఉత్పత్తులు

అన్ని ఈ-కామర్స్ వెబ్‌సైట్స్‌లో లభ్యం
చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర

పొన్నూరు టౌన్ (ఆంధ్రజ్యోతి): దేశంలో ఉన్న అన్ని ఈ- కామర్స్ సైట్లలో సంగం ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు సంగం డెయిరీ చైర్మన్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తెలిపారు. మంగళవారం నాడిక్కడ ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా అన్ని ప్రధాన నగరాల్లోని వినియోగదారులకు సంగం డెయిరీ ఉత్పత్తులు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. కాగా త్వరలోనే అద్దంకి చిల్లింగ్ సెంటర్ సహా తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలలో చిల్లింగ్ సెంటర్లతో పాటు దేవరాపల్లిలో చిల్లింగ్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. నాయుడుపేట సెజ్‌లో ప్రభుత్వం కేటాయించిన భూమిలో త్వరలోనే ప్లాంట్ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. క్యాటిల్ ఫీడ్ ప్లాంటు సామర్థ్యం పెంపు, ఆటోమేషన్‌ను రూ. 2.5 కోట్ల వ్యయంతో చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే సంగం డెయిరీలో ఇన్నోవేషన్ సెంటర్‌ను రూ. 2.5 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

ఈ నెల 15 వరకు బీఎస్ఎన్ఎల్ ఫ్రీడమ్ ఆఫర్ పొడిగింపు

విజయవాడ సిటీ (ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ ఫ్రీడమ్ ఆఫర్‌ను ఈ నెల 15వ తేదీ వరకు పొడిగించినట్టు బీఎస్ఎన్ఎల్ ఏపీ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎం.శేషాచలం మంగళవారం తెలిపారు. ఈ ఆఫర్‌లో భాగంగా రోజుకు 2 జీబీ డేటా, అన్ లిమిటెడ్ వాయిస్ కాల్స్, 100 ఎస్ఎంఎస్‌లు, నెల రోజుల వ్యాలిడిటీతో రూపాయికే సిమ్‌ను అందిస్తున్నట్టు చెప్పారు. ఈ సిమ్‌లో చూజ్ యువర్ నెంబర్ ఆప్షన్ సైతం ఉన్నట్లు తెలిపారు. నచ్చిన నెంబర్‌తో సిమ్‌ను పొందే వెసులుబాటు ఉందన్నారు. వినియోగదారుల నుంచి మంచి స్పందన వస్తుండటంతో ఈ ఆఫర్‌ను ఈ నెల 15 వరకు పొడిగించినట్లు శేషాచలం వెల్లడించారు.

టీసీఎస్ ఉద్యోగుల జీతం పెంపు

4.5 - 7% శ్రేణిలో పెరుగుదల ● సెప్టెంబరు నుంచి అమలు

ముంబై: దేశీయ ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) తన ఉద్యోగులకు శుభవార్త చెప్పింది. మెజారిటీ సిబ్బంది వేతనాలను 4.5 శాతం నుంచి 7 శాతం శ్రేణిలో పెంచుతున్నట్లు కంపెనీ ప్రకటించింది. సెప్టెంబరు నెల నుంచి జీతం పెంపు అమల్లోకి వస్తుందని తెలిపింది. ఉద్యోగులకు ఇంక్రిమెంట్ పత్రాలు అందజేసే ప్రక్రియ సోమవారం సాయంత్రం నుంచే ప్రారంభమైందని ఈ వ్యవహారంతో సంబంధమున్న వర్గాలు వెల్లడించాయి. కింది, మధ్య స్థాయి సిబ్బంది అందరికీ వేతనం పెరిగినట్లు ఆ వర్గాలు తెలిపాయి. అత్యుత్తమ పనితీరు కనబర్చిన వారికి వేతనాన్ని 10 శాతానికి పైగా పెంచినట్లు తెలిసింది.

రమేశ్ కార్డియాక్ హాస్పిటల్‌లో ఆస్టర్ హెల్త్‌కేర్‌కు మరింత వాటా

రూ.63 కోట్లతో 13 శాతం వాటా కొనుగోలు

న్యూఢిల్లీ: బెంగళూరు కేంద్రంగా పనిచేసే ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్ లిమిటెడ్.. విజయవాడ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న డాక్టర్ రమేశ్ కార్డియాక్ అండ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రైవేట్ లిమిటెడ్ (డీఆర్‌సీఎంహెచ్‌పీఎల్) ఈక్విటీలో మరింత వాటా పెంచుకుంది. ప్రస్తుతం ఈ హాస్పిటల్ ఈక్విటీలో ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్‌కు 57.49 శాతం వాటా ఉంది. తాజాగా రమేశ్ కార్డియాక్ హాస్పిటల్ ప్రమోటర్ల నుంచి మరో 13 శాతం వాటాను రూ.63.01 కోట్లకు చేసినట్లు ఆస్టర్ వెల్లడించింది. ఈ కొనుగోలుతో రమేశ్ హాస్పిటల్‌లో వాటా 70.49 శాతానికి చేరుకుందని తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న అభివృద్ధి అవకాశాలను దృష్టిలో ఉంచుకుని వ్యూహాత్మకంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. డీఆర్‌సీఎంహెచ్‌పీఎల్ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో 739 పడకల సామర్థ్యం కలిగిన ఐదు హాస్పిటల్స్‌ను నిర్వహిస్తోంది. కాగా 75 పడకల సామర్థ్యంతో ఏర్పాటు చేస్తున్న ఒంగోలు హాస్పిటల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయ, తృతీయ త్రైమాసికంలో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్లు వెల్లడించింది.

అక్టోబరు 9 నుంచి బడ్జెట్ కసరత్తు షురూ

న్యూఢిల్లీ: ప్రపంచ ఆర్థిక అస్థిరతలు, అమెరికా 50% సుంకాల విధింపు నేపథ్యంలో ఆర్థిక శాఖ 2026-27 వార్షిక బడ్జెట్ రూపకల్పనకు వచ్చే నెల 9వ తేదీ నుంచి సన్నాహాలు ప్రారంభించనుంది. దేశీయ డిమాండును ఉత్తేజితం చేయడం, తద్వారా 8% వార్షిక వృద్ధి స్థిరంగా సాధించడంలో ఎదురవుతున్న సవాళ్లను పరిష్కరించడంపై బడ్జెట్ ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తుంది. ఈ నేపథ్యంలో కేంద్ర వ్యయ శాఖ కార్యదర్శి అధ్యక్షతన వివిధ వర్గాలతో ప్రీ బడ్జెట్ సమావేశాలు వచ్చే నెల 9 నుంచి ప్రారంభమవుతాయని ఆర్థిక వ్యవహారాల శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

స్పోర్ట్స్

టీ20లకు స్టార్క్ వీడ్కోలు

టెస్టు, వన్డేలపై దృష్టి



సిడ్నీ: మరో ఆరు నెలల్లో టీ20 వరల్డ్‌కప్ జరుగనుండగా.. ఆస్ట్రేలియా స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. వన్డే, టెస్టులపై మరింత దృష్టి సారించేందుకు అంతర్జాతీయ టీ20 ఫార్మాట్ నుంచి వైదొలుగుతున్నట్టు ప్రకటించాడు. కొత్త బంతితో స్వింగ్ రాబట్టడంతో పాటు డెత్ ఓవర్లలో యార్కర్లతో 35 ఏళ్ల ఈ లెఫ్టామ్ పేసర్ బ్యాటర్లను బెంబేలెత్తించగలడు. 2012లో టీ20 అరంగేట్రం చేసిన తను కెరీర్‌లో ఆడిన 65 మ్యాచ్‌ల్లో 79 వికెట్లు తీశాడు. అలాగే ఇప్పటిదాకా జరిగిన ఆరు టీ20 వరల్డ్‌కప్‌ల్లో తను ఐదింటిలో ఆడడం విశేషం. గతేడాది జరిగిన మెగా టోర్నీలో ఆసీస్ తరఫున చివరిసారి పాల్గొన్నాడు. అలాగే 2021 టీ20 వరల్డ్‌కప్‌లో ఆసీస్‌ను విజేతగా నిలపడంలోనూ స్టార్క్ కీలక పాత్ర పోషించాడు. 'టెస్టు క్రికెట్‌కే నా ప్రాధాన్యత. అలాగే ఆసీస్ తరఫున ఆడిన ప్రతీ టీ20 మ్యాచ్‌ను ఆస్వాదించాను. ముఖ్యంగా 2021 టీ20 వరల్డ్‌కప్‌ను మరింత బాగా ఎంజాయ్ చేశాను. ఇక భారత్‌లో ఐదు టెస్టుల సిరీస్, యాషెస్, వన్డే వరల్డ్‌కప్ ఇలా బిజీ షెడ్యూల్ ముందుంది. వీటి కోసం ఫిట్‌గా ఉండాలనుకుంటున్నాను. అలాగే వచ్చే ఏడాది టీ20 వరల్డ్‌కప్ ఉండడంతో యువ బౌలర్లను ఎంపిక చేసుకునేందుకు తగిన సమయం ఇవ్వాలనే ఆలోచనతో రిటైర్ అవుతున్నా' అని స్టార్క్ పేర్కొన్నాడు. మరోవైపు ఫ్రాంచైజీ క్రికెట్‌పై ఎలాంటి ప్రకటనా చేయకపోవడంతో ఐపీఎల్, బిగ్‌బాష్ లీగ్‌ల్లో కొనసాగే అవకాశం ఉంది.

భారత్‌తో సిరీస్‌కు కమిన్స్ దూరం



సిడ్నీ: వెన్నునొప్పితో బాధపడుతున్న ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ భారత్, న్యూజిలాండ్ దేశాలతో జరిగే పరిమిత ఓవర్ల సిరీస్‌లకు దూరం కానున్నాడు. వచ్చే నెలలో మూడు టీ20ల సిరీస్ కోసం ఆసీస్ జట్టు కివీస్ పర్యటనకు వెళ్లనుంది. ఆ తర్వాత స్వదేశంలో భారత్‌తో మూడు వన్డేలు, ఐదు టీ20లు ఆడనుంది. అయితే నవంబరులో ఇంగ్లండ్‌తో జరిగే యాషెస్ సిరీస్‌లో కమిన్స్ ఆడే అవకాశం ఉందని క్రికెట్ ఆస్ట్రేలియా పేర్కొంది. జూలైలో వెస్టిండీస్‌తో జరిగిన మూడో టెస్టులో తను చివరిసారి ఆడాడు.

కామన్వెల్త్ ఆతిథ్యం కోసం భారత్‌తో నైజీరియా పోటీ

న్యూఢిల్లీ: 2030 కామన్వెల్త్ క్రీడలను నిర్వహించాలనుకొంటున్న భారత్‌కు గట్టిపోటీ ఎదురైంది. ఆఫ్రికా దేశం నైజీరియా కూడా ఆతిథ్య హక్కుల కోసం బిడ్ దాఖలు చేసింది. ఆగస్టు 31తో ముగిసిన డెడ్‌లైన్‌లోపు భారత్, నైజీరియా బిడ్‌లు దాఖలు చేసినట్టు కామన్వెల్త్ స్పోర్ట్స్ ఓ ప్రకటనలో తెలిపింది. ఇరు దేశాల బిడ్డింగ్‌ల పరిశీలనకు కమిటీని నియమించి.. నిర్ణయం తీసుకోనున్నట్టు పేర్కొంది.

స్పాన్సర్‌షిప్ వేటలో బీసీసీఐ



బిడ్ దాఖలుకు ఈనెల 16 తుది గడువు
గేమింగ్, బెట్టింగ్ కంపెనీలపై నిషేధం

న్యూఢిల్లీ: టీమిండియా ప్రధాన స్పాన్సరర్ కోసం బీసీసీఐ ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా ఆసక్తిగల కంపెనీలు బిడ్డింగ్ ప్రక్రియలో పాల్గొనాల్సిందిగా ఆహ్వానించింది. ఇటీవల ఆన్‌లైన్ గేమింగ్ నియంత్రణ చట్టం అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. దీంతో ఇప్పటిదాకా జట్టు స్పాన్సర్‌గా ఉన్న డ్రీమ్ 11 తమ ఒప్పందాన్ని మరో ఏడాది ఉండగానే రద్దు చేసుకోవాల్సివచ్చింది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగానే బోర్డు కొత్త స్పాన్సర్‌ను ఎంపిక చేయనుంది. దీనిలో భాగంగా ఆన్‌లైన్ , గ్యాంబ్లింగ్, బెట్టింగ్, క్రిప్టో కరెన్సీ, ఆల్కహాల్, పోర్నోగ్రఫీలతో ప్రత్యక్ష లేక పరోక్ష సంబంధం ఉన్న కంపెనీలకు అనుమతి లేదు. కంపెనీపై, యజమానులపై ఎలాంటి క్రిమినల్ కేసులూ ఉండరాదు. ఆర్‌బీఐ జాబితాలో ఉద్దేశపూర్వక ఎగవేతదారుగా ఉండకూడదు. మూడేళ్ల కాలంలో కంపెనీ సగటు టర్నోవర్ కనిష్ఠంగా రూ.300 కోట్లు ఉండాలి. ఇలా ఈ నిబంధనల్ని పాటించే కంపెనీలు మాత్రమే ఈనెల 16లోగా దరఖాసు చేసుకోవాలని తేల్చి చెప్పింది. ఈనేపథ్యంలో 9 నుంచి ఆరంభమయ్యే ఆసియాకప్ టోర్నీలో భారత జట్టు జెర్సీపై స్పాన్సర్ పేరు లేకుండానే బరిలోకి దిగే అవకాశం ఉంది.

దక్షిణాఫ్రికా బోణీ

ఇంగ్లండ్‌తో తొలి వన్డే



కేశవ్ (4/22)

లీడ్స్: ఇంగ్లండ్‌తో జరిగిన తొలి వన్డేలో దక్షిణాఫ్రికా జట్టు ఏడు వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. తద్వారా 3 వన్డేల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలో నిలిచింది. స్పిన్నర్ కేశవ్ మహరాజ్ (4/22), పేసర్ ముల్డర్ (3/33)ల ధాటికి ఇంగ్లండ్ 24.3 ఓవర్లలో 131 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ జేమీ స్మిత్ (54) మాత్రమే రాణించాడు. ఆ తర్వాత ఛేదనలో దక్షిణాఫ్రికా 20.2 ఓవర్లలో 137/3 స్కోరుతో నెగ్గింది. ఓపెనర్ మార్‌క్రమ్ (86), రికెల్టన్ (31 నాటౌట్) తొలి వికెట్‌కు 121 పరుగుల భాగస్వామ్యంతో విజయాన్నందించారు. స్పిన్నర్ రషీద్‌కు మూడు వికెట్లు దక్కాయి.

ఆసిఫ్ ఆలీ రిటైర్మెంట్



లాహోర్: పాకిస్థాన్ మిడిలార్డర్ బ్యాటర్ ఆసిఫ్ ఆలీ అంతర్జాతీయ క్రికెట్‌కు ముగింపు పలికాడు. పాక్ తరఫున అతడు 21 వన్డేల్లో మూడు అర్ధసెంచరీలతో 382 పరుగులు, 58 టీ20ల్లో 577 పరుగులు సాధించాడు. అయితే దేశవాళీ, ఫ్రాంచైజీ క్రికెట్‌లో మాత్రం కొనసాగుతానని ప్రకటించాడు. రెండేళ్ల క్రితం చివరి టీ20 ఆడిన 33 ఏళ్ల ఆసిఫ్ 2019 వన్డే వరల్డ్‌కప్‌తో పాటు 2021, 2022 టీ20 వరల్డ్‌కప్‌ల్లో పాక్ తరఫున ప్రాతినిధ్యం వహించాడు.

సెమీస్‌కు పెగుల

క్వార్టర్స్‌లో సినర్, ఒసాక
యూఎస్ ఓపెన్



పెగుల

న్యూయార్క్: గతేడాది రన్నరప్, నాలుగో సీడ్ జెస్సికా పెగుల వరుసగా రెండోసారి యూఎస్ ఓపెన్ సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో లోకల్ స్టార్ పెగుల 6-3, 6-3తో చెక్ భామ బార్బరా క్రెజికోవాపై వరుస సెట్లలో సునాయాసంగా నెగ్గింది. తొలి సెట్ రెండో గేమ్‌లోనే క్రెజికోవా సర్వీస్‌ను బ్రేక్ చేసిన పెగుల 3-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అయితే, క్రమంగా పుంజుకొన్న బార్బరా ఏడో గేమ్‌లో పెగుల సర్వీస్‌ను బ్రేక్ చేసి 3-4తో సమం చేసేలా కనిపించింది. కానీ, మరోసారి బ్రేక్ పాయింట్ సాధించిన పెగుల సెట్‌ను తన ఖాతాలో వేసుకొంది. ఇక రెండో సెట్ మొదటి గేమ్‌లోనే క్రెజికోవాకు చెక్ చెప్పిన జెస్సికా 2-0తో ముందంజ వేసింది. ఐదో గేమ్‌లో మరో బ్రేక్ పాయింట్‌తో పెగుల 4-1తో ఆధిక్యం సాధించింది. అయితే, ఆరో గేమ్‌లో ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసిన క్రెజికోవా 3-4తో పోటీలోకి వచ్చేలా కనిపించింది. ఆ తర్వాతి గేమ్‌లో సర్వీస్‌ను నిలబెట్టుకొన్న అమెరికా ప్లేయర్.. 9వ గేమ్‌లో క్రెజికోవా మరోసారి బ్రేక్ చేసి సెట్‌తోపాటు మ్యాచ్‌ను సొంతం చేసుకొంది.

గాఫ్‌కు ఒసాక షాక్: ప్రీ క్వార్టర్స్‌లో డిఫెండింగ్ చాంప్ యానిక్ సినర్ 6-1, 6-1, 6-1తో అలెగ్జాండర్ బబ్లిక్ (కజకిస్థాన్)ను వరుస సెట్లలో మట్టికరిపించాడు. కాగా, 10వ సీడ్ లొరెంజో ముసెట్టి (ఇటలీ) 6-3, 6-0, 6-1తో జేమ్ మునార్‌పై గెలిచాడు. క్వార్టర్స్‌లో ముసెట్టితో సినర్ అమీతుమీ తేల్చుకోనున్నాడు. మహిళల సింగిల్స్‌లో మూడో సీడ్ కోకొ గాఫ్‌కు నవోమి ఒసాక షాకిచ్చింది. రౌండ్-16లో 23వ సీడ్ ఒసాక 6-3, 6-2తో గాఫ్‌పై అలవోకగా గెలిచింది. 8వ సీడ్ అమండా అనిసిమోవా 6-0, 6-3తో బియాట్రిజ్ హడాడ్‌పై, 11వ సీడ్ కరోలినా ముచోవా 6-3, 6-7(0), 6-3తో మర్తా కోస్త్యుక్‌పై నెగ్గారు. రౌండ్-8లో ముచోవాతో ఒసాక తలపడనుంది. మహిళల డబుల్స్‌లో వీనస్ విలియమ్స్-లైలా ఫెర్నాండెజ్ జోడీ 6-3, 6-4తో ఎకటరీనా అలెగ్జాండ్రోవా-జాంగ్ షుయ్‌పై గెలిచింది.



సినర్

ప్రణవ్ ఖాతాలో ఫుజైరా టైటిల్



ఫుజైరా (యూఏఈ): ఫుజైరా గ్లోబల్ సూపర్ స్టార్స్ చెస్ టైటిల్‌ను ప్రపంచ జూనియర్ చాంపియన్ ప్రణవ్ వెంకటేష్ కైవసం చేసుకున్నాడు. మంగళవారం జరిగిన ఆఖరిదైన తొమ్మిదో రౌండ్‌లో స్పెయిన్ జీఎం అలాన్ పిచోట్‌ను బెంగళూరు జీఎం ప్రణవ్ ఓడించాడు. ఈ విజయంతో ప్రణవ్ ఏడు పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి, టైటిల్ దక్కించుకున్నాడు. ఈ టోర్నీలో ప్రణవ్ ఐదు విజయాలు, నాలుగు డ్రాలతో అజేయంగా నిలిచాడు.

స్విస్ బరిలో అర్జున్, ప్రజ్ఞానంద

సమర్‌కండ్ (ఉజ్బెకిస్థాన్): అర్జున్ ఇరిగేసి, ప్రజ్ఞానంద.. ఫిడే గ్రాండ్ స్విస్ టోర్నీలో మెరుగైన ప్రదర్శనతో క్యాండిడేట్స్ టోర్నీ బెర్త్‌ను ఖరారు చేసుకోవాలనుకొంటున్నారు. గురువారం నుంచి జరిగే ఈ టోర్నీలో వరల్డ్ చాంపియన్ గుకేష్‌తోపాటు హరికృష్ణ, నిహాల్ సరీన్, ప్రణవ్ వెంకటేష్ కూడా బరిలో నిలవనున్నారు. కాగా, వైల్డ్ కార్డ్ దక్కించుకొన్న మహిళల వరల్డ్‌కప్ విజేత దివ్య దేశ్‌ముఖ్ ఓపెన్ కేటగిరిలో తలపడనుంది. హంపి ఈ టోర్నీకి దూరం కాగా.. మహిళల విభాగంలో హారిక, వైశాలి, వంతిక బరిలో ఉన్నారు.

అథ్లెట్ పర్వేజ్ ఖాన్‌పై నిషేధం

న్యూఢిల్లీ: భారత మిడిల్ డిస్టెన్స్ రన్నర్ పర్వేజ్ ఖాన్‌పై ఆరేళ్ల నిషేధం విధించారు. పర్వేజ్ నిషేధిత ఎరిత్రోపొయిటిన్ ఉపయోగించి పాజిటివ్‌గా తేలాడు. అలాగే 2023లో మూడుసార్లు డోప్ టెస్టుకు అందుబాటులో లేడు. దీంతో ఈ రెండు అతిక్రమణలకు కలిపి ఆరేళ్ల నిషేధం విధించారు.



ఢిల్లీ-బెంగళూరు మ్యాచ్ దృశ్యం

బుల్స్‌పై దబాంగ్ గెలుపు

విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) సీజన్-12లో దబాంగ్ ఢిల్లీ శుభారంభం చేసింది. మంగళవారం ఇక్కడి పోర్టు రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో దబాంగ్ ఢిల్లీ 41-34 స్కోరుతో బెంగళూరు బుల్స్‌ను ఓడించింది. సీజన్‌లో తొలి మ్యాచ్ ఆడిన దబాంగ్ ఢిల్లీ ఆటగాళ్లు పూర్తిస్థాయిలో ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. ప్రథమార్ధంలో బెంగళూరు బుల్స్‌ను వరుసగా రెండుసార్లు ఆలౌట్ చేశారు. దబాంగ్ రైడర్లను నిలువరించడంలో బుల్స్ డిఫెండర్లు విఫలమయ్యారు. దీంతో తొలి భాగంలో ఢిల్లీ 21-11 స్కోరుతో ఆధిక్యంలో ఉంది. ద్వితీయార్ధంలో బెంగళూరు అనూహ్యంగా పుంజుకుని పోటీనిచ్చింది. అయితే అప్పటికే పూర్తి ఆధిక్యంతో ఉన్న దబాంగ్ ఆటగాళ్లు మ్యాచ్ చివరి నిమిషాలలో వ్యూహాత్మకంగా ఆడి సీజన్‌లో తొలి విజయాన్ని నమోదు చేశారు. దబాంగ్ రైడర్లు ఆషు మాలిక్ 17 పాయింట్లు, నీరజ్ నర్వాల్ రెండు బోనస్‌లతో 7 పాయింట్లు రాబట్టారు. మరో మ్యాచ్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ 39-36 పాయింట్ల తేడాతో పట్నా పైరేట్స్‌ను ఓడించింది.

ఆర్థిక నిపుణుడు నాగరాజుకు నాయుడమ్మ పురస్కారం

ఈ ఏడాది అవార్డుకు ఎంపికైన ఐఏఎస్ అధికారి

» ఈనెల 10న తెనాలిలో పురస్కారం ప్రదానం

» అవార్డు అందజేయనున్న తెలంగాణ గవర్నర్



తెనాలి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ యలవర్తి నాయుడమ్మ పురస్కారానికి ఆర్థిక వ్యవహారాల నిపుణుడు, ఐఏఎస్ అధికారి నాగరాజు మద్దిరాల ఎంపికయ్యారు. కేంద్ర ఆర్థిక శాఖలో ఆర్థిక సేవల విభాగ కార్యదర్శిగా ఉన్న ఆయనకు 2025 సంవత్సరం పురస్కారాన్ని అందజేయనున్నారు. ఈ మేరకు గుంటూరు జిల్లా తెనాలిలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ యలవర్తి నాయుడమ్మ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫౌండేషన్ చైర్మన్ యడ్లపాటి రఘునాథబాబు తెలిపారు. ప్రఖ్యాత చర్మశాస్త్రవేత్తగా గుర్తింపు పొందిన డాక్టర్ నాయుడమ్మ బాపట్ల జిల్లా అమృతలూరు మండలం యలవర్రు గ్రామంలో జన్మించారు. నాయుడమ్మ పేరుపై ఏటా శాస్త్రవేత్తలు, వివిధ రంగాల్లో నిపుణులకు అవార్డును ప్రదానం చేస్తున్నారు. ఈ ఏడాది పురస్కారాన్ని నాగరాజు మద్దిరాలకు తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఈనెల 10న తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ అందించనున్నారు. సీఎస్ఐఆర్ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ స్వర్ణ వి. కాంత కూడా ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. కాగా, మద్దిరాల నాగరాజు 1993వ బ్యాచ్‌కు చెందిన త్రిపుర కేడర్ ఐఏఎస్ అధికారి. ఆయన కృష్ణా జిల్లాలో 1966లో జన్మించారు. ప్రస్తుతం 2025 కేంద్ర బడ్జెట్ రూపకల్పన భాగస్వామిగా ఉన్నారు.

విద్యుత్ ఉత్పత్తిలో భారీ వృద్ధి

» గతేడాది కన్నా 20.3 శాతం అధికం

» రాష్ట్రంపై తగ్గిన విద్యుత్తు కొనుగోళ్ల భారం

» శ్రీశైలంలో రికార్డు స్థాయి ఉత్పత్తి

» జెన్కో, ఎలక్ట్రికల్ సేఫ్టీ అధికారులతో మంత్రి గొట్టిపాటి సమీక్ష



అమరావతి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉత్పత్తిలో రాష్ట్రం గణనీయమైన వృద్ధి సాధించింది. ఏపీ జెన్కో-ఏపీపీడీసీఎల్ సంయుక్తంగా 2025 ఆగస్టు నాటికి 16 వేల మిలియన్ యూనిట్ల ఉత్పత్తి చేశాయి. ఈ విషయాన్ని అధికారులు ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు తెలిపారు. ఇది గత ఏడాదితో పోలిస్తే 20.3 శాతం అధికమని పేర్కొన్నారు. మంగళవారం సచివాలయంలో ఏపీ జెన్కో అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్తు వినియోగానికి తగినట్లుగా విద్యుదుత్పత్తి చేస్తున్నామని, గతంతో పోలిస్తే రోజువారీ విద్యుత్తు కొనుగోళ్లు తగ్గాయని అధికారులు మంత్రికి వివరించారు. జల, సోలార్ విద్యుదుత్పత్తిలో కూడా గత ఏడాది కన్నా వృద్ధి సాధించినట్లు చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్-ఆగస్టు మధ్య 2,270 మిలియన్ యూనిట్లు విద్యుదుత్పత్తి చేయగా, గత ఏడాది ఇదే కాలానికి 1,652 మిలియన్ యూనిట్లు మాత్రమే ఉత్పత్తి అయ్యాయన్నారు. రికార్డు స్థాయి విద్యుదుత్పత్తి చేయడంపై మంత్రి హర్షం వ్యక్తం చేశారు. గత రెండు దశాబ్దాల్లో తొలిసారి శ్రీశైలం హైడల్ పవర్ స్టేషన్ వెయ్యి మిలియన్ యూనిట్ల ఉత్పత్తి మైలురాయిని చేరడంపై అధికారులను అభినందించారు. ఎన్టీటీపీఎస్ స్టేజ్-5 (800 మెగావాట్లు), ఆర్టీపీఎస్ స్టేజ్- 4 (600 మెగావాట్లు) విస్తరణ పనుల పురోగతిపై మంత్రి సమీక్షించారు. వీటిని ఈ ఏడాది చివరికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కమలపాడు, యాగంటి, రాజుపాలెం, అరవేటిపల్లి, గడికోట, దీనేపల్లిల్లో రానున్న సుమారు 6 వేల మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుల పనులు, పోలవరం జల విద్యుత్తు ప్రాజెక్టు, దిగువ సీలేరు రెండు యూనిట్లు, ఎగువ సీలేరు పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు పనుల పురోగతిపై మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమీక్షలో ఏపీ జెన్కో ఎండీ కేవీఎన్ చక్రధర్ బాబు, జెన్కో డైరెక్టర్లు ఎం.సుజయ్ కుమార్, పి.అశోక్ రెడ్డి, వి.ఉష, ఏపీపీడీసీఎల్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్తు ప్రమాదాలను నివారించండి

విద్యుత్తు ప్రమాదాల శాశ్వత నివారణే లక్ష్యంగా ఎలక్ట్రికల్ సేఫ్టీ అధికారులు పనిచేయాలని మంత్రి గొట్టిపాటి ఆదేశించారు. విద్యుత్తు ప్రమాదాలపై ఆయన ఆ విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. మానవ తప్పిదాలు, నిర్వహణ లోపాల వల్ల ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రమాదాల నివారణకు పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, సోషల్ మీడియా, మీడియా వేదికలను ఉపయోగించుకోవాలని, విద్యుత్తు శాఖ టోల్ ఫ్రీ నంబరు 1912కు విస్తృత ప్రచారం కల్పించాలని ఆదేశించారు. ప్రమాదాల నివారణకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలన్నారు. ప్రతి త్రైమాసికానికి ఒకసారి ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలపై సంబంధిత డిస్కంలకు సమగ్ర నివేదిక పంపాలని ఎలక్ట్రికల్ సేఫ్టీ అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో డైరెక్టర్ ఆఫ్ ఎలక్ట్రికల్ సేఫ్టీ జి.విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలకు 1,120 కోట్ల నిధులు

అమరావతి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1,120 కోట్లను విడుదల చేస్తూ ఆర్థికశాఖ చర్యలు తీసుకుంది. గత నెల 26న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఓ ప్రకటన చేస్తూ... '15వ ఆర్థిక సంఘం నిధులు సెప్టెంబరు మొదటి వారంలో విడుదలవుతాయి. సీఎం చంద్రబాబు ఆ మేరకు హామీ ఇచ్చారు' అని తెలిపారు. దానికి కార్యరూపం ఇస్తూ... ఆర్థిక శాఖ నిధులను విడుదల చేసింది. ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న గ్రామ పంచాయతీలకు ఈ నిధుల విడుదల ఊరటనివ్వనుంది.

మిగులు బార్లకు నేడు నోటిఫికేషన్

» 432 బార్లకు 15న లాటరీ

అమరావతి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మిగులు బార్లకు బుధవారం నోటిఫికేషన్‌జారీచేయనున్నట్లు ఎక్సైజ్ డైరెక్టర్ నిషాంత్‌కుమార్ మంగళవారం ప్రకటించారు. నేటి నుంచి ఈ నెల 14 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని, 15న ఉదయం లాటరీ నిర్వహిస్తారని తెలిపారు. కాగా.. రాష్ట్రవ్యాప్తంగా 432 బార్లు మిగిలిపోయాయి. 924 బార్లలో 492 బార్లకు ఇప్పటివరకు లైసెన్సీలు ఎంపికయ్యారు. వాటిలో 80 బార్లు కల్లు గీత కార్మికుల కేటగిరీలో ఉన్నాయి. దరఖాస్తులు తక్కువగా వస్తున్నందున ఈసారి వాటి స్వీకరణకు ఎక్కువ రోజులు గడువు పెట్టారు. సాధారణంగా వారం రోజులు పెట్టే గడువును 12రోజులకు పెంచారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★



థియేటర్లలో ఆస్వాదించే చిత్రం

శివకార్తికేయన్

శివకార్తికేయన్ కథానాయకుడిగా మురుగదాస్ తెరకెక్కించిన చిత్రం 'మదరాసి'. ఎన్వీ ప్రసాద్ నిర్మించారు. రుక్మిణీ వసంత్ కథానాయిక. ఈ నెల 5న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో శివకార్తికేయన్ మాట్లాడుతూ 'థియేటర్లలో ప్రతీ ప్రేక్షకుడు ఆస్వాదించే చిత్రమిది. నా గత చిత్రాలను ఆదరించినట్లే 'మదరాసి'ని ఆదరిస్తారని కోరుకుంటున్నా. అద్భుతమైన యాక్షన్, ఆకట్టుకునే ప్రేమకథ ఉన్న సినిమా ఇది. మంచి సినిమా చూశామన్న అనుభూతిని మీ అందరికీ ఇస్తుంది' అని అన్నారు. 'సినిమా విజువల్ వండర్‌లా ఉంటుంది. శివకార్తికేయన్ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్ అవుతుంది' అని ఎన్వీ ప్రసాద్ చెప్పారు. 'మా టీమ్ అందరికీ ఈ చిత్రం ఎంతో ప్రత్యేకం. కచ్చితంగా సినిమాను ఎంజాయ్ చేస్తారు' అని రుక్మిణీ వసంత్ తెలిపారు.



పాత ఫొటోతో కొత్తగా...

మెగాస్టార్ చిరంజీవి తమ్ముడు పవన్ కల్యాణ్‌పై తనకున్న ప్రేమను మరోసారి చాటుకున్నారు. మంగళవారం పవన్ కల్యాణ్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిరంజీవి ఓ పాత ఫొటో షేర్ చేస్తూ పవన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. 'చలన చిత్ర రంగంలో అగ్రనటుడిగా, ప్రజా జీవితంలో జన సేనానిగా, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా ప్రజలకు నిరంతర సేవలు అందిస్తున్న కల్యాణ్ బాబుకి శుభాకాంక్షలు. ప్రజా సేవలో నువ్వు చూపుతున్న అంకిత భావం చిరస్మరణీయం. ప్రజలందరి ఆశీస్సులతో, అభిమానంతో నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ప్రజలకు మార్గదర్శకుడిగా నిలవాలని ఆశీర్వదిస్తున్నాను, దీర్ఘాయుష్మాన్ భవ' అంటూ చిరంజీవి పోస్టు పెట్టారు. ఈ పోస్టుపై పవన్ కల్యాణ్ స్పందించారు. 'నా జీవితానికి మార్గదర్శి, తండ్రి సమానులైన అన్నయ్య, పద్మ విభూషణ్ చిరంజీవికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు. మీ ఆశీస్సులు, ప్రేమాభిమానాలు, పుట్టినరోజు శుభాకాంక్షలు ఎంతో ఆనందం కలిగించాయి' అని సమాధానమిచ్చారు. నాగబాబు పోస్టుకు కూడా పవన్ స్పందించారు. 'హృదయ పూర్వక ధన్యవాదాలు చిన్నన్నయ్యా మీరు లా చదివే సమయంలో బహుమతిగా ఇచ్చిన నానీ పాల్కీవాలా రచించిన 'వి ది నేషన్' పుస్తకం నాలో రాజకీయ చైతన్యాన్ని కలిగించడానికి ప్రేరణగా నిలిచింది' అని పవన్ పేర్కొన్నారు.

విందు భోజనంలా సినిమా ఉంటుంది

క్రిష్



'ఇప్పటికే పలు చిత్రాల్లో విభిన్నమైన, విలక్షణమైన పాత్రలు పోషించి, నటిగా తనేంటో నిరూపించుకున్నారు అనుష్క. మంచి పాత్ర పడాలే గానీ తన నటనకు ఆకాశమే హద్దు. ఇప్పుడు 'ఘాటి' చిత్రంలో తనలోని నటిని కొత్త కోణంలో ఆవిష్కరించారు. ఈ చిత్రం ట్రైలర్‌లో మీరు చూసింది రెండు మెతుకులు మాత్రమే. పూర్తి విందుభోజనం సినిమాలో ఉంటుంది' అని దర్శకుడు క్రిష్ అన్నారు. ఆయన దర్శకత్వం వహించిన 'ఘాటి' చిత్రం ఈ నెల 5న విడుదలవుతోంది. ఈ సందర్భంగా క్రిష్ మీడియాతో ముచ్చటించారు.

- డాక్టర్ చింతకింద శ్రీనివాసరావు చెప్పిన లైన్ నచ్చడంతో 'ఘాటి' చిత్రాన్ని మొదలుపెట్టాను. ఒడిసా, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో గంజాయి సాగు, అక్రమరవాణా ఎక్కువగా జరుగుతోంది. ఆ గుట్టల్లో గంజాయిని భుజాన మోస్తూ చేరవేయడానికి పనిచేసేవాళ్లను ఘాటీలు అంటారు.
- కథ ప్రధానంగా గంజాయి సాగు, అక్రమరవాణా చుట్టూ తిరుగుతుంది. రొమాంచిత పోరాట ఘట్టాలు, పతాకస్థాయి భావోద్వేగాలు, భారీ బడ్జెట్, హై టెక్నికల్ వాల్యూస్‌తో గ్రాండియర్‌గా తెరకెక్కించాం. ఒక సామాజిక సమస్యకు వాణిజ్య హంగులు జోడించి తెరకెక్కించిన చిత్రమిది.
- వేదం తర్వాత అనుష్కతో సినిమా చేయాలని చాలాకాలంగా ఎదురుచూస్తున్నా. ఆమె స్టార్‌డమ్‌కు సరిపోయే కథ ఇది. ఇందులో ఆమె శీలావతి అనే మహిళగా సాహసోపేతమైన పాత్రలో కనిపిస్తారు. యాక్షన్ సన్నివేశాల్లో అనుష్క నటన ఆకట్టుకుంటుంది. అలాగే విక్రమ్ ప్రభు, చైతన్యారావు పాత్రోచిత నటనతో అలరిస్తారు. మా నిర్మాతలు రాజీవ్‌రెడ్డి, సాయిబాబా జాగర్లమూడి, యూవీ క్రియేషన్స్ విక్కీ, వంశీ, ప్రమోద్ సహకారం వల్లే మంచి నిర్మాణవిలువలతో తీయగలిగాం.
- పరిస్థితుల ప్రభావం వల్లే 'హరి హర వీరమల్లు' దర్శక బాధ్యతల నుంచి నేను వైదొలగాల్సి వచ్చింది. అనుకోని అడ్డంకులతో ఆ సినిమా చిత్రీకరణ సుదీర్ఘంగా సాగడం వల్ల నేను కూడా ఆర్థికంగా ఒడిదొడుకులు ఎదుర్కోవాల్సి వచ్చింది. దాంతో నా టీమ్‌ను మెయింటైన్ చేయడానికి ఆ సినిమా నుంచి బయటకు వచ్చి మరో సినిమాను పట్టాలెక్కించాను. నిర్మాత ఏ.ఎం రత్నం గారు కూడా నా ఇబ్బందిని అర్థం చేసుకొని సహకరించారు. నాకు పవన్ కల్యాణ్ గారిపైన అమితమైన గౌరవం ఉంది.



వందకు పైగా దేశాల్లో మహేశ్ సినిమా!

- ముసాలియా(కెన్యా ప్రభుత్వ అధికారి)

మహేశ్‌బాబు కథానాయకుడిగా రాజమౌళి తెరకెక్కిస్తున్న 'ఎస్ఎస్ఎంబీ 29' షూట్ ప్రస్తుతం కెన్యాలో జరుగుతోంది. తాజాగా కెన్యా కేబినెట్ సెక్రటరీ ముసాలియా డబ్ల్యూ ముదావడిని ఆయన కార్యాలయంలో కలసింది చిత్రబృందం. ఈ సందర్భంగా దర్శకుడు రాజమౌళి, నిర్మాత కె.ఎల్.నారాయణ తదితరులతో తీసుకున్న ఫొటోలను అయన ఎక్స్ వేదికగా షేర్ చేశారు. 'దాదాపు రెండు దశాబ్దాలుగా అద్భుతమైన సినిమాలతో ప్రేక్షకులను అలరిస్తున్న రాజమౌళి, తన చిత్రం షూటింగ్ కోసం కెన్యాను ఎంచుకోవడం మాకెంతో గర్వకారణం. ఆఫ్రికా షెడ్యూల్‌లో దాదాపు 95 శాతం చిత్రీకరణ ఇక్కడే జరుగుతోంది. సుమారు 120 దేశాల్లో రిలీజ్ కానున్న ఈ సినిమా ద్వారా మా దేశంలోని ప్రకృతి అందాలు కోట్లాది ప్రేక్షకులను కనువిందు చేయనున్నాయి' అని పేర్కొన్నారు.

మంచి అనుభూతి కలుగుతుంది



విజయ రామరాజు టైటిల్ రోల్ పోషించిన స్పోర్ట్స్ డ్రామా 'అర్జున్ చక్రవర్తి'. సిజా రోజ్ కథానాయిక. విక్రాంత్ రుద్ర దర్శకత్వంలో శ్రీని గుబ్బల నిర్మించారు. సినిమా ఇటీవలె విడుదలైన సందర్భంగా మేకర్స్ సక్సెస్ మీట్ నిర్వహించారు. విజయ రామరాజు మాట్లాడుతూ 'ప్రేక్షకుల నుంచి ఇంతటి అద్భుతమైన స్పందన రావడం చాలా ఆనందంగా ఉంది. సినిమా చూడని వాళ్లు తప్పకుండా చూడండి. మంచి సినిమా చూశామనే అనుభూతి కలుగుతుంది' అని అన్నారు. దర్శకుడు విక్రాంత్ రుద్ర మాట్లాడుతూ 'ప్రేక్షకులు ఆదరిస్తే మరో మంచి సినిమా తీయగలుగుతాం' అని అన్నారు. కార్యక్రమంలో హీరోయిన్ సిజా రోజ్, నటుడు దయానంద్ రెడ్డి తదితరులు మాట్లాడారు.



యూత్‌ను ఆకట్టుకునేలా...

అంకిత్ కొయ్య, నీలఖి జంటగా జె.ఎస్.ఎస్.వర్ధన్ తెరకెక్కిస్తున్న చిత్రం 'బ్యూటీ'. దర్శకుడు మారుతి సమర్పణలో విజయపాల్ రెడ్డి అడిదల, ఉమేశ్‌కుమార్ బన్సాల్ నిర్మిస్తున్నారు. ఈ నెల 19న చిత్రం విడుదలవుతోంది. తాజాగా, ఈ సినిమా నుంచి 'ప్రెట్టీ ప్రెట్టీ' అంటూ సాగే పాటను విడుదల చేశారు మేకర్స్. ఈ సాంగ్ యూత్‌ను ఆకట్టుకుంటుందని తెలిపారు. సనారే సాహిత్యం అందించగా, పీవీఎన్ఎస్ రోహిత్ ఆలపించారు. విజయ్ బుల్గానిన్ సంగీతం అందించారు.




నా మనసుకు దగ్గరైన కథ

శివాని నాగరం

"అంబాజీ పేట మ్యారేజీ బ్యాండ్ చిత్రం తర్వాత కొన్ని కథలు నా దగ్గరకు వచ్చాయి. కానీ అవేవీ నాకు సంతృప్తికరంగా అనిపించలేదు. ఆలస్యం అయినా మంచి కథలు వస్తేనే సినిమా చేయాలనుకున్నాను. అప్పుడు 'లిటిల్ హార్ట్స్' చిత్రంలో అవకాశం వచ్చింది. ఇది నా మనసుకు బాగా దగ్గరైన కథ' అని హీరోయిన్ శివాని నాగరం అన్నారు. సాయి మార్తాండ్ దర్శకత్వంలో ఆదిత్య హాసన్ నిర్మించారు. మౌళి తనుజ్ కథానాయకుడు. నిర్మాతలు బన్నీ వాస్, వంశీ నందిపాటి ఈ నెల 5న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా శివాని మీడియాతో ముచ్చటించారు. 'ఇందులో కాత్యాయని అనే కాలేజ్ అమ్మాయి పాత్రలో కనిపిస్తాను. ప్రేక్షకులను బాగా నవ్విస్తుంది. ఈటీవి విన్ నుంచి వస్తున్న తొలి థియేట్రికల్ ఫిల్మ్ ఇదే కావడం విశేషం. 'లిటిల్‌హార్ట్స్' కథలో ప్రేక్షకులు తమను తాము చూసుకుంటారు. గతంలో కాలేజీ ప్రేమల నేపథ్యంలో చాలా చిత్రాలు వచ్చినా ఇది మాత్రం నవ్యపంథాలో ఉంటుంది. ప్రేక్షకుల కాలేజీ రోజులను గుర్తు చేస్తుంది. ఇందులో ప్రేమ, భావోద్వేగాల కన్నా వినోదానికి దర్శకుడు పెద్ద పీట వేశారు. కథ బాగా నచ్చింది కాబట్టే బన్నీ వాస్, వంశీ విడుదల చేస్తున్నారు' అని శివాని చెప్పారు.

హంతకుడి వేట



కోలీవుడ్ హీరో అథర్వా మురళి నటించిన యాక్షన్ ప్యాక్డ్ థ్రిల్లర్ 'టన్నెల్' ఈ నెల 12న విడుదల కానుంది. రవీంద్ర మాధవ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ చిత్రాన్ని తెలుగులో లచ్చురామ్ ప్రొడక్షన్స్ సంస్థ ద్వారా ఎ.రాజు నాయక్ విడుదల చేస్తున్నారు. ఈ సినిమాలో అథర్వా మురళీ పోలీస్ ఆఫీసర్‌గా నటించారు. క్రూరమైన హత్యలు, వాటి వెనుకున్న సైకోని పట్టుకోవడానికి ఓ పోలీస్ ఆఫీసర్ ఏం చేశాడన్న ఇతివృత్తంతో గ్రిప్పింగ్ సీన్స్, థ్రిల్లింగ్ యాక్షన్ సీక్వెన్స్‌తో సినిమా ఉంటుందని ఎ.రాజునాయక్ చెప్పారు. త్వరలోనే తెలుగు ట్రైలర్‌ను విడుదల చేస్తామన్నారు. అథర్వా మురళీ కూడా తెలుగు ప్రమోషన్స్‌లో పాల్గొంటారని ఆయన తెలిపారు.



ఇవ్వండి.. ప్లీజ్!

అమరావతి రైతులకు ప్రభుత్వం మరోసారి విన్నపం

- రాజధాని నిర్మాణాల మధ్య ఉన్న 1800 ఎకరాలు ఇవ్వాలని వినతి
- ల్యాండ్ పూలింగ్‌లో ఇస్తేనే లాభం.. కాదంటే.. భూసేకరణ: నారాయణ
- పెనుమాక, రాయపూడి, మల్కాపురంలో భూసేకరణకు సీఆర్డీఏ అడుగులు

గుంటూరు/తుళ్లూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణానికి రైతులు 32 వేల పైచిలుకు ఎకరాల భూములను భూ సమీకరణ(ల్యాండ్ పూలింగ్) కింద ఇచ్చారు. అయితే.. ఆయా భూముల మధ్యలో ఉన్న కొన్ని భూములను సంబంధిత రైతులు ఇప్పటికీ ఇవ్వలేదు. ఇలా.. 1800 ఎకరాల భూములు అమరావతి నిర్మాణాల మధ్యలో ఉండిపోయాయి. ఈ నేపథ్యంలో ఆయా భూములను కూడా రైతుల నుంచి తీసుకోవాలని సీఆర్డీఏ అథారిటీ నిర్ణయించింది. ఇప్పటికే సంబంధిత రైతులను ల్యాండ్ పూలింగ్ కింద అప్పగించాలని పలు దఫాలుగా కోరారు. అయినప్పటికీ వారు స్పందించడం లేదు. ఈక్రమంలో తాజాగా మరోసారి వారితో చర్చించి.. ల్యాండ్ పూలింగ్ కింద భూములు తీసుకోవాలని, లేకపోతే.. భూసేకరణ(ల్యాండ్ అక్విజిషన్) కింద అయినా తీసుకోవాలని నిర్ణయించారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం జరిగిన 52వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం నిర్ణయించింది. రాజధాని మాస్టర్‌ప్లాన్ పరిధిలోని నిడమర్రు, పెనుమాక, రాయపూడి, మల్కాపురం గ్రామాలలో కీలక నిర్మాణాల మధ్య ఉన్న భూములను రైతులు ల్యాండ్ పూలింగ్ కింద ఇవ్వలేదు. దీంతో ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణాలకు ఇబ్బందిగా మారింది. వాస్తవానికి భూసమీకరణ పద్ధతిని రాజధాని రైతులు దాదాపు అందరూ అంగీకరించారు. అయితే, వైసీపీ ప్రభావం అధికంగా ఉన్న గ్రామాల్లో కొందరు నిరాకరించారు. అప్పట్లో నిడమర్రు, పెనుమాక తదితర గ్రామాల్లో భూసమీకరణను అడ్డుకోవడానికి ప్రయత్నించారు. అవి సాధ్యపడకపోవడంతో తమ అనుకూలురైన రైతులను భూములు ఇవ్వకుండా నేతలు నిలువరింపజేశారు. ఇలా నాలుగు గ్రామాలకు సంబంధించి 80 మంది రైతులు భూములు ఇవ్వలేదని తెలుస్తోంది. అమరావతిలో ల్యాండ్ పూలింగ్ ద్వారా భూములు ఇవ్వని అతి కొద్ది మంది రైతులకు మరోసారి విజ్ఞప్తి చేస్తున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. రాజధాని రైతులకు భూసేకరణ కంటే సమీకరణ ద్వారానే ఎక్కువ లాభం చేకూరుతుందన్నారు. మిగిలిన 1800 ఎకరాలను భూసేకరణ ద్వారా తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు. భూసేకరణ అధికారాన్ని సీఆర్డీఏ కమిషనర్‌కు అప్పగించినట్లు వివరించారు. కాగా, రాజధాని అమరావతిలో ఈ నెలాఖరులోగా సీఆర్డీఏ ప్రాంతీయ కార్యాలయాన్ని ప్రారంభిస్తామని మంత్రి నారాయణ తెలిపారు. మంగళవారం రాయపూడి పరిధిలో నిర్మాణంలో ఉన్న సీఆర్డీఏ జోనల్ కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు.

సమీకరణతో రైతుకు లబ్ధి ఇదీ!

జరీబు భూమైతే ఎకరాకు నివాస స్థలం కింద 1000 గజాలు, వాణిజ్య స్థలం కింద 450 గజాలు ఇస్తారు.

మెట్ట భూమైతే నివాస స్థలంగా 1000 గజాలు, వాణిజ్య స్థలంగా 250 గజాలు లభిస్తాయి.

అసైన్ భూములైతే నివాస స్థలంగా 800 గజాలు, వాణిజ్య స్థలం కింద 100 గజాలు కేటాయిస్తారు.

అమరావతిలో పర్యటించిన జపాన్ బృందం

టోక్యో వర్సిటీ ఏర్పాటుకు భూముల పరిశీలన

తుళ్లూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రజా రాజధాని అమరావతిలో జపాన్‌కు చెందిన యూనివర్సిటీ ఆఫ్ టోక్యో బృందం మంగళవారం పర్యటించింది. అమరావతిలో యూనివర్సిటీ ఏర్పాటుకు అనుకూలమైన భూముల గురించి సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ వారికి డ్రోన్, మ్యాప్‌ల సాయంతో వివరించారు. పూర్తి పర్యావరణహితంగా, ప్రణాళికాబద్ధంగా ప్రపంచ స్థాయి సదుపాయాలతో నిర్మిస్తున్న రాజధాని గురించి వివరించారు. శాఖమూరు తదితర ప్రాంతాల్లో భూములను జపాన్ బృంద సభ్యులు పరిశీలించారు. అమరావతిలో విద్యాసంస్థల ఏర్పాటుకు అనుకూలమైన సదుపాయాలున్నాయని ఈ సందర్భంగా వారు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విట్, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ క్యాంపస్‌లను సందర్శించారు. ఈ క్యాంపస్‌లలో వేలాది మంది విద్యార్థులు పలు కీలకమైన కోర్సులు అభ్యసిస్తున్నారని ఆయా వర్సిటీల అధ్యాపకులు జపాన్ బృందానికి తెలిపారు. అమరావతిలో విద్యాసంస్థల ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి పూర్తిగా సహాయ సహకారాలు లభిస్తున్నాయని వివరించారు. జపాన్ బృందంలో టోక్యో వర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ యోషియాకి కజాయో, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, ప్రొఫెసర్ హయాషి కయోరి, ప్రాజెక్టు స్పెషలిస్ట్ జేమ్స్ ఫెగాన్ ఉన్నారు. సీఆర్డీఏ ఐటీ విభాగ ప్రాజెక్టు మేనేజర్ ఎం.లక్ష్మీప్రసన్న తదితరులు వారి వెంట పాల్గొన్నారు.



అమరావతి మాస్టర్ ప్లాన్ గురించి వివరిస్తున్న సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ ప్రవీణ్ చంద్

అమరావతి 'స్పెషల్'!

రాజధాని ప్రాజెక్టులకు ఎస్పీవీ

- వేగవంతంగా పూర్తి ప్రత్యేక చర్యలు
- గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టు సహా అన్ని నిర్మాణాలకూ వర్తింపు
- అర్బన్ డిజైన్లు, ఆర్కిటెక్చరల్ గైడ్‌లైన్స్ నోటిఫికేషన్‌కు ఆమోదం
- కన్వెన్షన్ సెంటర్ల ఏర్పాటుకు భూములు
- సీఆర్‌డీఏ అథారిటీ సమావేశంలో 7 అంశాలకు సీఎం చంద్రబాబు ఓకే



సీఆర్‌డీఏ సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణ, అధికారులు

అమరావతి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో కీలక నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా దృష్టి సారించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. మంగళవారం సీఎం క్యాంపు కార్యాలయంలో చంద్రబాబు నేతృత్వంలో 52వ సీఆర్‌డీఏ అథారిటీ సమావేశం జరిగింది. ఏడు అంశాలకు ఈ సమావేశంలో ఆమోదం లభించింది. రాజధాని పరిధిలో చేపట్టే కీలక ప్రాజెక్టులు వేగంగా కార్యరూపం దాల్చేలా స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్పీవీ) ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టు, ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు, స్మార్ట్ ఇండస్ట్రీస్, ఐకానిక్ బ్రిడ్జ్, స్పోర్ట్స్ సిటీ, రివర్‌ఫ్రంట్, రోప్‌వే, ఇన్నర్‌రింగ్ రోడ్డు వంటి ప్రాజెక్టుల పనులు త్వరిత గతిన పూర్తయ్యేందుకు ఎస్పీవీ దోహదపడుతుంది. అయితే, ఎస్పీవీ పరిధిలోకి బయో డిజైన్ ప్రాజెక్టును కూడా తీసుకురావాలని అధికారులకు సీఎం సూచించారు. స్పోర్ట్స్ సిటీ తరహాలోనే హెల్త్‌సిటీ కూడా అమరావతిలో ఏర్పాటు కానుందని.. దాని పరిధిలో బయో డిజైన్ ప్రాజెక్టు ఏర్పాటు చేయాలని సీఎం చెప్పారు. ప్రజారోగ్య సేవల నిమిత్తం బయోడిజైన్ ప్రాజెక్టులో భాగస్వాములుగా ఉండేందుకు 7 దేశాలకు చెందిన నిపుణులు, సంస్థలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఆయా ప్రాజెక్టుల డిజైన్, నిధులు సమకూర్చడం మొదలు నిర్మాణం పూర్తయ్యేంత వరకు ఎస్పీవీనే పూర్తి బాధ్యత వహించనున్నట్లు అధికారులు వివరించారు.

మౌలిక సదుపాయాలపై దృష్టి

అమరావతిలో ప్రభుత్వ భవనాల సముదాయం కోసం మౌలిక సదుపాయాల కల్పన పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. దీనికి సంబంధించిన టెండర్‌కు సీఆర్‌డీఏ అథారిటీ ఆమోదం తెలిపింది. ఆ భవనాల సముదాయానికి అనుసంధానంగా రహదారులు, ఫుట్‌పాత్‌ల నిర్మాణం పనులు మొదలు కానున్నాయి. దీనిలో భాగంగా 53.68 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. దీంతో పాటు ఏడేళ్లపాటు వాటి నిర్వహణ బాధ్యతను కూడా టెండర్ దక్కించుకున్న సంస్థే చేపట్టేలా నిబంధన పెట్టినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రాజధాని అర్బన్ డిజైన్లు, ఆర్కిటెక్చరల్ మార్గదర్శకాల నోటిఫికేషన్ జారీకి అథారిటీ ఆమోదం తెలిపింది. డిజైన్లపై జాగ్రత్తలు తీసుకోవాలని, అమరావతి నగరం ఆకర్షణీయంగా కనిపించేలా ఉండాలని చంద్రబాబు సూచించారు. ప్రతి కట్టడమూ ప్రజలను ఆకర్షించేలా ఉండాలని స్పష్టం చేశారు. సీఆర్‌డీఏ పరిధిలో చేపడుతున్న ప్రాజెక్టులతో కార్యకలాపాలు పెరిగాయని అధికారులు చెప్పగా.. ఈ మేరకు అవసరమైన సిబ్బందిని డిప్యూటేషన్, ఆన్‌డ్యూటీ విధానంలో నియమించుకునేందుకు సీఎం అనుమతించారు.

అదనంగా భూములు

రాజధాని పరిధిలో కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణం కోసం కొన్ని ప్రముఖ హోటళ్లు ముందుకు వచ్చాయని అధికారులు సీఎంకు వివరించారు. ఇప్పటికే కొన్ని ప్రముఖ హోటళ్లకు భూములు కేటాయించామని.. వాటికి అనుబంధంగా కొందరు కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణం చేపట్టాలని భావిస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలో అదనంగా భూములు కేటాయించాలని కోరినట్లు చెప్పారు. నిర్మాణాలు ప్రపంచ ప్రమాణాలకు దీటుగా ఉండాలని సూచిస్తూ.. ముందుకొచ్చిన సంస్థలకు కన్వెన్షన్ సెంటర్ల నిమిత్తం భూములు ఇచ్చేందుకు సీఎం అంగీకరించారు. మాస్టర్ ప్లాన్ అవసరాలకు అనుగుణంగా ఏమైనా భూసేకరణ చేపట్టాలంటే రైతులతో మాట్లాడి ఈ ప్రక్రియ చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సీఎంకు వివరించారు. కృష్ణానదిలోని ద్వీపాలను అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకర్షించేలా చూడాలని చంద్రబాబు సూచించారు. ఈ సమావేశంలో మంత్రి నారాయణతో పాటు మున్సిపల్, సీఆర్‌డీఏ, ఏడీసీ సహా వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

పంటి నొప్పి అని వెళ్తే ప్రాణమే పోయింది

తీవ్ర రక్తస్రావంతో వివాహిత మృతి

- కాకినాడ జిల్లా సర్పవరంలో ఘటన

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): పిప్పి పళ్ల నొప్పి భరించలేక ఆస్పత్రికి వచ్చిన మహిళ... దంత వైద్యురాలి నిర్వాకంతో ఏకంగా ప్రాణాన్నే కోల్పోవాల్సి వచ్చింది. కాకినాడ జిల్లా రూరల్ మండలం రమణయ్యపేట శివారు గైగోలుపాడుకు చెందిన మేడిశెట్టి దుర్గాభవానీ (38) పిప్పి పన్ను నొప్పితో గత నెల 30వ తేదీ రాత్రి సర్పవరం జంక్షన్‌లోని గోదావరి డెంటల్ ఆస్పత్రికి వచ్చింది. పరీక్షించిన వైద్యురాలు సంధ్యారాణి ఆరు పళ్లకు ఇంజెక్షన్లు ఇచ్చి, వాటిని ఒకేసారి తొలగించారు. అక్కడ కాటన్ పెట్టి అదేరోజు రాత్రి ఇంటికి పంపేశారు. ఇంటికెళ్లిన తర్వాత పళ్ల నుంచి రక్తం కారడం, వాంతులు అవ్వడంతో వైద్యురాలికి పలుమార్లు ఫోన్ చేశారు. ఆమె స్పందించకపోవడంతో దుర్గాభవానీని అర్ధరాత్రి సమయంలో స్థానిక ట్రస్ట్ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ మూడు రోజులు చికిత్స పొందిన దుర్గాభవానీ మంగళవారం తీవ్ర అస్వస్థతకు గురవడంతో డాక్టర్లు పలు వైద్య పరీక్షలు చేశారు. ఈ పరీక్షల్లో ఆమెకు బోన్‌మ్యారో క్యాన్సర్ ఉందని, మెదడులో తీవ్ర రక్తస్రావమైందని గుర్తించారు. ఆ తర్వాత ఆమె బ్రెయిన్ డెడ్ అయినట్టు నిర్ధారించారు. అయితే సోమవారం రాత్రి కూడా తనతో మాట్లాడిన భార్యకు మంగళవారం ఉదయానికల్లా సీరియస్ అయి ప్రాణాలు కోల్పోయిందని చెప్పడంపై ఆమె భర్త వెంకటరమణ ఆగ్రహం వ్యక్తం చేశాడు. క్యాన్సర్ ఉన్న సంగతి తమకు తెలీదని.. అయినా ఒక్కరోజులోనే బ్రెయిన్ డెడ్ ఎలా అవుతుందో చెప్పాలని వైద్యులను నిలదీశాడు. తన భార్య చనిపోవడానికి కారణమైన దంత వైద్యురాలిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు. ట్రస్ట్ ఆస్పత్రి వైద్యులపైనా ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు.

ఆన్‌లైన్ గేమ్స్‌కు యువకుడు బలి

- అప్పులు పెరిగిపోవడంతో నల్లమలలో ఉరి.. మృతుడు హైదరాబాద్ వాసి



సాయికుమార్

పెద్దదోర్నాల, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ గేమ్‌లో డబ్బులన్నీ పోగొట్టుకుని, అప్పులపాలై, ఆ అప్పులు తీర్చలేక, ఒత్తిడికి గురై యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల మండలం చిన్నారుట్లలో మంగళవారం ఈ ఘటన వెలుగుచూసింది. చిన్నారుట్ల వద్ద నల్లమల అడవిలో చెట్టుకు ఉరి వేసుకొని యువకుడు మృతి చెందిన విషయమై వచ్చిన సమాచారం మేరకు పోలీసులు వచ్చి... పరిశీలించగా శ్రీశైలం-దోర్నాల ఘాట్ రోడ్డుపై బైక్ ఉంది. మృతదేహం నుంచి దుర్వాసన వస్తుండటంతో నాలుగైదురోజుల కిందట ఆత్మహత్య చేసుకొని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. పరిసరాల్లో దొరికిన సెల్‌ఫోన్ ఆధారంగా మృతుడి కుటుంబ సభ్యులతో పోలీసులు మాట్లాడారు. మృతుడిని హైదరాబాద్ బండ్లగూడకు చెందిన ముక్కెర సాయికుమార్(27)గా గుర్తించారు. పోస్టుమార్టం తర్వాత మృతదేహాన్ని బంధువులు హైదరాబాద్ తీసుకెళ్లినట్లు ఎస్ఐ తెలిపారు.

డీఎస్సీలో భర్తీకాని 700 పోస్టులు!

దసరా సెలవుల్లో కొత్త టీచర్లకు శిక్షణ

నేడు, రేపు మూడో విడత సర్టిఫికెట్ల పరిశీలన

అమరావతి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో ప్రకటించిన 16,347 పోస్టుల్లో అభ్యర్థులు లేక సుమారు 700 పోస్టులు మిగిలే పరిస్థితి కనిపిస్తోంది! ఇప్పటివరకూ జరిగిన సర్టిఫికెట్ల పరిశీలనతో అధికారులు ఈ అంచనాకు వచ్చారు. కాగా.. సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ మొత్తం పూర్తవడానికి మరో రెండు రోజులు పట్టే అవకాశం ఉంది. రెండో విడతలో 627 మంది అభ్యర్థులకు కాల్ లెటర్లు పంపగా.. మంగళవారానికి వారిలో 480 మంది సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయింది. బుధవారం మధ్యాహ్నానికి రెండో విడత ప్రక్రియ పూర్తిచేసి, సాయంత్రం నుంచి మూడో విడత పరిశీలన ప్రారంభిస్తారు. మొత్తంగా 15,600 మంది అభ్యర్థులే ఎంపికయ్యే అవకాశం కనిపిస్తోంది. మిగిలిన పోస్టులను తర్వాత డీఎస్సీలో భర్తీ చేస్తారు. కాగా.. కొత్తగా ఎంపికైన టీచర్లకు దసరా సెలవుల్లో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. ఈలోపే వారు పాఠశాలలకు వచ్చే అవకాశం ఉంది. మొత్తం ప్రక్రియ పూర్తయ్యాక ఎంపికైన వారి జాబితాలు ప్రకటిస్తారు. అనంతరం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇస్తారు.

నటి రన్యారావుకు 102 కోట్ల జరిమానా

బంగారం స్మగ్లింగ్ కేసులో విధించిన డీఆర్ఐ



బెంగళూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): బంగారం స్మగ్లింగ్ కేసులో అరెస్టు అయిన కన్నడ నటి రన్యారావుకు డీఆర్ఐ(డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్) అధికారులు రూ.102 కోట్ల జరిమానా విధించారు. ఇదే కేసులో నిందితులుగా ఉన్న హోటల్ నిర్వాహకుడు తరుణ్ కొండరాజుకు రూ.63 కోట్లు, ఆభరణాల వ్యాపారులు సాహిల్ సకరియా, భరత్ కుమార్ జైన్‌లకు చెరో రూ.56 కోట్లు జరిమానా విధించారు. మంగళవారం బెంగళూరు సెంట్రల్ జైలుకు వచ్చిన డీఆర్ఐ అధికారులు ఈమేరకు నలుగురు నిందితులకు ఒక్కొక్కరికి 250 పేజీల నోటీసులు, 2,500 పేజీల అనుబంధ పత్రాలు అందజేశారు. నలుగురికీ కలిపి నోటీసులు, అనుబంధ పత్రాలు మొత్తం 11 వేల పేజీలు అందజేశామని డీఆర్ఐ వర్గాలు ఒక ఆంగ్ల వార్తా సంస్థకు తెలిపాయి. ఈ ఏడాది మార్చి 3న దుబాయి నుంచి వచ్చిన రన్యారావు.. బెంగళూరు విమానాశ్రయంలో 14.8 కిలోల బంగారంతో పట్టుబడ్డారు. ఆమె కర్ణాటక డీజీపీ ర్యాంక్ అధికారి కె.రామచంద్రరావు రెండో భార్య కుమార్తె. విదేశీ మారకం పరిరక్షణ, స్మగ్లింగ్ కార్యకలాపాల నిరోధక చట్టం(కొఫెపోసా) కింద రన్యారావుకు ఈ ఏడాది జూలైలో ఏడాది జైలుశిక్ష విధించారు.

ఎరువుల కోసం ఆందోళన వద్దు

- గతేడాది కన్నా ఎక్కువగానే సరఫరా
- యూరియా బ్లాక్ చేస్తే కఠిన చర్యలు
- అధికారులను ఆదేశించిన సీఎం చంద్రబాబు



ఎరువుల లభ్యత, ఉద్యాన పంటలపై సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు, మంత్రి అచ్చెన్నాయుడు తదితరులు

అమరావతి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎరువుల సరఫరాపై రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, డిమాండ్ కన్నా అదనంగానే నిల్వలు ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోకుండా కఠినంగా వ్యవహరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం ఉండవల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఉద్యాన పంటలు, ఎరువుల లభ్యత, ఉల్లి కొనుగోలు తదితర అంశాలపై సీఎం సమీక్ష జరిపారు. ఈ-క్రాప్ ద్వారా రాష్ట్రంలో ఎంత మేరకు, ఏ పంటలు సాగవుతున్నాయో, ఎరువులు వినియోగం ఎంత జరుగుతున్నదో లెక్కలు తీయాలని అధికారులను ఆదేశించారు. నిరంతర పర్యవేక్షణ ద్వారా సమస్య రాకుండా చూడాలన్నారు. ఈ సీజన్‌లో 2.02 లక్షల టన్నుల యూరియా రాష్ట్రానికి సరఫరా అయ్యిందని, వాస్తవ డిమాండ్ కన్నా అదనంగా నిల్వలు ఉన్నాయని అధికారులు చెప్పారు. గతంతో పోల్చితే ఈసారి 91 వేల టన్నుల యూరియా అదనంగా వచ్చిందని, డీఏపీ 16వేల టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 1.20లక్షల టన్నులు అదనంగా వచ్చాయని వివరించారు. దీనిపై సీఎం స్పందిస్తూ.. రాష్ట్రంలో ఎరువుల లభ్యత ఇంతగా ఉన్నా.. కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. రసాయన ఎరువులు, పురుగు మందుల రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దాలని అధికారులకు నిర్దేశించారు. రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం తగ్గించిన రైతులకు రాయితీలు ఇచ్చే అంశంపై ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రైతుసేవా కేంద్రాల ద్వారా కూడా గణాంకాలు నమోదు చేయాలన్నారు. రాష్ట్రంలోని 11 ఉద్యాన పంటలకు కనీస ధర వచ్చేలా చూడాలని ఆదేశించారు. రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టపోవటానికి వీల్లేదన్నారు. మరోవైపు కాఫీ తోటలకు కొత్తగా వచ్చిన బెర్రీ బోరర్ తెగులుపై తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. కొత్త తెగులు వచ్చిన కాఫీ పంట 20 ఎకరాల్లోనే ఉంటుందని, దానిని తక్షణమే తొలగించాల్సిన అవసరం ఉందని అధికారులు చెప్పగా, తొలగించిన పంటకు నష్ట పరిహారం చెల్లించి, రైతులను ఆదుకోవాలని సీఎం సూచించారు. ఇతర ప్రాంతాలకు తెగులు వ్యాపించకుండా చర్యలు చేపట్టాలన్నారు. మరోవైపు ఉల్లి పంట మొత్తాన్ని కొనుగోలు చేయాల్సిందిగా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కొనుగోలు చేసిన ఉల్లిని స్థానికంగా కమ్యూనిటీ హాళ్లలో ఆరబెట్టాలని మార్కెటింగ్ శాఖ అధికారులకు సూచించారు. ఇప్పటివరకు హెచ్‌డీ బర్లీ పొగాకు కొనుగోలుకు సంబంధించి రూ.54కోట్లు చెల్లింపులు జరిగాయని, మరో రూ.59కోట్లు చెల్లించాల్సి ఉందని అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. సమీక్షలో మంత్రి అచ్చెన్నాయుడు, సీఎస్ విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి మరో 53వేల టన్నుల యూరియా

- రికార్డు స్థాయిలో కేటాయించిన కేంద్రం
- ఎరువుల కొరత లేదు: వ్యవసాయ శాఖ

రాష్ట్రానికి అదనంగా 53వేల టన్నుల యూరియాను కేంద్రం కేటాయించిందని వ్యవసాయ శాఖ తెలిపింది. కాకినాడ పోర్టుకు 17,154 టన్నులు, గంగవరం పోర్టుకు 26,547టన్నులు, కృష్ణపట్నం పోర్టుకు 9,200 టన్నుల యూరియా చేరుకుందని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. గత 10 రోజుల్లో 22వేల టన్నుల యూరియా రాగా, వచ్చే 10 రోజుల్లో మరో 30వేల టన్నులు రానున్నట్లు తెలిపింది. దేశీయంగా వివిధ కంపెనీల ఎరువులు కూడా అందుబాటులో ఉన్నాయని, రైతులకు ఎరువుల కొరత లేదని స్పష్టం చేసింది. రబీ సీజన్‌లోనూ ఎరువుల కొరత ఉండదని తెలిపింది.

రైతులపై జగన్ మొసలి కన్నీరు

- వారిలో అయోమయం సృష్టిస్తున్నారు: అచ్చెన్న



అమరావతి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రైతులకు ఏ సమస్య వచ్చినా వారు అడక్కముందే స్పందించి, మేలు చేస్తుంటే.. రాష్ట్రానికి ఐదేళ్లు సీఎంగా వెలగబెట్టిన జగన్.. వారిలో అయోమయం సృష్టిస్తున్నారని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. రైతులకు యూరియా అందట్లేదని, ఉల్లి కొనట్లేదని తప్పుడు పోస్టులతో దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. రైతులపై కొందరు మొసలి కన్నీరు కారుస్తున్నారు, ప్రతీదీ రాజకీయం చేసి, రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. మిర్చి, కోకో, నల్ల బర్లీ, చిత్తూరు జిల్లాలో తోతాపురి రైతులను ప్రభుత్వం ఆదుకున్నదని చెప్పారు. ఉల్లి ధర పడిపోతే క్వింటా రూ.1,200 చొప్పున కొనాలని సీఎం నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. యార్డుకు వచ్చే ప్రతి ఉల్లిగడ్డా కొనుగోలు చేస్తున్నాం. దీనికి హర్షించకుండా, ఉల్లి కొనట్లేదని తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వస్తే.. దేనిమీదైనా చర్చిస్తామన్న చంద్రబాబు వ్యాఖ్యల్ని విమర్శిస్తున్న సజ్జలకు ఏ అర్హత ఉంది? నువ్వేమైనా ఎమ్మెల్యేవా, వార్డు మెంబర్‌వా? అని నిలదీశారు. జగన్‌కు ప్రతిపక్ష హోదాను ప్రజలు ఇవ్వకపోతే.. ఎవరేం చేస్తారని మంత్రి ప్రశ్నించారు.

బిల్లులిచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

- జగనన్న కాలనీ భూముల అక్రమాలపై సోమిరెడ్డి



ముత్తుకూరు/నెల్లూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): పనులు చేయకుండానే జగనన్న కాలనీ చదును పేరుతో రూ.లక్షల్లో బిల్లులు మంజూరు చేసిన అధికారులపై చర్యలు తీసుకుంటామని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. నెల్లూరు జిల్లా ముత్తుకూరు పంచాయతీ బోడిస్వామి కండ్రికలో జగనన్న కాలనీ ఏర్పాటు కోసం తీసుకున్న భూములను బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎస్.వంశీధర్‌రెడ్డితో కలసి మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 'గత వైసీపీ ప్రభుత్వంలో జగనన్న కాలనీ ఏర్పాటు కోసం తీసుకున్న భూములను చదును చేయకుండానే బిల్లులు స్వాహా చేశారు. పక్కనే ఉన్న దళితుల భూముల నుంచి మట్టి తోలుకుని ప్రైవేటుగా అమ్ముకున్నారు. చదును చేయకుండానే రూ.లక్షలు బిల్లులు స్వాహా చేసిన వారిని వదిలిపెట్టబోం అని హెచ్చరించారు. కాగా, 'పులివెందుల జడ్పీటీసీని గెలిపించుకోలేని జగన్‌రెడ్డిని కలవాలంటే ఎంట్రీపాస్ ఉండాలంట! సొంత నియోజకవర్గం, సొంత మండల ప్రజలు కలవాలంటే కూడా పాస్ తీసుకోవాలంట! ఇవన్నీ నియంతపోకడలకు నిదర్శనం' అని నెల్లూరులో విలేకరులతో మాట్లాడుతూ సోమిరెడ్డి విమర్శించారు.

పేర్ని, సజ్జలకు మతి భ్రమించింది

- మిథున్‌రెడ్డి, పెద్దిరెడ్డి శుద్ధపూసలా!: బుద్దా వెంకన్న



విజయవాడ(వన్‌టౌన్), సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు పేర్ని నాని, సజ్జల రామకృష్ణారెడ్డి మతిభ్రమించి మాట్లాడుతున్నారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న విమర్శించారు. విజయవాడలోని తన కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మిథున్‌రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శుద్ధపూసలు అన్నట్లు వైసీపీ నాయకులు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మరో మూడు దశాబ్దాలు గడిచినా కూడా వైసీపీ అధికారంలోకి రావటం కల్ల అన్నారు. పేర్ని, సజ్జల వల్ల ఆ పార్టీ మరింతగా దిగజారిపోతోందన్నారు. ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకోవాలని హితవు పలికారు.

మాన్సాస్ పూర్వ వైభవానికి కృషి

- గత ప్రభుత్వం ఈ విద్యా సంస్థలను ఇబ్బందులకు గురిచేసింది
- రాజ్యాంగాన్ని, న్యాయస్థానాలనూ ధిక్కరించింది
- మాన్సాస్ చైర్మన్, గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు





విజయనగరం కోటలో పునర్నిర్మించిన 'మాన్సాస్' మోతీ మహల్‌ను ప్రారంభిస్తున్న అశోక్ గజపతిరాజు

విజయనగరం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): విజయనగరం మాన్సాస్ విద్యాసంస్థల పూర్వవైభవానికి కృషి చేస్తామని మాన్సాస్ ట్రస్ట్ చైర్మన్, గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు అన్నారు. రూ12.75 కోట్ల ట్రస్టు నిధులతో పునర్నిర్మించిన విజయనగరం కోటలోని మాన్సాస్ విద్యాసంస్థలకు చెందిన మోతీ మహల్, అదనపు తరగతి గదులను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యా వ్యాప్తి కోసమే తమ పూర్వీకులు మహారాజా అలక్ నారాయణ సొసైటీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ (మాన్సాస్) సంస్థను స్థాపించారని, ఆ లక్ష్యంతోనే నేటికీ ముందుకు సాగుతోందని చెప్పారు. కానీ, ఐదేళ్ల క్రితం అధికారం వెలగబెట్టిన అప్పటి ప్రభుత్వం మాన్సాస్‌ను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందని, సిబ్బందికి జీతాలు కూడా ఇవ్వకుండా ఇబ్బంది పెట్టిందని చెప్పారు. రాష్ట్రంలో పలు ఎయిడెడ్ విద్యా సంస్థల మూసివేత, ప్రభుత్వ పాఠశాలల అసంబద్ధ విలీనంతో 14లక్షల మంది విద్యార్థులను విద్యకు దూరం చేసిందని ఆరోపించారు. గత ప్రభుత్వం రాజ్యాంగాన్ని, న్యాయస్థానాలను కూడా ధిక్కరించిందని విమర్శించారు. భవిష్యత్తులో ఇలాంటి తప్పు మరోసారి జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. కాగా, విజయనగరం కోట భవిష్యత్ తరాల అభివృద్ధికి దోహదపడుతుందంటూ.. మోతీ మహల్ భవన పునఃనిర్మాణానికి కృషిచేసిన ప్రతి ఒక్కరికీ ఆయన అభినందనలు తెలిపారు. సమావేశంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొప్పర్తికి లక్ష ఉద్యోగాలు

(మొదటి పేజీ తరువాయి)

ఇక్కడ వంటలు తయారుచేసి చుట్టుపక్కల 136 స్కూళ్లకు ప్రత్యేక వాహనాల్లో పంపించనున్నారు. వంట కోసం ఆర్వోప్లాంట్ నీటిని వినియోగించనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం 10వ తరగతి విద్యార్థినులతో మంత్రి భేటీ అయ్యారు. చింతకొమ్మదిన్నె మండలం కొప్పర్తి ఎలక్ట్రానిక్ మ్యానిఫ్యాక్చరింగ్ క్లస్టర్‌లో నూతనంగా ఏర్పాటు అయిన ఎగ్జిక్యూటివ్ సెంటర్ భవనాన్ని మంత్రి లోకేశ్ ప్రారంభించారు. టీవీలను తయారు చేసే ఎంఎస్ టెక్నోడోమ్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్‌ను, రెడీమెడ్ దుస్తులు తయారుచేసే టెక్సొసానా వరల్డ్ ప్రైవేటు లిమిటెడ్ పరిశ్రమలను కొప్పర్తి మెగా ఇండ్రస్ట్రియల్ హబ్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత, స్థానిక ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డితో కలిసి ఆరంభించారు. మహిళలను ఎక్కడ గౌరవిస్తే అక్కడే అక్కడే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. అనంతరం మహిళలతో కలిసి సెల్ఫీ దిగారు. పరిశ్రమ లోపల తిరిగి ఎల్ఈడీ టీవీల తయారీని పరిశీలించారు.



సీకే దిన్నెలో లోకేశ్ ప్రారంభించిన డొక్కా సీతమ్మ స్మార్ట్ కిచెన్

కార్యకర్తలకు అండగా ఉంటాం: లోకేశ్

కార్యకర్తలకు అండగా ఉంటామని మంత్రి లోకేశ్ తెలిపారు. సీకేదిన్నె మండలం కొలుములపల్లెలో 69వ ప్రజాదర్బార్‌ను ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేశ్‌ను కలిసేందుకు పెద్ద ఎత్తున ప్రజలు, పార్టీ కార్యకర్తలు తరలి వచ్చారు. ప్రజలు, కార్యకర్తల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. ప్రతి ఒక్కరితో ఆప్యాయంగా మాట్లాడారు. అనంతరం వారితో కలిసి ఫొటోలు దిగారు.



కొప్పర్తిలోని దుస్తుల తయారీ పరిశ్రమలో సిబ్బందితో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్

థ్యాంక్స్ సార్ పుస్తకాల బరువు తగ్గించారు

» లోకేశ్‌తో భేటీలో విద్యార్థుల సంతోషం

ప్రభుత్వం చేపట్టిన విద్యాసంస్కరణలతో కలుగుతున్న మంచి గురించి మంత్రి లోకేశ్ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. "సెమిస్టర్‌వైజ్ టెస్ట్‌బుక్ విధానం మాకు ఉపయోగకరంగా ఉంది. దాని నివల్ల పుస్తకాల బరువు తగ్గింది. సోషల్ స్టడీస్‌లోని నాలుగు టెక్స్ట్ బుక్‌లను రెండిటికి కుదించాలి. ఇంగ్లీష్ టెస్ట్‌బుక్, సప్లిమెంటరీ కలిపి ఒకటిగా ఇస్తే బాగుంటుంది. సన్నబియ్యం ఇస్తుండడం వలన మధ్యాహ్న భోజనం గతం కంటే బాగుంది. బుక్‌లెట్స్ బాగున్నాయి." అని పేర్కొన్నారు. వారి సూచనలను మంత్రి సానుకూలంగా ఆలకించారు. అనంతరం పెండ్లిమర్రి మండల పరిధిలోని చెర్లోపల్లె పంచాయతీలో రూ.12కోట్లతో నిర్మించిన అధునాతన ఆదర్శ డిగ్రీ కళాశాల భవనాలను లోకేశ్ ప్రారంభించారు. పీఎం ఉష పథకంలో భాగంగా యోగివేమన వర్సిటీలో రూ.20 కోట్లతో నిర్మించనున్న ఆడిటోరియం, నూతన పరిపాలన భవనానికి శంకుస్థాపన చేశారు.

జగన్ కాస్త అప్‌డేట్ అవ్వూ!

అమరావతి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుపై అక్కసు, బుర ద చల్లడమే లక్ష్యంగా వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ చేసిన ప్రయత్నం అబాసుపాలైంది. 'హెరిటేజ్ ఫ్రెష్' యజమాని ఎవరో కూడా తెలుసుకోకుండా ఆయన, చంద్రబాబుపై విమర్శలు చేశారు. మంగళవారం కడప జిల్లా వేముల మండలం దుగ్గన్నగారి పల్లి వద్ద ఉల్లి పంటను పరిశీలించిన జగన్.. రైతులతో కూటమి సర్కార్ ఆడుకుంటోంది. ఉల్లి క్వింటాకు రూ.800 కూడా గిట్టుబాటు కావడం లేదు. రైతుల నుంచి కేవలం రూ.6కు కొని అదే ఉల్లిని హెరిటేజ్ ఫ్రెష్ దుకాణాల్లో కేజీ రూ.35 చొప్పున అమ్ముతున్నారు. చంద్రబాబు తన లాభాలు కొద్దిగా తగ్గించుకున్నా రైతులకు మేలు జరుగుతుంది' అంటూ విమర్శించారు. హెరిటేజ్ ఫ్రెష్ ఇంకా చంద్రబాబుదేనన్న ఉద్దేశంతో జగన్ ఈ వ్యాఖ్యలు చేశారు. వాస్తవానికి సుమారు 9 ఏళ్ల క్రితమే హెరిటేజ్ ఫ్రెష్‌ను చంద్రబాబు కుటుంబం విక్రయిం చేసింది. కానీ జగన్ మాత్రం హెరిటేజ్ ఫ్రెష్ చంద్రబాబుదేనంటూ చేసిన వ్యాఖ్యలపై ప్రస్తుతం నెటిజన్లు సెటైర్లు వేస్తున్నారు. 'ఓ జగనూ.. హెరిటేజ్ ఫ్రెష్‌ను అమ్మేసి కొన్ని సంవత్సరాలు గడిచాయి. ఇప్పుడే నిద్రలేచి హెరిటేజ్.. హెరిటేజ్ అని కలవరిస్తే ఎలా చెప్పు. జగన్ కాస్త అప్‌డేట్ అవ్వూ.... ఏళ్లనాటి వెనుకబాటు నుంచి బయటకురా' అంటూ వ్యాఖ్యానిస్తున్నారు.

విశాఖలో టీసీఎస్ బిల్డింగ్ సిద్ధం!

విశాఖపట్నం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఐటీ రంగాన్ని మరో మెట్టుపైకి తీసుకువెళ్లే దిగ్గజ కంపెనీ టీసీఎస్ తన కార్యకలాపాలు ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. రుషికొండ ఐటీ పార్కు హిల్ నంబరు-3పై మిలీనియం టవర్స్‌ను టీసీఎస్‌కు ప్రభుత్వం కేటాయించిన విషయం తెలిసిందే. బిల్డింగ్‌లో అవసరమైన ఇంటీరియర్ పనులన్నీ టీసీఎస్ చేయిస్తోంది. ఇవి పూర్తికావచ్చాయి. భవనంపై టీసీఎస్ పేరుతో బోర్డును ఏర్పాటు చేసింది. త్వరలో 2 వేల మంది ఉద్యోగులతో ఈ క్యాంపస్ ప్రారంభం కానుంది. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర నగరాల్లో పనిచేస్తున్న ఉత్తరాంధ్రకు చెందిన ఉద్యోగులను తొలుత విశాఖపట్నం తీసుకువచ్చి, ఆ తరువాత కొత్తవారిని రిక్రూట్ చేసుకుంటారని సమాచారం. కాగా, టీసీఎస్ సొంత క్యాంపస్ ఏర్పాటు చేసుకోవడానికి రుషికొండ ఐటీ పార్కులోని హిల్ నంబరు-3 పైనే 21.6 ఎకరాలు కేటాయించిన సంగతి తెలిసిందే. ఎకరా 99 పైసలు చొప్పున ఇచ్చారు. సుమారు రూ.1,370 కోట్ల పెట్టుబడితో 12 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇవ్వడంతో ప్రభుత్వం భూమి ఇచ్చింది.

కోర్టు సందేహాలకు 'సిట్' జవాబులు

» మిథున్‌రెడ్డి బెయిల్‌పై విచారణ నేటికి వాయిదా

విజయవాడ, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో దాఖలు చేసిన 2 చార్జిషీటులపై కోర్టు వ్యక్తం చేసిన సందేహాలకు సిట్ అధికారులు సమాధానాలు ఇచ్చారు. వివరణతో కూడిన పిటిషన్‌ను కోర్టులో అందజేశారు. కొద్దిరోజుల క్రితం చార్జిషీట్‌లపై ఏసీబీ కోర్టు న్యాయాధికారి పి.భాస్కరరావు 21 సందేహాలను లేవనెత్తుతూ సిట్ దర్యాప్తు అధికారికి మెమో పంపారు. కాగా, ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు వేయడానికి మధ్యంతర బెయిల్, మద్యం కేసులో రెగ్యులర్ బెయిల్ ఇవ్వాలని ఎంపీ మిథున్‌రెడ్డి దాఖలు చేసిన రెండు పిటిషన్లపై మంగళవారం జరగాల్సిన విచారణను కోర్టు బుధవారానికి వాయిదా వేసింది.

ఎయిరిండియా విమానాల్లో వృద్ధులకు టికెట్‌పై రాయితీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 2: ఎయిరిండియా విమానయాన సంస్థ 60 ఏళ్లు పైబడినవారికి టికెట్ ధరపై రాయితీ ప్రకటించింది. అంతర్జాతీయ సర్వీసుల్లో టికెట్ మూల ధరపై 10% వరకు, దేశీయ సర్వీసుల్లో అయితే 25% వరకు రాయితీ ఇస్తామని వెల్లడించింది. ఎకనామీ, బిజినెస్ క్లాస్ సహా అన్ని రకాల టికెట్లపై ఈ రాయితీ వర్తిస్తుంది. అలాగే, సాధారణం కంటే 10 కిలోల వరకు అదనపు లగేజీని సీనియర్ సిటిజన్లు తీసుకెళ్లే అవకాశాన్ని ఎయిరిండియా ఇస్తుంది.

హిందీ సలహా కమిటీలో ఆర్.కృష్ణయ్య

కేంద్ర సామాజిక న్యాయం, సశక్తీకరణ మంత్రిత్వ శాఖ పరిధిలోని హిందీ సలహా కమిటీని పునర్వ్యవస్థీకరించారు. ఈ కమిటీకి ఎంపీలు ఆర్.కృష్ణయ్య, సురేశ్ కుమార్ కశ్యప్, సంధ్య రాయ్, ధైర్యశీల్ మోహన్ నామినేట్ అయ్యారు.

బీఆర్ఎస్ నుంచి కవిత సస్పెన్షన్



(మొదటి పేజీ తరువాయి)

కొనసాగిస్తున్న పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు బీఆర్ఎస్‌కు నష్టం కలిగించే విధంగా ఉన్నాయని తెలిపింది. పార్టీ అధిష్ఠానం ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తోందని చెప్పింది. అందుకే పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ కవితను తక్షణమే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారని తెలిపింది. సోమవారం రాత్రే కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తారని భావించారు. సోమవారం మీడియా సమావేశంలో హరీశ్‌రావు, సంతోష్‌రావులు అవినీతి అనకొండలంటూ కవిత సంచలన ఆరోపణలు చేశారు. కేసీఆర్‌కు అవినీతి మరక అంటడానికి వారిద్దరే కారణమని ఆరోపించారు. ఆమె వ్యాఖ్యలు బీఆర్ఎస్‌లో తీవ్ర కలకలం రేపాయి. కేటీఆర్ సహా పలువురు ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు సోమవారమే ఎర్రవెల్లిలోని కేసీఆర్ ఫామ్‌హౌజ్‌కు వెళ్లారు. కవిత తీరుతో పార్టీకి జరిగే నష్టాన్ని కేసీఆర్‌కు వివరించారు. ఆమెతో పార్టీకి ఏమైనా లాభం ఉందా? అని కేసీఆర్ వారిని అడిగినట్లు సమాచారం. లాభం సంగతి అటుంచితే పార్టీకి తీవ్ర నష్టం జరుగుతోందని, విపక్షాలకు ఆయుధం ఇచ్చినట్లు అవుతోందని నేతలంతా కేసీఆర్‌కు వివరించారు. పార్టీ నుంచి ఆమెను సాగనంపాల్సిందేనని పట్టుబట్టారు. అయితే, కేసీఆర్ వెంటనే ఒక నిర్ణయానికి రాలేదని సమాచారం. మంగళవారం ఉదయం మరోమారు ఫామ్‌హౌజ్‌లోనే కీలక నేతలతో భేటీ అయ్యారు. కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రులు జగదీశ్వర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు కల్వకుంట్ల సంజయ్‌రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. కవితను సస్పెండ్ చేయని పక్షంలో అనేక మంది పార్టీలో ఉంటూ పార్టీకే నష్టం కలిగించేలా వ్యవహరిస్తారనే అంశం చర్చకు వచ్చింది. దాంతో కేసీఆర్ తన తనయపై వేటుకు సిద్ధమయ్యారు. మధ్యాహ్నం ఒకటిన్నర సమయంలో సస్పెన్షన్ ప్రకటన వెలువడింది. తొలుత ఏకంగా బహిష్కరణ వేటు వేయాలని నిర్ణయించారు. తర్వాత అధికారిక ప్రకటనలో సస్పెన్షన్‌గా మార్చారు. బీఆర్ఎస్ పార్టీ నిబంధనావళి ప్రకారం పార్టీ నుంచి బహిష్కరిస్తే ఆరేళ్ల పాటు తిరిగి పార్టీలోకి వచ్చే అవకాశం ఉండదు. సస్పెన్షన్ చేస్తే ఏ క్షణమైనా ఎత్తేసి తిరిగి పార్టీలోకి తీసుకోవచ్చు. మరోవైపు కవితే బుధవారం బీఆర్ఎస్‌కు, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయనున్నట్లు జాగృతి వర్గాలు వెల్లడించాయి.

వైఎస్‌కు ఆత్మగా కేవీపీ!

» ఈ రోజుల్లో అధికారంలో ఉంటేనే దోస్తీ

» అధికారం పోయాక మాయమైపోతారు

» కేవీపీలా ఉంటామంటూ నాదగ్గరకూ వస్తారు

» ఆయనలా ఎవరూ ఉండలేరని చెబుతా

» వైఎస్ స్మారక అవార్డుల సభలో రేవంత్



హైదరాబాద్‌లో మాజీ సీఎం వైఎస్ స్మారక అవార్డుల ప్రదాన కార్యక్రమంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, షర్మిల, కేవీపీ, భట్టి విక్రమార్క, రఘురామ రాజు తదితరులు

హైదరాబాద్, సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): "ఈరోజుల్లో రాజకీయాల్లో అధికారం ఉన్నపుడు అనేక మంది మిత్రులుగా వస్తారు. అధికారం పోయాక మాయమవుతారు. కానీ.. చదువుకునే రోజుల నుంచి మరణం వరకూ వైఎస్ రాజశేఖర్ రెడ్డికి డాక్టర్ కేవీపీ రామచంద్ర రావు తోడే నీడగా నిలబడ్డారు" అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశంసించారు. వైఎస్ వర్ధంతి సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లోని దసపల్లా హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రేవంత్ పాల్గొన్నారు. సుభాష్ పాలేకర్, డాక్టర్ సి.సుధ, డాక్టర్ సి.నాగేశ్వరరావుకు డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి స్మారక అవార్డు-2025ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వైఎస్-కేవీపీ మైత్రీబంధాన్ని ప్రశంసించారు. "కేవీపీలాగా ఉంటామంటూ కొంతమంది నా దగ్గరకు వస్తున్నారు. వారిని మొదటి వారం లోపలికి రానిస్తే, రెండోవారం నా కుర్చీలో కూర్చుని అంతా నేనే నడుపుతాలే అంటున్నారు" అని సరదాగా వ్యాఖ్యానించారు. కేవీపీలా ఉంటామంటూ తనవద్దకు వచ్చినవారికి.. "మీరెప్పటికీ ఆయనలా కాలేరు. అలాంటి ఆలోచన సైతం చేయవద్దు" అని సూచించినట్టు రేవంత్ తెలిపారు. 1978లో ఎమ్మెల్యేగా ఎన్నికై మంత్రిగా బాధ్యతలు నిర్వహించిన వైఎస్.. ఆ తర్వాత ఎమ్మెల్యేగా, ఎంపీగా ఎన్నికైనప్పటికీ ఆయనకు పదవులు దక్కలేదని, అనేక సమస్యలను ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. ఆయన వెన్నంటి ఉన్న కేవీపీ.. వైఎస్ తప్పులను తన ఖాతాలో వేసుకుని, మంచిని వైఎస్ ఖాతాలో వేసి ఆయనకు ఆత్మలా పనిచేశారన్నారు. సర్వం త్యాగం చేయగల గుణం, సమస్యలు ఎదుర్కొనేశక్తి కేవీపీకి ఉందన్నారు. రాజశేఖర్‌రెడ్డి 2009లో రెండోసారి సీఎంగా ఎన్నికైన వెంటనే గాంధీ భవన్‌కు వెళ్లి.. రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే తన ప్రధాన లక్ష్యమని చెప్పారని గుర్తు చేశారు. ఈ సభలో ప్రత్యేక అతిధిగా పాల్గొన్న హరియాణా మాజీ సీఎం భూపేంద్రసింగ్ హుడా వైఎస్‌ను ప్రశంసించారు. రైతుల సమస్యలను పాదయాత్ర సమయంలో తెలుసుకున్న వైఎస్.. అధికారంలోకి రాగానే వారి సమస్యల పరిష్కారం కోసం కృషిచేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి రఘువీరారెడ్డి, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, ఎమెస్కో విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పులివెందుల నియోజకవర్గం లింగాల మండలం గంగమ్మకుంట చెరువులో కృష్ణాజలాలకు హారతి ఇస్తున్న మాజీ సీఎం జగన్, చిత్రంలో ఎంపీ అవినాశ్

చంద్రన్న జలాలకు జగన్ హారతులు

పులివెందుల, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్ సొంత నియోజకవర్గం పులివెందులకు 2017లో చంద్రబాబు సీఎంగా ఉన్నపుడే కృష్ణా జలాలను రప్పించారు. ఇప్పుడు... అవే జలాలకు జగన్ హారతులు ఇచ్చి, పూజలు చేశారు. మంగళవారం పులివెందుల నియోజకవర్గం లింగాల మండలంలోని అంబకపల్లె గ్రామంలో గంగమ్మకుంటలో నింపిన కృష్ణా జలాలకు జగన్ జలహారతి ఇచ్చారు. నిజానికి... గత టీడీపీ హయాంలోనే లింగాల కుడికాల్వ నుంచి ఎత్తిపోతలను ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి హిరోజుపురం వరకు పైప్‌లైన్ వేశారు. తాజాగా... ఆ పైప్‌లైన్‌ను గంగమ్మకుంట చెరువు వరకు పొడిగించారు. ఇందు కోసం అవినాశ్ రెడ్డి తన ఎంపీ నిధుల నుంచి రూ.2.50 కోట్లు ఖర్చు చేశారు. ఇప్పుడు ఆ చెరువుకు చేరిన కృష్ణా జలాలకే జగన్ పూజలు చేశారు.

హంద్రీనీవా కాలువలో కృష్ణా జలాలు ఆగవు

» అసత్య ప్రచారాలను నమ్మకండి: జలవనరుల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్

అమరావతి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): 'హంద్రీనీవా కాలువలో కృష్ణా జలాల ప్రవాహ వేగం తగ్గింది. జలాలు నిలిచిపోతాయి... అంటూ జరుగుతున్న అసత్య ప్రచారాన్ని నమ్మకండి' అని జల వనరుల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన చేశారు. 'పలమనేరు, కుప్పం అసెంబ్లీ నియోజకవర్గాలలోని 110 చెరువులను నింపేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. కుప్పం ఉపకాలువ చివర ఉన్న పరమసముద్రం చెరువుకు గత నెల 28న నీటిని వదిలాం. ఆ చెరువును గరిష్ఠస్థాయిలో నింపుతున్నాం. సోమవారం కుప్పం ఉపకాలువలో ఆదినేపల్లి దగ్గర నిర్మించిన పంపు స్టేషన్ ప్యానల్ బోర్డులో కొన్ని సాంకేతిక లోపాలు తలెత్తాయి. దీంతో కొన్ని గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచింది. దీంతో కుప్పం ఉప కాలువలో ప్రవహిస్తోన్న నీటిని పంపు స్టేషన్‌పై భాగంలో 15 చెరువులకు, తూముల ద్వారా మళ్లించాం. కొన్ని గంటల వ్యవధిలోనే ప్యానెల్ బోర్డు సాంకేతిక సమస్యను పరిష్కరించాం. నీటి ఎత్తిపోతలను పునరుద్ధరించాం. తద్వారా ప్రవాహం వేగం పెరిగి కృష్ణా జలాలు పరమసముద్రం దిశగా పరుగులు తీస్తున్నాయి. ఈ ఉపకాలువ ద్వారా 110 చెరువులు నింపాక నియోజకవర్గంలోని ఇతర చెరువులను కూడా నింపుతాం' అని ఇంజనీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి తెలిపారు.

సుపరిపాలనతో ఎన్డీయేను బలోపేతం చేస్తున్నారు

» డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు మోదీ, అమిత్ షా జన్మదిన శుభాకాంక్షలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పుట్టిన రోజును పురస్కరించుకొని పలువురు ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పవన్ కల్యాణ్ అభిమానులు, జనసైనికులు, నేతలు కేక్‌లు కట్ చేసి పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్‌లో స్పందిస్తూ... 'పవన్ కల్యాణ్‌కు పుట్టిన రోజు సందర్భంగా శుభాకాంక్షలు. ఎంతో మంది ప్రజల హృదయాల్లో, ఆలోచనల్లో పవన్ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. ఎన్డీయేను బలోపేతం చేస్తున్నారు. ఆయన ఆరోగ్యంగా మరింత కాలం జీవించాలని ప్రార్థిస్తున్నా' అని పేర్కొన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఎక్స్‌లో స్పందిస్తూ... 'ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఆలోచనలకు అనుగుణంగా ప్రజలకు సేవ చేయాలనే మీ ఉత్సాహపూరిత, నిబద్ధ వైఖరి ప్రశంసనీయం' అని పేర్కొన్నారు.

మీ సహకారం మరువలేనిది: బాబు

సీఎం చంద్రబాబు ఎక్స్‌లో స్పందిస్తూ... 'మిత్రులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. అడుగడుగునా సామాన్యుడి పక్షం. అణువణువునా సామాజిక స్పృహ... మాటల్లో పదును... చేతల్లో చేవ... జనసైన్యానికి ధైర్యం... మాటకి కట్టుబడేతత్వం... రాజకీయాల్లో విలువలకు పట్టం... స్పందించే హృదయం... అన్నీ కలిస్తే పవనిజం అని నమ్మే అభిమానులు, కార్యకర్తలు, ప్రజల దీవెనలతో మీరు నిండు నూరేళ్లు వర్ధిల్లాలి. మరెన్నో విజయశిఖరాలను అందుకోవాలి. పాలనలో, రాష్ట్రాభివృద్ధిలో మీ సహకారం మరువలేనిది.' అని పేర్కొన్నారు. మంత్రి లోకేశ్ స్పందిస్తూ... 'వెండితెరపై అభిమానులను అలరించిన పవర్ స్టార్, జనహితమే అభిమతంగా రాజకీయాల్లో ప్రవేశించి పీపుల్ స్టార్‌గా ఎదిగారు. ప్రజల కోసం తగ్గుతారు. ప్రజాస్వామ్యాన్ని గెలిపించేందుకు నెగ్గి తీరుతారు. సొంత తమ్ముడు కంటే ఎక్కువగా నన్ను అభిమానించి, అండగా నిలిచిన పవనన్నకు హృదయపూర్వక పుట్టిన రోజు శుభాకాంక్షలు' అని ఎక్స్‌లో పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, పవన్ కల్యాణ్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



జపాలి మెట్లపై ఈశ్వర్ పొర్లుదండాలు

పొర్లుదండాలతో జపాలి మెట్లెక్కిన పవన్ వీరాభిమాని

తిరుమల, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా బలిజపల్లికి చెందిన ఈశ్వర్, పవన్ కల్యాణ్ పుట్టినరోజున మంగళవారం తిరుమలలోని జపాలి మెట్లను పొర్లుదండాలతో ఎక్కారు. మరో 30 ఏళ్ల పాటు ఈ ప్రభుత్వమే కొనసాగాలని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు మంచి ఆరోగ్యాన్ని ప్రసాదించాలని ఆంజనేయస్వామిని కోరుకుంటూ ఈ పొర్లుదండాలు చేసినట్టు పవన్ వీరాభిమాని ఈశ్వర్ తెలిపారు. 71 రోజుల పాటు దీక్షబూని ఈ పొర్లుదండాలు చేసినట్టు వివరించారు. పవన్ కోసం ఈయన గతంలోనూ అలిపిరి, శ్రీవారిమెట్టు దారుల్లో ఇదేవిధంగా పొర్లుదండాలతో తిరుమల చేరుకున్నారు. తిరుత్తణి, విజయవాడ కనకదుర్గమ్మ క్షేత్రాలనూ ఇలాగే దర్శించుకున్నారు.

తీరానికి హారం!

(మొదటి పేజీ తరువాయి)

'ఈస్ట్ కోస్ట్ మారీటైమ్ అండ్ లాజిస్టిక్స్ సమ్మిట్'కు ఆయన హాజరయ్యారు. లాజిస్టిక్స్ కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటుచేసి, పాలసీని రూపొందిస్తామన్నారు. దీనికి అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వడానికి 15 నుంచి 20 మందితో ఒక కమిటీని ఏర్పాటుచేయాలని పారిశ్రామికవేత్తలకు సూచించారు. అమరావతికి బుల్లెట్ ట్రైన్ వస్తుందని తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా అదానీ గ్రూపు లాజిస్టిక్స్ యూనివర్సిటీ ఏర్పాటుచేస్తుందని, అలాగే విశాఖపట్నంలో జీఎంఆర్ సంస్థ సివిల్ ఏవియేషన్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తుందన్నారు. రాష్ట్రంలో షిప్ బిల్డింగ్‌తోపాటు రిపేర్లు, బ్రేకింగ్ యూనిట్లు, కంటెయినర్ల నిర్మాణానికి ఎవరైనా ముందుకు వస్తే తగిన సహకారం అందిస్తామన్నారు.ఏపీలో పోర్టుల నుంచి కార్గో 90 శాతం బల్క్‌గానే రవాణా జరుగుతోందని, కంటెయినర్ కార్గో కూడా పెంచాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో 1,050 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉందని, సముద్ర రవాణాలో ఏపీది రెండో స్థానమని, మూడు ఇండస్ట్రియల్ కారిడార్లు ఉన్నందున మరింత అభివృద్ధి సాధించవచ్చునన్నారు. లాజిస్టిక్స్ కోసం దీర్ఘకాలిక విధానం తీసుకువస్తామని, వాటికి భూమిని దీర్ఘకాలిక లీజుకు ఇస్తామని వివరించారు. రాష్ట్రంలోని అన్ని విమానాశ్రయాల నుంచి ఎయిర్‌కార్గో పెంచాలని సూచించారు. మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్కులకు ప్రాధాన్యం ఇచ్చి, వయబులిటీ గ్యాప్ ఫండింగ్ కూడా ఇస్తామన్నారు. రాష్ట్రంలో ప్రైవేటు పోర్టుల ద్వారా ఏడాదికి 69 మిలియన్ టన్నుల ఐరన్ ఓర్, 11 మిలియన్ టన్నుల బొగ్గు రవాణా జరుగుతోందన్నారు. భారీ నౌకలు వచ్చేందుకు అవసరమైనంత లోతు 18 మీటర్ల డ్రాఫ్ట్ ఏపీలోనే ఉందన్నారు. నదుల అనుసంధానం ద్వారా కూడా జల రవాణా పెంచుకోవచ్చునన్నారు. ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ వ్యవస్థను అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఆరు పోర్టులు ఉండగా, మరో 4 నిర్మాణంలో ఉన్నాయన్నారు. మూలపేట, మచిలీపట్నం, కాకినాడ, రామాయపట్నం.. పోర్టుల వద్ద అనుబంధ పరిశ్రమలు, పోర్టు టౌన్‌షిప్‌ల కోసం పది వేల ఎకరాలు అందుబాటులో ఉందన్నారు.

డ్రోన్లతో సరుకు రవాణాకు సహకారం

సదస్సుకు ముందు ఆయన వివిధ సంస్థలకు చెందిన ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ భేటీలో 14 మంది పలు సూచనలు చేశారు. అందులో ఒకరు డ్రోన్ల ద్వారా సరుకులను రవాణా చేస్తున్న తమకు సహకారం అందించాలని కోరారు. విజయవాడ నుంచి హైదరాబాద్‌కు మందులను డ్రోన్ల ద్వారా పంపిస్తుంటే కిలో రూ.80 వరకు పడుతోందని సీఎంకు వివరించారు. దీనిపై స్పందించిన చంద్రబాబు.. తప్పక ప్రోత్సహిస్తామన్నారు. శ్రావణ్ షిప్పింగ్ ఎండీ సాంబశివరావు మాట్లాడుతూ.. విమానాల ద్వారా సరుకు పంపడానికి ఏర్పాట్లు చేయాలని, పోర్టులకు కూడా ఇండస్ట్రియల్ ఏరియాల లోకల్ అథారిటీ(ఐలా) పెట్టాలని కోరగా, సీఎం అంగీకరించారు. అనంతరం ఎయిర్ కార్గో ఫోరం ఆఫ్ ఇండియా ఏపీ చాప్టర్‌ను ప్రారంభించారు.

పుస్తకాలు, పెన్నులపై జీఎస్టీ ఎత్తేయండి

» నూలు, రంగులను మినహాయించండి

» జీఎస్టీ మండలికి పయ్యావుల ప్రతిపాదనలు

» నేడు, రేపు ఢిల్లీలో జీఎస్టీ మండలి సమావేశాలు

అమరావతి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): పుస్తకాలు, పెన్నులు, నూలు, రంగులపై జీఎస్టీ ఎత్తివేయాలని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ విజ్ఞప్తి చేశారు. బుధ, గురువారాల్లో ఢిల్లీలో జీఎస్టీ మండలి సమావేశాలు జరగనున్న నేపథ్యంలో రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా పన్ను శ్లాబుల్లో మార్పులు చేయాలని కోరుతూ జీఎస్టీ మండలి ఛైర్‌పర్సన్, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఆయన కొన్ని ప్రతిపాదనలతో లేఖ రాశారు. ముఖ్యంగా చేనేత రంగాన్ని ఆదుకోవాలని, పాదరక్షల రంగంలో ఉన్న ఎంఎస్ఎంఈలకు చేయూతనివ్వాలని, పుస్తకాలు, పెన్నులపై పూర్తిగా పన్ను మినహాయించాలని కోరారు. 'రాష్ట్రంలో బందర్ పేట చీరలు, ఉప్పాడ జందానీ చీరలు, వెంకటగిరి జరీ చీరలు, మంగళగిరి చేనేత చీరలు, పొందూరు ఖాదీ, కాటన్, ఇతర వస్త్రాలకు ఏపీ ప్రసిద్ధి. రాష్ట్రంలో వస్త్రాల ఉత్పత్తి, వ్యాపారం ద్వారా 5 లక్షల మందికిపైగా ఉపాధి పొందుతున్నారు. వ్యాట్ ఉన్న సమయంలో కాటన్ నూలు, సిల్కు నూలుపై పన్నులు ఉండేవి కాదు. కానీ, ఇప్పుడు కాటన్ నూలుపై 5%, రంగులు, వాటికి సంబంధించిన రసాయనాలపై 18% పన్ను అమలవుతోంది. దీంతో ధరలు పెరిగి వ్యాపారం కుదేలవడంతో ఆ రంగంలో ఉపాధి తగ్గిపోయింది. అలాగే, గరిటెలు, స్పూన్లు, పాత్ర లు, వల్కనైజ్డ్ రబ్బర్, ఫ్లేవర్లు కలిపిన పాలు, జున్ను, బేకరీ ఉత్పత్తులపై జీఎస్టీని ఎత్తేయండి' అని కేశవ్ కోరారు.

బంగాళాఖాతంలో అల్పపీడనం

» 24 గంటల్లో తీవ్ర అల్పపీడనంగా మారే చాన్స్

» ఏలూరు జిల్లాలో ఉప్పొంగిన తమ్మిలేరు, ఎర్రకాల్వ

విశాఖపట్నం/అమరావతి/ఏలూరు, సెప్టెంబరు2 (ఆంధ్రజ్యోతి): ఉత్తర ఒడిశాకు ఆనుకుని వాయవ్య బంగాళాఖాతంలో మంగళవారం ఉదయం అల్పపీడనం ఏర్పడింది. ఇది వచ్చే 24 గంటల్లో తీవ్ర అల్పపీడనంగా మారుతుందని, ఆ తర్వాత ఉత్తర ఒడిశాలో తీరం దాటి పశ్చిమ వాయవ్యంగా పయనిస్తుందని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో మంగళవారం ఉత్తరాంధ్రలో అనేకచోట్ల వర్షాలు, అక్కడక్కడ భారీవర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో ఉత్తర కోస్తాలో అనేక చోట్ల, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఉత్తరాంధ్రలో అక్కడక్కడ భారీవర్షాలు పడతాయంది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళిలో 9.3, వజ్రపుకొత్తూరులో 8.1, చినబాడాంలో 7.9, పలాసలో 7, రావివలసలో 5.6, హరిపురంలో 5.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. తీరం వెంబటి గంటకు 40-60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్నందున మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లొద్దని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. బుధవారం శ్రీకాకుళం, అల్లూరి, మన్యం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

అల్పపీడన ప్రభావంతో ఎగువన కురిసిన వర్షాలకు ఏలూరు జిల్లాలో తమ్మిలేరు, ఎర్రకాల్వలకు వరద పోటెత్తింది. మంగళవారం ఉదయం నాగిరెడ్డిగూడెం డ్యామ్ నుంచి 2,700 క్యూసెక్కులను తమ్మిలేరు మీదుగా విడుదల చేశారు. సోమవారం ఏడువేల క్యూసెక్కులను దిగువకు విడుదల చేయడంతో ఏలూరు-శనివార పుపేట కాజ్‌వేపై 2 మీటర్ల మేర నీరు ప్రవహించగా రాకపోకల ను అధికారులు నిలిపివేశారు. జంగారెడ్డిగూడెం మండలం సరిహద్దులో ఎర్రకాల్వ ఉధృతి పెరిగే ప్రాంతంలో రెవెన్యూ, పోలీసులు గస్తీ కాస్తున్నారు.

ప్రాజెక్టుల్లో స్థిరంగా జలాలు

అమరావతి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు స్థిరంగా కొనసాగుతున్నాయి. నాగార్జున సాగర్‌లో గరిష్ఠ నీటి మట్టం 312.05 టీఎంసీలు కాగా మంగళవారం నాటికి 299.74 టీఎంసీలకు తగ్గింది. మొత్తంగా జలాశయాలన్నీ నిండుకుండలను తలపిస్తున్నాయి.



ఏలూరు నగరంలో తమ్మిలేరు ఉధృతి



వినాయకునికీ తప్పని రప్పా.. రప్పా!

- కడప జిల్లాలో వైసీపీ శ్రేణుల పైశాచికానందం
- విగ్రహం వెనుకభాగాన రప్పా.. రప్పా నినాదాలు, గొడ్డలి గుర్తు

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): వైసీపీ రప్పా రప్పా నినాదాలు... గొడ్డలి గుర్తులూ వినాయక విగ్రహాన్నీ వదల్లేదు. ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో జరగాల్సిన నిమజ్జన శోభాయాత్రలో వైసీపీ శ్రేణుల వికృత చేష్టలు పరాకాష్టకు చేరాయి. వైఎస్సార్ కడప జిల్లా ఎర్రగుంట్ల మండలంలోని పెద్దనపాడు గ్రామంలో వినాయకుని నిమజ్జనంలో వింత పోకడలు చోటుచేసుకున్నాయి. గ్రామంలోని వీధుల్లో నిమజ్జనానికి బయలుదేరిన వినాయక విగ్రహం వెనుక వైపున 2.0, రప్పా రప్పా వైఎస్సార్ అక్షరాలతో పాటు ఎర్రటి రంగులో ఉన్న గొడ్డలి గుర్తును వేశారు. ఇంతటితో ఆగకుండా వినాయక విగ్రహాన్ని పైకి ఎగురవేస్తూ రప్పా, రప్పా వైఎస్సార్ అని కేకలు వేస్తూ నిమజ్జనానికి వీధుల గుండా తీసుకెళ్లడం గ్రామస్థులను విస్మయానికి గురిచేసింది. ఆదివారం సాయంత్రం చోటుచేసుకున్న ఈ ఘటన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. ఈ క్రమంలోనే వచ్చే సంవత్సరం వినాయకచవితికి ఎవరికీ చందాలివ్వకూడదని గ్రామానికి చెందిన కొందరు నిర్ణయించుకున్నారు. కాగా.. పెద్దనపాడు వినాయక విగ్రహ నిమజ్జన విషయంలో ఎలాంటి ఫిర్యాదులు రాలేదని, శాంతి భద్రతల దృష్ట్యా ఈ సంఘటనపై విచారణ చేస్తున్నామని సీఐ విశ్వనాథరెడ్డి తెలిపారు.

ఇప్పుడు కర్రలతో వస్తున్నాం...

- రేపు గొడ్డళ్లతో వస్తాం: కాసు మహేశ్‌రెడ్డి



మాచవరం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): 'ఇప్పుడు కర్రలతో వస్తున్నాం.. రేపు అధికారంలోకి రాగానే గొడ్డళ్లతో వచ్చి వీధుల వెంట పరిగెత్తించి, పరిగెత్తించి తంతాం' అని మాజీ ఎమ్మెల్యే కాసు మహేశ్‌రెడ్డి కూటమి నేతలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. మంగళవారం పల్నాడు జిల్లా మాచవరంలో 'బాబు ష్యూరిటీ... మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... '2014 నుంచి 2019 వరకు బాబు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు. రుణమాఫీ పూర్తిస్థాయిలో చేస్తానని చేయకుండానే ముగించారు. ప్రస్తుతం కూడా అలవికాని హామీలు ఇచ్చి తూతూమంత్రంగా చేస్తున్నారు. వైసీపీ నాయకులపై కూటమి నాయకులు లేని పోని అక్రమ కేసులు పెడుతున్నారు' అని మహేశ్‌రెడ్డి విమర్శించారు.

'మత్తు'ను పట్టించేస్తాయి!

(మొదటి పేజీ తరువాయి)

శిక్షణ పొందిన 35 జాగిలాల పాసింగ్ ఔట్ పరేడ్ మంగళవారం మంగళగిరిలోని ఏపీఎస్పీ బెటాలియన్‌లో జరిగింది. 'బెల్జియన్ మాలినోయిస్' జాతికి చెందిన ఈ జాగిలాలు ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ (ఐఎస్‌డబ్ల్యూ) ద్వారా పోలీసు శాఖలోకి ప్రవేశించాయి. ఈ కార్యక్రమంలో హోంమంత్రి అనిత, డీజీపీ హరీశ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు. నేర పరిశోధనలో పోలీసు జాగిలాలు ఎంతో కీలకంగా వ్యవహరిస్తాయని, నేరం జరిగిన ప్రాంతంలో పోలీసులకు ఎలాంటి ఆధారాలు లభించకపోయినా.. ఇవి కేసుల్ని ఛేదిస్తున్నాయని అనిత అన్నారు. ఏకంగా 35 జాగిలాలు అంతర్జాతీయ స్థాయి శిక్షణ పొంది.. ఈ రోజు ఏపీ పోలీసు శాఖలో సేవలందించేందుకు సిద్ధమవడం శుభపరిణామమని అన్నారు. 'నేను హోంమంత్రిగా బాధ్యతలు తీసుకున్న వెంటనే చీరాలలో ఒక యువతిని రేప్ చేసి హత్య చేశారన్న సమాచారం రావడంతో అక్కడికి వెళ్లా.. పోలీసులకు ఎలాంటి క్లూ లభించలేదు. కానీ పోలీసు జాగిలం ఆ ప్రాంతమంతా తిరిగి ఒకచోట ఆగింది. అక్కడి టవర్ లొకేషన్ ఆధారంగా పోలీసులు హంతకుల్ని అరెస్టు చేశారు. మన్యంలో ఐజీ ఆకే రవికృష్ణతో కలిసి పర్యటిస్తున్నప్పుడు అక్కడ ఓ పోలీసు జాగిలం ఎక్కడో అటవీ ప్రాంతంలో దాచిన గంజాయిని పట్టించింది. నేర పరిశోధనలో స్నిఫర్ డాగ్స్ ఎంతో కీలకంగా వ్యవహరిస్తాయని ఈ రెండు సంఘటనలతో అర్థమైంది..' అని హోంమంత్రి తెలిపారు. విశాఖలో ఒక కార్యక్రమానికి వెళ్లినప్పుడు స్నిఫర్ డాగ్స్ ఎన్ని ఉన్నాయని అడిగితే.. కేవలం ఒక్కటే ఉందని చెప్పారని, దీంతో గత వైసీపీ ప్రభుత్వంలో పరిస్థితి అర్థమైందని ఆమె అన్నారు. శాంతి భద్రతలకు ప్రాధాన్యమిచ్చే కూటమి ప్రభుత్వంలో ఏకంగా 35 జాగిలాలు ఏపీ పోలీసు శాఖలో ప్రవేశించాయని చెప్పారు. "కూటమి ప్రభుత్వం ఏర్పడే సమయానికే రాష్ట్రంలో యువత గంజాయి, డ్రగ్స్ బారిన పడి తూలుతున్నారు.. 'ఈగల్' ద్వారా దాదాపు కట్టడి చేశాం.. అందులో పోలీసు జాగిలాల పాత్ర ఎనలేనిది. అందుకే ఈ 35 జాగిలాల్లో 16 డాగ్స్‌కు గంజాయి, మత్తు పదార్థాలను పసిగట్టడం కోసమే శిక్షణ ఇప్పించాం.. మిగతావి వీఐపీ సెక్యూరిటీ, పేలుడు పదార్థాల గుర్తింపు లాంటి వాటిపై శిక్షణ పొందాయి. కొన్ని సందర్భాల్లో టెక్నాలజీ చెయ్యలేని పనులు పోలీసు జాగిలాలు చేస్తాయి" అన్నారు.

సైలెంట్ హీరోస్..: డీజీపీ గుప్తా

ప్రపంచంలో అత్యుత్తమ జాతికి చెందిన 35 బెల్జియన్ మాలినోయిస్ శునకాలు అంతర్జాతీయ స్థాయి శిక్షణ పొందాయని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా తెలిపారు. ప్రతి జాగిలానికి రెండు విభాగాల్లో శిక్షణ ఇప్పించామని చెప్పారు. ఈ జాగిలాలు పేలుడు పదార్థాలను గుర్తించడంలో, నార్కోటిక్స్‌ను పసిగట్టడంలో, అవసరాన్ని బట్టి దాడిచేయడంలో.. సైలెంట్‌గా పనిపూర్తిచేసే హీరోలని అభివర్ణించారు. అరాచక శక్తుల్ని వెంబడించడంలో ఈ జాగిలాలు పోలీసులకు ఆయుధాలుగా పనిచేస్తాయన్నారు. హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్, ఇంటెలిజెన్స్ చీఫ్ మహేశ్ చంద్ర లడ్డా, ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ, విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు, పలువురు సీనియర్ ఐపీఎస్ అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

అబ్బే.. అంతా బాగానే చేశాం!

(మొదటి పేజీ తరువాయి)

హైకోర్టుకు వెళ్లి సంజయ్ తెచ్చుకున్న ముందస్తు బెయిల్‌ను ఇటీవల సుప్రీంకోర్టు రద్దు చేయడంతో ఆయన జైలుకు వెళ్లాల్సి వచ్చింది. సంజయ్‌ను మంగళవారం నుంచి మూడు రోజులపాటు కస్టడీకి ఇస్తూ ఏసీబీ కోర్టు అనుమతులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో మంగళవారం ఏసీబీ అధికారులు సంజయ్‌ను జైలు నుంచి అదుపులోకి తీసుకున్నారు. అగ్నిమాపక శాఖలో ఎన్‌వోసీలు ఆన్‌లైన్‌లో జారీ చేసేందుకు మొబైల్ యాప్ అభివృద్ధి, నిర్వహణ, ట్యాబ్‌ల కొనుగోళ్లలో అవినీతిపై ఏసీబీ అధికారులు ప్రశ్నలు సంధించారు. ప్రశ్నల్లో కొన్నింటిని దాటవేసిన సంజయ్ మరికొన్నింటికి 'కాదు' అని సమాధానం చెప్పినట్లు తెలిసింది. అంతా సక్రమంగానే జరిగిందని, టెండర్ నిర్వహించి దక్కించుకున్న వారికి బిల్లులు చెల్లించామని, ఎక్కడా అవినీతి జరగలేదని ఏసీబీ విచారణలో సంజయ్ వెల్లడించినట్లు సమాచారం. మరో వైపు అగ్నిమాపక శాఖలో బిడ్ రిగ్గింగ్, టెండర్లు కట్టబెట్టడంలో పక్షపాత ధోరణి అవలంబించినట్లు తేలింది. సౌత్రిక టెక్నాలజీస్‌కు యాప్ అభివృద్ధి పేరుతో బిల్లులు చెల్లించి 59.93 లక్షలు దుర్వినియోగం చేసినట్లు విజిలెన్స్ గుర్తించింది. 'అగ్ని-ఎన్‌వోసీ' వెబ్‌సైట్ రూపకల్పన, యాప్ అభివృద్ధి, నిర్వహణ, 150ట్యాబ్‌ల సరఫరా కోసం ముందే ఎంపిక చేసుకున్న మూడు సంస్థలతో బిడ్లు వేయించి ఎల్-1గా సౌత్రికా టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ బిడ్‌ను ఎంపిక చేశారు. మొత్తం 2.29కోట్ల రూపాయల ప్రాజెక్టులో పనులు జరగకుండానే 59.93లక్షలు చెల్లించేశారు. మార్కెట్ ధరకన్నా ఎక్కువ చెల్లించి టాబ్‌లు కొనుగోలు చేయడం, బిడ్ వేసిన సంస్థకు నిబంధనలు అతిక్రమించి బిల్లులు చెల్లించడం వెనుక సంజయ్ అవినీతి ఉన్నట్లు విజిలెన్స్ నివేదికలో స్పష్టం చేసింది. అలాగే.. సీఐడీ చీఫ్‌గా ఉండగా ఆయన దళితులకు ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన కల్పించేందుకు పలు కల్యాణ మండపాల్లో పెట్టిన సమావేశాల్లో రూ.1.19కోట్లు ఖర్చు చేసినట్లు చూపించారు. ఈ కార్యక్రమాలకు సంబంధించి క్రిత్వాప్ టెక్నాలజీస్ అనే సంస్థకు బిల్లులు చెల్లించినట్లు చూపారు. అయితే ప్రభుత్వ బడుల్లో నిర్వహించిన వాటికి సీఐడీ అధికారులు, సిబ్బంది తప్ప దళిత, గిరిజనులు హాజరు కాలేదని విజిలెన్స్ విచారణలో తేలింది. ఫొటోలు, వీడియోలు సీఐడీ సిబ్బంది సెల్‌ఫోన్లలో చిత్రీకరించి వాటికి సైతం బిల్లులు పెట్టారని.. టీ, బిస్కట్లు ఇచ్చి భోజనాలు పెట్టినట్లు భారీగా ఖర్చు చూపించి రూ.కోటికి పైగా నిధులు కాజేశారని విజిలెన్స్ తెలిపింది. ఈ రెండు అవినీతి భాగోతాలపైనా ఏసీబీ అధికారులు ప్రశ్నించారు. అగ్నిమాపక శాఖలో ట్యాబ్‌లు కొనుగోలు చేశామని, అగ్ని-ఎన్‌వోసీ వెబ్‌సైట్ రూపకల్పన జరిగిందని ఎలాంటి అవినీతి జరగలేదని సంజయ్ బదులిచ్చినట్లు తెలిసింది. ఈ విచారణ అంతా రహస్యంగా జరిగింది. అనంతరం సంజయ్‌ను జైలుకు తరలించారు. మరో రెండు రోజులు ఆయనను ఏసీబీ విచారించనుంది.

సుగాలి ప్రీతి కేసు సీబీఐకి

- సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం
- 2017లో ప్రీతి అనుమానాస్పద మృతి
- న్యాయం చేయాలని జనసేనాని పోరాటం
- వైసీపీ హయాంలో కేసు సీబీఐకి అప్పగింత
- అయినా ముందుకు సాగని దర్యాప్తు
- డిప్యూటీ సీఎం పవన్‌ను టార్గెట్ చేస్తూ రోడ్డెక్కిన మృతురాలి తల్లి పార్వతీదేవి
- వైసీపీ నేతల ప్రోద్బలంతో ఆరోపణలు
- మరోసారి సీబీఐకి అప్పగించిన ప్రభుత్వం

కర్నూలు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంచలనం సృష్టించిన కర్నూలు జిల్లాకు చెందిన గిరిజన విద్యార్థిని సుగాలి ప్రీతి మృతి కేసును సీబీఐకి అప్పగిస్తూ కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రీతికి న్యాయం జరగాలని గత వైసీపీ ప్రభుత్వంలో జనసేనాని పవన్ కల్యాణ్ రోడ్డెక్కి పోరాటం చేశారు. దీంతో జగన్ ప్రభుత్వం కేసును సీబీఐకి అప్పగించింది. అయినా దర్యాప్తు ముందుకు సాగలేదు. తాజాగా మరోసారి సీబీఐకి అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కేసు వివరాలు... కర్నూలు నగరానికి చెందిన సుగాలి ప్రీతి స్థానికంగా ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతూ అదే పాఠశాల హాస్టల్‌లో ఉండేది. 2017 ఆగస్టు 19న హాస్టల్ గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు వేలాడుతూ ఆమె అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పాఠశాల యాజమాన్యం ప్రీతిది ఆత్మహత్యగా పేర్కొంది. విద్యార్థిని తల్లి పార్వతీదేవి, కుటుంబ సభ్యులు మాత్రం పాఠశాల యాజమాన్యానికి చెందిన తండ్రి, ఆయన ఇద్దరు కుమారులు తమ కుమార్తెపై అత్యాచారం చేసి హత్య చేశారని ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ముగ్గురిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కేసు నమోదైన నెల రోజులకు నిందితుల్లో ఇద్దరిని (పాఠశాల అధినేత కుమారులు) అరెస్ట్ చేశారు. ఆ తరువాత పాఠశాల యాజమాని పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయారు. తరువాత ఈ ముగ్గురూ బెయిల్‌పై విడుదలయ్యారు. దీంతో ప్రీతికి న్యాయం జరగలేదని, పోలీసులు కేసును నీరుగార్చారని, సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేస్తూ మృతురాలి తల్లి, కుటుంబ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు ఆందోళనలు చేపట్టారు.



సుగాలి ప్రీతి తల్లి పార్వతీ దేవి

పవన్ పోరాటంతో కదలిక

సుగాలి ప్రీతి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి టీడీపీ ప్రభుత్వం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది. 2019లో ప్రీతి తల్లి పార్వతీదేవి జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను కలిసి తమకు న్యాయం జరిగేలా అండగా నిలవాలని కోరారు. ఈ కేసులో దర్యాప్తు త్వరితగతిన జరపాలని, మృతురాలు ప్రీతికి న్యాయం చేయాలని నాటి టీడీపీ ప్రభుత్వంపై జనసేనని ఒత్తిడి తెచ్చారు. ఇంతలో ప్రభుత్వం మారి వైసీపీ అధికారంలోకి వచ్చింది. ప్రీతికి న్యాయం చేయాలంటూ వివిధ వేదికల్లో పవన్ గళం ఎత్తారు. కర్నూలుకు వెళ్లి ప్రీతి కుటుంబాన్ని పరామర్శించారు. భారీ ఎత్తున నిరసన తెలిపారు. ఈ నేపథ్యంలో కేసును సీబీఐకి అప్పగిస్తూ గత వైసీపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే.. ప్రభుత్వం జీవో జారీ చేసి 8 నెలలు గడిచినా సీబీఐ కేసు దర్యాప్తు చేపట్టలేదని ప్రీతి తల్లిదండ్రులు 2020లో హైకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు అప్పగించిన పలు కేసుల దర్యాప్తులో బిజీగా ఉన్నామని, ప్రీతి కేసును దర్యాప్తు చేయడానికి తమవద్ద తగినన్ని వనరులు లేవని కోర్టుకు సీబీఐ చెప్పినట్లు సమాచారం. ప్రీతికి న్యాయం చేయాలని, విద్యార్థిని కుటుంబానికి అండగా ఉంటూ పవన్ చేసిన పోరాటాలతో వైసీపీ ప్రభుత్వం దిగొచ్చింది. విద్యార్థిని కుటుంబానికి దిన్నెదేవరపాడు దగ్గర 5 ఎకరాల పొలం, కర్నూలు నగరంలో 5 సెంట్లు ఇంటి స్థలం, తండ్రి రాజు నాయక్‌కు ఉద్యోగం ఇచ్చారని జనసేన నాయకులు చెబుతున్నారు.

మళ్లీ సీబీఐ దర్యాప్తునకు నిర్ణయం

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత... ప్రీతి కేసుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఐడీ అధికారులను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశించారు. ఇదే సమయంలో న్యాయం చేయాలని కోరుతూ ప్రీతి తల్లి పార్వతీదేవి ఆగస్టు 19న కర్నూలు టు అమరావతి వీల్‌చైర్ యాత్ర చేట్టారు. అయితే.. అనుమతి లేదంటూ అడ్డుకున్న పోలీసులు.. కొండారెడ్డి బురుజు వరకు అనుమతి ఇచ్చారు. దీంతో యాత్రకు అనుమతి ఇవ్వాలంటూ ఆమె న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ క్రమంలో డిప్యూటీ సీఎంపై నిందలు వేసేలా ప్రీతి తల్లి మాట్లాడటం వెనుక వైసీపీ నాయకులు ఉన్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ పార్టీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, రాష్ట్ర నాయకురాలు ఎస్వీ విజయ మనోహరి తదితరులు సోమవారం కర్నూలులో ప్రీతి తల్లి పార్వతీదేవిని కలిసి పరామర్శించడం ఇందుకు బలం చేకూరుస్తోంది. అయితే.. గిరిజన విద్యార్థినికి న్యాయం చేయాలనే సంకల్పంతో సీఎం చంద్రబాబు కేసును సీబీఐకి అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

పోలీసు స్టేషన్ మొత్తం కవరయ్యేలా
కెమెరాలు లేవు



- స్టేషన్లలో పెట్టిన 10 కెమెరాలు అందుకు సరిపోవు
- హైకోర్టుకు నివేదించిన అడ్వొకేట్ కమిషనర్

అమరావతి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ, ఠాణా మొత్తం కవర్ అయ్యేలా వాటిని బిగించలేదని అడ్వొకేట్ కమిషనర్ ఎంఆర్‌కె చక్రవర్తి హైకోర్టుకు నివేదించారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పరిధిలోని పెనమలూరు, అమరావతి, తుళ్లూరు, అరండల్‌పేట, నల్లపాడు, మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్లు పరిశీలించినట్లు తెలిపారు. ప్రతీ ఠాణాలో సగటున 10 సీసీ కెమెరాలు ఉన్నాయని, మంగళగిరి స్టేషన్‌లో 11 ఏర్పాటుచేశారని వివరించారు. స్టేషన్‌లోని ప్రతీ మూలను కవర్ చేసేందుకు 10 సీసీ కెమెరాలు సరిపోవన్నారు. రెండు అంతస్తులు ఉన్న పెనమలూరు, నల్లపాడు పోలీస్ స్టేషన్లలో మొదటి అంతస్తులో కెమెరాలను బిగించలేదని హైకోర్టు దృష్టికి తెచ్చారు. సీసీటీవీ ఫుటేజ్ లభ్యత గురించి ఆరా తీయగా, డిజిటల్ వీడియో రికార్డర్ నుండి ఫుటేజ్‌ను పొందేందుకు తమకు అవకాశం లేదని పోలీసులు చెప్పారన్నారు. ఏదైనా కేసు దర్యాప్తు, విచారణకు అవసరమైనప్పుడు సంబంధిత ఎస్పీ కార్యాలయాల నుండి ఈ-మెయిల్ ద్వారా పంపిస్తారని తెలిపారని అడ్వొకేట్ కమిషనర్ వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో పాస్‌వర్డ్ ఇస్తారని, ఫుటేజ్ తీసుకున్న వెంటనే దానిని మార్చేస్తారని పెనమలూరు ఎస్‌హెచ్‌వో సమాచారం ఇచ్చారన్నారు. కోర్టు అనుమతి లేకపోవడంతో గుంటూరు, కృష్ణా ఎస్పీ కార్యాలయాల్లోకి వెళ్లలేకపోయానన్నారు. ఈ కారణంతో వీడియో ఫుటేజ్‌ల లభ్యత? ఎప్పటి నుంచి ఫుటేజ్ అందుబాటులో ఉంది? ఫుటేజ్‌లో మాట స్పష్టంగా ఉందా? అనే విషయాలను పరిశీలించలేకపోయానని తెలిపారు. తనిఖీలకు వెళ్లినప్పుడు స్టేషన్‌లో పోలీసు అధికారులు లేరని, దీంతో వీడియో రికార్డింగ్, దాని లభ్యత, డీవీఆర్‌ల నుంచి ఫుటేజ్ సేకరించే విధానం గురించి పూర్తి వివరాలు చెప్పేవారు లేరన్నారు. ఈ దశలో ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) తిరుమాను విష్ణుతేజ స్పందిస్తూ... డీవీఆర్‌లలో రికార్డు అయిన ఫుటేజ్ ఎక్కడ స్టోర్ అవుతుందో తెలుసుకొని వివరాలు సమర్పించేందుకు విచారణను బుధవారానికి వాయిదా వేయాలనికోరారు. అందుకు అంగీకరించిన న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ టీసీడీ శేఖర్‌తో కూడిన ధర్మాసనం విచారణను బుధవారానికి వాయిదా వేసింది. రాష్ట్రంలోని పోలీస్ స్టేషన్లు, జైళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ 2019లో న్యాయవాది తాండవ యోగేశ్ ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాన్ని విచారించిన హైకోర్టు ధర్మాసనం సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్రంలోని పోలీస్ స్టేషన్లు, జైళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని 2019 జులై 15న ఆదేశాలిచ్చింది. ఏళ్లు గడుస్తున్నా ఉత్తర్వులు అమలుకాక పోవడంతో యోగేశ్ 2022లో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు పల్నాడు జిల్లా, మాచవరం పోలీసులు తన సోదరుడు గోపిరాజును అక్రమంగా నిర్బంధించారని పేర్కొంటూ కటారు నాగరాజు గత నవంబర్‌లో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లు ఇటీవల విచారణకురాగా స్టేషన్ మొత్తం కనిపించేలా పోలీస్ స్టేషన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని సర్కారు పేర్కొంటూ ఎస్‌డీపీవోలు(డీఎస్పీలు) సమర్పించిన నివేదికలపై ధర్మాసనం సందేహం వ్యక్తం చేసింది. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితిని తేల్చేందుకు అడ్వొకేట్ కమిషనర్‌ను నియమించింది.

నా అకౌంట్ నా ఇష్టం!

- ఫేస్‌బుక్‌లో నేను రాసుకునేవాటికి ప్రభుత్వం ఎందుకు స్పందించాలి?
- అమరావతిపై చేసిన వ్యాఖ్యలను సమర్థించుకున్న ప్రభుత్వ అధికారి

అమరావతి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిపై ఫేస్‌బుక్‌లో విషం చిమ్మిన వాణిజ్య పన్నుల అధికారి ఎస్.సుభాష్ తన పోస్టులను సమర్థించుకున్నారు. తానేమీ తప్పు చేయలేదన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అమరావతి మునిగిపోయిందంటూ సుభాష్ తన ఫేస్‌బుక్ ఖాతాలో పోస్టులు పెట్టారు. "ఒకే ఒక్క వర్షం. అమరావతి జలమయం. ఇదే మన డ్రోన్ క్యాపిటల్. ఇదే మన క్వాంటమ్ వ్యాలీ" అంటూ వ్యంగ్య వ్యాఖ్యలు జోడించారు. మరో పోస్టులో 'అమరావతినే రిజర్వాయర్‌గా కడితే సరి' అని వ్యాఖ్యానించారు. అమరావతిపై పనిగట్టుకుని సోషల్ మీడియాలో దుష్ప్రచారం సాగిస్తున్నవారిని ఉద్దేశించి 'శాడిస్టు సైకోలు' అనే పేరిట ఈ నెల 19న 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించింది. అందులో ప్రభుత్వ ఉద్యోగి అయిన సిద్ధార్థి సుభాష్ పోస్టుల గురించి కూడా ప్రస్తావించింది. ఈ నేపథ్యంలో ఆయనకు వాణిజ్య పన్నుల శాఖ ఇటీవల మెమో జారీచేసింది. దీంతో ఆ శాఖ చీఫ్ కమిషనర్‌కు సుభాష్ వివరణ ఇచ్చారు. "నా ఫేస్‌బుక్ ఖాతా నా వ్యక్తిగతం. నేను ప్రభుత్వ ఉద్యోగినని ఆ ఖాతాలో ఎక్కడా పేర్కొనలేదు. ఆ ఖాతా నాదికాదని చెప్పొచ్చు. కానీ.. అలా చెప్పను" అని తెలిపారు. "నేను ఒక్క వ్యాఖ్యను కూడా ప్రభుత్వంపై చేయలేదు. ప్రభుత్వ విధానాలను తప్పుపట్టలేదు. పొరుగు రాష్ట్రాల రాజధానులైన హైదరాబాద్, చెన్నై నగరాలు వర్షాలకు తరచూ మునిగిపోతున్నాయి. అలాగే ఏపీ రాజధాని అమరావతి కూడా ముంపునకు గురైందన్నాను" అని తెలిపారు. ఆయన వ్యాఖ్యలను, పోస్టులను పరిశీలిస్తే... వాస్తవాలను వక్రీకరించారని స్పష్టమవుతుంది. అమరావతిని రాజధానిగా ఎంపిక చేయడం, అక్కడ అభివృద్ధి పనులు చేపట్టడం ప్రభుత్వ విధాన నిర్ణయం. దీనిని సుభాష్ తప్పుపట్టినట్లు ఆయన జోడించిన వ్యంగ్య వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. అయినా సరే.. 'నేను తప్పు చేయలేదు' అని దబాయించడం గమనార్హం. పైగా... 'వ్యక్తిగతంగా రాసుకునే ఫేస్‌బుక్‌లోని వ్యాఖ్యలపై ప్రభుత్వం స్పందించడం ఏమిటి?' అంటూ సుభాష్ వింత వాదన లేవనెత్తారు. "ప్రధాని మోదీ సైతం తన ప్రభుత్వంపై విమర్శలను స్వాగతిస్తున్నారు. విమర్శలతో ప్రజాస్వామ్యం బలపడుతుంది. ఇదే విషయం సుప్రీంకోర్టు కూడా పేర్కొంది" అని వివరించారు. నిర్మాణాత్మక విమర్శలకు, కువిమర్శలకు తేడా ఉంటుందని సుభాష్ విస్మరించడం గమనార్హం.

సుప్రీం ముందుకు నేడు ఇసుక కేసు

- జగన్ జమానాలో 3.91 లక్షల టన్నుల ఇసుక అక్రమ తవ్వకం
- అఫిడవిట్ దాఖలు చేసిన సర్కారు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ ప్రభుత్వ హయాంలో ఇసుక అక్రమ తవ్వకాల కేసు విచారణ కీలక దశకు చేరుకుంది. సోమవారం సుప్రీం కోర్టులో ఈ కేసు విచారణకు రానుంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అఫిడవిట్‌ను దాఖలు చేసింది. జగన్ ప్రభుత్వ జమానాలో 2021-2024 వరకు 2,743 హెక్టార్ల పరిధిలో 3.91 లక్షల టన్నుల ఇసుకను అక్రమంగా తవ్వితీశారని అందులో ప్రభుత్వం పేర్కొంది. ఇందులో 1.22 కోట్ల టన్నుల ఇసుక అక్రమ తవ్వకాలకు సంబంధించి తవ్వకాలు చేసిన కంపెనీలకు 1,467 కోట్ల మేర డిమాండ్ నోటీసులు జారీ చేసినట్లుగా వివరించింది. బుధవారం జరిగే విచారణలో ప్రభుత్వ అఫిడవిట్ కీలకం కానుంది. అయితే, ఇంకా లెక్కతేలాల్సిన అక్రమ ఇసుక సొమ్ము చాలానే ఉంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం కేవలం 1.22 కోట్ల టన్నులకు 1,467 కోట్ల మేర ఇసుక దోపిడి జరిగింది. ఇంకా 2.69 కోట్ల టన్నుల ఇసుక దోపిడికి లెక్కతేల్చాల్సి ఉంది. ఈ మొత్తం విలువ కనీసం 4వేల కోట్లపైనే ఉండొచ్చని అధికారవర్గాలు చెబుతున్నాయి. అయితే, ఏపీ స్పేస్ అప్లికేషన్ సెంటర్ అధ్యయనం ప్రకారం కేవలం ఒక మీటర్ లోతు మేర తవ్వకాలు జరిగితేనే 3.91 కోట్ల టన్నుల అక్రమంగా తవ్వితీసినట్లుగా గుర్తించారు. అయితే, గూగుల్ ఎర్త్‌ప్రో మ్యాప్స్, ఆనాడు తీసిన ఫొటోల ఆధారంగా కనీసం 5-6 మీటర్ల లోతున తవ్వకాలు జరిగాయని ఈ కేసులో పిటిషనర్‌గా ఉన్న నాగేంద్రకుమార్ చెబుతున్నారు. కేవలం ఒక మీటర్ లోతు తవ్వకాలను ప్రామాణికంగా తీసుకుంటేనే 3.91 కోట్ల అక్రమ తవ్వకాలు బయటపడ్డాయని, కానీ ఆనాడు గూగుల్‌ఎర్త్ ఫొటోలను, ఇతర సాక్ష్యాధారాలను పరిశీలిస్తే ప్రభుత్వం చెబుతున్నదానికంటే ఐదారు రెట్లు అక్రమ తవ్వకాలు జరిగాయని పిటిషనర్ సుప్రీంకోర్టుకు నివేదించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కనీసం 6,500 హెక్టార్ల పరిధిలో అక్రమ తవ్వకాలు జరిగాయని కోర్టు దృష్టికి ఇంతకుముందే తీసుకెళ్లారు.

పోలీసు కస్టడీలో ఆరుగురు కి'లేడీ' అనుచరులు

కోవూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): నెల్లూరు కి'లేడీ' నిడిగుంట అరుణను విచారించిన పోలీసులు ఇప్పుడు ఆమె అనుచరుల నుంచి పూర్తి వివరాలు రాబట్టే పనిలో పడ్డారు. కోవూరు మండలం పడుగుపాడులోని సాయి ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంటులో ప్లాటును ఆక్రమించిన కేసులో అరుణ అనుచరులు పల్లం వేణు, అంకెం రాజ, షేక్ అప్సర్, షేక్ మునీర్, మచ్చకర్ల గణేశ్, ఎలీషాలను కోవూరు సీఐ సుధాకరరెడ్డి మంగళవారం విచారించారు. అపార్ట్‌మెంట్ యజమానిపై వీరంతా దౌర్జన్యానికి పాల్పడ్డారు. నెల్లూరు జైలులో ఉన్న వీరందరినీ పోలీసులు కస్టడీకి తీసుకుని కోవూరు పోలీస్‌స్టేషనుకు తరలించి రోజంతా విచారించారు. అరుణతో కలిసి చేసిన నేరాల గురించి వారి నుంచి సీఐ వివరాలు రాబట్టినట్లు తెలిసింది.

జయమంగళ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ

అమరావతి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తూ తాను సమర్పించిన లేఖపై తగిన ఉత్తర్వులు జారీచేసేలా శాసన మండలి చైర్మన్‌ను ఆదేశించాలని కోరుతూ జయ మంగళ వెంకటరమణ దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం హైకోర్టులో విచారణ జరిగింది. విచారణ ప్రారంభమైన వెంటనే చైర్మన్ తరఫున వకాల్తా వేశానని, పూర్తి వివరాలతో కౌంటర్ వేసేందుకు సమయం ఇవ్వాలని ఆయన న్యాయవాది అభ్యర్థించారు. జయ మంగళ తరఫున న్యాయవాది ఎన్.అశ్వినీకుమార్ స్పందిస్తూ... గత విచారణలో మండలి చైర్మన్, కార్యదర్శి తరఫున స్టాండింగ్ కౌన్సిల్ హాజరయ్యారని, రాజీనామా విషయంలో రాతపూర్వక వివరాలు సమర్పించాలని కోర్టు ఆదేశించిందన్నారు. పిటిషనర్ రాజీనామా లేఖను పరిగణనలోకి తీసుకొని తగిన ఉత్తర్వులు జారీ చేసేలా ఆదేశాలివ్వాలని కోరుతూ అనుబంధ పిటిషన్ వేశామన్నారు. దీనిపై విచారణ జరపాలని కోరారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ కౌంటర్ దాఖలు చేసిన తర్వాత వ్యాజ్యంపై తుది విచారణ జరిపి నిర్ణయం వెల్లడిస్తామన్నారు. విచారణను వారం రోజులకు వాయిదా వేశారు. వైసీపీ తరఫున ఎమ్మెల్సీగా ఎన్నికైన జయ మంగళ వెంకటరమణ గతేడాది నవంబరు 23న సమర్పించిన రాజీనామా లేఖపై తగిన ఉత్తర్వులిచ్చేలా చైర్మన్‌ను ఆదేశించాలని కోరారు.

ఐరోపాకు అరకు కాఫీ

- ప్రతి జిల్లాలో జీసీసీ ప్రత్యేక స్టాల్
- 12 ఎకరాల్లో, 10 కోట్లతో కాఫీ క్యూరింగ్ సెంటర్
- 'ఆంధ్రజ్యోతి'తో వీసీఎండీ కల్పనాకుమారి



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

అరకు ఆర్గానిక్ కాఫీని ఐరోపా దేశాలకు ఎగుమతి చేయనున్నామని గిరిజన సహకార సంస్థ (జీసీసీ) వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కల్పనాకుమారి తెలిపారు. ఆమె 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడుతూ పలు వివరాలు వెల్లడించారు. 'ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులు మీదుగా ఆగస్టు 9, అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం రోజున పాడేరులో జీసీసీ కొత్త లోగో ఆవిష్కరింపజేశాం. ఆధునికీకరించిన వెబ్‌సైట్ అందుబాటులోకి తెచ్చాం. ఐరోపా దేశాలకు ఇప్పటివరకు థర్డ్ పార్టీల ద్వారా ఆర్గానిక్ కాఫీ పంపిస్తున్నాం. ఇకపై నేరుగా జీసీసీయే అందిస్తుంది. దానికి ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటివరకూ గిరిజనుల నుంచి కాఫీ గింజలు సేకరించిన తరువాత అటవీ శాఖ వద్ద క్యూరింగ్, మరో దగ్గర రోస్టింగ్, ఇంకొకరి వద్ద ప్యాకింగ్ చేయిస్తున్నాం. ఇకపై కాఫీ పండ్ల సేకరణ నుంచి ప్యాకింగ్ వరకు అన్నీ జీసీసీయే చేస్తుంది. దీనికోసం అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలంలో 12 ఎకరాల భూమిలో రూ.10 కోట్లతో కాఫీ క్యూరింగ్ సెంటర్ పెడుతున్నాం. ఇక్కడ జీసీసీ అవసరాలకే కాకుండా ఇతరులకు కూడా క్యూరింగ్, రోస్టింగ్ వంటి పనులు చేస్తాం' అని కల్పన తెలిపారు.

ఆర్గానిక్ కాఫీకి కిలోకి రూ.100 అదనం

'గిరిజనుల నుంచి సేకరించిన చెర్రీ కాఫీకి కిలోకు రూ.230 ఇస్తున్నాము. ఆర్గానిక్ సర్టిఫికేషన్ చేయించిన తరువాత వారికి కిలోకు అదనంగా మరో రూ.100 ఇస్తున్నాం. ఆరు క్లస్టర్లలో మూడు వేల ఎకరాల్లో ఆర్గానిక్ కాఫీ పండిస్తున్నారు. మరో మూడు వేల ఎకరాలకు విస్తరిస్తున్నాం. జీసీసీకి చెందిన పాత లోగోలో చిన్న చిన్న తప్పులున్నాయి. వాటిని సవరించి రాజధాని అమరావతి స్తూపం అందులో ప్రతిబింబించేలా కొత్తది రూపొందించాం. వెబ్‌సైట్ మార్కెటింగ్‌కు సంబంధించినది కాబట్టి దానిని కూడా ఆధునికీకరించాం' అని వివరించారు.

ట్రైఫెడ్‌తో ఎంఓయూ

కేంద్ర గిరిజన సంస్థ ట్రైఫెడ్‌తో ఒప్పందం చేసుకొని దేశంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న వారి షాపుల్లో కూడా జీసీసీ ఉత్పత్తులు విక్రయానికి పెడుతున్నాం. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో జీసీసీ ఉత్పత్తుల విక్రయ కేంద్రాలు పెట్టబోతున్నాం. విజయనగరం వంటి జిల్లాలో ఇప్పటికే ఉన్నప్పటికీ వాటికి తగిన గుర్తింపు లేదు. జీసీసీకి చెందిన అన్ని ఉత్పత్తుల ప్యాకింగ్ మార్చేశాం. ఏజెన్సీలో గిరిజనులకు నిత్యావసర సరకులను డీఆర్ డిపోల ద్వారా సరఫరా చేస్తున్నారు. వీటిని ఇకపై చౌక ధరల దుకాణాలు (ఫెయిర్ ప్రైస్ షాపు-ఎఫ్‌పీ)గా మార్చి, ప్రభుత్వం సరఫరా చేసే వస్తువులతో పాటు జీసీసీ ఉత్పత్తులు కూడా విక్రయిస్తాం. మొత్తం 900 డీఆర్ డిపోలు ఎఫ్‌పీ షాపులుగా మారనున్నాయి. గిరిజనుల నుంచి అంతకు ముందు రూ.6 కోట్ల విలువైన అటవీ ఉత్పత్తులు సేకరించాం. గతేడాది రూ.12 కోట్లు చేశాం. ఈసారి రూ.24 కోట్ల విలువైన ఉత్పత్తులు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం' అని కల్పన తెలిపారు.



జీసీసీ ఉత్పత్తులు

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.